www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



సత్యం.. సుందరం!

ప్రపంచ ప్రభావశీల భారతీయుల్లో వీరే టాప్

తొలి స్థానంలో తెలుగు తేజం సత్య నాదెళ్ల

రెండో స్థానంలో సుందర్ పిచాయ్ 2

యూట్యూబ్ నీల్ మోహన్‌కు మూడో స్థానం

హురున్ గ్లోబల్ ఇండియన్స్ జాబితా విడుదల

బుధవారం | 22-1-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 | సంచిక (Issue) : 277

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: అష్టమి మ. 3.18 తదుపరి నవమి; నక్షత్రం: స్వాతి రా. 2.34 తదుపరి విశాఖ; వర్జ్యం: శేషం ఉ. 7.42 వరకు; దుర్ముహూర్తం: మ. 12.04-12.49; అమృతఘడియలు: సా. 4.41-6.28; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం:6.52; సూర్యాస్తమయం: 6.01

విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

దండకారణ్యంలో కాల్పుల మోత

మావోయిస్టు పార్టీకి భారీ దెబ్బ

ఛత్తీస్‌గఢ్-ఒడిసా సరిహద్దుల్లో ఎన్‌కౌంటర్

40 గంటలపాటు కొనసాగిన కాల్పులు

కేంద్ర కమిటీ సభ్యుడు చలపతి మృతి

మరో ముగ్గురు అగ్ర నేతలు కూడా!?

నిఘా సమాచారంతో దాడి

గరియాబంద్ అడవుల దిగ్బంధం

చుట్టుముట్టిన వెయ్యి మంది జవాన్లు

డ్రోన్లతో నక్సల్స్ కదలికల గుర్తింపు

గొప్ప విజయంగా అభివర్ణించిన అమిత్‌షా

16 మంది నక్సల్స్ కాల్చివేత

చర్ల/చింతూరు/చుండూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): వరుస ఎన్‌కౌంటర్లతో కుదేలవుతున్న మావోయిస్టు పార్టీకి... మరో అతి భారీ దెబ్బ తగిలింది! సంఖ్యాపరంగానే కాదు... స్థాయిపరంగానూ భారీ సంఖ్యలో శ్రేణులనూ, కీలక నేతలనూ ఎన్‌కౌంటర్‌లో కోల్పోయింది. ఛత్తీస్‌గఢ్‌లోని గరియాబంద్ - ఒడిసాలోని నౌపాడ జిల్లాల పరిధి కుల్హారిఘాట్ అడవుల్లో రెండ్రోజులుగా జరుగుతున్న భారీ

మిగతా 14వ పేజీలో...



ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన నక్సల్స్

అలిపిరి దాడి సూత్రధారి చలపతి

బలిమెలలో బీఎస్ఎఫ్ జవాన్ల హత్యలో..

మల్కన్‌గిరి కలెక్టర్ కిడ్నాప్‌లోనూ సూత్రధారి

కిడారి, సివేరి హత్యలో కూడా పాత్ర

అసలు పేరు రామచంద్రారెడ్డిగారి ప్రతాప్‌రెడ్డి

స్వస్థలం చిత్తూరు జిల్లా మత్యం పైపల్లె 14

మదనపల్లెలో సెరికల్చర్ ఉద్యోగిగా పనిచేస్తూ

విశాఖకు బదిలీ.. అక్కడే నక్సల్స్‌తో పరిచయాలు

తర్వాత అజ్ఞాతంలోకి.. అగ్ర నేతగా ఆవిర్భావం

ఆయన తలపై కోటి రూపాయల రివార్డు





చలపతి మృతదేహం

ఉత్తర్వుల ఉప్పెన!

అమెరికాలో జన్మతః పౌరసత్వంపై వేటు



అమెరికాలోని లక్షలాది భారతీయుల ఆశలపై నీళ్లు

తొలిరోజే డజన్ల కొద్దీ ఉత్తర్వులపై ట్రంప్ సంతకాలు

ప్రపంచ ఆరోగ్య సంస్థ నుంచి బయటికి అమెరికా!

2015 నాటి పర్యావరణ ఒప్పందం నుంచీ నిష్క్రమణ

గల్ఫ్ ఆఫ్ మెక్సికోకి పేరు గల్ఫ్ ఆఫ్ అమెరికాగా మార్పు

లింగవైవిధ్యానికి చెల్లు.. ఇక స్త్రీ, పురుష లింగాలు మాత్రమే

ఫెడరల్ ఉద్యోగులకు ఇంటి నుంచి పని విధానం రద్దు

క్యాపిటల్ భవనంపై దాడి నిందితులకు క్షమాభిక్ష

వెస్ట్‌బ్యాంక్‌లోని ఇజ్రాయెల్ సెటిలర్లపై ఆంక్షల ఎత్తివేత

టిక్‌టాక్‌పై నిషేధం అమలు 75 రోజులపాటు వాయిదా

ఫిబ్రవరి 1 నుంచి కెనడా, మెక్సికోపై 25% సుంకాలు?

వాషింగ్టన్ డీసీ, జనవరి 21: అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్.. మొదటి రోజే ఉత్తర్వుల వర్షం కురిపించారు! ఆ దేశ చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా తొలిరోజే డజన్ల కొద్దీ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లతో సంచలనం సృష్టించారు. అందులో ప్రధానమైనది.. అమెరికాలో పుట్టినవారికి ఆటోమేటిగ్గా పౌరసత్వాన్ని ప్రసాదించే హక్కును రద్దు చేసే ఉత్తర్వు! ఉద్యోగాల నిమిత్తం అమెరికాలో ఉంటూ.. ఆ గడ్డపై పుట్టే తమ పిల్లలకైనా పౌరసత్వం దక్కుతుందని ఆశిస్తున్న లక్షలాది మంది ప్రవాస భారతీయులకు ఈ ఉత్తర్వు అశనిపాతమే! అదొక్కటే కాదు.. ఇంధన రంగం, పర్యావరణం,

మిగతా 2వ పేజీలో...

బర్త్ టూరిజానికి బ్రేక్

గ్రీన్‌కార్డు కోసం నిరీక్షిస్తున్న వారికీ ఇబ్బందులే!

ట్రంప్ నిర్ణయంతో అమెరికాలో ఎన్నారైలకు పుట్టే పిల్లలెవరికీ పౌరసత్వం దక్కదు

అమలు సులువేమీ కాదు.. రాజ్యాంగ సవరణ క్లిష్టం

ఏపీకి రండి!

దిగ్గజ సంస్థలకు చంద్రబాబు ఆహ్వానం

పెట్టుబడులే లక్ష్యంగా దావోస్‌లో వరుస భేటీలు

ఆసక్తి చూపిన సముద్ర రవాణా సంస్థ మార్స్క్

త్వరలో ఏపీకి వస్తానన్న ఆ సంస్థ సీఈవో

ఎల్జీ కెమ్, కార్ల్స్ బెర్గ్, కాగ్నిజెంట్‌తోనూ భేటీ

లిథియం బ్యాటరీ, బ్రూవరీ, బాట్లింగ్ యూనిట్ల ఏర్పాటుకు ముందుకురావాలని ఆహ్వానం



దావోస్‌లో మార్స్క్ సీఈవో విన్సెంట్ క్లర్క్‌తో భేటీ అయిన ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): దావోస్ సదస్సు వేదికగా సీఎం చంద్రబాబు బృందం పెట్టుబడుల వేటను మొదలుపెట్టింది. ఏపీకి పెట్టుబడులతో రావాల్సిందిగా పలు దిగ్గజ కంపెనీలను కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు రోజంతా వరుస సమావేశాలతో గడిపారు. ఈ క్రమంలో ప్రపంచంలో అతిపెద్ద సముద్ర రవాణా కంపెనీలలో ఒకటైన డెన్మార్క్‌కు చెందిన మార్స్క్ సంస్థ ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపింది. 130 దేశాల్లో వాణిజ్య కార్యకలాపాలను నిర్వహిస్తున్న, ప్రపంచ సముద్ర రవాణా రంగంలోనే ప్రతిష్ఠాత్మకమైన కంపెనీ ఇది. అలాంటి సంస్థ వస్తే ఏపీ సముద్ర రవాణాలో దేశంలోనే మొదటిస్థానంలోకి వెళ్లడం ఖాయమని

మిగతా 13వ పేజీలో...

పెట్టుబడులకు రాష్ట్రం సానుకూలం

భావనపాడును పెట్రోకెమికల్ హబ్‌గా మారుద్దాం

మిట్టల్ గ్రూప్ చైర్మన్ లక్ష్మీ మిట్టల్‌కు ప్రతిపాదన

ఏపీలో జెడ్ఎఫ్ ఫాక్స్‌కాన్ యూనిట్ పెట్టండి

ఆ సంస్థ సీఈవో ఐకే డోర్ఫ్‌కు మంత్రి వినతి

మాస్టర్ కార్డ్, సిస్కో, కార్గిల్, డీహెచ్ఎల్, ఉబెర్, ఎర్నెస్ట్ యంగ్, డసాల్ట్‌లకూ ఆహ్వానం

ఆయా ప్రతినిధుల నుంచి సానుకూల స్పందన

దావోస్‌లో ప్రముఖ సంస్థల ప్రతినిధులతో లోకేశ్ భేటీ 13



దావోస్‌లో సిస్కో వైస్ ప్రెసిడెంట్ ఫ్రాన్సిస్ కట్సౌదాస్‌తో భేటీ అయిన మంత్రి నారా లోకేశ్

ప్రపంచానికి మనమే మోడల్!

గ్రీన్ ఎనర్జీ, హైడ్రోజన్ హబ్‌గా ఏపీ

ఈ రంగాల్లోకి లక్ష కోట్ల పెట్టుబడులు

టాటాతో కలిసి అమరావతిలో సీఐఐ కేంద్రం

దావోస్ సదస్సులో చంద్రబాబు వెల్లడి

భారతీయుల రక్తంలోనే వ్యాపార లక్షణాలు

భారత్‌లో స్థిరంగా మోదీ పరిపాలన: సీఎం



జనసేనకు ఈసీ గుర్తింపు

ఇక గాజుగ్లాసు గుర్తు ఆ పార్టీకే

పవన్ కల్యాణ్‌కు ఎన్నికల సంఘం లేఖ

అమరావతి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) జనసేనను ఆంధ్రప్రదేశ్‌లోని గుర్తింపు పొందిన పార్టీల జాబితాలో చేర్చింది. దీంతోపాటు గాజుగ్లాసు గుర్తును ఆ పార్టీకే రిజర్వ్ చేసింది. ఈ మేరకు జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌కు ఎన్నికల సంఘం మంగళవారం సాయంత్రం లేఖ పంపింది. సార్వత్రిక ఎన్నికల్లో వంద శాతం విజయం నమోదు చేసిన పార్టీగా జనసేన రికార్డు సాధించింది. పోటీ చేసిన 21 అసెంబ్లీ స్థానాలతో పాటు రెండు లోక్‌సభ స్థానాల్లో విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ క్రమంలో గుర్తింపు పొందిన పార్టీగా నిలిచి, గాజుగ్లాసు గుర్తును కూడా పొందింది. ఈ పరిణామంపై ఆ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పదవులపై మాట్లాడొద్దు!

సోషల్ మీడియాలోనూ ఆ పోస్టులు పెట్టొద్దు

జనసేన నేతలకు అధిష్ఠానం ఆదేశం 14

సీఎం, డిప్యూటీ సీఎం పదవుల వ్యాఖ్యలపై సీరియస్

ఇప్పటికే అలా మాట్లాడిన నాయకులకు మందలింపు

టీడీపీలోనూ చంద్రబాబు ఆదేశాలతో తగ్గిన నేతలు

చెరి సగం కుదరదు!



66:34 నిష్పత్తిలోనే కృష్ణా జలాలు పంచుకోవాలి

బోర్డు భేటీలో ఆంధ్ర స్పష్టీకరణ.. సుప్రీంలో వ్యాజ్యం ఉన్నందున కేటాయింపులపై చర్చ వద్దు

కాదని నిర్ణయం తీసుకుంటే కోర్టు ధిక్కరణే.. తీర్పు వచ్చేదాకా ప్రస్తుత కేటాయింపులే!

మా వాటా మేం వాడుకుంటుంటే టెలిమెట్రీల ఏర్పాటు ఎందుకు: ఏపీ

చెరి సగం డిమాండ్‌ను మినిట్స్‌లో రాయాలని తెలంగాణ సర్కారు పట్టు

తాము వ్యతిరేకించినట్లు కూడా నోట్ చేయాలని ఆంధ్ర స్పష్టీకరణ

తమకు 71% వాటా దక్కాలన్న తెలంగాణ.. అయినా 50 శాతమే అడుగుతున్నామని వెల్లడి

బచావత్ అవార్డుకు విరుద్ధంగా దేనికీ అంగీకరించేది లేదన్న ఏపీ అధికారులు

బోర్డు కార్యాలయం బెజవాడకు తరలించేందుకు సూత్రప్రాయ అంగీకారం

అద్దెలేని భవనం అడిగిన చైర్మన్ జైన్.. తమ ఆఫీసులే అద్దె భవనాల్లో ఉన్నాయన్న ఆంధ్రా

నీటి లెక్కలు

అమరావతి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జలాల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన 811 టీఎంసీలను రెండు తెలుగు రాష్ట్రాలకు చెరి సగం పంచాలన్న తెలంగాణ డిమాండ్‌ను ఆంధ్రప్రదేశ్ నిర్ద్వంద్వంగా తోసిపుచ్చింది. ప్రస్తుతం అమల్లో ఉన్న 66:34 దామాషాలోనే నీటి కేటాయింపులు, వినియోగం కొనసాగించాలని స్పష్టం చేసింది. మంగళవారం హైదరాబాద్ జలసౌధలో కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులో బోర్డు చైర్మన్ అతుల్ జైన్, రాష్ట్రం నుంచి ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు, జలవనరుల శాఖ సీఈ (అంతర్రాష్ట్ర వ్యవహారాలు) సుగుణాకరరావు, తెలంగాణ నీటిపారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు. బచావత్ ట్రైబ్యునల్ ఇచ్చిన తీర్పు మేరకు తొలుత 731 టీఎంసీలు..

మిగతా 12వ పేజీలో...

రెండ్రోజుల్లో డెల్టాకు నీరు

నాగార్జునసాగర్ ఆయకట్టుకు ఈ ఏడాది మూడో విడత 15 టీఎంసీలను కృష్ణా డెల్టాకు కేటాయించగా.. అందులో 2.9 టీఎంసీలు మాత్రమే వచ్చాయని బోర్డు భేటీలో ఏపీ గుర్తుచేసింది. మిగతా 12 టీఎంసీలను రోజుకు 1,700 క్యూసెక్కుల చొప్పున విడుదల చేసి.. చివరి ఆయకట్టుకు నీరివ్వాలని కోరింది. నీటి విడుదల ప్రారంభించామని.. రెండ్రోజుల్లో డెల్టాకు నీరందుతుందని బోర్డు చైర్మన్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

ఇంకా.. అదే విధేయత!

674 కిసాన్ డ్రోన్లు వైసీపీ వాళ్లకే..



రూ.10 లక్షల పరికరానికి రూ.8 లక్షల సబ్సిడీ

ఏడాదిన్నర క్రితం జాబితాకే ప్రాధాన్యమివ్వండి

అవసరమైతే ఎమ్మెల్యేలకు సర్దిచెప్పి ఒప్పించండి

జేడీలకు వ్యవసాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశం

భగ్గుమంటున్న ఎమ్మెల్యేలు.. విషయం మంత్రి దృష్టికి

లబ్ధిదారుల ఎంపిక సక్రమంగా ఉండాలన్న అచ్చెన్న

(గుంటూరు సిటీ - ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో వైసీపీ పాలన ముగిసి ఆరు నెలలు దాటినా.. వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు ఇంకా ఆ పార్టీకి వీర విధేయత చూపుతూనే ఉన్నారు..! కూటమి సర్కారు రైతులకు సబ్సిడీపై పంపిణీ చేయతలపెట్టిన కిసాన్ డ్రోన్లను పూర్తిగా వైసీపీ వారికే కట్టబెట్టాలని చూస్తున్నారు..! ఈ డ్రోన్ల పంపిణీ జాబితా సిద్ధం చేయడానికి సంబంధించి జిల్లాల వ్యవసాయ అధికారులతో ఏర్పాటు చేసిన జూమ్ మీటింగ్‌లో ఉన్నతాధికారులు ఇచ్చిన ఆదేశాలు ఇప్పుడు వివాదాస్పదంగా మారాయి. డ్రోన్ల పంపిణీలో ఏడాదిన్నర క్రితం ఎంపిక చేసిన జాబితాకే తొలి ప్రాధాన్యతనివ్వాలని ఉన్నతాధికారులు జేడీలకు సూచించారు. ఆ విషయంలో అవసరమైతే స్థానిక ఎమ్మెల్యేలకు సర్దిచెప్పి ఒప్పించాలని కూడా ఆదేశించారు. ఈ ఆదేశాలతో

మిగతా 12వ పేజీలో...

ఆర్టీసీకి 'పండగే'!

20వ తేదీ రికార్డు స్థాయిలో 23 కోట్ల ఆర్జన

ఇందులో ప్రత్యేక బస్సుల ఆదాయం 21 కోట్లు

విదిరోజుల్లో ఏనాడూ 17కోట్లు దాటని వైనం

పండగ రోజుల్లో రూ.20 కోట్లు వస్తే గొప్ప

సంక్రాంతికి వచ్చి తిరిగి వెళ్లే వారి కోసం 3

అదనంగా రెండు వేల బస్సులు తిప్పిన ఆర్టీసీ

ఈ ఆదరణ మరవలేం: ద్వారకా తిరుమలరావు



సోమవారం నాడు విజయవాడ బస్టాండులో ప్రయాణికుల రద్దీ

జన్మతః పౌరసత్వంపై వేటు

(మొదటి పేజీ తరువాయి)

వలసలు, విదేశాంగ విధానం.. ఇలా పలు రంగాలకు సంబంధించిన ఉత్తర్వులపై ట్రంప్ సంతకాలు చేశారు. సాధారణంగా అధ్యక్ష బాధ్యతలు స్వీకరించినవారు.. వైట్‌హౌస్‌లోని తమ కార్యాలయానికి వెళ్లిన తర్వాత పని మొదలుపెట్టడం కద్దు! కానీ.. ట్రంప్ ప్రమాణ స్వీకారం చేసీచేయగానే, అక్కడికక్కడే తన ఉత్తర్వుల దండయాత్ర మొదలుపెట్టారు. మాజీ అధ్యక్షుడు బైడెన్ గతంలో జారీ చేసిన 78 ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లను రద్దు చేస్తూ జారీ చేసిన ఉత్తర్వుపై తొలి సంతకం పెట్టారు. పాలనపై తన ప్రభుత్వం పూర్తిస్థాయిలో పట్టు సాధించేదాకా ప్రభుత్వ అధికారులు ఎలాంటి నిబంధనలూ జారీ చేయకుండా నిషేధించే ఉత్తర్వుపై మలి సంతకం.. అప్పటిదాకా సైన్యం, కొన్ని కీలక రంగాల్లో మినహా ఫెడరల్ ఉద్యోగాల నియామకాలను నిలిపివేసే ఉత్తర్వుపై మూడో సంతకం చేశారు. ఆ తర్వాత.. ఫెడరల్ ఉద్యోగులు ప్రత్యక్షంగా ఆఫీసుకు వచ్చి, పూర్తి సమయం పనిచేయడాన్ని తప్పనిసరి చేస్తూ నాలుగో ఉత్తర్వు జారీ చేశారు. పెరుగుతున్న జీవన వ్యయం సమస్యను పరిష్కరించే బాధ్యతను అన్ని ప్రభుత్వ విభాగాలు, ఏజెన్సీలపై పెడుతూ ఐదో ఉత్తర్వు.. పారిస్‌లో 2015లో కుదుర్చుకున్న పర్యావరణ ఒప్పందం నుంచి వైదొలగుతూ ఆరో ఉత్తర్వు.. భావవ్యక్తీకరణ స్వేచ్ఛను పరిరక్షిస్తూ ఏడో ఉత్తర్వు.. రాజకీయ ప్రత్యర్థులపై ప్రభుత్వ దర్యాప్తు సంస్థలను ఉసిగొలిపే విధానానికి చెక్‌పెడుతూ (ఎండింగ్ ద వెపనైజేషన్ ఆఫ్ ఫెడరల గవర్నమెంట్) ఎనిమిదో ఉత్తర్వు జారీ చేశారు! అలాగే.. తన క్యాబినెట్ సహచరులు, సీఐఏ డైరెక్టర్, ఇతరత్రా కీలక పదవులకు సంబంధించి నియామక ఉత్తర్వులపైనా సంతకాలు చేశారు. అనంతరం ట్రంప్ తన చేతిలోని పెన్నును.. ప్రమాణ స్వీకారానికి హాజరై హర్షధ్వానాలు చేస్తున్న తన మద్దతుదారుల వైపునకు విసిరేశారు! దీంతో వారి హర్షధ్వానాలు మిన్నుముట్టాయి. వారి స్పందనను గమనించిన ట్రంప్.. తన బల్లపై ఉన్న మిగతా పెన్నులను కూడా.. ఒక్కొక్కటిగా వారి వైపునకు విసరడంతో అంతా ఆ పెన్నులను పట్టుకుని వాటితో సెల్ఫీలు దిగడం కనిపించింది. అనంతరం శ్వేతసౌధంలోని తన కార్యాలయానికి చేరుకున్న ట్రంప్.. 2021 జనవరి 6న క్యాపిటల్ భవనంపై జరిగిన దాడికి సంబంధించిన కేసులో 1500 మంది నిందితులకు క్షమాభిక్ష ప్రసాదిస్తూ మరో ఉత్తర్వు జారీ చేశారు. వారందరిపై ఉన్న అన్ని కేసులనూ కొట్టేయాలని ఆదేశాలిచ్చారు. అలా ఆయన జారీ చేసిన మరికొన్ని కీలక ఉత్తర్వులు..

పుట్టుకతో పౌరసత్వ హక్కు: ఇప్పటిదాకా ఉన్న నిబంధనల ప్రకారం.. పర్యాటక/ఉద్యోగి/విద్యార్థి వీసాలపైన, మరేదైనా కారణాల వల్ల అమెరికాకు వచ్చినవారికి ఆ గడ్డపై పిల్లలు పుడితే వారికి అమెరికా పౌరసత్వం (బర్త్ రైట్ సిటిజెన్‌షిప్) వస్తుంది. ఆ హక్కుపై వేటు వేస్తూ ట్రంప్ తొలిరోజే ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వు రాజ్యాంగంలోని 14వ సవరణకు విరుద్ధమని హక్కుల సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. అమెరికాలో అంతర్యుద్ధం నేపథ్యంలో 1868లో.. శరణార్థుల పిల్లలకు జన్మతః పౌరసత్వాన్ని ఇచ్చేలా రాజ్యాంగానికి ఆ సవరణ చేశారు. అయితే.. జన్మతః పౌరసత్వ హక్కు అందరికీ వర్తించదని, అందుకు కొన్ని నిబంధనలు వర్తిస్తాయని (సబ్జెక్ట్ టు ద జ్యూరిస్‌డిక్షన్ దేర్ ఆఫ్) ఆ సవరణలోనే ఉన్నదని ట్రంప్ తన ఉత్తర్వులో పేర్కొన్నారు. ఆ నిబంధన ప్రకారం.. అక్రమంగా అమెరికాలో ఉండే మహిళలకు జన్మించే పిల్లలకు, ఆ పిల్లల తండ్రి అమెరికన్ పౌరుడు/చట్టబద్ధమైన శాశ్వత నివాస హోదా లేనివాడు అయితే జన్మతః పౌరసత్వ హక్కు వర్తించదు. అలాగే.. అమెరికాలో చట్టబద్ధంగానే ఉంటున్నప్పటికీ తాత్కాలికంగా (విద్యార్థి/ఉద్యోగి/పర్యాటక వీసాలపై) నివసించే మహిళలకు పుట్టే పిల్లలకు ఆ పిల్లల తండ్రి అమెరికన్ పౌరుడు/చట్టబద్ధమైన శాశ్వత నివాస హోదా లేనివాడయితే జన్మతః పౌరసత్వ హక్కు వర్తించదు.

పేర్ల మార్పు: గల్ఫ్ ఆఫ్ మెక్సికో పేరును 'గల్ఫ్ ఆఫ్ అమెరికా'గా మారుస్తూ ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ జారీ చేశారు. దాదాపు 16 లక్షల చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న గల్ఫ్ ఆఫ్ మెక్సికో చుట్టూ అమెరికా, క్యూబా, మెక్సికో దేశాలున్నాయి. అమెరికా ముడిచమురు, సహజవాయు ఉత్పత్తికి సంబంధించి అత్యంత కీలకమైన ప్రాంతమిది. అలాగే.. ఉత్తర అమెరికాలోనే అత్యంత ఎత్తైన పర్వతమైన 'మౌంట్ డెనాలీ' పేరును 'మౌంట్ మెకిన్లే'గా మార్చేశారు. 2015లో ఒబామా దాని పేరును మౌంట్ డెనాలీగా మార్చారు. ట్రంప్ పాతపేరును పునరుద్ధరించారు.

పారిస్ ఒప్పందం నుంచి వెనక్కి: పెరిగిపోతున్న భూతాపానికి అడ్డుకట్ట వేసేలా.. కర్బన ఉద్గారాలను తగ్గించేందుకు 2015లో పారిస్‌లో ప్రపంచ దేశాలు కుదుర్చుకున్న ఒప్పందం నుంచి అమెరికా వైదొలగుతున్నట్టుగా ట్రంప్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పుడే కాదు.. ట్రంప్ ఎప్పట్నుంచో ఈ ఒప్పందాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఒక్క పారిస్ ఒప్పందం నుంచే కాదు.. అమెరికా అభివృద్ధికి అడ్డంకిగా మారే అన్ని అంతర్జాతీయ ఒప్పందాల నుంచీ వైదొలగేలా.. 'యూఎన్ ఫ్రేమ్‌వర్క్ కన్వెన్షన్ ఆన్ క్లైమేట్ చేంజ్'కు సంబంధించి గతంలో అమెరికా ఏదైనా ఆర్థికసాయం అందిస్తానని ప్రకటించి ఉంటే వాటి నుంచి కూడా వైదొలగేలా ఈ ఉత్వర్వులు జారీ చేశారు.

డబ్ల్యూహెచ్‌వో నుంచి నిష్క్రమణ: అధికారంలోకి వస్తే డబ్ల్యూహెచ్‌వో నుంచి అమెరికా వైదొలగేలా చేస్తానని ట్రంప్ అప్పట్నుంచీ చెబుతూనే వచ్చారు. ఎన్నికల ప్రచారంలో ఆయన ఇచ్చిన ప్రధాన హామీల్లో ఇది కూడా ఒకటి. అమెరికా నిష్క్రమణతో.. ప్రపంచ ఆరోగ్య సంస్థకు ఏటా 130 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.1124 కోట్లు) ఆర్థిక సాయం అందకుండా పోతుందని అంచనా.

లింగ నిర్వచనం, డీఈఐ కార్యక్రమాల రద్దు: అమెరికావ్యాప్తంగా చాలా మంది తమ లింగానికి సంబంధించి వాస్తవాలను అంగీకరించడానికి ఒప్పుకోవట్లేదని.. పురుషులు తమను తాము అమ్మాయిలుగా ప్రకటించుకొని, మహిళలకు ఉద్దేశించిన కార్యకలాపాల్లోకి చొరబడుతున్నారని.. ఇకపై అలాంటివి చెల్లబోవని స్పష్టం చేస్తూ ట్రంప్ ఒక ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ జారీ చేశారు. దీని ప్రకారం అమెరికా ఇకపై రెండు లింగాలను మాత్రమే గుర్తిస్తుంది. అవి.. స్త్రీ, పురుషుడు. అమెరికాలోని జైళ్లల్లో ఉన్న ఖైదీలలో ట్రాన్స్‌మెన్ (స్త్రీగా జన్మించి తమను తాము పురుషులుగా భావించేవారు) అందరినీ మహిళల జైళ్లలో వేయాలని, అదే తరహాలో ట్రాన్స్ వుమెన్ ఖైదీలను పురుషుల జైళ్లలోకి తరలించాలని కూడా ఈ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కుల, మత, జాతి, వర్ణ వివక్ష నిర్మూలనకు ఫెడరల్ ప్రభుత్వం చేపట్టిన 'డైవర్సిటీ, ఈక్విటీ అండ్ ఇంక్లూజన్ (వైవిధ్యం, సమానత్వం, కలుపుకొనిపోయే తత్వం)' కార్యక్రమాలన్నింటినీ కూడా రద్దు చేస్తూ మరో ఆర్డర్‌ను ట్రంప్ జారీ చేశారు.

టిక్‌టాక్‌కు ఊరట: టిక్‌టాక్ నిషేధానికి సంబంధించి.. బైడెన్ సర్కారు విధించిన నిషేధం అమలును 75 రోజుల పాటు వాయిదావేస్తూ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ జారీ చేయడం ద్వారా దాని మాతృసంస్థ 'బైట్‌డ్యాన్స్'కు ట్రంప్ ఊరట కల్పించారు.

అత్యవసర స్థితి: మెక్సికన్ డ్రగ్ కార్టెల్స్‌ను, ఇతర నేర సంస్థలను విదేశీ ఉగ్రవాద సంస్థలుగా ప్రకటిస్తూ మరో ఉత్తర్వు జారీ చేశారు. అలాగే.. మెక్సికో నుంచి అక్రమ వలసలను అడ్డుకునేందుకు అమెరికా దక్షిణ సరిహద్దుల్లో అత్యవసర పరిస్థితి విధించారు. దీనివల్ల కాంగ్రెస్ ఆమోదం అవసరం లేకుండానే.. ఫెడరల్ నిధులతో అమెరికా-మెక్సికో సరిహద్దుల్లో గోడ నిర్మించేందుకు వీలు కలుగుతుంది.

ఇజ్రాయెల్ సెటిలర్లపై ఆంక్షల ఎత్తివేత: వెస్ట్‌బ్యాంక్‌లో స్థిరపడ్డ ఇజ్రాయెలీ సెటిలర్లపై గత బైడెన్ సర్కారు 2024లో విధించిన ఆంక్షలను ఎత్తివేస్తూ ట్రంప్ పాలనా ఉత్తర్వు జారీ చేశారు. ఈ సెటిలర్లు వెస్ట్‌బ్యాంక్‌లోని పాలస్తీనియన్లపై హింసకు పాల్పడుతున్నారన్న ఆరోపణలతో బైడెన్ సర్కారు ఆంక్షలు విధించింది. అమెరికాలో వారికి ఉన్న ఆస్తులను స్తంభింపజేసింది. సంస్థలు, వ్యక్తులు వారితో సంబంధబాంధవ్యాలు నెరపకుండా నిషేధం విధించింది. ఈ ఆంక్షలను ట్రంప్ ఎత్తివేయడంతో వెస్ట్‌బ్యాంక్‌లో మళ్లీ హింస పెరుగుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది.



కొన్ని నిర్ణయాల అమలు.. అంత వీజీ కాదు!

ఎన్నికల ప్రచార సమయంలో ట్రంప్ ఇచ్చిన హామీల్లో చాలావాటిని ఈ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ల ద్వారానే అమలు చేయొచ్చు. కానీ, పుట్టుకతో పౌరసత్వ హక్కు వంటి మరికొన్ని నిర్ణయాల అమలుకు మాత్రం చట్టపరంగా పలు అడ్డంకులు ఎదురవుతాయి. వాటిపై న్యాయస్థానాల్లో వ్యాజ్యాలు దాఖలవుతాయి. ఆ అడ్డంకులన్నింటినీ అధిగమించి వాటిని అమలు చేయాలంటే రాజ్యాంగ సవరణ అవసరం. అమెరికా ప్రతినిధుల సభలో (హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్) రిపబ్లికన్లకు స్వల్ప ఆధిక్యం మాత్రమే ఉంది. సెనెట్‌లో సైతం.. ఏదైనా చట్టం అమలుకాకుండా సభ్యులు అడ్డుకునే వీలు కల్పించే 'ఫిలిబస్టర్' అనే ప్రక్రియ ఉంది. కాబట్టి, ట్రంప్ ఆ నిర్ణయాల అమలుకు డెమొక్రటిక్ సభ్యుల సహకారం తప్పనిసరి.

కెనడా, మెక్సికోపై 25% సుంకాలు

అమెరికాలోకి అక్రమ వలసలను, మాదకద్రవ్యాలను నిరోధించడంలో విఫలమవుతున్న కెనడా, మెక్సికోపై ఫిబ్రవరి 1 నుంచి 25% సుంకాలను విధించే ఆలోచనలో ఉన్నట్టు ట్రంప్ తెలిపారు. అంతకుముందు.. అమెరికన్ కార్మికులను, కుటుంబాలను కాపాడేందుకుగాను అమెరికా వాణిజ్యవ్యవస్థ ప్రక్షాళనను తక్షణమే ప్రారంభించనున్నట్టు ప్రకటించారు.

నా ప్రమాణం రోజే జెండా అవనతమా?


అమెరికా మాజీ అధ్యక్షుడు జిమ్మీకార్టర్ డిసెంబరు 29న మరణించిన నేపథ్యంలో.. అప్పటికి అధ్యక్షుడుగా ఉన్న బైడెన్ అమెరికా జాతీయ పతాక నిబంధనలను అనుసరించి 30 రోజులపాటు జెండాలను అవనతం చేయాలని ఆదేశించారు. కానీ.. తన ప్రమాణ స్వీకారం రోజు జాతీయ జెండాలు అలా ఎగరడాన్ని జీర్ణించుకోలేకపోయిన ట్రంప్.. అధ్యక్షుడి ప్రమాణ స్వీకారం రోజున జాతీయ జెండాను పూర్తిస్థాయిలో ఎగరవేసేలా ఒక ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ జారీ చేసేశారు!!

నలుగురు ఉద్యోగులపై వేటు!

రెండోసారి అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన ట్రంప్ తొలిరోజు పుంఖానుపుంఖాలుగా పాలనా ఉత్తర్వులు జారీచేయడమే కాదు.. మాజీ అధ్యక్షుడు బైడెన్ నియమించిన నలుగురు సీనియర్ అధికారులపై వేటు కూడా వేశారు. వారితోపాటు మరో వెయ్యి మందిని తొలగిస్తామంటూ.. తన సొంత సామాజిక మాధ్యమమైన 'ట్రూత్ సోషల్' ద్వారా ట్రంప్ బహిరంగ హెచ్చరిక జారీ చేశారు.



ప్రమాణస్వీకార కార్యక్రమంలో భాగంగా కేక్ కోస్తున్న ట్రంప్



సతీమణి మెలానియాతో ట్రంప్ నృత్యం

లోకం తీరు



పుతిన్ వల్లే రష్యా నాశనం: ట్రంప్

రష్యా అధ్యక్షుడు వ్లాదిమర్ పుతిన్ వల్లే ఆ దేశం నాశనం అవుతోందని ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పుతిన్ ఉక్రెయిన్‌తో శాంతి ఒప్పందం చేసుకోకుండా రష్యాను నాశనం చేస్తున్నారని ఆయన విలేకరులతో అన్నారు. త్వరలోనే పుతిన్‌ను స్వయంగా కలుస్తానని ట్రంప్ ఈ సందర్భంగా ప్రకటించారు. ఉక్రెయిన్‌తో శాంతి ఒప్పందానికి పుతిన్ ఇకనైనా అంగీకరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. మరోవైపు, అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్.. ప్రమాణ స్వీకారం చేసిన కాసేపటికే ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌ను తలుచుకున్నారు. సైనికుల గౌరవార్థం నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న అధ్యక్షుడు ట్రంప్.. దక్షిణ కొరియాలో ఉన్న అమెరికా సైనికులతో శాటిలైట్ కాల్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా కిమ్ జోంగ్ ఉన్ ఎలా ఉన్నారని ? సైనికులను ప్రశ్నించారు. కిమ్ ఓ పట్టాన వినే రకం కాదన్నారు. డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన కాసేపటికే అంతర్జాతీయంగా కీలక పరిణామం చోటు చేసుకుంది. రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ వీడియో కాల్‌లో మాట్లాడుకున్నారు.

ఎలాన్ మస్క్ 'డోజ్'పై దావా.. ట్రంప్‌కు షాక్

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నూతన కార్యవర్గం ఏర్పాటు చేసిన డోజ్(డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియన్సీ) చట్టపరమైన చిక్కుల్లో ఇరుక్కుంది. ప్రభుత్వ ఖర్చుల్లో వృథాను గుర్తించి, నిధులను ఆదా చేసేందుకు, ప్రభుత్వ వ్యవస్థల్లో సమూల మార్పులకు ఎలాన్ మస్క్ అధ్యక్షతన డోజ్‌ను ట్రంప్ ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా ట్రంప్ ప్రమాణ స్వీకారం చేసిన గంటల వ్యవధిలోనే అమెరికా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం.. ఏఎఫ్‌జీఈ.. డోజ్ చెల్లుబాటుపై వాషింగ్టన్‌లోని ఓ న్యాయస్థానంలో దావా వేసి అధ్యక్షుడికి షాకిచ్చింది.

డోజ్ బాధ్యతలు వద్దు : వివేక్ రామస్వామి

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఏర్పాటు చేసిన డోజ్ బాధ్యతల నుంచి భారతీయ, అమెరికన్ వ్యాపారవేత్త వివేక్ రామస్వామి తప్పుకున్నారు. డోజ్ బాధ్యతలను ఎలాన్ మస్క్‌తోపాటు వివేక్ రామస్వామికి ట్రంప్ అప్పగించారు. అయితే, ఒహాయో గవర్నర్ ఎన్నికల బరిలో నిలిచే ఆలోచనలో ఉన్న నేపథ్యంలో డోజ్ బాధ్యతల నుంచి తప్పుకుంటున్నానని రామస్వామి ప్రకటించారు. డోజ్ ఏర్పాటులో తాను కీలకంగా వ్యవహరించడం సంతోషంగా ఉందని, డోజ్ లక్ష్య సాధనలో మస్క్ బృందం విజయం సాధిస్తుందన్నారు.

సత్యం.. సుందరం!

- ప్రపంచ ప్రభావశీల భారతీయుల్లో వీరే టాప్
- హురున్ గ్లోబల్ ఇండియన్స్ లిస్ట్ విడుదల



న్యూఢిల్లీ, జనవరి 21: అత్యంత ప్రభావశీలురైన ప్రపంచ భారతీయుల్లో మైక్రోసాఫ్ట్ సీఈవో, ఛైర్మన్ సత్య నాదెళ్ల అగ్రస్థానం దక్కించుకున్నారు. రెండో స్థానంలో గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ నిలిచారు. ప్రపంచంలో అత్యంత విలువైన కంపెనీలకు దిశానిర్దేశం చేస్తున్న భారతీయ సంతతి వ్యక్తులతో కూడిన జాబితాను హెచ్‌ఎస్‌బీసీ హురున్ 'గ్లోబల్ ఇండియన్స్-2024' పేరుతో తొలిసారి జాబితా విడుదల చేసింది. ఇందులో 200 ప్రముఖ కంపెనీలు, 226 వ్యక్తుల గురించి ప్రస్తావించింది. అందులో సాఫ్ట్‌వేర్, ఆర్థిక సేవలు, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, ఫార్మా తదితర కంపెనీలు ఉన్నాయి. ఈ కంపెనీలకు నేతృత్వం వహించడం ద్వారా భారతీయ సంతతి వ్యక్తులు ప్రపంచ ఆర్థిక గమనాన్ని నిర్దేశిస్తున్నారని హెచ్‌ఎస్‌బీసీ హురున్ కొనియాడింది. ఆ జాబితా టాప్ టెన్‌లో సత్య నాదెళ్ల తొలిస్థానం దక్కించుకోగా, రెండో స్థానంలో గూగుల్ (ఆల్ఫాబెట్) సీఈవో సుందర్ పిచాయ్, మూడో స్థానంలో యూట్యూబ్ సీఈవో నీల్ మోహన్ నిలిచారు. ఇక ఈ జాబితాలో 12 మంది మహిళలు కూడా స్థానం దక్కించుకున్నారు. వారిలో నేహా నర్ఖేడే (కాన్‌ఫ్లుయెంట్), అంజలి సూద్ (టుబి), యామినీ రంగన్ (హబ్‌స్పాట్), లీనా నాయర్ (చానెల్) తదితరులు ఉన్నారు. గతేడాది నవంబరు 29 నాటికి ఆయా కంపెనీల మార్కెట్ స్థాయిలను బట్టి హెచ్‌ఎస్‌బీసీ హురున్ ఈ ర్యాంకుల జాబితాను రూపొందించింది.

'అభయ' మృత దేహంపై ఓ మహిళ డీఎన్‌ఏ!

కోల్‌కతా, జనవరి 21: కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ ప్రభుత్వ ఆస్పత్రిలో మెడికో 'అభయ'పై జరిగిన అత్యాచారం, హత్య కేసులో కొత్త విషయాలు వెలుగు చూస్తున్నాయి. ఈ కేసులోని ముద్దాయి సంజయ్ రాయ్ చనిపోయే వరకు జైలులోనే ఉండాలంటూ ట్రయల్ కోర్టు సోమవారం తీర్పు ఇచ్చిన విషయం విదితమే. అయితే విచారణ సందర్భంగా సమర్పించిన కొన్ని నివేదికల ద్వారా మరికొంత ఆసక్తికర సమాచారం వెల్లడయింది. సెంట్రల్ ఫోరెన్సిక్ ల్యాబ్ సమర్పించిన నివేదికను పరిశీలించినప్పుడు అత్యాచారానికి గురయిన ఆ యువ వైద్యురాలి మృతదేహంపై సంజయ్ రాయ్ డీఎన్‌ఏ 100 శాతం మేర ఉన్నట్టు గుర్తించారు. అయితే కొద్ది శాతం మేర మరో మహిళ డీఎన్‌ఏ కూడా ఉన్నట్టు తేలింది. ఇది పొరపాటున సంజయ్‌రాయ్ డీఎన్‌ఏలో కలిసిందా, లేదంటే ఆమెకు కూడా ఏమైనా ప్రమేయం ఉందా అన్నదానిపై స్పష్టత రావాల్సి ఉంది. ఇదిలా ఉండగా, ట్రయల్ కోర్టు ఇచ్చిన తీర్పుపై అప్పీలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు అనుమతి మంజూరు చేసింది. ముద్దాయి సంజయ్ రాయ్ చనిపోయే వరకు జైలులోనే ఉండాలని ట్రయల్ కోర్టు సోమవారం తీర్పు ఇవ్వగా, దానిపై ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అసంతృప్తి వ్యక్తం చేశారు. మరణశిక్ష విధించి ఉంటే బాగుండేదని, తీర్పుపై అప్పీలు చేస్తామని తెలిపారు. దాంతో తీర్పు వచ్చి 24 గంటలు గడవకముందే అడ్వకేట్ జనరల్ కిశోర్ దత్తా మంగళవారం ఉదయమే హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

బర్త్ టూరిజానికి అడ్డుకట్ట



వాషింగ్టన్ డీసీ, జనవరి 21: అమెరికా చట్టాల ప్రకారం ఆ దేశ పౌరులకు పుట్టిన పిల్లలకే కాక, అమెరికా గడ్డపై పుట్టిన ప్రతి ఒక్కరికీ పౌరసత్వం లభిస్తుంది. అమెరికాలో పుట్టినవారంతా ఆ దేశ పౌరులే అనే ఉద్దేశంతో 1868లో చేసిన 14వ రాజ్యాంగ సవరణ ద్వారా శరణార్థుల పిల్లలకు అమెరికా జన్మతః పౌరసత్వాన్ని అందిస్తోంది. అయితే, తాజాగా ట్రంప్ జారీ చేసిన ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వులతో దీనికి అడ్డుకట్ట పడినట్లయింది. ట్రంప్ ఉత్తర్వుల ప్రకారం.. బిడ్డకు జన్మనిచ్చే సమయానికి తల్లిదండ్రులు అమెరికా పౌరులు కాకపోయినా, ఒకవేళ తండ్రి చట్టబద్ధంగా అమెరికాలో ఉన్నప్పటికీ.. శాశ్వత నివాసి కాకపోతే పుట్టిన పిల్లలకు అమెరికా పౌరసత్వం రాదు. అలాగే, తండ్రి శాశ్వత నివాసి అయినప్పటికీ తల్లి తాత్కాలిక వీసా మీద అమెరికాలో నివాసం ఉంటున్నా ఇదే నియమం వర్తిస్తుంది.

భారతీయుల పరిస్థితి ఏంటి?

అమెరికాలో 2024 చివరి నాటికి 54 లక్షల మంది ప్రవాస భారతీయులు అక్కడ నివసిస్తున్నారు. వీరిలో 34 శాతం మంది అమెరికాలోనే జన్మించారు. మిగిలిన వారంతా వలసదారులే. ఈ నేపథ్యంలో ట్రంప్ నిర్ణయం ఎన్నారైలపై తీవ్ర ప్రభావం చూపిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు! తాత్కాలిక వీసాపై అమెరికా వెళ్లి, గ్రీన్ కార్డు కోసం నిరీక్షిస్తున్న వారికి పుట్టిన పిల్లలెవరికీ ఇకపై అమెరికా పౌరసత్వం దక్కదు.

ప్రభావం ఎలా?

అమెరికాలో నివసిస్తున్న భారతీయులకు పుట్టిన పిల్లలకు ఇకపై జన్మతః పౌరసత్వం లభించదు. గ్రీన్ కార్డు కోసం కొన్ని దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న 10 లక్షల మందికి పైగా భారతీయ వలసదారులు, వారి పిల్లలకు కూడా అక్కడి పౌరసత్వం రాకపోతే.. గ్రీన్ కార్డు జారీ ప్రక్రియ మరింత ఆలస్యమవుతుంది. 'బర్త్ టూరిజం' మాయమైపోతుంది. పిల్లలకు అమెరికా పౌరసత్వం లభించాలన్న ఉద్దేశంతో ధనవంతులైన చాలా మంది భారతీయ మహిళలు.. కాన్పు సమయానికి అమెరికా వెళ్తుంటారు. దీన్నే 'బర్త్ టూరిజం'గా పేర్కొంటారు. అయితే, ఈ విధానాన్ని రద్దు చేసేందుకు అమెరికా రాజ్యాంగాన్ని సవరించాల్సి ఉంటుంది. ఇందుకు హౌస్, సెనేట్‌లో మూడింట రెండొంతుల మెజారిటీ ఓట్లు అవసరం. ఆ తర్వాత రాష్ట్ర శాసనసభల్లో నాలుగింట మూడొంతుల మంది దాన్ని ఆమోదించాలి. హౌస్, సెనెట్‌లో రిపబ్లికన్లకు అంత సంఖ్యాబలం లేదు. ఈ నేపథ్యంలో రాజ్యాంగ సవరణ అంత సులభం కాకపోవచ్చని నిపుణులు చెబుతున్నారు.

18 వేల మంది తిరిగి భారత్‌కు!

అక్రమంగా అమెరికాలో ఉన్న భారత వలసదారులను వెనక్కి రప్పించనున్నారు. అమెరికా, భారత్ ప్రభుత్వాలు కలిసి గుర్తించిన ఇలాంటి అక్రమ వలసదారులైన దాదాపు 18 వేల మందిని తిరిగి భారత్‌కు తీసుకురానున్నారు. వారందరినీ అమెరికా నుంచి వెనక్కి రప్పించేందుకు భారత ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది.

ఉపాధ్యక్షురాలిగా ఉషను ఎంపిక చేయాల్సింది!

తెలుగింటి ఆడపడుచు ఉషా వాన్స్‌పై ట్రంప్ ప్రశంసల జల్లు

న్యూఢిల్లీ, జనవరి 21: అగ్రరాజ్య 47వ అధ్యక్షుడిగా సోమవారం ప్రమాణ స్వీకారం చేసిన డొనాల్డ్ ట్రంప్ తన ప్రారంభోపన్యాసంలో తెలుగింటి ఆడపడుచు, అమెరికా నూతన ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ సతీమణి, దేశ రెండో మహిళ 39 ఏళ్ల ఉషా వాన్స్(చిలుకూరి)పై ప్రశంస జల్లు కురిపించారు. "ఆమె కడు నేర్పరి.. తెలివైంది. అసలు ఉపాధ్యక్ష పదవికి ఆమెను ఎంపిక చేసుకుని ఉంటే బాగుండేది. కానీ, వారసత్వం సరికాదు కాబట్టి జేడీని ఎంపిక చేసుకున్నా" అని ప్రమాణ స్వీకార మహోత్సవంలో తనకు సమీపంలో ఉన్న ఉషా వాన్స్‌వైపు చూస్తూ ట్రంప్ వ్యాఖ్యానించారు. దీంతో అతిథులు కరతాళ ధ్వనులతో తమ సంతోషాన్ని వ్యక్తం చేయగా వాన్స్ తన సతీమణిని చూస్తూ గర్వంతో చిరునవ్వు నవ్వారు. "గత కొంత కాలంగా జేడీ వాన్స్‌ను పరిశీలిస్తున్నాను. ఆయన గొప్ప సెనేటర్. చాలా తెలివిగల వ్యక్తి. అందుకే ఓహియో బాధ్యతలను ఆయనకు అప్పగించాను" అని అన్నారు.



ట్రంప్, వాన్స్ దంపతులు

మళ్లీ ఒక ఏడాది బీఈడీ

- నాలుగేళ్ల డిగ్రీ లేదా పీజీ చేసినవారే అర్హులు

న్యూఢిల్లీ, జనవరి 21 : మళ్లీ ఒక ఏడాది బీఈడీ కోర్సును ప్రవేశపెట్టే అవకాశాలు ఉన్నాయని జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి(ఎన్‌సీటీఈ) ప్రకటించింది. కేంద్ర విద్యా శాఖకు ఇందుకు సంబంధించిన నిబంధనల డ్రాఫ్ట్‌ను సమర్పించనున్నట్లు ఎన్‌సీటీఈ ఛైర్మన్ పంకజ్ అరోరా సోమవారం వెల్లడించారు. 2014లో ఈ బీఈడీ కోర్సును రద్దు చేయగా జాతీయ విద్యా విధానంలో చేసిన సిఫార్సుల మేరకు మళ్లీ ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. నాలుగేళ్ల బ్యాచిలర్స్ డిగ్రీ పూర్తిచేసిన లేదా రెండేళ్ల మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులే ఈ కోర్సు చేయవచ్చని అరోరా వెల్లడించారు. మూడేళ్ల డిగ్రీ చేసినవారు ఈ కోర్సు చేసేందుకు వీల్లేదు. ఆ అభ్యర్థులు రెండేళ్ల బీఈడీ కోర్సులో చేరాల్సి ఉంటుంది. ఒక ఏడాది బీఈడీ కోర్సు సహా పలు ఇతర కోర్సులకు సంబంధించిన నిబంధనలను ఖరారు చేసేందుకు 8 మంది సభ్యులతో ఒక కమిటీని సోమవారం ఏర్పాటు చేశారు.

పోటీ పరీక్షల అభ్యర్థులకు 15వేలు

- దరఖాస్తు ఫీజు, ప్రయాణ ఖర్చుల రీయింబర్స్‌మెంట్
- ఢిల్లీ ఎన్నికలకు రెండో మేనిఫెస్టో విడుదల చేసిన బీజేపీ

న్యూఢిల్లీ, జనవరి 21: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల కోసం బీజేపీ తన రెండో మేనిఫెస్టోను విడుదల చేసింది. తొలి మేనిఫెస్టోలో మహిళా ఓటర్లను ఆకర్షించేలా పలు పథకాలు ప్రకటించిన బీజేపీ... ఇప్పుడు విద్య, సంక్షేమం, యువజన సాధికారతపై దృష్టి సారించింది. ఈ మేరకు 'సంకల్ప్ పత్ర'ను ఆ పార్టీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ విడుదల చేశారు. తాము అధికారంలోకి వస్తే పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు రూ.15వేల సహాయంతో పాటు దరఖాస్తు ఫీజు, ప్రయాణ ఖర్చులను ఒక్కో అభ్యర్థికి రెండుసార్లు చొప్పున రీయింబర్స్‌మెంట్ చేస్తామని ప్రకటించారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే నిరుపేద విద్యార్థులకు కేజీ నుంచి పీజీ వరకూ ఉచిత విద్య అందిస్తామని హామీ ఇచ్చారు. కార్మికుల సంక్షేమంలో భాగంగా ఇంటి పనివారి కోసం ప్రత్యేకంగా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని తెలిపారు. వారికి రూ.10లక్షల బీమా, రూ.5 లక్షల ప్రమాద బీమా, వారి పిల్లలకు ఉపకార వేతనాలు, 6 నెలల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు వర్తింపజేస్తామన్నారు. అదేవిధంగా ఆటో, టాక్సీ డ్రైవర్లకు రూ.10లక్షల జీవిత బీమా, రూ.5లక్షల ప్రమాద బీమా, వాహన బీమా, వారి పిల్లలకు ఉపకార వేతనాలు ఇస్తామని బీజేపీ హామీ ఇచ్చింది. 'డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టైపెండ్ స్కీమ్' కింద ఎస్సీ విద్యార్థులకు నెలకు రూ.1,000 స్టైపెండ్ ఇవ్వనున్నట్లు ప్రకటించింది.



మ్యానిఫెస్టోను విడుదల చేస్తున్న కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్

ఆర్టీసీకి 'పండగే'!

20వ తేదీ ఒక్కరోజే రికార్డుస్థాయిలో 23 కోట్ల ఆర్జన


సోమవారం విజయవాడ బస్టాండులో ప్రయాణికుల రద్దీ

- ఇందులో ప్రత్యేక బస్సుల ఆదాయం 21 కోట్లు
- విడిరోజుల్లో ఏనాడూ 17కోట్లు దాటని వైనం
- సంక్రాంతికి వచ్చి తిరుగుప్రయాణమయ్యేవారి కోసం అదనంగా రెండు వేల బస్సులు తిప్పిన ఆర్టీసీ
- దీంతో ఆర్టీసీనే ఎంచుకున్న ప్రయాణికులు
- ఈ ఆదరణ మరవలేం : ద్వారకా తిరుమలరావు

అమరావతి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): 'మీ సేవల్లో నాణ్యత ఉంటే ఆదరించేందుకు మేం సిద్ధం' అంటూ ఆర్టీసీకి ప్రయాణికులు గట్టి సంకేతం ఇచ్చారు. పెద్ద పండగ సంక్రాంతికి సొంతూళ్లకు వచ్చిన ప్రజలు తిరుగు ప్రయాణంలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి చరిత్రలో సంస్థ చూడనంత ఆదాయాన్ని ఒకే రోజు అందించారు. అయితే పండగకు వచ్చే ప్రయాణికుల్ని బస్టాండ్లలో పడిగాపులు కాయించిన ఆర్టీసీ ఉన్నతాధికారులను సీఎం చంద్రబాబు మందలించడంతో మేల్కొని తిరుగు ప్రయాణాలకు సరిపడా బస్సులు ఏర్పాటు చేశారు. దీంతో ఈ నెల 20న సొంతూళ్ల నుంచి తిరిగి వెళ్లే ప్రయాణికుల నుంచి ఆర్టీసీకి ఏకంగా రూ.23.71కోట్ల ఆదాయం వచ్చింది. ఇదే పండగ సీజన్లో మూడు సార్లు 20కోట్ల ఆదాయాన్ని ఆర్టీసీ దాటింది. ఆర్టీసీ అంటే ఒకప్పుడు ఆసియా దేశాల్లోనే అతిపెద్ద ప్రజా రవాణా సంస్థ. ప్రతి పల్లెకు ప్రయాణ సేవలందిస్తూ అన్ని వర్గాల ప్రజలతో మమేకమైన ఆర్టీసీ క్రమక్రమంగా ఆక్యుపెన్సీ కోల్పోతోంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఒక్క కొత్త బస్సు కూడా కొనుగోలు చేయకుండా డొక్కు బస్సులతో గోతుల మయమైన రోడ్లతో ప్రయాణికులను ఆర్టీసీ భయపెట్టింది. దీనికితోడు మూడుసార్లు ప్రయాణికులపై మోయలేని భారం మోపి అంతకు ముందున్న ధరలకు దాదాపు రెట్టింపు చేసింది. సిబ్బంది విలీనంతో ప్రయాణ సేవల్లోనూ నాణ్యత తగ్గడం, ఎండీ సహా ఇంచార్జిలుగా ఉన్న కీలక అధికారులు కనీస సమీక్ష చేయకపోవడంతో ప్రయాణికుల సంఖ్య బాగా తగ్గిపోయింది. రాష్ట్రంలో ప్రభుత్వం మారగానే కొత్త బస్సులు కొనుగోలు మొదలు పెట్టిన ఆర్టీసీ ... గడిచిన ఆర్నెలల్లో సుమారు 600 బస్సులు సమకూర్చుకుంది. ఇది గమనించిన ప్రయాణికులు ఆర్టీసీ వైపు చూడటం మొదలుపెట్టారు.

ముఖ్యమంత్రి సూచనలతో

ఏటా సంక్రాంతికి ప్రత్యేక బస్సులు ఏర్పాటుచేసే ఆర్టీసీ ఎండీతో ప్రెస్ మీట్ పెట్టించి తమ సేవలు వినియోగించుకోవాలంటూ ప్రయాణికులకు విజ్ఞప్తి చేసేది. ఈ ఏడాది మాత్రం ఒక ప్రకటన చేసి ఊరుకున్నారు. తగినన్ని బస్సులు కూడా ఏర్పాటు చేయలేదు. పాత ఆలోచనాధోరణి మారని కొందరు ఆర్టీసీ ఉన్నతాధికారుల తీరుతోనే సమస్యలు వస్తున్నాయని చెబుతున్నారు. పండగ పూట ప్రయాణికులు విజయవాడ, గుంటూరు, ఏలూరు, రాజమహేంద్రవరం తదితర ప్రాంతాల్లో బస్టాండ్లలో బస్సుల కోసం పడిగాపులు కాశారు. టీవీల్లో ప్రయాణికుల కష్టాలు చూసిన సీఎం చంద్రబాబు....ఆర్టీసీ అధికారులను గట్టిగా మందలించారు. దీంతో అప్పటికప్పుడు ప్రైవేటు విద్యా సంస్థల బస్సులు సమీకరించుకుని పడిగాపుల ప్రయాణీకుల్ని గమ్యం చేర్చారు. ఈ అనుభవంతో తిరుగు ప్రయాణంలో రెండు వేల బస్సులు అదనంగా ఏర్పాటు చేసి తిరుగు ప్రయాణాల్లో ఇబ్బందుల్లేకుండా జాగ్రత్త పడ్డారు. సంక్రాంతికి వచ్చే వారి కోసం 3,900, తిరుగు ప్రయాణికులకు 3,300 బస్సులు ఏర్పాటు చేసిన ఆర్టీసీ....పండగ రోజు అనుభవంతో మేల్కొని రెండు వేల బస్సులు అదనంగా ఏర్పాటు చేసింది. ప్రయాణ చార్జీలు కూడా సాధారణ ధరల్లోనే ఉండటంతో ఆర్టీసీ చరిత్రలోనే చూడనంత ఆదాయాన్ని అందించి ప్రయాణికులు తమ ఆదరణ చూపించారు. ఈ విషయమై ఆర్టీసీ ఇంచార్జి ఎండీ ద్వారకా తిరుమలరావు స్పందిస్తూ.. ప్రత్యేక సర్వీసుల పట్ల ప్రయాణికుల ఆదరణ ఎప్పటికీ మరువలేమని, చరిత్రలో చూడనంత ఆదాయం ఒక్క రోజు రావడానికి కారణం డ్రైవర్లు, కండక్టర్లు, సూపర్‌వైజర్లేనని వ్యాఖ్యానించారు. రెగ్యులర్ సర్వీసులు కాకుండా పండగ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సుల ద్వారా రూ.21.11కోట్లు ఆదాయం వచ్చిందని తెలిపారు.

నేడు 'అనంత'లో డాకు మహారాజ్ విజయోత్సవ సభ

అనంతపురం అర్బన్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): డాకు మహారాజ్ విజయోత్సవ సభ బుధవారం అనంతపురం నగరంలోని శ్రీనగర్ కాలనీలో నిర్వహించనున్నారు. సాయంత్రం 6.30 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం ఎమ్మెల్యే, హీరో నందమూరి బాలకృష్ణతోపాటు చిత్ర యూనిట్ సభ్యులు హాజరవుతారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను అనంతపురంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. అదే సమయంలో తిరుపతిలో తొక్కిసలాట జరగడంతో రద్దు చేశారు. ఈ నేపథ్యంలో అనంతపురంలో సినిమా విజయోత్సవ సభను నిర్వహిస్తున్నారు.

ఉగ్రవాదుల కాల్పుల్లో యువ జవాన్ మృతి

- ఉత్తర జమ్మూకశ్మీర్‌లో ఘటన
- చిత్తూరు జిల్లాకు చెందిన కార్తీక్ వీరమరణం
- ఎగువ రాగిమానుపెంటలో నేడు అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు


కార్తీక్

బంగారుపాళ్యం, అమరావతి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రవాదులు, సైనికుల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో చిత్తూరు జిల్లాకు చెందిన యువ జవాన్ కార్తీక్(29) ప్రాణాలు కోల్పోయారు. బంగారుపాళ్యం మండలం ఎగువ రాగిమానుపెంటకు చెందిన వరదరాజులు, సెల్వి దంపతుల ఇద్దరు కుమారుల్లో కార్తీక్ చిన్నవాడు. కార్తీక్ ప్రాథమిక విద్యాభ్యాసం బంగారుపాళ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, ఇంటర్మీడియట్ చిత్తూరు పీసీఆర్ జూనియర్ కళాశాలలో పూర్తి చేశారు. డిగ్రీ చదువుతూ 2017లో ఆర్మీలో చేరాడు. గత ఏడాది దీపావళికి ఇంటికి వచ్చి వారంపాటు కుటుంబ సభ్యులతో, స్నేహితులతో సంతోషంగా గడిపారు. మే నెలలో మళ్లీ వస్తానని చెప్పి విధులకు వెళ్లారు. ఈ క్రమంలో ఆదివారం ఉత్తర జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రవాదులు, సైనికుల మధ్య జరిగిన కాల్పుల్లో కార్తీక్ తీవ్రంగా గాయపడగా, ఆర్మీ అధికారులు ఆస్పత్రిలో చేర్పించారు. సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు కార్తీక్ తండ్రి వరదరాజులకు ఫోన్ చేసి.. కార్తీక్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని తెలిపారు. సాయంత్రం మళ్లీ ఫోన్ చేసి వీరమరణం పొందాడని సమాచారం ఇచ్చారు. దీంతో కుటుంబ సభ్యులు షెల్లుమన్నారు. కార్తీక్ మరణంతో గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. బుధవారం ఉదయానికి కార్తీక్ పార్థివదేహం ఎగువ రాగిమానుపెంటకు చేరుకోనుంది. అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

చంద్రబాబు, లోకేశ్ సంతాపం

జవాన్ కార్తీక్ దేశరక్షణలో వీరమరణం పొందడంపై విదేశీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ 'ఎక్స్' వేదికగా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దేశం కోసం ప్రాణాలర్పించిన కార్తీక్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన కార్తీక్ ధైర్య సాహసాలు వెలకట్టలేనివని లోకేశ్ పేర్కొన్నారు.


శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలో నిర్వహించిన రోడ్డు భద్రతా వారోత్సవాల్లో ఎమ్మెల్యే బాలకృష్ణకు హెల్మెట్ అందిస్తున్న ఆర్టీవో కరుణసాగర్ రెడ్డి

రాష్ట్రాన్ని వైసీపీ సర్వనాశనం చేసింది

- ఎన్టీఆర్, చంద్రబాబు అభినవ భగీరథులు: బాలకృష్ణ

హిందూపురం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల పాలనలో వైసీపీ రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ విమర్శించారు. శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం నియోజకవర్గంలో మంగళవారం ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. లేపాక్షి, చిలమత్తూరు మండలాల్లో రైతులకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పంపిణీ చేశారు. రవాణా, పోలీసు శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్డు భద్రతా వారోత్సవాల్లో పాల్గొన్నారు. బైక్ ర్యాలీలో హెల్మెట్ ధరించి బుల్లెట్ నడిపారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ.. రాయలసీమకు నీరు అందించే హంద్రీనీవా ఎత్తిపోతల పథకం ఎన్టీఆర్ మానస పుత్రిక అని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా హంద్రీనీవా పనులను దృఢ సంకల్పంతో ముందుకు తీసుకెళ్తున్నారని అన్నారు. ఎన్టీఆర్, చంద్రబాబు అభినవ భగీరథులని కొనియాడారు. కాగా, తాను తీసే ప్రతి సినిమా సమాజానికి సందేశమిచ్చేలా ఉంటుందని, అందుకే సూపర్‌హిట్ అవుతున్నాయని చెప్పారు. నీటికోసం పోరాడే రైతులను దృష్టిలో పెట్టుకుని 'డాకు మహారాజ్' సినిమాలో నటించానని అన్నారు.

సెంచరీ కొట్టనున్న షార్



- వందో రాకెట్ ప్రయోగానికి సన్నద్ధం
- నెలాఖరులో జీఎస్ఎల్వీ-ఎఫ్15 ప్రయోగం
- కక్ష్యలోకి ఎన్వీఎస్-02 నావిగేషన్ ఉపగ్రహం
- ప్రధాని నరేంద్ర మోదీ హాజరయ్యే అవకాశం

సూళ్లూరుపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ అంతరిక్ష కేంద్రం (షార్) మరో అరుదైన మైలురాయికి సిద్ధమవుతోంది. ఈ నెలాఖరులో ఇస్రో ఇక్కడ వందో రాకెట్ ప్రయోగాన్ని చేపట్టనుంది. జీఎస్ఎల్వీ-ఎఫ్15 రాకెట్ ద్వారా ఎన్వీఎస్-02 ఉపగ్రహాన్ని రోదసీలోకి చేర్చనుంది. ఇప్పటికే షార్ రెండో ప్రయోగ వేదికపై రాకెట్ అన్ని దశల అనుసంధాన పనులను శాస్త్రవేత్తలు పూర్తి చేశారు. రాకెట్ శిఖర భాగంలో అమర్చడానికి ముందు క్లీన్ రూమ్‌లో ఉపగ్రహానికి తుది పరీక్షలు నిర్వహించారు. ఈ నెలాఖరులో ప్రయోగం ఉండొచ్చని భావిస్తున్నారు. తేదీని అధికారికంగా ఖరారు చేయాల్సి ఉంది. కాగా... ఎన్వీఎస్-02 రెండో తరానికి చెందిన నావిగేషన్ ఉపగ్రహం. ఈ సిరీస్‌లో ఇస్రో ఇప్పటికే 7 ఉపగ్రహాలను ప్రయోగించింది. వాటిలో మూడింటి కాలపరిమితి ముగిసింది. వాటి స్థానంలో కొత్త ఉపగ్రహాల ప్రయోగానికి ఇస్రో శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా 2023 మే 29న జీఎస్ఎల్వీ-ఎఫ్12 రాకెట్ ద్వారా ఎన్వీఎస్-01 ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించింది. ఇప్పుడు జీఎస్ఎల్వీ-ఎఫ్15 రాకెట్ ద్వారా ఎన్వీఎస్-02 ఉపగ్రహాన్ని కక్ష్యలోకి పంపేందుకు ఏర్పాట్లు చేస్తోంది. షార్‌లో ఇది వందో ప్రయోగం కావడంతో ప్రధాని నరేంద్ర మోదీని ఇస్రో ఆహ్వానించింది. దీనికి ప్రధాని ఆమోదం తెలిపారని, కార్యక్రమం ఖరారు కావాల్సి ఉందని తెలుస్తోంది.

మే 3 నుంచి గ్రూప్-1 మెయిన్స్ రాత పరీక్షలు

- 89 పోస్టులకు 4,496 మంది పోటీ

అమరావతి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 మెయిన్స్ రాత పరీక్షలు మే 3వ తేదీ నుంచి 9 వరకు జరుగుతాయని ఏపీపీఎస్సీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. దీని ప్రకారం.. మే 3, 4 తేదీల్లో తెలుగు, ఇంగ్లీష్ అర్హత (క్వాలిఫైయింగ్ నేచర్) పరీక్షలు ఉంటాయి. 5న సమకాలీన అంశాలు, ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ అంశాలపై సాధారణ వ్యాసరూప ప్రశ్నల పేపర్-1 పరీక్ష నిర్వహిస్తారు. 6న ఆంధ్రప్రదేశ్, భారతదేశ చరిత్ర, సంస్కృతి, జాగ్రఫీల మీద పేపర్-2 పరీక్ష నిర్వహిస్తారు. 7న పాలిటీ, రాజ్యాంగం, పరిపాలన, న్యాయ, విలువలపై పేపర్-3 పరీక్ష జరుగుతుంది. 8న ఆంధ్రప్రదేశ్, భారతదేశ ఎకానమీ, అభివృద్ధిపై పేపర్-4 పరీక్ష నిర్వహిస్తారు. 9న సైన్స్, టెక్నాలజీ, పర్యావరణ అంశాలపై చివరి పరీక్ష పేపర్-5 ఉంటుంది. 2023లో జారీ అయిన ఈ గ్రూప్-1 నోటిఫికేషన్‌లో మెయిన్స్‌కు 4,496 మంది ఎంపికయ్యారు. ఈ నోటిఫికేషన్ ద్వారా 89 గ్రూప్ పోస్టులను భర్తీ చేయనున్నారు. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, అనంతపురం కేంద్రాల్లో ఆయా తేదీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షలు జరుగుతాయి.

చంద్రబాబు సంస్కరణలతోనే విద్యుత్తు రంగంలో పెట్టుబడులు

- ఆపత్కాలాల్లో విద్యుత్తు ఉద్యోగుల సేవలు వెలకట్టలేనివి
- ఉద్యోగుల వేతన సవరణ సమస్యను పరిష్కరిస్తాం
- ఏపీఎస్ఈబీ ఇంజనీర్స్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణలో మంత్రి గొట్టిపాటి

అమరావతి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): 'ఆపత్కాల సమయంలో విద్యుత్తు ఉద్యోగుల సేవలు వెలకట్టలేనివి. ఔదార్యంలోనే వారే ముందుండేది. బుడమేరు వరదల వేళ అందరికంటే ముందుగా ఒకరోజు వేతనాన్ని ప్రకటించారు' అని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రశంసించారు. మంగళవారం విజయవాడలోని ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఏపీఎస్ఈబీ ఇంజనీర్స్ అసోషియేషన్ డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడారు. 'సీఎం చంద్రబాబు ప్రవేశపెట్టిన విద్యుత్తు సంస్కరణల కారణంగానే ప్రైవేటు రంగంలో పెట్టుబడులు వస్తున్నాయి. దావోస్ పర్యటనలో సీఎం చంద్రబాబు పునరుత్పాదక విద్యుత్తు రంగంలో పెట్టుబడుల సేకరణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. వ్యవసాయానికి స్మార్ట్ మీటర్లు పెట్టకూడదని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది. అసెంబ్లీలో ప్రకటించింది. అయినప్పటికీ తన రాజకీయ అస్తిత్వం కోసం వైసీపీ అధ్యక్షుడు జగన్ అసత్య ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. విద్యుత్తు ఉద్యోగుల వేతన సవరణ సమస్యను పరిష్కరిస్తాం' అని గొట్టిపాటి హామీ ఇచ్చారు.

జిల్లాలకు బీజేపీ అధ్యక్షుల నియామకం

అమరావతి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సభ్యత్వ నమోదు ప్రక్రియ పూర్తి చేసిన భారతీయ జనతా పార్టీ తాజాగా జిల్లాలకు నూతన అధ్యక్షులను నియమించింది. పార్టీని బలోపేతం చేయాలన్న అగ్ర నాయకత్వం ఆదేశాలతో క్షేత్రస్థాయిలో బలపడే ప్రయత్నాలు రాష్ట్ర నాయకత్వం చేస్తోంది. అందులో భాగంగానే గత సెప్టెంబరులో సభ్యత్వ నమోదు చేపట్టింది. ఆ వెంటనే పోలింగ్ బూత్ బాధ్యుల నియామకం నుంచి మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ అధ్యక్షుల మార్పునకు శ్రీకారం చుట్టింది. అన్నమయ్య, నంద్యాల, ఎన్టీఆర్, ఏలూరు, మన్యం జిల్లాల్లో మాత్రం పాత వారినే కొనసాగించింది.

డీఆర్వో 'రమ్మీ'పై విచారణకు ఆదేశం



అనంతపురం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఉప కులాల వర్గీకరణ అంశంపై ఏకసభ్య కమిషన్ రాజీవ్ రంజన్ మిశ్రా అభిప్రాయాలు సేకరించే సమయంలో.. వేదికపైనే ఆన్‌లైన్ రమ్మీ ఆడిన అనంతపురం డీఆర్వో మలోల వ్యవహారంపై కలెక్టర్ వినోద్‌కుమార్ విచారణకు ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం చోటుచేసుకున్న ఈ ఘటనపై 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం ప్రచురితమైన కథనం కలకలం రేపింది. ఉన్నతాధికారుల పక్కనే కూర్చుని సెల్‌ఫోన్‌లో డీఆర్వో రమ్మీ ఆడటాన్ని కలెక్టర్ తీవ్రంగా పరిగణించారు. ఆయనపై మండిపడ్డారు. విచారించి, రెండు రోజుల్లో నివేదిక ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మను ఆదేశించారు. జేసీ వెంటనే విచారణ ప్రారంభించారు. డీఆర్వో రమ్మీ వీడియోను సేకరించి, సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించినట్లు తెలిసింది. జేసీ నివేదిక ఆధారంగా డీఆర్వోపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది. కాగా, డీఆర్వో తీరుపై దళిత సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి తదితరులు జాయింట్ కలెక్టర్‌ను కలిసి డీఆర్వోను సస్పెండ్ చేయాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చారు.

'ఉక్కు'ను కాపాడింది చంద్రబాబే: మంత్రి కొల్లు

- రెండేళ్లపాటు 99 శాతం సామర్థ్యంతో నడిపితే సెయిల్‌లో విలీనం చేయాలని కోరతాం: పల్లా

విశాఖపట్నం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఆంధ్రుల సెంటిమెంట్‌తో ముడిపడిన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రస్తుత సంక్షోభం నుంచి కాపాడింది సీఎం చంద్రబాబేనని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ఉక్కు కర్మాగారం పరిరక్షణకు చిత్తశుద్ధితో పనిచేసింది. కేంద్రం రూ.11,440 కోట్లతో ప్యాకేజీ ప్రకటించింది. నక్కపల్లిలో మిట్టల్ స్టీల్‌ప్లాంటు ఏర్పాటు కోసం దావోస్ వేదికగా చంద్రబాబు ఒప్పందం చేసుకున్నారు' అని తెలిపారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ, 'కేంద్రం ఇచ్చిన సహాయంతో రెండేళ్లపాటు స్టీల్ ప్లాంటును 99 శాతం సామర్థ్యంతో నడిపితే సెయిల్‌లో విలీనం చేయాలని కోరతాం. సొంత గనులు కేటాయిస్తే కష్టాలు తీరతాయి' అని అన్నారు.

రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యం

- ఎన్ఐఆర్‌సీఏ ఆవిష్కరణలో కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ

రాజమహేంద్రవరం రూరల్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): సీటీఆర్ఐ గత 75 ఏళ్లగా పొగాకు రైతుల ఆర్థిక జీవన స్థితి గతులను మెరుగు పరచడానికి విశేషంగా కృషి చేసిందని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ తెలిపారు. ఇప్పుడు ఈ సంస్థ పరిధిని పెంచుతూ పొగాకుతో పాటు అదనంగా పసుపు, మిరప, ఆముదం, అశ్వగంధ పంటలను చేర్చి ఐసీఏఆర్‌గా రూపొందించామని చెప్పారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని సీటీఆర్ఐలో మంగళవారం జరిగిన ఎన్ఐఆర్‌సీఏ ఆవిష్కరణ వేడుకలు జరిగాయి. దీనికి శ్రీనివాసవర్మ ముఖ్య అతిథిగా విచ్చేసి ఎన్ఐఆర్‌సీఏ లోగోను, ఎన్ఐఆర్ సీఏ భవన సముదాయం పేరును ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. ఎన్ఐఆర్‌సీఏ ద్వారా భారత రైతాంగం భవిష్యత్తులో ఎంతో లబ్ధి పొందగలదని తెలిపారు. ప్రధాని మోదీ 10 ఏళ్లగా రైతుల ఆదాయం రెట్టింపు దిశగా విలువ ఆధారిత వ్యవసాయ ఉత్పత్తులను పెంచి వ్యవసాయాన్ని వాణిజ్యంగా తీర్చిదిద్ది, దిగుమతులను తగ్గించుకోవాలని కృషి చేస్తున్నారన్నారు.



సీటీఆర్ఐలో ఎన్ఐఆర్‌సీఏ లోగో ఆవిష్కరిస్తున్న కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ

రేపటి నుంచి స్లాటెడ్ సర్వదర్శన టోకెన్ల జారీ

- ఏరోజుకారోజు జారీ చేసేలా ప్రణాళిక

తిరుమల, జనవరి 21(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి స్లాటెడ్ సర్వదర్శనం (ఎస్ఎస్‌డీ) టోకెన్లను గురువారం నుంచి తిరిగి ప్రారంభించనున్నట్లు టీటీడీ మంగళవారం ప్రకటించింది. మంగళవారం రాత్రి టీటీడీ ఈవో శ్యామలరావు ఎస్ఎస్‌డీ టోకెన్ల జారీపై తిరుపతిలో అధికారులతో సమీక్షించారు. గతంలో ఎస్ఎస్‌డీ టోకెన్ల విధానం లేకుండా దర్శనాలు ఎలా జరిగాయి? రద్దు చేస్తే కలిగే పరిణామాలేంటి? టోకెన్ల జారీ కౌంటర్ల వద్ద క్యూలైన్ల నిర్వహణ, భద్రత వంటి అంశాలపై చర్చించినట్లు తెలిసింది. టోకెన్ల జారీపై వివిధ రకాల చర్చలు నడుస్తున్న నేపథ్యంలో 23వ తేదీ గురువారం నుంచి ఏరోజుకారోజు స్లాటెడ్ సర్వదర్శన టోకెన్లను జారీ చేయనున్నట్లు మంగళవారం రాత్రి టీటీడీ ఓ ప్రకటనలో తెలిపింది. అలిపిరిలోని భూదేవి కాంప్లెక్స్, తిరుపతి రైల్వేస్టేషన్ వద్దనున్న విష్ణునివాసం, బస్టాండ్ వద్దనున్న శ్రీనివాసంలో యథావిధిగా టోకెన్లు జారీ చేయనున్నారు.

మెట్రోకెమ్ ఫార్మాలో అగ్ని ప్రమాదం

- దెబ్బతిన్న ఈటీపీ భవనం, రూ.లక్షల్లో ఆస్తి నష్టం



పరవాడ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా పరవాడ ఫార్మాసిటీలోని మెట్రో కెమ్ ప్రైవేటు లిమిటెడ్‌లో మంగళవారం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఇందుకు సంబంధించి పరవాడ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కంపెనీలోని ఎఫ్లూయింట్ ట్రీట్‌మెంట్ ప్లాంటు (ఈటీపీ) భవనం మూడో అంతస్థులో గోనె సంచులు, డ్రమ్ములు, ఇతర వ్యర్థాలు నిల్వ చేస్తారు. రెండు నుంచి మూడు టన్నులు కాగానే వాటిని విక్రయిస్తుంటారు. మంగళవారం ఉదయం 6.15 గంటల సమయంలో నిల్వ ఉంచిన వ్యర్థాల నుంచి మంటలు రాజుకున్నాయి. రసాయన వ్యర్థాలు కావడంతో పెద్ద ఎత్తున అగ్నికీలలు ఎగసిపడ్డాయి. మంటల తీవ్రత ఎక్కువ కావడంతో రాంకీ అగ్నిమాపక శకటంతో పాటు అనకాపల్లి అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలికి చేరుకున్నారు. సుమారు 40 నిమిషాల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. వ్యర్థాలు రాపిడికి గురై మంటలు వ్యాపించి ఉండవచ్చని అధికారులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. ప్రమాదం జరిగిన సమయంలో సంఘటనా స్థలం వద్ద కార్మికులెవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. మంటలకు భవనం పాక్షికంగా దెబ్బతింది. రూ.లక్షల్లో ఆస్తి నష్టం జరిగిందని అంచనా వేస్తున్నారు. గతేడాది నవంబరు రెండవ తేదీన ఇదే కంపెనీలో రియాక్టర్ మ్యాన్‌హోల్ తెరుచుకోవడంతో ప్రొడక్షన్ బ్లాక్‌లో పెద్దపేలుడు సంభవించింది. అయితే ఆరోజు కూడా కార్మికులెవరికీ ఎలాంటి హాని జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

శాంతి...నిజంగానే?!

'గాజా కాల్పుల విరమణ ఒప్పందం సృష్టికర్త డోనాల్డ్ ట్రంప్ కదా..?' అంటూ వెనకనుంచి వినిపించిన ఓ వ్యాఖ్య లాంటి ప్రశ్నను జో బైడెన్ చిన్నచిరునవ్వుతో జోక్ అని తీసిపారేశారు. హమాస్–ఇజ్రాయెల్ చర్చల్లో అప్పటికి కాబోయే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దూత కూడా ఉన్న విషయం తెలిసిందే. పదిహేను నెలల భీకరమైన విధ్వంసం తరువాత, సదరు కాల్పుల విరమణ ఒప్పందం ఆదివారంనుంచి అమల్లోకి రావడమే కాదు, ఉభయపక్షాలనుంచి బందీల అప్పగింత కూడా ఎటువంటి అడ్డంకులూ లేకుండా జరిగింది. కేవలం ట్రంప్ హెచ్చరికతోనే, బైడెన్ మాదిరిగా ఆయనను సులువుగా పెరట్లోకట్టేసుకోవడం సాధ్యం కాదని తెలిసినందునే నెతన్యాహూ దిగివచ్చాడనీ, ఒప్పందం అమల్లోకి వచ్చిందనీ అంతా అనుకున్నారు. కానీ, అమెరికా అధ్యక్షుడైన వెంటనే తనకు ఈ ఒప్పందం ఎక్కువకాలం నిలుస్తుదన్న నమ్మకం లేదని ట్రంప్ తీసిపారేశారు. కాల్పుల విరమణ ఒప్పందంలోని దశలన్నీ దాటేట్టుగా ఆయన చూస్తాడని, గట్టిగా నిలబడతాడని అనుకుంటున్న తరుణంలో ఈ వ్యాఖ్యలు ఆశ్చర్యం కలిగించేవే.

ఆదివారం ఉదయం ఎనిమిదిన్నరనుంచి కాల్పుల విరమణ అమల్లోకి రావాల్సి ఉండగా, తొలివిడతగా విడుదలచేయాల్సిన ముగ్గురు బందీల జాబితాను హమాస్ ఇవ్వలేదన్న సాకుతో మరింత ఉధృతంగా దాడులను కొనసాగించింది ఇజ్రాయెల్. ముగ్గురు యువతులను రెడ్‌క్రాస్‌కు అప్పగించే లోగా ఓ పాతికమంది ప్రాణాలు తీసింది. కాల్చేస్తా, పేల్చేస్తా అంటూ నెతన్యాహూ ఓ పక్క అంటున్నా, కాల్పులు నిలిచిపోవడం, బందీల విడుదల జరగడం ఓ అతిపెద్ద ఉపశమనం. ఇజ్రాయెల్ బాంబుదాడులకు నేలమట్టమైపోయిన అల్‌సరయా స్క్వేర్‌లో చోటుచేసుకున్న ఈ అప్పగింత కార్యక్రమాన్ని, హమాస్ అందించిన గిఫ్ట్‌బ్యాగులతో రెడ్‌క్రాస్ వాహనాల్లో కూచున్న ఆ యువతులను ఇజ్రాయెల్ ఆసుపత్రులకు తరలించడాన్ని ప్రపంచమంతా ఆనందంగా గమనించింది. ఇందుకు ప్రతిగా, 90మంది పాలస్తీనా మహిళలూ పిల్లలను ఇజ్రాయెల్ వదిలిపెట్టడమూ జరిగింది. శనివారం మరో నలుగురు బందీలను అప్పగించబోతున్నట్టు హమాస్ మంగళవారం చేసిన ప్రకటన ఆ సంస్థ ఈ ఒప్పందానికి కట్టుబడివున్నదనడానికి నిదర్శనం. ఆహారసరఫరాలతో గాజాలోకి వందలాది ట్రక్కులు ప్రవేశించడం ఓ అరుదైన దృశ్యం. గాజావాసులు స్వేచ్ఛగా తిరుగుతున్నారు, కూలిన ఇళ్ళను చూసి దుఃఖిస్తున్నారు. 470 రోజులకు పైగా భయంకరమైన విధ్వంసాన్ని చవిచూసిన వారికి నిరవధికంగా ఆహారం, మందులు, ఇతర సరఫరాలు అందాల్సి ఉంది.

కాల్పుల విరమణ ఒప్పందంలో భాగంగా ప్రతీ ఇజ్రాయెలీ బందీకీ ప్రతిగా పదులూ వందలసంఖ్యలో పాలస్తీనా ఖైదీలను విడిచిపెట్టవలసి రావడం నెతన్యాహూకు ఇబ్బందికరమైన స్థితే. ఒప్పందంపై ఇజ్రాయెలీలు ఏమనుకుంటున్నారో కచ్చితంగా తెలియదు కానీ, నెతన్యాహూ కూటమి ప్రభుత్వంలో మాత్రం లుకలుకలు ఆరంభమైనాయి. కొందరు మంత్రివర్గ సహచరులను, కొంత మద్దతును ఆయన కోల్పోవలసి రావచ్చు. ఇద్దరు ఉన్నతస్థాయి సైనికాధికారులు హఠాత్తుగా రాజీనామా చేయడానికి ఈ ఒప్పందమే కారణమని అంటారు. ఈ ఆగ్రహాన్ని ఉపశమింపచేయడం కోసం కాబోలు, ఒకపక్క హమాస్‌తో యుద్ధం ఆపి, మరోపక్క వెస్ట్‌బ్యాంక్‌లోని జెనిన్‌లో ఇజ్రాయెల్ సైన్యం తన పైశాచికత్వాన్ని ప్రదర్శిస్తోంది.

తొలిదశ ఆరువారాలూ సవ్యంగా గడిస్తే కాల్పుల విరమణ ఒప్పందం కచ్చితంగా నిలుస్తుంది. హమాస్ దగ్గర బందీలుగా ఉన్నవారిలో ముప్పైమూడుమంది విడుదలై, 1900మంది పాలస్తీనియన్ ఖైదీలు బయటకువస్తే ఇరుపక్షాలమధ్య నమ్మకం పెరుగుతుంది. మధ్య గాజానుంచి, ఈజిప్ట్‌సరిహద్దులనుంచి ఇజ్రాయెల్ సైన్యం ఉపసంహరించుకున్నపక్షంలో వాతావరణం మరింత మెరుగుపడుతుంది. గత పదిహేను నెలలకాలంలో హమాస్ బాగా దెబ్బతిన్నప్పటికీ, ప్రస్తుత సంధికాలం అది తిరిగిశక్తిని పుంజుకొనేందుకు ఉపకరిస్తుందన్న అనుమానాలు బాగా ఉన్నాయి. కాల్పుల విరమణ అమల్లోకి రాగానే ఆయుధాలు చేబూనిన హమాస్ మిలిటెంట్లు వీరవిహారం చేస్తున్న దృశ్యాలు విస్తృతంగా ప్రచారమవుతున్నాయి. అపనమ్మకాలను, ఉద్రిక్తతలను పెంచే ఇటువంటి సందర్భాలు రాబోయే రోజుల్లో మరిన్ని చూడవలసి రావచ్చు. బైడెన్‌ను దాటి ఇజ్రాయెల్‌కు సాయపడటానికి ట్రంప్ సిద్ధంగా ఉన్నారనడానికి అధికారంలోకి రాగానే ఇజ్రాయెల్‌కు ఆయన ఇచ్చిన బాంబులూ వరాలే నిదర్శనం. ఒప్పందానికి ముఖ్యకారకుడని అనుకుంటున్న ఆయనే దానిని ఆఖరువరకూ నిలిచేట్టు చూడాలని ప్రపంచమంతా కోరుకుంటోంది. శాంతిని పెంచడం కష్టం కానీ, తుంచడం సులువే.


డ్రిల్, బేబి, డ్రిల్ అనేది ఆకర్షణీయమైన రాజకీయ నినాదం. వ్యాపారాత్మక దృష్టితో చూసినప్పుడు అది ఆత్మహత్యా సదృశమని చెప్పక తప్పదు. ఎక్కువగా ఉత్పత్తి చేస్తే సరఫరా–గిరాకీ సమతౌల్యం దెబ్బతిని డ్రిల్లింగ్ చేసే సంస్థలు నష్టపోతాయి. అమెరికా తీర ప్రాంతాలలో పర్యావరణ పరిరక్షణ కొరకు బైడెన్ ప్రభుత్వం విధించిన ఆంక్షల వలన తమ వ్యాపారాలు దెబ్బతినడంతో అమెరికన్ చమురు సంస్థలు ట్రంప్‌కు అండగా నిలిచాయి కానీ తాము నష్టపోవడానికి మాత్రం కాదు.

ట్రంప్ 'స్వర్ణ' స్వప్నం పగటి కలే!

చమురు ధరల పెరుగుదల ద్రవ్యోల్బణానికి ఒక ప్రధాన కారణం. చమురు ఉత్పాదక దేశాలు మినహా ప్రపంచవ్యాప్తంగా అమెరికాతో సహా అన్ని దేశాలకు ఈ ప్రాథమిక సూత్రం వర్తిస్తుంది. చమురు ధరలను సాకుగా చూపి 'డ్రిల్, బేబీ, డ్రిల్' అంటూ ఎన్నికల ప్రచారంలో డొనాల్డ్ ట్రంప్ హోరెత్తించారు. విజయం సాధించారు. అధ్యక్ష పదవీ బాధ్యతలు స్వీకరించిన వెన్వెంటనే చమురు ఉత్పత్తిపై ఆయన వ్యాఖ్యలు ప్రపంచ వ్యాప్తంగా ఆసక్తి రేకెత్తిస్తున్నాయి.

ట్రంప్ సోమవారం నాడు రెండవసారి అధికారం చేపట్టిన మరుక్షణమే అమెరికాలో ఇంధన అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. స్వదేశంలో చమురు ఉత్పత్తిని ఇతోధికంగా పెంపొందించడంపై ట్రంప్‌కు ఉన్న ఆసక్తి, ఆయన ఇస్తున్న ప్రాధాన్యానికి ఆ ప్రకటన ఒక సంకేతం. అమెరికాలో చమురు ఉత్పత్తిపై ఉన్న నిషేధాజ్ఞలను తొలగించారు; చమురు ఉత్పాదకతకు అడ్డంకులు సృష్టిస్తున్న పర్యావరణ నిబంధనలకు పాతర పెట్టారు. అంతేకాకుండా కర్బన ఉద్గారాల తగ్గింపునకు ఉద్దేశించిన పారిస్ ఒడంబడిక నుండి వైదొలుగుతున్నట్లు ట్రంప్ ప్రకటించారు. పర్యావరణ పరిరక్షణ పేరిట ప్రజల ఇళ్ళ నుండి గ్యాసు లేదా చమురుతో నడిచే హీటర్లను కూడ తొలగించడానికి బైడెన్ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లుగా ఎన్నికల ప్రచారంలో ట్రంప్ ఎద్దేవా చేశారు. అందుకు తగినట్లుగా ట్రంప్ అధికారం చేపట్టిన వెంటనే పర్యావరణ పరిరక్షణకు సంబంధించి బైడెన్ తీసుకున్న అనేక నిర్ణయాలను రద్దు చేశారు.

రష్యా – ఉక్రెయిన్ యుద్ధం ఫలితంగా చమురు ధరలు పెరిగిపోయాయి. ఆ ధరలను నియంత్రించేందుకు అమెరికా తన ముందస్తు నిల్వల నుంచి భారీ పరిమాణంలో చమురును మార్కెట్‌లోకి విడుదల చేసింది. దీంతో చమురు నిల్వలు తగ్గి, గత 40 సంవత్సరాలలో ఎన్నడూ లేని రీతిలో కనిష్ఠ స్థాయిలోకి పడిపోయాయి. అందుకే తాను పూర్తి స్థాయి సామర్థ్యానికి నిల్వలను పునరుద్ధరిస్తానని ట్రంప్ ప్రకటించారు. 1973 అరబ్ –ఇజ్రాయిల్ యుద్ధం అనంతరం అరబ్బు దేశాలు అమెరికాకు చమురు ఎగుమతులపై నిషేధం విధించాయి. పర్యవసానంగా చుట్టుముట్టిన సమస్యలను అధిగమించేందుకై అమెరికా ముందస్తు చమురు నిల్వల విధానాన్ని ప్రారంభించింది.



అమెరికా గత కొద్ది కాలంగా చమురు, సహజ వాయువు ఉత్పత్తిలో రష్యా, అరబ్బు దేశాలను మించిపోయింది. ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన తరువాత రష్యాపై ఆంక్షల వలన సహజ వాయువు ఉత్పత్తిలో అమెరికా ప్రపంచ అగ్రగామిగా నిలిచింది. అదే విధంగా చమురు ఉత్పత్తిలో కూడ సౌదీ అరేబియాను ప్రస్తుతానికి అధిగమించింది. భూగోళం మీద కేవలం అమెరికాలో మాత్రమే అత్యధికంగా చమురు, సహజవాయువు నిల్వలు ఉన్నాయని, వీటిని యావత్తు ప్రపంచానికి ఎగుమతి చేయడం ద్వారా అమెరికాలో స్వర్ణయుగానికి నాంది పలుకుతామని ట్రంప్ తన ఎన్నికల ప్రచారంలో పదే పదే చెప్పారు. మొదటిసారి అధ్యక్షుడుగా ఉన్నప్పుడు కూడా చమురు ధరల విషయమై ట్రంప్ అనేక ప్రగల్భాలు పలికారు. ట్రంప్‌తో సన్నిహిత సంబంధాలు ఉన్నా చమురు ధరల విషయంలో గల్ఫ్ దేశాలు అమెరికాకు చుక్కలు చూపించాయి. తమ వ్యూహాత్మక విధానంతో అమెరికా చమురు సంస్థలను దాదాపుగా దివాలా తీయించాయి. ఇది ఎవరూ విస్మరించలేని వాస్తవం.

సరఫరా– డిమాండ్ సూత్రంతో నడిచే మార్కెట్ ఆర్థిక వ్యవస్థలో ధరలను నియంత్రించడం అంత సులువు కాదు. చమురు వినియోగంలో భారత్, చైనా సహా ఆసియా దేశాలది సింహభాగం. అయితే అమెరికాలోని చమురు ఉత్పాదక రాష్ట్రాల నుంచి ఈ దేశాలకు భారీ నౌకలలో చమురు రవాణా వ్యవధి ఇంచుమించు రెండు నెలలు. అమెరికా తక్కువ ధరకే చమురు విక్రయించినా దూరం కారణాన రవాణా వ్యయం అత్యధికంగా ఉంటుంది. పైగా అమెరికా చమురు తేలిక రకమైంది. దాన్ని శుద్ధి చేయడం సాంకేతికంగా భారత్ తదితర ఆసియా దేశాల రిఫైనరీలకు అంత సులభం కాదు. ఈ కారణాన వెనీజులా చమురు ఆధారిత దేశీయ అంబానీ, ఎస్సార్ రిఫైనరీలు అంతగా రాణించలేకపోతున్నాయి.

వీటన్నింటికీ మించి అమెరికాలో చమురు ఉత్పాదక వ్యయం అరబ్ దేశాలతో పోల్చితే అధికంగా ఉంటుంది. పీపా చమురు ఉత్పత్తికి అమెరికాలో సగటున 50 నుంచి 70 డాలర్లు ఖర్చు అవుతుంది. అదే అరబ్ దేశాలలో అయితే పీపా చమురు ఉత్పత్తి వ్యయం సగటున 10 డాలర్లకు మించదు. ఉత్పాదక వ్యయం తక్కువగా ఉండడంతో పాటు వినియోగ దేశాలకు భౌగోళికంగా అనుకూలమైన ప్రాంతాలు కావడంతో అరబ్ దేశాలు అమెరికా ఎగుమతి ఆకాంక్షలపై నీళ్ళు చల్లుతున్నాయి.

డ్రిల్, బేబీ, డ్రిల్ అనేది నిస్సందేహంగా ఆకర్షణీయమైన రాజకీయ నినాదం. అయితే వ్యాపారాత్మక దృష్టితో చూసినప్పుడు అది ఆత్మహత్యా సదృశమని చెప్పక తప్పదు. ఎక్కువగా డ్రిల్లింగ్ చేసి ఉత్పత్తి చేస్తే సరఫరా–గిరాకీ సమతౌల్యం దెబ్బతిని డ్రిల్లింగ్ చేసే సంస్థలు నష్టపోతాయి. అమెరికా తీర ప్రాంతాలలో చమురు వెలికితీతపై పర్యావరణ పరిరక్షణ కొరకు బైడెన్ ప్రభుత్వం విధించిన ఆంక్షల వలన తమ వ్యాపారాలు దెబ్బతినడంతో అమెరికన్ చమురు సంస్థలు ట్రంప్‌కు అండగా నిలిచాయి కానీ తాము నష్టపోవడానికి మాత్రం కాదు.

చమురు సంపాదనతో అమెరికాలో స్వర్ణయుగానికి నాంది పలుకుతానని ట్రంప్ ప్రకటించడం ముదావహమే కానీ సకల దేశాలూ తమ చమురునే కొనుగోలు చేయాలనే నిర్బంధ వైఖరే ఆక్షేపణీయం. అంతర్జాతీయ చమురు వ్యాపారంలో (అరబ్ దేశాల పెత్తనం ఉన్న) ఒపెక్ కూటమి వాటా 60 శాతానికి పైగా ఉన్నది. భూగోళంపై చమురు నిక్షేపాలలో 72 శాతం ఈ కూటమి సభ్య దేశాలలోనే ఉన్నాయి. అమెరికా ఎన్నటికీ ఈ కూటమి దేశాలతో పోటీపడలేదు.

▪ **మొహమ్మద్ ఇర్ఫాన్**
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ఉచితాలతో అప్పుల ఊబిలోకి!



▪ **ఎ. కృష్ణారావు**

ఇండియాగేట్

'ప్రజలకు స్వీట్ల మాదిరి ఉచితాలను పంచిపెడుతూ పోతే ఆధునిక భారత దేశం అంధకార యుగంలోకి జారిపోతుంది.. ఉచితాలను అమలు చేస్తే ఎక్స్‌ప్రెస్ వేలు, విమానాశ్రయాలు, రక్షణ కారిడార్లను నిర్మించలేం' అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ 2022 జూలై 16న యూపీలో బుందేల్‌ఖండ్ ఎక్స్‌ప్రెస్ వేను ప్రారంభిస్తూ హెచ్చరించారు. మోదీ దారిలో కేంద్రమంత్రులు కూడా ఉచితాలను విమర్శించారు. అయితే ఆ తర్వాత ఏడాదే మధ్యప్రదేశ్‌లో లాడ్లీ బెహనా పథకం క్రింద మహిళలకు నెలకు రూ. 1250 చొప్పున చెల్లిస్తామని, క్రమంగా దాన్ని రూ. 3వేల వరకు పెంచుతామని బీజేపీ ప్రకటించడంతో ఆ రాష్ట్రంలో ఆ పార్టీ అధికారంలోకి రాగలిగింది. ఈ పథకాన్ని 'గేమ్ ఛేంజర్'గా ఆ పార్టీ నేతలే అభివర్ణించారు. మధ్యప్రదేశ్‌లోనే కాదు, ఆ తర్వాత ప్రతి రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో బీజేపీ ఉచితాల మీద ఉచితాలను ప్రకటిస్తూ ఎన్నికల్లో ప్రయోజనం పొందింది. ఇటీవల జరిగిన మహారాష్ట్ర ఎన్నికల్లో కూడా లడ్కీ బెహన్ పథకం వల్ల బీజేపీకి పెద్ద ఎత్తున మహిళలు ఓట్లు వేశారు. ప్రస్తుతం దేశ రాజధాని ఢిల్లీలో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ కనీవినీ ఎరుగని స్థాయిలో ప్రకటిస్తున్న ఉచితాల హామీలను బట్టి చూస్తే ఈ పార్టీయేనా గతంలో ఉచితాలను వ్యతిరేకించింది అని ఆశ్చర్యం కలుగుతుంది.

దేశ రాజకీయాల్లో ఈ ఉచితాల సంస్కృతి ఎంత పెనవేసుకుపోయింది అంటే ఆర్థిక వ్యవస్థపై దీని వల్ల తీవ్రమైన భారం పడుతుంది అని తెలిసినా ఏ రాజకీయ పార్టీ కూడా ఉచితాలను ప్రకటించేందుకు వెనుకాడడం లేదు. ఉచితాలను సమర్థంగా అమలు చేస్తే అధికారంలోకి తప్పకుండా రాగలుగుతాం అని ఆమ్ ఆద్మీ పార్టీ పలు ఎన్నికల్లో నిరూపించింది. మంచి నీరు, విద్యుత్, ఆరోగ్యం, విద్య, మహిళలకు బస్సు ప్రయాణం, వృద్ధులకు తీర్థ యాత్ర.. ఇలా ప్రతి రంగంలోనూ ఉచితాలను ప్రవేశపెట్టి అమలు చేయడం ద్వారా 2013 నుంచి ఇప్పటి వరకూ ఆప్‌కు ఎన్నికల్లో తిరుగులేకుండా పోతోంది. ఢిల్లీ మద్యం కేసులో అరెస్ట్ అయి జైలు నుంచి విడుదల అయిన తర్వాత ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ మరిన్ని ఉచితాలను ఎడా పెడా ప్రకటించారు. మహిళలకు ముఖ్యమంత్రి మహిళా సమ్మాన్ యోజన క్రింద నెలకు రూ. 2100 చొప్పున నగదు బదిలీ చేస్తామని, ఆలయాలు, గురుద్వారాల్లో పూజారులకు నెలకు రూ. 18వేల చొప్పున గౌరవ వేతనం చెల్లిస్తామని, ఆటో డ్రైవర్లకు, వారి కుటుంబ సభ్యులకు కూడా బీమా, వివాహాలు, స్కూలు యూనిఫారంల రూపంలో ఆర్థిక సహాయం అందిస్తామని, ఢిల్లీలో అద్దె గృహాలలో ఉన్న వారందరికీ ఉచిత విద్యుత్, నీరు సరఫరా చేస్తామని ఈ ఎన్నికల్లో ఆప్ అధినేత ప్రకటించి ప్రత్యర్థి పార్టీలను కూడా ఆత్మరక్షణలో పడేలా చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనైనా గెలవాలనుకుంటున్న బీజేపీ తాను కూడా ఉచితాల వర్షాన్ని కురిపించింది. కేజ్రీవాల్ కంటే ఒక అడుగు ముందుకు వేసి మహిళలకు రూ. 2500 చొప్పున నెలకు చెల్లిస్తామని, గర్భిణీ స్త్రీలకు రూ. 21వేలతో పాటు ఆరు పోషకాహార కిట్లను పంచిపెడ్తామని బీజేపీ ప్రకటించింది. తమ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేస్తూ బీజేపీ జాతీయ అధ్యక్షుడు జగత్ ప్రకాశ్ నడ్డా ఇది కేవలం మొదటి భాగం మాత్రమే అనడాన్ని బట్టి కేజ్రీవాల్ ఆ పార్టీపై ఎంత ప్రభావం చూపుతున్నారో అర్థమవుతుంది. ఢిల్లీ మాత్రమే కాదు, ఇప్పుడు యావద్దేశమూ ఉచితాల బాటలో పయనిస్తోంది. 2024–25లో 9 రాష్ట్రాలు మహిళలకు నగదు బదిలీ క్రింద రూ. లక్ష కోట్లు ఖర్చు పెట్టాయని చట్టసభల పనితీరును అధ్యయనం చేసే పీఆర్ఎస్ పరిశోధనా సంస్థ వెల్లడించింది.

రూ. 76 వేల కోట్ల ఢిల్లీ బడ్జెట్‌లో దాదాపు రూ. 15వేల కోట్లకు పైగా ఉచితాలకు, సబ్సిడీలకే ఖర్చవుతుందని, రూ. 8,159 కోట్ల మేరకు బడ్జెటరీ లోటు ఏర్పడుతుందని, పెద్ద ఎత్తున అప్పులు చేయక తప్పదని తెలిసి కూడా కేజ్రీవాల్ తిరిగి అధికారంలోకి రావడానికి ప్రజలకు హామీలను కురిపించక తప్పడం లేదు. జాతీయ చిన్నపొదుపు మొత్తాల నిధి నుంచి కూడా ఆప్ ప్రభుత్వం అప్పులు చేసి రోజువారీ ఖర్చులను భరించాల్సి వస్తోంది.

కేంద్ర ఆర్థిక పరిస్థితి కూడా అంత దివ్యంగా ఏమీ లేదు. ఈ ఆర్థిక సంవత్సరాంతానికి మార్కెట్ అప్పులతో సహా కేంద్రం అప్పులు రూ. 185 లక్షల కోట్లకు చేరుకోబోతున్నాయి. జీడీపీలో 56.8 శాతం దేశం అప్పులే ఉన్నాయి. ప్రతి ఏడాదీ రూ. 30 లక్షల కోట్లు ప్రభుత్వం అదనంగా అప్పులు చేయాల్సి వస్తున్నది. రాష్ట్రాల పరిస్థితి కూడా ఇంతకంటే దారుణంగా ఉన్నది. ఎన్నికల్లో గెలిచేందుకు రకరకాల ఉచితాలను ప్రకటించిన ప్రభుత్వాలు వాటిని అమలు చేయడం కోసం నానా కష్టాలు పడాల్సి వస్తోంది. మహారాష్ట్రలో లడ్కీ బెహనా పథకం అమలు చేసేందుకు ఏటా రూ. 46వేల కోట్లు ఎలా తేవాలా అని ప్రభుత్వం గింజుకుంటున్నట్లు సమాచారం.

నగదు బదిలీల వల్ల ప్రజల వినియోగ సామర్థ్యం పెరిగి ఆర్థిక వ్యవస్థకు ఎంతో కొంత తోడ్పడుతుందనే వాదన ఒకటి ఉన్నది. అయిత నిరుత్పాదక వ్యయం వల్ల జరిగే నష్టాలు అన్నీ ఇన్నీ కావు కదా. ప్రజలకు చేతినిండా పని కల్పించలేని ప్రభుత్వాల అసమర్థత వల్ల ఆర్థిక వ్యవస్థకు ఎంత మేరకు నష్టం జరుగుతుందో, దాని వల్ల సమాజంలో జరిగే నష్టాలు ఎన్నో కూడా ఊహించవచ్చు. 'ఏదీ ఉచితంగా లభించదు. కొందరికి లభించే ఉచితాలకు సమాజంలో మరెవరో చెల్లించాల్సి వస్తుంది' అని ఆర్థికవేత్తలు అంటున్నారు. వేల కోట్లు బ్యాంకులకు అప్పులు బాకీపడిన, విదేశాలకు పరారైన, కోట్ల రూపాయలు పన్నులు ఎగ్గొట్టిన, రాజకీయ పార్టీలకు నిధులు సమకూర్చిన సంపన్నులు మాత్రం ఈ ఉచితాలను భరించడం లేదన్నది మాత్రం వాస్తవం. అందుకే దేశంలో అసమానతలు తగ్గించాలంటే లక్షల కోట్లకు పడగలెత్తిన (సూపర్ రిచ్) సంపన్నులపై మరిన్ని పనులు విధించినప్పుడే దేశంలో అసమానతలు తగ్గుతాయని గత ఏడాది ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో జరిగిన ఒక సెమినార్‌లో ప్రసంగించిన ఫ్రెంచ్ ఆర్థికవేత్త థామస్ పికెటీ అన్నారు. దేశం సంపదలో 40 శాతం పైగా కేవలం ఒక శాతం సంపన్నులు కబళించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. బహుశా కార్పొరేట్లకు, సంపన్నులకు రుణాలను రద్దు చేయడం, భారీ ప్యాకేజీని ప్రకటించడం, కొంతమంది సంపన్నులకు అనుకూలంగా విధానాలను రూపొందించడాన్ని ప్రజలు ప్రశ్నిస్తారనే భయంతోనే దేశంలో రాజకీయ పార్టీలు వారిని ప్రలోభపెట్టేందుకు ఉచితాలను ప్రయోగిస్తున్నారేమో అన్న అనుమానం కూడా లేకపోలేదు. నిజానికి ఉచితాలను అమలు చేసి రాజకీయ ప్రయోజనాలు పొందే పార్టీలు ఎవరి జేబులు కొడుతున్నాయో, సామాన్యులు, మధ్యతరగతి వర్గాలు ఆలోచించాల్సిన అవసరం ఉన్నది. ఉచితాల వల్ల జరిగే భారీ వ్యయాన్ని భరించేందుకు ఆర్థిక లోటు లక్ష్యాలను, పెట్టుబడి, రెవిన్యూ వ్యయాలను, మౌలిక సదుపాయాలకు పెట్టే ఖర్చును రాష్ట్ర ప్రభుత్వం సవరించాల్సి వస్తోంది. దాని వల్ల ఏ వర్గం నష్టపోతోంది?

ఆర్థికవేత్తల ప్రకారం సబ్సిడీలు వేరు, ఉచితాలు వేరు. సబ్సిడీల వల్ల కొన్ని సందర్భాల్లో పెట్టిన ఖర్చు తిరిగి వస్తుంది. కాని ఉచితాలు గోడకు వేసిన సున్నం లాంటిదే. ఆరోగ్యం, విద్య, ప్రభుత్వ సేవలు అందించడాన్ని ఉచితాలుగా వర్గీకరించలేమని, వీటిలో కొన్ని ఆర్థిక వ్యవస్థ ఆరోగ్యవంతం కావడానికి తోడ్పడతాయని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ (ఎన్‌ఐపీఎఫ్‌పీ)కి చెందిన పరిశోధకులు అంటున్నారు. 'ఒక వస్తువు సేకరించినప్పుడు పెట్టే వ్యయానికి, దాన్ని అమ్మిన ధరకు మధ్య తేడాయే సబ్సిడీ' అని ప్రముఖ ఆర్థికవేత్త, రిజర్వుబ్యాంకు మాజీ గవర్నర్ సి. రంగరాజన్ నిర్వచించారు. ప్రజలకు అత్యవసరమైన వస్తువులపై, వ్యక్తికన్నా సమాజానికి తోడ్పడే వస్తువులపై పెట్టే సబ్సిడీని సమర్థించవచ్చు కాని అంతకు మించి ఏది చేసినా అది ఉచితమే అవుతుందని ఆయన అన్నారు. ఉత్పత్తి వ్యయాని కంటే తక్కువగా లేదా ఉచితంగా ఇచ్చిన వస్తువు, సేవలను ఉచితాలనే భావించవచ్చని వివేక్ కౌల్ అనే మరో ఆర్థికవేత్త అన్నారు. ఆర్థికవేత్తలు ఏమి చెబుతున్నప్పటికీ సంక్షేమ వ్యయం, సబ్సిడీలు, ఉచితాలకూ మధ్య సరిహద్దులు రోజురోజుకూ చెరిగిపోతున్నాయి. సమాజంలో అట్టడుగు వర్గాలకు చేయూత నిచ్చేందుకు, విద్యను, నైపుణ్యాన్ని పెంపొందించేందుకు, ఆరోగ్య సంరక్షణ కల్పించేందుకు మాత్రమే సహాయం చేయాలన్న నిబంధనను ప్రభుత్వాలు పెట్టుకోవడం లేదు. దీనివల్ల దాదాపు అన్ని వర్గాలూ ఉచితాలను ఆశించే పరిస్థితి ఏర్పడుతోంది. 'ఉచితాలకు మీరు నిధులు కేటాయిస్తారు కాని న్యాయమూర్తుల జీతాలు, పింఛన్లు చెల్లించేందుకు మాత్రం మీ వద్ద డబ్బులు లేవు. ఎంతకాలం హేతుబద్ధత లేకుండా ఈ ఉచితాలను కొనసాగిస్తారు?' అని సుప్రీంకోర్టు కూడా ప్రశ్నించింది. ఢిల్లీలోని ప్రతిష్ఠాత్మకమైన ఎయిమ్స్ ఆసుపత్రిని ఇటీవల సందర్శించిన కాంగ్రెస్ నేత రాహుల్ ఆసుపత్రి కారిడార్లలో, ఫుట్‌పాత్‌లపై చికిత్సకోసం రోజుల తరబడి వేచి చూస్తూ రాత్రింబగళ్లు పడిగాపులు కాస్తున్న వేలాది పేదలను చూసి చలించిపోయారు. ఈ మానవత్వ సంక్షోభాన్ని పట్టించుకోవాల్సిందిగా ఆయన ఆరోగ్యమంత్రి నడ్డాకు లేఖ రాశారు. ఎయిమ్స్‌లోనే కాదు, దేశంలో అనేక ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఈ దుస్థితి కొనసాగుతోంది. ఉచితాలపై కంటే ఇలాంటి వాటి గురించి ప్రభుత్వాలు ఎందుకు పట్టించుకోవడం లేదు? జమిలి ఎన్నికలు, ఉమ్మడి పౌరస్మృతి వంటివి బీజేపీకి ముఖ్యమే కావచ్చు కాని ఉచితాలపై నరేంద్రమోదీ వివిధ రాజకీయ పార్టీల మధ్య ఏకాభిప్రాయసాధనకు ప్రయత్నించడం తక్షణ అవసరం. పారదర్శకత, నిర్దిష్ట కాలపరిమితిని నిర్ణయించడం, అవసరమైన వారిని గుర్తించడం, లక్ష్యాలను సమర్థంగా సాధించారా లేదా సమీక్షించడం వంటి విధానాల ద్వారా ఉచితాలను, సబ్సిడీలను హేతుబద్ధం చేయాల్సి ఉంది. లేకపోతే ఈ ఉచితాల పరంపర ఎంత హాస్యాస్పదమైన స్థాయికైనా దిగజారవచ్చు.

(ఆంధ్రజ్యోతి డిల్లీ ప్రతినిధి)




ఉచితాలను అమలు చేసి రాజకీయ ప్రయోజనాలు పొందే పార్టీలు ఎవరి జేబులు కొడుతున్నాయో, సామాన్యులు, మధ్యతరగతి వర్గాలు ఆలోచించాల్సిన అవసరం ఉన్నది. ఉచితాలపై వివిధ రాజకీయ పార్టీల మధ్య ఏకాభిప్రాయసాధనకు ప్రధాని మోదీ ప్రయత్నించాలి. పారదర్శకత, నిర్దిష్ట కాలపరిమితిని నిర్ణయించడం, అవసరమైన వారిని గుర్తించడం, లక్ష్యాలను సమర్థంగా సాధించారా లేదా సమీక్షించడం వంటి విధానాల ద్వారా ఉచితాలను, సబ్సిడీలను హేతుబద్ధం చేయాలి.

వ్యవహారిక భాషోద్యమ వైతాళికుడు

తెలుగు భాషకు దశ, దిశ నిర్దేశించిన భాషా వైతాళికుడు గిడుగు రామమూర్తి పంతులు. ఆధునిక విజ్ఞాన వ్యాప్తికి, పత్రికా రచనకు, సాహితీప్రక్రియల (కథా, కవిత, నవల) సృజనకు, పాఠ్యాంశాల బోధనకు, పరీక్షల నిర్వహణకు గ్రాంధిక భాష సరైంది కాదని సాధికారిక పరిశోధనల ద్వారా నిరూపించి, వ్యావహారిక భాషోద్యమం నడిపి విజయం సాధించిన అలుపెరుగని కలం యోధుడు గిడుగు.

చాళుక్యుల పాలనలో వైదిక మత ప్రచారం కోసం నన్నయ సంస్కృత భారతాన్ని తెలుగులోకి అనువదించడంతో తెలుగు సాహిత్యం మొదలైంది. అందులో తెలుగు కన్నా సంస్కృతానికే ఎక్కువ ప్రాధాన్యం కల్పించారు. తర్వాత కాలంలో పాల్కురికి సోమనాథుడు, తిక్కన, గోన బుద్ధారెడ్డి తత్సమభాషని బాగా తగ్గించి ఆనాటి తెలుగులో కావ్యాలు రాసి, తెలుగు భాషకు కావ్యగౌరవం కల్పించారు. అయినా శ్రీనాథుని కాలంలో, రాయల కాలంలో కావ్య ప్రబంధాలు మళ్లీ సంస్కృతానికి ప్రాధాన్యం, ఇచ్చి తెలుగు ఉనికిని ప్రశ్నార్థకం చేశాయి. వేమన లాంటి వారు తెలుగును బతికించినా, గిడుగు రామమూర్తి పంతులు రంగ ప్రవేశం చేసేవరకు గ్రాంధికభాష రాజ్యమేలింది.



గిడుగు పిడుగు ధాటికి పండిత భిషక్కులు ఉలిక్కిపడ్డారు. జయంతి రామయ్య పంతులు, కాశీభట్ట బ్రహ్మయ్య శాస్త్రి, వేదం వెంకటరాయ శాస్త్రి, శ్రీపాద కృష్ణమూర్తి లాంటి గ్రాంధిక భాషావాదులతో గిడుగు పెద్ద యుద్ధమే చేశారు. వారితో నిరంతరం వాదనలు చేస్తూ 'శిష్టవ్యావహారిక' భాష అవసరాన్ని, ఆవశ్యకతను, జీవద్భాష ప్రాధాన్యతను నొక్కి వక్కాణించారు. అందుకోసం తన జీవితకాలాన్నే త్యాగం చేశారు. 1919–20ల మధ్య వ్యావహారిక భాషోద్యమ ప్రచారం కోసం 'తెలుగు' అనే మాసపత్రికను నడిపారు. గ్రాంధిక భాషను చీల్చి చెండాడుతూ 'ఆంధ్ర పండిత భిషక్కుల భాషా భేషజం' అన్న విమర్శాగ్రంథాన్ని రాశారు. 1906 నుంచి 1940 వరకు తెలుగు భాష వ్యాప్తి కోసం అలుపెరుగని పోరాటం చేశారు. సవరభాష కోసం ఎంతగానో శ్రమించారు. సవరలతో కలిసి జీవించారు. వారి భాషా మూలాలు అన్వేషించారు. సవర భాషావ్యాకరణం రాశారు. సవరలు అంటరానివారు కాదని, తన ఇంటి వద్ద పెట్టుకొని సవరభాష నేర్చుకున్నానని చెప్పుకున్నారు. అట్టడుగు వర్గాల సంస్కృతి, సాహిత్య వికాసానికి వ్యావహారిక భాష ఎంతగానో ఉపయోగపడుతుందని తెల్పివేశారు. పేదవాళ్ళకి, పసి పిల్లలకు, స్త్రీలకు వాళ్ళకు అర్థమైన భాషలో విజ్ఞాన బోధన జరగాలన్నదే గిడుగు రామమూర్తి పంతులు వాదన, వేదన.

గిడుగు భాషోద్యమాన్ని గురజాడ, వీరేశలింగం పంతులు, ఏట్స్ దొర లాంటి గొప్ప సృజనకారులు, మేధావులు సమర్థించారు. సహాయ సహకారాలు అందించారు. గిడుగు రామమూర్తి పంతులు తెలుగు భాషా ప్రాధాన్యతను వివరిస్తూ అనేక పరిశోధనా గ్రంథాలు రాశారు. ప్రాచీన కావ్యాలను లోతుగా అధ్యయనం చేశారు. ప్రాచీన కావ్యాల్లో ఉన్న వ్యావహారిక భాషను చూపించే ప్రయత్నం చేశారు. ప్రజల వాడుకభాషలో ఉంటేనే సాహిత్యం అన్ని వర్గాల ప్రజలకు చేరువవుతుందని చెప్పారు. గిడుగు రామమూర్తి పంతులు వ్యావహారిక భాషావాదం లేవనెత్తడంతో తెలుగు కావ్యభాషా స్వరూపం మారిపోయిందని శ్రీశ్రీ అన్నారు.

అట్టడుగు కులాల పట్ల ప్రేమ, సంఘ సంస్కరణ పట్ల అభిలాష, జీవద్భాష పట్ల మమకారం, ఆంధ్రదేశం పట్ల ఆత్మాభిమానం, విద్యాసక్తి, కార్యదీక్ష, సత్యాన్వేషణ లాంటి గొప్ప లక్షణాలున్న గిడుగు, తన జీవితంలో ఎక్కడా రాజీ పడలేదు. అందుకే పర్లాకిమిడి పట్టణాన్ని ప్రభుత్వం అక్రమంగా ఒరిస్సాలో చేర్చడం వల్ల తెలుగు వారికి అన్యాయం జరిగిందని 1936లో రాజమహేంద్రవరం వచ్చేశారు. అక్కడే తన శేషజీవితాన్ని గడిపారు. 1940 జనవరి 22న ఆయన తన 74 ఏళ్ళ వయసులో మరణించారు.


రామమూర్తి పంతులు మనుమరాలు కాంతికృష్ణ 'గిడుగు రామమూర్తి పంతులు ఫౌండేషన్' స్థాపించి గత తొమ్మిదేళ్ళుగా దళిత, గిరిజన, బహుజన కవులు, రచయితలు, పరిశోధకులకు, వారి రచనలకు గిడుగు జాతీయ పురస్కారాలు ప్రదానం చేస్తూ, భాషా సేవ చేస్తున్నారు. తద్వారా ఆ మహానుభావుని ఆశయాలను ముందుకు తీసుకెళుతున్నారు. తెలుగు భాషా పరిరక్షణ కోసం తెలుగు జాతి ఉద్యమించాల్సిన అవసరం ఉంది. అందుకు గిడుగు రామమూర్తి పంతులు జీవితం, భాషా సేవే మనకు స్ఫూర్తినిస్తుందని ఆశిద్దాం.

• **డా. బిక్కి కృష్ణ**
ప్రధాన కార్యదర్శి, గిడుగు రామమూర్తి ఫౌండేషన్
(నేడు గిడుగు రామమూర్తి పంతులు వర్ధంతి)

పద్యకవుల్లో ప్రజాకవి.. మల్లవరపు జాన్

ఆధునిక సాహిత్యంలో ప్రజా చైతన్యానికి పట్టుగొమ్మగా నిలిచే పద్య కవిత్వం రాసిన విశిష్ట కవి మల్లవరపు జాన్. 'మధుర కవి'గా తెలుగునాట ప్రసిద్ధికెక్కిన జాన్, నాలుగు దశాబ్దాల పాటు అవిచ్ఛిన్నంగా సాహిత్యసేద్యం చేసి, పద్య కవిత్వానికి వినూత్న జవజీవాలను అందించాడు. జాన్ పేరు ఈ తరం వచన కవులకు పెద్దగా పరిచయం లేకపోవచ్చు కానీ, జాషువానంతర పద్య కవులకు మాత్రం నులివెచ్చని జొన్నరొట్టె లాంటి ఆయన పద్యం అత్యంత ప్రీతిపాత్రమైనది.

మల్లవరపు జాన్ ప్రకాశం జిల్లా చీమకుర్తి పట్టణంలో 1927 జనవరి 22న మాదిగ సామాజిక వర్గానికి చెందిన దావీదు, రత్నమ్మ దంపతులకు జన్మించాడు. అంటరానితనం, పేదరికం కారణంగా అనేక ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొని, కఠోరమైన శ్రమతో సంస్కృతాంధ్ర భాషా సాహిత్యాలను అధ్యయనం చేసి, తెలుగు పండితునిగా, పద్యకవిగా ఎదిగి, తెలుగు జాతికి విశేషమైన సేవలందించాడు. విశ్వప్రకాశం, అతుకుల బ్రతుకులు, క్రాంతి రేఖలు, చిరస్మరణీయులు, భావ విపంచి మొదలగు పద్యకావ్యాలతో ఆధునిక కవిత్వంలో జాన్ సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నాడు.




మల్లవరపు జాన్ కావ్యాలను పరిశీలించమని తుమ్మల సీతారామమూర్తి రస హృదయులైన భాషాభిమానులకు హితవు పలికాడు. "పురుషుల్ జేసిన పుణ్య మెట్టిదియె యెపుడున్ మానభంగాలకున్ గురియై పోయిన జాడలేదు" అని స్త్రీ వాదిలా కన్నెర్ర జేశాడు. ఛందో బందోబస్తుల రహదారుల్లో జాన్ ప్రజా సమస్యల కేంద్రంగా శక్తివంతమైన పద్య కవిత్వం రాశాడు. అభ్యుదయ కవితా ప్రభంజనం తీరం దాటుతున్న సాహిత్య సంక్షోభంలో రచయితగా రంగ ప్రవేశం చేసిన మల్లవరపు జాన్, అస్తిత్వ ఉద్యమాల సాహిత్య సందర్భంలో కన్నుమూశాడు (2006). ఈ నలభైయేళ్ళలో సాగిన సామాజిక ఉద్యమాలతో కవికి ప్రత్యక్షంగా సంబంధం లేకపోయినప్పటికీ, ఆయా ఉద్యమాల మౌలికావేశాలు, అవి లేవనెత్తిన ప్రాథమిక ప్రశ్నలు జాన్ కవిత్వంలో సర్వత్రా కనబడతాయి. "పురుషులతో సమానంగా సర్వకార్యములు నెరపెడి శక్తియుక్తులు నేర్చిన" ఆధునిక స్త్రీలను అణిచివేయడం సభ్యసమాజానికి సిగ్గుచేటు కలిగించే విషయమని ఎలుగెత్తి చాటిన మల్లవరపు జాన్ సాహిత్య వ్యక్తిత్వం ఎంతో ఉదాత్తమైనది.

విశ్వమానవాళికి సమతా సందేశాన్నందించిన గౌతమ బుద్ధుని సమున్నత మూర్తిమత్వాన్ని జాన్ కవి ఆరాధించాడు. కులీనుల ఇళ్ళలో కుక్కకు కూడా మనిషి హోదా లభిస్తుందని, కానీ కుల సమాజంలో దళితులకు జీవించే హక్కు లేకుండా పోతుందని, ఈ దుర్మార్గమైన విషమ పరిస్థితిని రూపుమాపలేని భారతదేశాన్ని చూసి ప్రపంచం పరిహసిస్తుందని మల్లవరపు జాన్ 'అస్పృశ్యత' అనే ఖండికలో నిశితంగా విమర్శించాడు. "మాలయతడు, నేను మాదిగ కులజుడనను భేద ముండునంత దనక, కలిసి తిరగలేముకదా కులీనుల తోడ, ఇంట గెలిచి రచ్చకేగుమయ్య" (విశ్వప్రకాశం) అని సూటిగా ఇంటి గుట్టును బయటపెట్టిన జాన్ విలువైన మాటల్ని ఆచరణాత్మకంగా నిజం చేయాల్సిన అవసరమెంతైనా ఉంది. "పరరాజన్యులు లేరు, నేడు ప్రజలే పాలించు రాజ్యంబులో, తరుగే మున్నది? సర్వహక్కుల సమానత్వము నీ సొమ్మురా తిరిపెమ్మెత్తెదవేల? సంఘటిత శక్తిన్ జూప లేలెమ్ము, నీ యరచేతన్ పరిపాలనా చరణ భాగ్యంబెన్నడో దోచె" (విశ్వప్రకాశం) అంటూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆలోచనల వెలుగులో దళితులకు కర్తవ్యాన్ని నూరిపోశాడు.

సంస్కృత భాషా సముద్రాల్ని లంఘించిన పండితోత్తముల మెప్పుకోసం ఆయన పద్యం రాయలేదు. లెక్కకు మిక్కిలి సమస్యలతో సతమతమవుతున్న సగటు మనిషిలో కనువిప్పు కలిగించాలనే ఉత్తమ సంకల్పంతోనే మల్లవరపు జాన్ ప్రయోజనాత్మకమైన పద్య కవిత్వం రాశాడు. అందుకే జాన్ పద్యం గుడిలో తీర్థం వంటిది కాదు. చౌరాస్తాలోని చలివేంద్రంలో దొరికే చల్లని మంచినీరు వంటిది. ఆ మంచి నీటి తత్వం వల్లనే మల్లవరపు కవిత్వంలో మధురత్వంతో అంతకంటే మించిన సజీవత్వం నిలువెల్లా పరిమళిస్తుంది. నుతి మెత్తని ఎత్తిపొడుపు, మర్యాదపూర్వకమైన మందలింపు, సంభాషణా సిద్ధమైన పద్యధార మొదలైన లక్షణాల వల్ల జాను కవిత్వం ఎంతోమంది పాఠకులకు చేరువయింది. అత్యాధునిక సాహిత్యంలో వచన కవితా రూపానికి సమాంతరంగా పద్యాన్ని కదం తొక్కించి, వచన కవుల్లోని ఆధునికతని ఆహ్వానించి, జాతీయ–అంతర్జాతీయ పరిణామాలకు స్పందిస్తూ, ఎప్పటికప్పుడు తాజా కవిత్వాన్ని సృజించిన జాన్ పద్యకవుల్లో ప్రజాకవి. భావంలో ఎంత ఆధునికత ఉన్నా, మరెంత సమకాలికత ఉట్టిపడినా, పొరపాటున అది పద్య కవిత్వమైతే ఏ మాత్రం ఆదరించని రూపలౌల్యం సోకాల్డ్ విమర్శకుల్ని పట్టిపీడిస్తున్నందువల్ల మల్లవరపు జాన్‌కి తెలుగు సాహిత్యంలో రావాల్సినంత గుర్తింపు రాలేదు.

▪ **డాక్టర్ కోయి కోటేశ్వరరావు**
ప్రభుత్వ సిటీ కళాశాల, హైదరాబాద్
(నేడు మల్లవరపు జాన్ జయంతి)



ఈస్ట్ బైపాస్‌ను ఆపేయాల్సిందిగా కేంద్ర ఉపరితల మంత్రిత్వ శాఖ (మోర్తు) నుంచి జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్)కు స్పష్టమైన ఆదేశాలు వచ్చాయి. దీంతో విజయవాడ ఈస్ట్ బైపాస్ అంశాన్ని ఎన్‌హెచ్ అధికారులు పూర్తిగా పక్కన పెట్టేశారు. అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)కు సమాంతరంగా మరో జాతీయ రహదారి వెళ్లటానికి వీల్లేదని విజయవాడ ఈస్ట్ బైపాస్ అంశం ఇక ముగిసిన అధ్యాయమేనని మోర్తు తేల్చిచెప్పింది. దీంతో ఎన్‌హెచ్ విజయవాడ డివిజన్ అధికారులు తమ ప్రాధాన్యతా ప్రాజెక్టుల జాబితా నుంచి ఈస్ట్ బైపాస్‌ను తొలగించారు.

ఈస్ట్ బైపాస్ ఆపేయండి!

ఎన్‌హెచ్‌కు 'మోర్తు' నుంచి ఆదేశం

- రెండు ఎన్‌హెచ్‌లు సమాంతరంగా వెళ్లడం కుదరదు
- కనీసం 10 కిలోమీటర్ల దూరం ఉన్నా.. అనుమతించే వాళ్లం
- ఎన్‌హెచ్ అధికారులతో కేంద్ర ఉపరితల మంత్రిత్వ శాఖ
- ప్రాధాన్యతా పనుల జాబితా నుంచి తొలగింపు
- ఐఆర్ఆర్ అలైన్‌మెంట్ మార్చి ఈస్ట్ బైపాస్ కొరత తీర్చాలన్న ఆలోచన
- ఎన్‌హెచ్- 16పై నిడమానూరు ఫ్లై ఓవర్‌కు కదలిక
- త్వరలో రాష్ట్రం నుంచి కేంద్రానికి ప్రతిపాదన



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): విజయవాడ ఈస్ట్ బైపాస్ ప్రతిపాదన డీపీఆర్ దశలోనే ముగిసిపోయింది. ఈ ప్రాజెక్టును తిరస్కరించటానికి ప్రధాన కారణం ఓఆర్ఆర్ అని మోర్తు చెబుతోంది. కనీసం పది కిలో మీటర్ల దూరం అవతల ఉన్నా ఈ ప్రాజెక్టును చేపట్టేవారమని, ఆ పరిస్థితి లేనందున తిరస్కరిస్తున్నట్టుగా స్పష్టత ఇవ్వడంతో.. ఇప్పటి వరకు ఈస్ట్ బైపాస్‌పై ఆశలు పెట్టుకున్న వారికి స్పష్టమైన సంకేతాలు ఇచ్చినట్టు అయింది. రాష్ట్ర ప్రభుత్వం విశాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని చూస్తే.. అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) అత్యవసరం. ఈ ఓఆర్ఆర్ ప్రాజెక్టు ప్రధానమైన ఎక్స్‌ప్రెస్‌వేలు, జాతీయ రహదారులను అనుసంధానిస్తుంది. విజయవాడ - బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌వే, విజయవాడ - ఖమ్మం గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే, మిగతా 6లో..

రవాణాశాఖలో అవినీతి భాగస్వామి రగడ తారాస్థాయికి చేరింది. ఇసుక, క్వారీ లారీల నుంచి సొమ్ము వసూలుకు ఎంవీఐలు ఏర్పాటు చేసుకున్న ఏజెంట్ కలెక్షన్లు పెరగడంతో పార్టనర్ అయ్యాడు. కామధేనువుగా కాసులు కురిపించాడు. రవాణాశాఖనే శాసించే స్థాయికి ఎదిగాడు. అవినీతి రుచిమరిగిన ఆ భాగస్వామి అధికారులకు మస్కా కొట్టి అవినీతి సొమ్ము దారిమళ్లించాడు. భారీగా ఆస్తులు, భూములు కూడబెట్టుకున్నాడు. ఆదాయం తగ్గిందేంటని ఆరా తీసిన అధికారులు పార్టనర్ ఆదాయం చూసి నివ్వెరపోయారు. ఎంవీఐలకు వచ్చేది తక్కువ.. పార్టనర్‌కు వచ్చేది ఎక్కువ కావడంతో ఈ పార్టనర్ వద్దని కొందరు.. లేదు లేదు ఈ పార్టనరే కావాలని మరికొందరు ఎంవీఐలు పట్టుబట్టడం ప్రస్తుతం రవాణా శాఖలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

అవినీతి భాగస్వామి రగడ

రవాణాశాఖలో నడుస్తున్న పంచాయితీ

- ఇసుక, క్వారీ లారీల నుంచి నగదు వసూలుకు ఏజెంట్‌ను పెట్టుకున్న ఎంవీఐలు
- కలెక్షన్ పెరగడంతో భాగస్వామిగా మారిన సదరు ఏజెంట్
- అంతాతానై వ్యవహరిస్తూ అవినీతి సొమ్ము దారి మళ్లింపు
- ఎంవీఐ సిండికేట్‌కు ఆదాయం తగ్గడంతో పార్టనర్ వ్యవహారంపై ఆరా
- భారీగా ఆస్తులు, భూములు కూడబెట్టుకున్నట్లు నిర్ధారణ
- భాగస్వామి వద్దని కొందరు.. కావాలని మరికొందరు ఎంవీఐల పట్టు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఉమ్మడి కృష్ణాజిల్లాలో రవాణా శాఖలోని కొందరు అవినీతి రుచి మరిగిన మోటారు వాహన ఇన్‌స్పెక్టర్లు (ఎంవీఐ)లు సిండికేట్‌గా ఏర్పడ్డారు. రవాణా వాహనాల నుంచి అక్రమ వసూళ్లకు ఓ ప్రైవేటు వ్యక్తిని నియమించుకున్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఉండే పెద్ద టిప్పర్లనే టార్గెట్‌గా చేసుకుని కొందరు ఎంవీఐలు ఆ ప్రైవేటు వ్యక్తి ద్వారా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇసుక రవాణా చేసే టిప్పర్లు, క్వారీల నుంచి వచ్చే లారీలపై కేసులు రాసే అధికారాన్ని అవినీతి ఎంవీఐ సిండికేట్‌ఆ ప్రైవేటు వ్యక్తికి కల్పించింది. ఎంవీఐలు నేరుగా పాల్గొనకుండా తమ చేతులకు మట్టి అంటకుండా అన్ని పనులు ఈయన ద్వారా చేయిస్తున్నారు. ఈ ప్రైవేటు వ్యక్తి లారీల దగ్గరకు వెళ్లి ఫొటోలు తీయడం, లారీ నంబర్లను మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లకు పంపిస్తే వారు కేసులు రాస్తారు. ఇలా ఆ ప్రైవేటు వ్యక్తి అనధికారికంగా రవాణా శాఖ అధికారిగా చెలామణి అవుతున్నాడు.

పార్టనర్ వ్యవహారంపై పంచాయితీ

దీంతో ఇటీవలే ఎంవీఐ సిండికేట్ ఓ ప్రైవేటు ప్లేస్‌లో భేటీ అయింది. పార్టనర్ వ్యవహారంపై సీరియస్‌గా చర్చించింది. పార్టనర్‌ను తొలగించాల్సిందేనని కొందరు ప్రతిపాదించగా.. మరికొందరు కంట్రోల్‌లోకి తెచ్చుకుని కొనసాగించాలని ప్రతిపాదించారు. మళ్లీ కొత్త పార్టనర్‌ను వెతకటం కష్టమైన పని అయినందు వల్ల మన చేతులకు మట్టి అంటకుండా సంపాదించాలంటే పార్టనర్‌ను తొలగించటం కుదరదని నిర్ణయించారు. అయితే ఈ పంచాయితీ తేలలేదు.

రూ.200 కూలికి వచ్చేవాడు కోట్లకు పడగెత్తాడు

రవాణాశాఖ అవినీతి ఎంవీఐ సిండికేట్‌లో పార్టనర్‌గా చేరి.. వారినే అలో 'లక్షణ' అనే స్థితికి తీసుకు వచ్చిన వ్యక్తి గతంలో గన్నవరంలోని రవాణా శాఖ ఎఫ్‌సీ కేంద్రంలో వాహనాలకు రంగులు వేసే కార్మికునికి సహాయకుడిగా ఉండేవాడు. రూ.200 కూలి కోసం రోజంతా పనిచేసేవాడు. ఈ క్రమంలో ఇక్కడికి వచ్చే ఎంవీఐలకు దగ్గరయ్యాడు. వారికి కలెక్షన్ ఏజెంట్‌గా మారాడు. ఆ తర్వాత పార్టనర్‌గా అవతారమెత్తాడు. కాలక్రమంగా ఎంవీఐలే అతని బాధితులుగా మారిపోయారు.

ఇసుక, క్వారీ లారీ యజమానులతో డీల్

ఇసుక, క్వారీ లారీలు ఖచ్చితంగా ఓవర్‌లోడ్‌తో ఉంటాయి. ఈ ఓవర్ లోడ్ అంశాన్ని దృష్టిలో పెట్టుకుని ఆ ప్రైవేటు వ్యక్తి కేసులకు సిఫార్సులు చేయడం పరిపాటిగా మారింది. అన్నమానం ఈ కేసుల గొడవ .. వేలాది రూపాయలు పోగొట్టుకోవాల్సి వస్తుందన్న ఉద్దేశంతో ఇసుక, క్వారీ లారీ యజమానుల సిండికేట్ కూడా ఆ ప్రైవేటు వ్యక్తి ద్వారా ఎంవీఐ సిండికేట్‌తో డీల్ కుదుర్చుకుంది. ఈ డీల్ ప్రకారం ప్రతి నెలా మిగతా 6లో..

కృష్ణా వర్సిటీలో వివాదాలు

కృష్ణా యూనివర్సిటీలో మళ్లీ వివాదాలు రాజుకుంటున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా నిధులను వాడుకోవడంపై ప్రొఫెసర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. రెక్టార్ చాంబర్‌లో ప్రొఫెసర్లంతా మంగళవారం సమావేశమై రిజిస్ట్రార్‌ను నిలదీశారు. వివిధ విభాగాల అధిపతులకు తెలియకుండానే నిధులు డ్రా చేయడం, జవాబు పత్రాల మూల్యాంకనం బిల్లులు చెల్లించపోవడం, భవనాలు నిర్మించకుండా బిల్లులు చెల్లించడంపై ప్రశ్నించారు. వర్సిటీలో జరిగిన అవకతవకలపై పూర్తి వివరాలు తెలియజేయాలని పట్టుబట్టారు. వెంటనే విచారణకు ఆదేశించాలని, లేకుంటే రాష్ట్ర ఉన్నత విద్యామండలికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

పరీక్షలు, సీడీసీ విభాగాల నుంచి గుట్టుగా రూ.4 కోట్లు డ్రా

భవనాలు నిర్మించకుండా రూ.25 కోట్ల వరకు చెల్లింపులు

- నాక్ బృందం పర్యటన వేళ వసూళ్ల పర్వం
- పై అంశాలపై రిజిస్ట్రార్‌ను నిలదీసిన ప్రొఫెసర్లు



ఆంధ్రజ్యోతి- మచిలీపట్నం: కృష్ణా యూనివర్సిటీలో గతేడాది అక్టోబరులో నాక్ బృందం పర్యటించింది. ఆ సమయంలో ఖర్చుల పేరుతో యూనివర్సిటీ పరిధిలోని వివిధ కళాశాలల నుంచి రూ.13.50 లక్షల వరకు వసూలు చేశారు. అలాగే యూనివర్సిటీలోని ఎస్‌బీఐ బ్రాంచ్‌లోని వర్సిటీ ఖాతా నుంచి రూ.5 లక్షలు నగదును డ్రా చేశారు. అయితే ఈ నగదును దేనికి వినియోగించారని ప్రొఫెసర్లు రిజిస్ట్రార్‌ను నిలదీశారు. నాక్‌బృందం పర్యటించిన సమయంలో యూనివర్సిటీ వీసీ, రిజిస్ట్రార్ విజయవాడలోని ఒక ప్రముఖ హోటల్‌లో ఉన్నారని, యూనివర్సిటీ నిధుల నుంచి వేలాది రూపాయలు హోటల్ బిల్లుల రూపంలో చెల్లింపులు ఎలా చేశారని ప్రశ్నించారు. యూనివర్సిటీకి నాక్ ఏగ్రేడ్ కాకుండా బీ+గ్రేడ్ రావడానికి గల కారణాలు ఏమిటో చెప్పాలన్నారు. యూనివర్సిటీలో కాంట్రాక్టు పద్ధతిపై పనిచేసే సిబ్బందికి యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కమిటీ అనుమతులు తీసుకోకుండానే జీతాలు పెంచారని, 15 నెలలకు మిగతా 6లో..

మూల్యాంకనం బిల్లుల సంగతేంటి?

యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల జవాబు పత్రాల మూల్యాంకనానికి సంబంధించి బిల్లులను ఎనిమిది నెలలుగా పెండింగ్‌లో పెట్టారని ప్రొఫెసర్లు ఆరోపించారు. జిల్లాలోని వివిధ కళాశాలల యాజమాన్యాలు పరీక్షలు నిర్వహించబోమని, పరీక్షలు జరిగినా జవాబు పత్రాలను మూల్యాంకనం చేయబోమని ఇప్పటికే స్పష్టం చేశాయని తెలిపారు. ఈ బిల్లులు చెల్లించకుండా ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. ఇటువంటి పరిస్థితిలో ఈ ఏడాది వివిధ కోర్సుల పరీక్షలు ఎలా నిర్వహిస్తారని ప్రొఫెసర్లు రిజిస్ట్రార్‌ను నిలదీశారు.

'దుర్గమ్మ' గోపురానికి కొలతలు



- ప్రధాన ఆలయ శిఖరానికి బంగారు తాపడం
- టీటీడీ అధికారుల పరిశీలన


8లో

హద్దు మీరితే ఆట కట్టిస్తా..!

- ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య ఫైర్
- విస్తుపోయిన సమన్వయ కమిటీ సభ్యులు

8లో

సింధూర శోభితం



సాయంసంధ్య వేళ ఆకాశం సింధూర శోభితమైంది. ప్రచండ భానుడు తన తాపాన్ని తగ్గించుకుని కనుమరుగవుతున్న వేళ సుందర దృశ్యం ఆవిష్కృతమైంది. విజయవాడ బెంజ్ సర్కిల్ వద్ద మంగళవారం సాయంత్రం ఒక విద్యుత్ స్తంభానికి దీపం వెలుగుతున్నట్టుగా కనిపించి కనువిందు చేసింది.

నేడు జేఈఈ మెయిన్స్ పరీక్షలు

- నగరంలో 11 కేంద్రాల ఏర్పాటు
- హాజరుకానున్న 19,800 మంది విద్యార్థులు

విజయవాడ, జనవరి 21(ఆంధ్రజ్యోతి): జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్స్ పరీక్షల కోసం విజయవాడలో 11 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పరీక్షలు రెండు విడతలుగా జరగనున్నాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు నిర్వహిస్తారు. రాష్ట్ర నలుమూలల నుంచి 19,800 మంది విద్యార్థినీ విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నారు. బుధవారం నుంచి శుక్రవారం వరకు ఈ పరీక్షలు జరుగుతాయి. పరీక్షా కేంద్రాల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

దుర్గమ్మ ఆదాయం రూ.3.22 కోట్లు

8లో

సాగర్ ఆయకట్టు అంతా కనికట్టు

తోతాపురి @ 90వేలు

6లో

గంజాయి కలకలం

చిల్లకల్లు చెక్‌పోస్టు వద్ద 218 కిలోల గంజాయి స్వాధీనం

- రెండు కార్లు సీజ్.. నలుగురి అరెస్టు
- వన్‌టౌన్‌లో కారులో 100 కిలోల సరుకు గుర్తింపు
- ఆచూకీ లేని నిందితులు

విజయవాడ, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి విజయవాడ మధ్యలో అనేక టోల్‌ప్లాజాలు ఉన్నాయి. వాటికి మధ్యలో పోలీస్ చెక్‌పోస్టులు. ఇవన్నీ దాటుకుని మూడు గంజాయి కారులు విజయవాడలోకి ప్రవేశించాయి. ఇందులో రెండు కారులు చిల్లకల్లు వద్ద చెక్‌పోస్టు దగ్గర పోలీసులకు చిక్కాయి. మొత్తం నలుగురు నిందితులను అరెస్టు చేశారు. ఇవి కాకుండా వన్‌టౌన్‌లోని పల్లె వారి వీధిలో ఒక కారులో 100 కిలోల గంజాయి పోలీసులకు చిక్కింది. ఇందులో నిందితులు ఎవరో తేలలేదు. ఈ రెండు కేసుల వెనుక ఉన్న అసలు వ్యక్తులు ఎవరన్నది తేలడం లేదు.

అనకాపల్లి జిల్లా రావికమతం మండలం మరుపాక గ్రామానికి చెందిన తలారి రమణ, నర్సీపట్నం మండలం పాత బైపురెడ్డిపాలెం గ్రామానికి చెందిన బైపురెడ్డి ఎల్లయ్యపై గంజాయి కేసులు ఉన్నాయి. ఈ ఇద్దరూ ఒడిశా నుంచి గంజాయిని కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. ప్రస్తుతం గంజాయి ధర విపరీతంగా పెరగడంతో తెలంగాణను లక్ష్యంగా చేసుకుని వ్యవహారాలు సాగిస్తున్నారు. రెండు కారుల్లో 218 కిలోల గంజాయిని తరలిస్తుండగా చిల్లకల్లు చెక్‌పోస్టు వద్ద పోలీసులు పట్టుకున్నారు. ఒడిశా నుంచి ఈ సరుకు బయలుదేరినట్టు పోలీస్ కమిషనర్‌కు సమాచారం అందింది. ఆయన వెంటనే నందిగామ ఏసీపీ ఏబీజీ తిలక్, జగ్గయ్యపేట ఇన్‌స్పెక్టర్ పి.వెంకటేశ్వర్లును అప్రమత్తం చేశారు. ఈ సరుకును తెలంగాణలో ఎవరికి విక్రయించడానికి తీసుకెళ్తున్నారన్న విషయం మాత్రం చెప్పడం లేదు. వన్‌టౌన్‌లో పోలీసులు మిగతా 6లో..



స్వాధీనం చేసుకున్న గంజాయి పెట్టెలు, నిందితులతో నందిగామ ఏసీపీ తిలక్, జగ్గయ్యపేట సీఐ వెంకటేశ్వర్లు తదితరులు

ఒడిశా నుంచే సరఫరా

ప్రస్తుతం మార్కెట్లోకి వస్తున్న గంజాయి మొత్తం ఒడిశా నుంచి వస్తోందని పోలీసులు చెబుతున్నారు. గంజాయిని గుజరాత్‌కు తీసుకెళ్లాలనుకుంటే నిందితులు కారును పల్లె వారి వీధిలోకి ఎందుకు తీసుకువచ్చారన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఈ గంజాయిని వన్‌టౌన్‌లో ఎవరైనా బుక్ చేసుకున్నారా అన్న అనుమానం కలుగుతోంది. జిల్లాలో గంజాయి బ్యాచ్‌లు వ్యవహారాలను కొనసాగిస్తున్నాయి. ఇంతకుముందుతో పోల్చి చూస్తే కొంత వరకు తగ్గుముఖం పట్టాయి. గంజాయి మీద ఆదాయాన్ని రుచి మరిగిన బ్యాచ్‌లు ఈ సరుకును రప్పించుకుని ఉంటాయని అనుమానిస్తున్నారు.

టిడ్కో కిస్తీలు కట్టలేం!



టిడ్కో గృహ సముదాయం (ఫైల్)

(ఆంధ్రజ్యోతి-గుడివాడ)

గుడివాడ మండలం మల్లాయిపాలెం గ్రామ పరిధిలో రాష్ట్రంలోనే అతి పెద్ద లేఅవుట్‌లో 8912 గృహాల నిర్మాణం ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలో ప్రారంభమైంది. జీ ప్లస్ త్రి నమూనాలో 300చ.అ, 365చ.అ, 430చ.అడుగుల్లో మూడు కేటగిరిల్లో గృహాలను నిర్మించారు. దాదాపుగా 85శాతం పనులు పూర్తయ్యాయి. ఇంతలో 2019లో ఎన్నికలు.. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. జగన్ పాలనలో 2023 వరకూ మిగిలిన 15శాతం నిర్మాణ పనులను పూర్తి చేయకుండా నాటి ప్రభుత్వం తాత్సారం చేసింది. 2023 జూన్ 16న అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి లబ్ధిదారులకు ఎటువంటి మౌలిక వసతులు కల్పించకుండానే ఇళ్లు పంపిణీ చేయడంతో లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

టిడ్కో రుణాల మాఫీ కోసం కాలనీ లబ్ధిదారులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే బ్యాంకర్లు రుణాల కిస్తీలు కట్టాలంటూ నోటీసులు జారీ చేస్తూ, ఇళ్లకు వెళ్లి ఒత్తిడి చేస్తుండటంతో తమవల్ల కాదని లబ్ధిదారులు నెత్తి నోరు బాదుకుంటున్నారు. సొంతింటి కల నెరవేరిందనుకునేలోగా లబ్ధిదారులను ఈఎంఐల రూపంలో భూతం వెంటాడుతోంది.

- టిడ్కో లబ్ధిదారులకు ఈఎంఐల వెతలు
- కిస్తీలు కట్టాలంటూ బ్యాంకర్ల నోటీసులు
- రుణమాఫీ కోరుతున్న గృహ లబ్ధిదారులు
- ఒక్కో ఇంటిపై రూ.8 లక్షల అప్పు
- మొత్తంగా రూ.617 కోట్లు భారం

లబ్ధిదారులపై అప్పు భారం రూ.617కోట్లు

8912 గృహాలకు గాను 7325 మంది లబ్ధిదారులకు మాత్రమే అందజేశారు. మూడు కేటగిరీల్లో 300 చ.అడుగుల గృహాలను ఉచితంగా అందజేశారు. 365 చ.అడుగుల గృహానికి రూ.7.55లక్షలు, 430 చ.అడుగుల గృహానికి రూ.8.55లక్షలు చొప్పున వడ్డీతో సహా చెల్లించేలా బ్యాంకుల నుంచి రుణాలు పొందారు. 430 చ.అడుగుల గృహాలకు సంబంధించి 6336 మంది లబ్ధిదారులు రూ.541.72కోట్లు, 365 చ.అడుగుల గృహానికి 992 మంది లబ్ధిదారులు రూ. 74.89కోట్లు మేర చెల్లించాల్సి ఉంది.

వయస్సును బట్టి కిస్తీలు..

లబ్ధిదారుల వయస్సు ఆధారంగా బ్యాంకర్లు కిస్తీలను నిర్ణయించారు. వయస్సు ఎక్కువగా ఉన్నవారి నెలవారీ కిస్తీల సంఖ్యను బ్యాంకర్లు తగ్గించాయి. దీంతో వయస్సు తక్కువ ఉన్న వారికంటే ఎక్కువ మొత్తంలో కిస్తీ చెల్లించాల్సిన భారం వీరిపై పడింది. 365 చదరపు అడుగుల గృహ లబ్ధిదారులు నెలకు రూ.3వేల నుంచి 4వేలు, 430చదరపు అడుగుల గృహ లబ్ధిదారులు రూ.5వేల నుంచి రూ.6వేల వరకు 20ఏళ్ల పాటు చెల్లించాల్సి ఉంది. కిస్తీలతో పాటు బకాయిలను చెల్లించాలని బ్యాంకర్లు నోటీసులు జారీ చేస్తున్నారు. కొన్ని బ్యాంకుల సిబ్బంది నేరుగా లబ్ధిదారుని వద్దకు వచ్చి కిస్తీలు చెల్లించే తేదీలను చెప్పాలంటూ ఒత్తిడి చేస్తున్నారు.

అద్దె కంటే కిస్తీలే ఎక్కువ..

గతంలో పట్టణంలో చిన్న ఇళ్లలో ఉండే మధ్య తరగతి ప్రజలు నెలకు రూ.3వేల నుంచి రూ.4వేలు వరకు అద్దెలు చెల్లించేవారు. ఎవరి స్తోమతను బట్టి వారు నివసించేవారు. నేడు సొంతింటిలోకి వచ్చిన మనశ్శాంతి లేదని, కిస్తీలను కట్టాలంటూ బ్యాంకర్లు ఒత్తిడి చేస్తున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు. గతంలో చెల్లించిన అద్దె కంటే కిస్తీనే ఎక్కువ ఉంటోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రుణమాఫీ చేయాల్సిందే..

- బసవ అరుణ, టిడ్కో కాలనీ అభివృద్ధి కమిటీ కార్యదర్శి



ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే వెనిగండ్ల టిడ్కో లబ్ధిదారులను రుణవిముక్తులను చేస్తానని యిచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కాలనీ అభివృద్ధి కమిటీ కార్యదర్శి బసవ అరుణ డిమాండ్ చేశారు. 300 చదరపు అడుగుల గృహాలకు రుణమాఫీ చేసారని, 365, 430 చదరపు అడుగుల గృహాలకు సంబంధించి రుణాలను మాఫీ చేయలేదన్నారు. లబ్ధిదారులకు రుణం భారంగా మారిందని, పెరిగిన నిత్యావసరాల ధరలతో ఇప్పటికే సామాన్య, మధ్య తరగతి ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అదేవిధంగా కాలనీలో కనీస మౌలిక వసతులు లేవని, కాలనీ అభివృద్ధికి రూ.250కోట్లు ప్రత్యేక నిధులు వచ్చేలా ఎమ్మెల్యే కృషి చేయాలని బసవ అరుణ కోరారు.

ఎమ్మెల్యే వెనిగండ్ల హామీ నిలబెట్టుకోవాలి

ఎన్నికల సమయంలో టీడీపీ అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే వెనిగండ్ల రాము టిడ్కో లబ్ధిదారులను రుణవిముక్తులను చేస్తానని హామీ యిచ్చారు. కూటమి మ్యానిఫెస్టోలో లేకున్నా వెనిగండ్ల హామీ ఇవ్వడంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే తమ కష్టాలు తీరతాయని లబ్ధిదారులు ఆశపడ్డారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు కావస్తున్నా రుణమాఫీ విషయంలో ఎటువంటి స్పష్టత లేదు. టీడీపీ మ్యానిఫెస్టోలో టిడ్కో రుణమాఫీ లేకపోవడం, బ్యాంకర్ల నుంచి కిస్తీలను చెల్లించాలని ఒత్తిడి పెరగడంతో చేసేది లేక లబ్ధిదారులు లోలోన మదనపడుతున్నారు. ఏదో విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి సమస్యను తీసుకువెళ్లి రుణమాఫీ జరిగేలా ఎమ్మెల్యే కృషి చేస్తున్నారు. టిడ్కో కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిరసనలు సమస్యల పరిష్కారం, రుణమాఫీపై పోరాటంలో భాగంగా టిడ్కో కాలనీ లబ్ధిదారులు అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. ఇప్పటికే పలుమార్లు అధికారులకు వినతిప్రతాలను అందజేశారు. రోడ్డెక్కి ధర్నాలు, నిరసనలు చేపడుతున్నారు. ఎమ్మెల్యే వెనిగండ్లను కలిస్తే ప్రభుత్వంతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని పేర్కొన్నట్టు కమిటీ సభ్యులు చెబుతున్నారు.

సూర్యఘర్ లబ్ధిదారులకు ఢిల్లీ నుంచి ఆహ్వానం

- గణతంత్ర వేడుకల వీక్షణకు అవకాశం
- రూ.2 లక్షల కనెక్షన్‌ల రిజిస్ట్రేషన్లు లక్ష్యం
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



సూర్యఘర్ లబ్ధిదారులతో కలెక్టర్ లక్ష్మీశ

కృష్ణలంక, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న సూర్యఘర్ సౌర విద్యుత్ పథకాన్ని సద్వినియోగం చేసుకొని ఎటువంటి బిల్లు చెల్లింపులు లేకుండా ఉచితంగా విద్యుత్ వినియోగించుకొంటున్న జిల్లాకు చెందిన ఆరుగురు లబ్ధిదారులు ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకల్లో పాల్గొనేందుకు కేంద్రం నుంచి ఆహ్వానం అందుకోవడం అభినందనీయమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఢిల్లీలో నిర్వహించే 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఆహ్వానం అందుకున్న లబ్ధిదారులను మంగళవారం కలెక్టర్ కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో అభినందనలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ, ప్రతి ఇంటా సూర్యఘర్ వెలుగులు నింపాలనే ఉద్దేశ్యంతో జిల్లావ్యాప్తంగా రెండు లక్షల సోలార్ విద్యుత్ కనెక్షన్లు లక్ష్యంగా ప్రారంభించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ లబ్ధిదారులను ఆకట్టుకుంటోందన్నారు. ఇప్పటి వరకు 59 వేలమందికి పైగా లబ్ధిదారులు పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. ఇప్పటి వరకు 600కి పైగా కనెక్షన్లు మంజూరు చేసి గ్రౌండింగ్ చేయడం జరిగిందన్నారు. జిల్లాకు చెందిన ఆరుగురికి ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకలను వీక్షించేందుకు ఆహ్వానం పంపడం జరిగిందన్నారు. ఒక్కో రాష్ట్రం నుంచి 10 మంది లబ్ధిదారులకు అవకాశం కల్పించారని మన రాష్ట్రం నుంచి 10 మందికి అవకాశం కల్పించగా అందులో ఆరుగురు లబ్ధిదారులు ఎన్టీఆర్ జిల్లా వారు కావడం గర్వకారణమన్నారు. విజయవాడకు చెందిన మేడ పద్మకృష్ణ, గుంటుపల్లికి చెందిన ఎఆర్‌పిఆర్ ప్రసాద్, పోరంకికి చెందిన కోనేరు రవికుమార్, రామవరప్పాడుకు చెందిన వి.బుచ్చయ్య చౌదరి, ప్రసాదంపాడుకు చెందిన ఎం.వెంకటేశ్వరరావు, కంచికచర్లకు చెందిన కె.సాయికృష్ణలు ఈనెల 26న ఢిల్లీలో నిర్వహించే గణతంత్ర వేడుకలను వీక్షించనున్నారని కలెక్టర్ తెలిపారు. కలెక్టరును కలిసిన వారిలో లబ్ధిదారులతో పాటు ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకం నోడల్ ఆఫీసర్ ఎం.భాస్కరరావు వున్నారు.



మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ పురందేశ్వరి, పక్కన ఎమ్మెల్యే సుజనా చౌదరి, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరాం తదితరులు

బెజవాడలో బీజేపీ జెండా ఎగరాలి

- బెజవాడతోపాటు గుంటూరు అభివృద్ధి
- ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి

విజయవాడ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో మాదిరిగానే విజయవాడలోనూ బీజేపీ జెండా రెపరెపలాడాలని ఎంపీ దగ్గుబాటి పురందరేశ్వరి అభిప్రాయపడ్డారు. దీనికోసం పార్టీ నేతలు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని సూచించారు. బీజేపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన అడ్డూరి శ్రీరాం ప్రమాణ స్వీకార కార్యక్రమం సూర్యరావుపేటలో ఉన్న నగర కమిటీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. తొలుత శ్రీరాంతో ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం ఆమె మాట్లాడారు. బీజేపీ సిద్ధాంతాలను కాపాడుతూ, పార్టీ బలోపేతం కోసం పనిచేయాలని చెప్పారు. ప్రధాని మోదీ రాష్ట్ర అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నారన్నారు. పోలవరం, విశాఖ ఉక్కు కోసం కేంద్రం నిధులు కేటాయిస్తోందన్నారు. విజయవాడ, గుంటూరులో మౌలిక సదుపాయల వృద్ధికి కేంద్ర సహాయం అందుతోందన్నారు. పశ్చిమ ఎమ్మెల్యేగా శ్రీరాం పోటీ చేయాల్సి ఉన్నప్పటికీ అనివార్య కారణాల వల్ల సుజనా చౌదరికి చోటు కల్పించాల్సి వచ్చిందన్నారు. కష్టపడి పనిచేసిన ప్రతిఒక్కరిని గుర్తించి తగిన ప్రాధాన్యాన్ని పార్టీ ఇస్తుందన్నారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారి వేటుకూరి సూర్యనారాయణరాజు, పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి, మీడియా విభాగం రాష్ట్ర ఇంచార్జి పాతూరి నాగభూషణం, రాష్ట్ర అధికార ప్రతినిధి యామినీశర్మ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో భూసేకరణ పూర్తిచేస్తాం

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కృష్ణలంక, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జాతీయ రహదారుల ప్రాజెక్టుల నిర్మాణం, విస్తరణకు అవసరమైన భూసేకరణ పనులను సకాలంలో పూర్తిచేసేందుకు చర్యలు తీసుకొంటున్నట్టు కలెక్టర్ లక్ష్మీశ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌కు వివరించారు. జాతీయ రహదారుల ప్రాజెక్టుల నిర్మాణం, విస్తరణకు అవసరమైన భూ సేకరణపై కె.విజయానంద్ జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, సంబంధితశాఖల అధికారులతో మంగళవారం వీడియా కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జాతీయ ప్రాధాన్యతా రహదారుల నిర్మాణం, విస్తరణకు అవసరమైన భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేసి పనులు పర్తిచేసేందుకు చర్యలు తీసుకొంటున్నట్లు వివరించారు. ఎ.కొండూరు మండలం రామచంద్రాపురం వద్ద రహదారి విస్తరణ అభివృద్ధికి భూమిని సేకరించి నిర్మాణ పనులు పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. నందిగామ వై జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై వెహికల్ అండర్ పాస్‌కు అనుసంధానంగా అప్రోచ్ రోడ్ల నిర్మాణం దాదాపు పూర్తికావచ్చాయని తెలిపారు. విజయవాడ బెంజిసర్కిల్ నుంచి జాతీయ రహదారికి ఇరువైపులా సర్వీసు రోడ్ల నిర్మాణం పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. విజయవాడ మహాత్మాగాంధీ రోడ్ల డ్రైయిన్ల నిర్మాణపనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకొంటున్నామని కలెక్టర్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌కు వివరించారు. వీడియా కాన్ఫరెన్స్‌లో నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చంద్రశేఖర్, కలెక్టర్ కార్యాలయం భూ సేకరణ పర్యవేక్షకులు దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల దినోత్సవాన్ని విజయవంతం చేయండి

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

కృష్ణలంక, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమానికి గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరు కానున్న దృష్ట్యా అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తిచేసి కార్యక్రమ విజయవంతానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఈనెల 25న తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్న 15వ జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమ నిర్వహణపై మంగళవారం కలెక్టర్ లక్ష్మీశ వివిధ శాఖల అధికారులతో కలెక్టరేట్‌లో సమావేశమయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి నేతృత్వంలో జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమానికి గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్టు తెలిపారు. వివిధ జిల్లాలకు చెందిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు హాజరుకానున్నారన్నారు. గవర్నర్ చేతులమీదుగా యువఓటర్లకు ఈపీఐసీ కార్డులను పంపిణీ చేసేందుకు సిద్ధంగా వుండాలన్నారు. కళాశాలల, యూనివర్సిటీ విద్యార్థినీ, విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొని ఓటర్లుగా పేరు నమోదు చేసుకొనేలా చర్యలు తీసుకోవాలని ఆర్‌ఐవోకు సూచించారు. సమావేశంలో రెవెన్యూ అధికారి ఎం.లక్ష్మీనరసింహం, ఆర్డీవో కావూరి చైతన్య, రాష్ట్ర ఎన్నికల అధికారి కార్యాలయం అసిస్టెంట్ సెక్రటరీ ఆంజనేయులు, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చంద్రశేఖర్, ఎస్వో కొండారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, యువజన సంక్షేమ అధికారి యు.శ్రీనివాసరావు, డీఐపీఆర్‌వో యు.సురేంద్రనాథ్, ఫారెస్ట్ సెటిల్మెంట్ ఆఫీసర్ ఎ.రవీంద్రరావు, డీఈవో యూవీ సుబ్బారావు, ఆర్‌ఐవో సి.శివ సత్యనారాయణరెడ్డి, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యార్థులకు పోటీలు

జిల్లాకు చెందిన కళాశాలల విద్యార్థులకు ఓటర్ల దినోత్సవం సందర్భంగా పోటీలు నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఈనెల 23 గురువారం ఉదయం 11 గంటలకు ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వ్యాస రచన, వక్తృత్వ, క్విజ్ పోటీలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విజేతలకు బహుమతులు అందచేయడం జరుగుతుందని తెలిపారు. వివరాలకు జిల్లా ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ కొల్లి రమేష్‌ను స్వయంగా లేదా 9487916504లో సంప్రదించాలని కలెక్టర్ తెలిపారు.

గంజాయి కలకలం

(5వ పేజీ తరువాయి)

స్వాధీనం చేసుకున్న కారు, చిల్లకల్లు చెక్‌పోస్టు వద్ద పోలీసులకు చిక్కిన రెండు కారులు ఒకేసారి అక్కడి నుంచి బయలుదేరాయా అన్న అనుమానం వస్తోంది.

హరీష్ సింగ్ ఎవరు?

వన్‌టౌన్‌లోని పల్లె వారి వీధిలో పోలీసులు సోమవారం రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఆగి ఉన్న జీజే05 జేఈ 4115 నంబరు గల షిఫ్ట్ డిజైర్ కారును గుర్తించారు. అనుమానంతో డిక్కీని తెరిచి చూడగా గోనె సంచుల్లో గంజాయి ప్యాకెట్లు ఉన్నాయి. కారును అక్కడి నుంచి వన్‌టౌన్ స్టేషన్‌కు తరలించారు. మూడు, నాలుగు సంచుల్లో గంజాయి ఉంది. పోలీస్ స్టేషన్‌లో తూకం వేయగా 100 కిలోలు ఉన్నట్టు తేలింది. ఈ కారు గుజరాత్ రాష్ట్రానికి చెందినదిగా గుర్తించారు. హరీష్‌సింగ్ అనే వ్యక్తి పేరు మీద కారు రిజిస్ట్రేషన్ అయిఉంది. గంజాయి కోసం గుజరాత్ గ్యాంగ్ ఒడిశాకి వెళ్లిందా? నంబరు బోర్డును మార్చి కారును తీసుకొచ్చారా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. పల్లె వారి వీధిలో సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలించారు. ఇద్దరు వ్యక్తులు కారు దగ్గర నుంచి నడుచుకుంటూ వెళ్తున్నట్టు కనిపించింది. ఆ సీసీ కెమెరాల ఫుటేజీల్లో స్పష్టత లేకపోవడంతో పోలీసులు నిందితులను గుర్తించలేకపోతున్నారు.

గంజాయి రవాణా ఇలా..

గంజాయి సరఫరాలో కొనుగోలు చేసే వారికి, దాన్ని విక్రయించే వారికి మధ్య వ్యవహారం వాట్సాప్‌లో మాదిరిగా ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్షన్‌లా ఉంటుంది. సరుకును తీసుకొచ్చే వారు కీప్యాడ్ ఫోన్‌ను కొనుగోలు చేస్తారు. అందులో ఇతరుల పేరు మీద తీసుకున్న సిమ్‌కార్డును వేస్తారు. కొనుగోలుదారులు ఇదేవిధంగా చేస్తారు. కొనుగోలుదారులు తీసుకొచ్చే వారికి కేవలం మార్గం చెప్పి సరుకును చేర్చాల్సిన ప్రదేశం చెప్తారు. సరఫరాదారులు అక్కడకు చేరుకోగానే సిమ్‌లను, ఫోన్‌లను డ్రైయినేజీలో గానీ, చెత్తకుండీలో గానీ పడేస్తారు. ప్రస్తుతం గంజాయి సరఫరాలో ఇదే వ్యవహారం కొనసాగుతోంది. వన్‌టౌన్‌లో గుర్తించిన గంజాయి వ్యవహారంలో నిందితులను కారును కొనుగోలుదారులు చెప్పినట్టుగా ఆ ప్రదేశానికి చేర్చారని తెలుస్తోంది. ఇంతలో పెట్రోలింగ్ పోలీసులు సైరన్ మోగించడంతో అక్కడి నుంచి జారుకున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ రెండు ఘటనలపై జగ్గయ్యపేట, వన్‌టౌన్ పోలీసులు కేసులు నమోదు చేశారు.

అవినీతి పార్టనర్ రగడ

(5వ పేజీ తరువాయి)

ఒక్కో లారీకి రూ.5,500 ఎంవీఐ సిండికేట్‌కు చెల్లించాల్సి ఉంటుంది. ఇందులో రూ.500 ప్రైవేటు వ్యక్తి కలెక్షన్ చేసినందుకు తీసుకుంటాడు. మిగిలిన రూ.5 వేలు ఎంవీఐ సిండికేట్‌కు వెళుతుంది. ఇలా చాలా కాలంగా గుట్టు చప్పుడు కాకుండా వ్యవహారం సాగుతోంది.

పది శాతం పార్టనర్‌షిప్‌తో మొదలు..

కాల క్రమంలో లారీల నుంచి నెలవారీ కలెక్షన్ చేస్తున్న ప్రైవేటు వ్యక్తికి ఆశ పెరిగింది. తన వల్లే ఇంత ఆదాయం వస్తుందని ఎంవీఐ సిండికేట్‌ను పార్టనర్‌షిప్ కోరాడు. సరేనని సిండికేట్ కూడా ఓ పది శాతం పార్టనర్‌షిప్ కల్పించింది. ఇక ఇక్కడి నుంచి పార్టనర్ జూలు విదిల్చాడు. ఏ లారీ మీద కేసు పెట్టాలి.. పట్టుకున్న ఏ లారీని కేసు రాయకుండా వదిలిపెట్టాలన్నది కూడా ఈ పార్టనర్ శాసించేస్థాయికి వెళ్లాడు.

అధికారులకే చుక్కలు చూపించాడు..

ఆ తర్వాత నుంచి ఎంవీఐలకే చుక్కలు చూపించడం మొదలు పెట్టాడు. లారీ యజమానుల నుంచి చేస్తున్న వసూళ్లను ఎంవీఐ సిండికేట్‌కు పార్టనర్ చెల్లించడం ఆపేశాడు. అదేమంటే లారీలు తిరగటం లేదని, ఏదో ఒక సాకు చెబుతున్నాడు. ఎంవీఐ సిండికేట్ గట్టిగా ప్రశ్నిస్తే.. వసూలు చేసిన వాటిలో కొంత మాత్రమే చెల్లిస్తున్నాడు. దీంతో కొద్దికాలంగా పార్టనర్ తీరుపై ఎంవీఐ సిండికేట్ అసహనంగా ఉంది.

అవినీతి డబ్బుతో ఆస్తులు

పార్టనర్ వ్యవహారాలపై ఎంవీఐ సిండికేట్ దృష్టి సారించింది. దీంతో ఎంవీఐ సిండికేట్‌కు నివ్వెరపోయే విషయాలు తెలిశాయి. పార్టనర్ సంపాదన కంటే తమ సంపాదనే తక్కువని తేలింది. పార్టనర్ ఇతర రాష్ట్రాల్లో ప్లాట్స్ కొనుగోలు చేశాడని గుర్తించారు. గూడవల్లి గ్రామంలో ఎనిమిది ఎకరాల భూములు కొన్నాడని తెలిసింది. ఎలాంటి ఫైనాన్స్ లేకుండా ఎనిమిది భారీ టిప్పర్లను కొనుగోలు చేయటమే కాకుండా మరో నాలుగు భారీ టిప్పర్లు కొనుగోలు చేయటానికి ఇన్వాయిస్‌లు కూడా తీసుకున్నాడని గుర్తించారు. దీంతో ఎంవీఐ సిండికేట్‌కు మైండ్ బ్లాక్ అయినంత పనైంది. తమ పార్టనర్ తమను మోసం చేసి తమ కంటే ఎక్కువ అక్రమాస్తులు కూడబెట్టుకున్నాడని ఎంవీఐ సిండికేట్ రగిలిపోయింది.



ముంబాయికి మామిడి ఎగుమతి చేస్తున్న దుకాణం నిర్వాహకుడు

తోతాపురి @ 90వేలు

తోతాపురి మామిడి టన్ను రూ.90 వేలు ధర పలికింది. ఇదే రేటు స్థిరంగా కొనసాగితే రైతుకు దశతిరిగినట్టే.. విస్సన్నపేట నుంచి ముంబాయి మ్యాంగో మార్కెట్‌కు మామిడి ఎగుమతులు ఊపందుకున్నాయి. మంగళవారం తోతాపురి రకం 10 టన్నులు ముంబాయి మార్కెట్‌కు ఎగుమతి చేసినట్టు మార్కెట్ నిర్వాహకుడు రాయల కృష్ణయ్య (కిట్టు) తెలిపారు. (విస్సన్నపేట-ఆంధ్రజ్యోతి)

ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు కృషి

- ఎమ్మెల్యే కొలికపూడి



తిరువూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి హామీ మేరకు నియోజకవర్గంలో ఇండస్ట్రియల్, లెదర్ పార్కుల ఏర్పాటుకు ఎంపీ కేశినేని శివనాథ్ కృషి చేస్తున్నారని స్థానిక ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తెలిపారు. దీనికోసం నియోజకవర్గంలో ప్రభుత్వ స్థలాల పరిశీలన జరుగుతోందన్నారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో నియోజకవర్గాన్ని పారిశ్రామిక హబ్‌గా అభివృద్ధి చేయడంతో పాటు, ప్రతి ఇంటి నుంచి ఒకరిని వ్యాపారవేత్తగా తీర్చిదిద్దుతామన్నారు. గత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఢిల్లీ పర్యటనలు తనపై కేసుల విముక్తికి చేస్తే.. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ వెళ్లిన ప్రతిసారి రాష్ట్రానికి శుభవార్తలు తెచ్చారన్నారు. సమావేశంలో తిరువూరు, ఎ.కొండూరు, గంపలగూడెం టీడీపీ నేతలు పాల్గొన్నారు.

అప్పులోళ్ల వేధింపులు తాళలేక ఆత్మహత్య



రమేష్‌బాబు

ఎ.కొండూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : అప్పులు ఇచ్చిన వారి వేధింపులు తాళలేక మాజీ సర్పంచ్ భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రమైన ఎ.కొండూరులో జరిగింది. ఎస్సై చల్లా కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఎ.కొండూరు గ్రామ మాజీ సర్పంచ్ బలుమూరి నాగపద్మ, భర్త రమేష్‌బాబు గతంలో కొన్ని అప్పులు చేశారు. ఇటీవల ఓ వ్యక్తి రమేష్‌బాబు ఇంట్లో లేని సమయంలో ఇంటికి తాళం వేసి అప్పు తీర్చాలని వారం రోజులుగా ఇంటి ముందు కూర్చున్నాడు. సోమవారం ఊరు నుంచి ఇంటికి చేరుకున్న రమేష్‌బాబు దంపతులతో గ్రామానికి చెందిన వ్యక్తులు తమ బాకీలు తీర్చాలని వత్తిడి చేసి దుర్భాషలాడారు. కొంత సమయం ఇవ్వాలని రమేష్‌బాబు వారికి చెప్పి పంపేశారు. ఈ ఘటనతో తీవ్ర మనస్థాపానికి గురైన రమేష్‌బాబు అర్ధరాత్రి ఇంట్లో ఊరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య నాగపద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కృష్ణ తెలిపారు.

కృష్ణా వర్సిటీలో వివాదాలు

(5వ పేజీ తరువాయి)

సంబంధించి అరియర్స్ కూడా చెల్లించారని, ఈ సమయంలో సిబ్బంది నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడ్డారని, దీనిపైన సమాధానం చెప్పాలని ప్రొఫెసర్లు పట్టుబట్టారు.

భవనాలు నిర్మించకుండా రూ.25 కోట్లు ఎలా చెల్లించారు

కృష్ణా యూనివర్సిటీలో బాలురు, బాలికల వసతి గృహాలు, ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాల భవనాలు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్‌కు సంబంధించిన భవనం ప్రహరీ నిర్మాణం పనులు మూడు సంవత్సరాల కిందట ప్రారంభించారు. వీటిలో కొన్ని భవనాల నిర్మాణాలు పునాదుల దశను దాటలేదు. అయినా రూ.25 కోట్ల నిధులను బిల్లులుగా చెల్లించారు. అలాగే ఇటీవల పరీక్షల నియంత్రణ విభాగంలో ఉన్న రూ.5 కోట్ల నుంచి రూ.2 కోట్లు, కాలేజీ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ఫండ్(సీడీసీ) నుంచి మరో రూ.2 కోట్లు కాలేజ్ వెల్ఫేర్ ఫండ్‌కు ఇవ్వాలని కోరారని, ఆయా విభాగాల అధిపతులు అంగీకారం తెలపకున్నా ఈ నిధులను ఎలా మళ్లించేశారని, ఈ నిధులను ఏం చేశారని ప్రొఫెసర్లు రిజిస్ట్రార్‌ను ప్రశ్నించారు. ఈ నిధులు తమకు తెలియకుండానే మళ్లించేశారని ఈ సమావేశంలో ఉన్న కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ వీరబ్రహ్మాచారి, సీడీసీ చైర్మన్, రెక్టార్ బసవేశ్వరరావు అధ్యాపకులకు చెప్పడం గమనార్హం. భవనాలు నిర్మించకుండా రూ.25కోట్ల బిల్లులు ఎలా చెల్లించారని రిజిస్ట్రార్‌ను నిలదీశారు. పునాదుల్లో వేసిన ఇనుము తప్పు పడుతుంటే ఈ భవనాల నిర్మాణం ఎంతమేర నాణ్యతగా ఉంటుందని ప్రొఫెసర్లు ప్రశ్నించారు. వీటిపై పూర్తిస్థాయిలో వివరాలు అందజేయాలని కోరారు. ఇన్‌చార్జి వీసీ హయాంలో బిల్లుల చెల్లింపులు చేయవద్దని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని, ఒకవేళ చెల్లింపులు చేస్తే, సంబంధిత వివరాలను ఈ నెల 20వ తేదీలోగా తెలియజేయాలని ప్రభుత్వం సూచన చేసిందని, ఈ వివరాలను తెలియజేశారా లేదా అనే అంశంపైనా రిజిస్ట్రార్‌ను నిలదీశారు.

ఈస్ట్ బైపాస్ ఆపేయండి!

(5వ పేజీ తరువాయి)

అమరావతి - అనంతపురం ఎక్స్‌ప్రెస్‌వేలను అనుసంధానించటంతో దేశంలో అతి ముఖ్యమైన ఎన్‌హెచ్ - 16, ఎన్‌హెచ్ - 65, ఎన్‌హెచ్ - 216 హెచ్, ఎన్‌హెచ్ - 30, ఎన్‌హెచ్- 163జీ, ఎన్‌హెచ్ - 544ఎఫ్‌లను అనుసంధానిస్తుంది. ఒక విస్తృత రోడ్డు నెట్‌వర్క్‌ను అమరావతి ఓఆర్ఆర్ కల్పిస్తోంది. అమరావతి రాజధానిని దేశంలోని అన్ని ప్రధాన నగరాలకు ఈ రోడ్డు నెట్‌వర్క్ వ్యవస్థ అనుసంధానం చేస్తోంది. అందువల్ల అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు అనేది చాలా ముఖ్యమైన ప్రాజెక్టు. అమరావతి అవుటర్ రింగ్ రోడ్డును గతంలో సీఆర్‌డీఏ సొంతంగా ఏర్పాటు చేయాలనుకుంది. ఇప్పుడలా కాదు ! మొత్తం 189 కిలోమీటర్ల అలైన్‌మెంట్ ఓఆర్ఆర్‌ను రూ.45 వేల కోట్లకు పైగా అంచనా వ్యయం అయ్యే ప్రాజెక్టును ఎన్‌హెచ్ చేపడుతోంది. ఇంత ముఖ్యమైన ప్రాజెక్టును ఈస్ట్ బైపాస్ కోసం ఆపలేరు.

ఇన్నర్ రింగ్ రోడ్డుపై దృష్టి

ఈస్ట్ బైపాస్ కొరతను ఇన్నర్ రింగ్ రోడ్డుతో భర్తీ చేసుకునే అంశంపై ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను ఈస్ట్ బైపాస్‌కు అనుగుణంగా మార్చగలిగితే ఈ సమస్య పరిష్కారమవుతుంది. ఇప్పటికే విజయవాడ వెస్ట్ బైపాస్ వైపు అలైన్‌మెంట్‌ను మార్చేందుకు నోటిఫికేషన్ ఇవ్వడం జరిగింది. ఇన్నర్ రింగ్ రోడ్డును ఈస్ట్ బైపాస్ వైపు కూడా మార్చితే చాలా వరకు ఇది లేని కొరతను అధిగమించవచ్చు. రాష్ట్ర ప్రభుత్వం ఇన్నర్ రింగ్ రోడ్డు ప్రాజెక్టును సొంతంగా కాకుండా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పూర్తిగా ఎన్‌హెచ్ ద్వారాచేయించే ఆలోచనలు కూడా చేస్తోంది.

నిడమానూరు ఫ్లైఓవర్‌పై కేంద్రానికి నివేదిక

పదహారవ నంబర్ జాతీయ రహదారిపై నిడమానూరు జంక్షన్ నుంచి మహానాడు జంక్షన్ వరకు ఏడు కిలోమీటర్ల మేర ఆరు వరసల మెగా ఫ్లై ఓవర్‌కు సంబంధించి కదలిక వచ్చింది. ఈ మార్గంలో మెట్రో కారిడార్ - 1 ప్రతిపాదన కూడా ఉండటంతో మెట్రో లైన్ వెళుతున్నంత వరకు రెండింటి అవసరాలను తీర్చేలా డబుల్ లైన్ ఫ్లైఓవర్‌ను నిర్మించాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. దీనికి సంబంధించిన అంచనాలను ఏపీ మెట్రోరైల్ కార్పొరేషన్ దాదాపుగా రూ. 1000 కోట్ల వ్యయంతో తయారు చేసింది. త్వరలో ఈ డిజైన్‌ను రాష్ట్ర ప్రభుత్వానికి అందించనుంది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వానికి నివేదిక అందనుంది. ఫిబ్రవరి మొదటి వారంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి కేంద్రానికి డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్‌కు సంబంధించి ప్రతిపాదన ఇచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.

విజయవాడ తూర్పు

సిద్ధార్థ మెడికల్ కళాశాలకు పీఎల్‌గా అక్రిడేషన్ గుర్తింపు


సిబ్బందిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

ప్రభుత్వాసుపత్రి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సిద్ధార్థ మెడికల్ కళాశాల మైక్రోబయాలజీ వీఆర్‌డీఎల్ ల్యాబ్‌కు డబ్ల్యూహెచ్‌వో ప్రొఫిషియన్సీ ల్యాబరేటరీగా అక్రిడేషన్ గుర్తింపు లభించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.అశోక్ కుమార్ మంగళవారం తెలిపారు. ఈ మేరకు సిబ్బందికి ఆయన అభినందనలు తెలిపారు.




కాల్వ మీద కట్టిన ర్యాంపులపై కార్ల పార్కింగ్, మైనేని క్యాంటీన్ సర్వీస్ రోడ్డు నుంచి గాయత్రీనగర్ రోడ్డు కల్వర్టును కలిసే చోట కూలిన గోడ, గాయత్రీనగర్ నుంచి సర్వీస్ రోడ్డు డ్రెయిన్ కలిసే చోట

కూలిన డ్రెయిన్ గోడలు

- శంకర్ నేత్రాలయ నుంచి రమేష్ ఆసుపత్రి జంక్షన్ వరకు సర్వీస్ రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న డ్రెయిన్ గోడలు
- కొన్ని చోట్ల సైడు కాల్వకు గోడలు నిర్మించారు...మరికొన్ని చోట్ల వదిలేశారు
- ఏళ్ల తరబడి అధికారుల నిర్లక్ష్యం


5వ నెంబరు రూట్ పాలిటెక్నిక్ కళాశాల రోడ్డు మొదట్లో కరెంటు స్తంభాలు, ఇనుప గడ్డర్లు

(మొగల్రాజపురం, ఆంధ్రజ్యోతి)

తూర్పు నియోజకవర్గం 8వ డివిజన్‌లో శంకర్ నేత్రాలయ ఆసుపత్రి నుంచి పాలిటెక్నిక్ కళాశాల రమేష్ ఆసుపత్రి జంక్షన్ వరకు ఉన్న సైడు డ్రెయిన్ గోడలు కూలి ప్రమాదకరంగా ఉంది. ఈ సమస్య ఏళ్ల తరబడి అధికారుల దృష్టిలో పడటం లేదు. ఆ ప్రాంతంలో ఫ్లైవోవర్ కట్టిన తరువాత సర్వీస్ రోడ్డు గోతులమయం కావడంతో ఇటీవల ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ చొరవ తీసుకుని శంకర్ నేత్రాలయ నుంచి ప్రభుత్వాసుపత్రి వరకు సర్వీస్ రోడ్డు మరమ్మతులు చేయించారు. ఈ మార్గంలో డ్రెయిన్‌ను అధికారులు పట్టించుకోలేదు. శంకర్ నేత్రాలయ నుంచి గాయత్రీనగర్ మలుపు వరకు మాత్రం సైడు కాల్వకు గోడలు కట్టారు. ఇదే మలుపు నుంచి పాలిటెక్నిక్ కళాశాల రమేష్ ఆసుపత్రి జంక్షన్ వరకు మాత్రం వదిలేశారు.

గాయత్రీనగర్ కల్వర్టుకు రెండు వైపులా, సర్వీస్ రోడ్డులో నాలుగు చోట్ల గోడలు కూలిన చోట సిమెంట్ దిమ్మలు పెట్టి చేతులు దులుపుకున్నారు. ఈ మార్గంలో నిత్యం వందలాది కార్లు, ద్విచక్రవాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఏదన్నా వాహనం అదుపు తప్పితే ఐదు అడుగుల లోతులో ఉన్న డ్రెయిన్‌లో పడటం ఖాయం. మొన్నటి వర్షాకాలంలో పరిస్థితి దారుణంగా ఉంది. ఏళ్ల తరబడి ఇలాగే ఉన్నా వీఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదు. అధికారులు ఇప్పటికైనా స్పందించి గోడలు కట్టించాలని వాహనదారులు కోరుతున్నారు.

విశాఖ స్టీల్‌పై టీడీపీది ఉక్కులాంటి నిర్ణయం

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం టీడీపీ ఉక్కు లాంటి గట్టి నిర్ణయాన్ని తీసుకుందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. మంగళవారం అశోక్‌నగర్‌లోని ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ ఉత్తరాంధ్రకే కాకుండా యావత్ ఏపీకే మణిహారం అయిన విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పరిరక్షించేందుకు టీడీపీ తొలి నుంచి కృషి చేసిందన్నారు. సీఎం ఢిల్లీ వెళ్లిన ప్రతి సారి కేంద్రం రాష్ట్రానికి ఒక శుభవార్త చెబుతుందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పరిరక్షించేందుకు రూ.11,440 కోట్ల ఆర్థిక ప్యాకేజీని మంజూరు చేయించడంలో సీఎం కృషి ఎంతో ఉందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటు పరం చేసి విలువైన భూములను జగన్మోహన్ రెడ్డి అమ్ముకోవాలని చూశాడన్నారు. 1998లో ప్రధాని వాజ్‌పేయితో మాట్లాడి విశాఖ ఉక్కుకు రూ.1,650 కోట్లు మంజూరు చేయించి ప్లాంట్‌ను పరిరక్షించామన్నారు. గతంలోను ఇప్పుడు కాపాడింది సీఎం చంద్రబాబు నాయుడే అన్నారు.

- **గృహ నిర్మాణాలకు దరఖాస్తు చేసుకోండి**

అర్హులైన వారందరూ గృహ నిర్మాణాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. పీఎంఏవో పథకం కింద రూ.2.5 లక్షలు మంజూరు చేస్తుందని నియోజకవర్గంలో అర్హులైన వారు రెండు ఇంటి స్థలం కలిగి గృహ నిర్మాణం చేయదలచుకున్న వారు వారి దరఖాస్తుతో పాటు సొంత పట్టా, బీఫామ్, పొజిషన్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంక్ అకౌంట్, ఆదాయ ధ్రువపత్రం, కుల ధ్రువపత్రంతో సెల్ నంబరు 9346922569కు సంప్రదించాలన్నారు.

చేయూతకు 20 కుర్చీల వితరణ


కుర్చీలు అందజేసిన సీనియర్ సిటిజన్స్

పటమట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆపన్నులకు చేయందించడంలో పటమట సీనియర్ సిటిజన్స్ తమ ఉదారణతను చాటుకున్నారు. కేదారేశ్వరపేటలో డాక్టర్ కృష్ణకుమారిచే నడపబడుచున్న చేయూత అనే మానసిక పాఠశాలను పటమట సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం సందర్శించారు. వారు 20 కుర్చీలు, తినుబండారాలను అందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు సూర్యదేవర పాపారావు, ఉపాధ్యక్షుడు పొన్నగంటి సాంబశివరావు, కోనేరు వెంకటేశ్వరరావు, కొల్లిపర రామ్మోహన్‌రావు, పాండురంగారావు పాల్గొన్నారు.

40 వసంతాల వేడుక


ఆంధ్రజ్యోతి ఫొటో కంపోజింగ్ సెక్షన్ తొలి బ్యాచ్ ఉద్యోగులు విజయవాడలో 40 వసంతాల వేడుక జరుపుకున్నారు. 1985 జనవరి 21న ఒకేరోజు 20 మంది విధుల్లో చేరగా వారంతా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. చిత్రంలో ఎన్.సాంబశివరావు, కె.హరికుమార్, వై.సుధాకర్‌రావు, ఎస్.వి.ఎస్.వాసు, ఎ.రమేష్‌బాబు, ఈ.వి.శ్రీధర్‌రావు, పి.రామారావు, కె.రామకృష్ణ, చక్కా రమేష్(పై వరుస), ఎస్.ఎస్.వి. పార్థసారథి, కె.శివకుమారి, కె.వి.లక్ష్మీకుమారి, వై.సూర్యకుమారి, సిహెచ్.వి.ఎన్.ఎస్. శర్మ(కింది వరుస)ఉన్నారు.

కంప్యూటర్ ఎయిడెడ్ డ్రగ్ డిజైన్‌పై ముగిసిన వర్క్‌షాపు

పటమట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మారిస్ స్టెల్లా కళాశాలలో కంప్యూటర్ ఎయిడెడ్ డ్రగ్ స్పెక్ట్రోస్కోపిక్ అనాలసిస్‌పై రెండ్రోజుల పాటు నిర్వహించిన వర్క్‌షాపు మంగళవారంతో ముగిసింది. బయో కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈవర్క్‌షాపులో మొదటి రోజు ఆటో డాకింగ్, ప్రొటీన్ లిగాండ్ ఇన్‌ట్రాక్షన్స్, ఇన్ఫర్మేటిక్స్‌పై మేడూరి రామకృష్ణ విద్యార్థులకు అవగాహన కల్పించారు. రెండో రోజు పునీత్ బీడి, బి.మనీష్ రెడ్డిలు జీవిత శాస్త్రాల్లో స్పెక్ట్రోస్కోపిక్ విశ్లేషణ ప్రాముఖ్యతను వివరించారు. జీవ రసాయన, పరిశోధన, ఔషధాల అభివృద్ధిలో అనువర్తనాలను ప్రధానంగా వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ లీనా క్వాడ్రస్, ప్రిన్సిపాల్ డాక్టర్ జెసింతా క్వాడ్రస్, డాక్టర్ ఇనాశమ్మ, కులరేక, జి.ఉషాకుమారి, కె.కృష్ణ మనోహర్‌లు పాల్గొన్నారు.

బీజేపీ ప్రభుత్వంపై అలుపెరుగని పోరాటం

- లెనిన్ శత వర్ధంతి ముగింపు సభలో వక్తలు


లెనిన్ శత వర్ధంతి కార్యక్రమంలో వామపక్ష, ప్రజాసంఘాల నేతలు

గవర్నర్‌పేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ప్రభుత్వంపై అలుపెరుగని పోరాటం సాగించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు వామపక్ష నేతలకు పిలుపునిచ్చారు. సోషలిస్టు రాజ్య స్థాపకులు వీఐ లెనిన్ శత వర్ధంతి ముగింపు సందర్భంగా మంగళవారం లెనిన్ సెంటర్‌లోని లెనిన్ విగ్రహం వద్ద వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల శ్రేణులు నివాళులర్పించారు. కార్యక్రమానికి విగ్రహ కమిటీ కన్వీనర్ బి. జమీందారు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ పాలక బీజేపీ ప్రభుత్వం ఫాసిస్టు విధానాలు పాల్పడుతూ ఉందని, మనువాదం రాజ్యమేలుతోందని అన్నారు. బీజేపీ పాలనలో ప్రజలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. సీపీఐ జాతీయ సమితి కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల్ని బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందన్నారు. సీపీఐ ఎంఎల్ నాయకుడు ముప్పాళ్ళ భార్గవశ్రీ మాట్లాడుతూ దేశంలో కమ్యూనిస్టు ఉద్యమానికి వంద సంవత్సరాలు అవ్వగా లెనిన్ మరణించి వందేళ్లు అవ్వడం ఇదొక గొప్ప పరిణామమని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణా రాష్ట్ర ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, జనసాహితీ కార్యదర్శి దివి కుమార్, వామపక్ష నేతలు కె. పోలారి, అమర్‌నాథ్, సి. నరసింహారావు, జి. కోటేశ్వరరావు, సీహెచ్ బాబూరావు, వై. వెంకటేశ్వరరావు, అరుణ్‌కుమార్, వివిధ సంఘాల నేతలు అక్కినేని చంద్రారావు, వి. రామ్‌ప్రసాద్, మోతుకూరి వెంకటేశ్వరరావు, ఎం. రామకృష్ణ, అరసం అరుణకుమార్, జి.వలరాజు, సాయికుమార్, డి. సుజాత పాల్గొన్నారు.

మత్తుపదార్థాలపై విద్యార్థులకు అవగాహన

కృష్ణలంక, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : మత్తుపదార్థాల దుర్వినియోగంపై స్క్రీన్ ప్రొజెక్టర్ ద్వారా అవగాహనా కార్యక్రమాన్ని మంగళవారం నవజీవన్ బాలభవన్ ప్రోగ్రాం మేనేజర్ కృష్ణలంకలోని వీఎం రంగా స్కూల్ విద్యార్థినులకు కల్పించారు.

ఈ కార్యక్రమంలో నవజీవన్ ప్రోగ్రాం మేనేజర్ జి.శేఖర్‌బాబు మాట్లాడుతూ మత్తు పదార్థాల జోలికి వెళ్లవద్దని, తెలిసో తెలియకో మాదక ద్రవ్యాలు అలవాటు చేసుకొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడిన వారు సరైన అవగాహన లేక దానికి బానిసలవుతున్నారన్నారు. మత్తుపదార్థాలపై అవగాహన కల్పించుకొని జీవితాన్ని చక్కదిద్దుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కో ఆర్డినేటర్ ప్రియాంక, విజయరాణి, వీఎం రంగా హెడ్‌మాస్టర్ గ్రేసమ్మ, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో జనసేన బలోపేతానికి కృషి చేయాలి. సామినేని


ఉదయభానును కలిసిన బోలియశెటి శ్రీకాంత్, గజీరావు శ్రీనివాసరావు, శీలం బ్రహ్మయ్య తదితరులు

భారతీనగర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని జనసేన పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్క జనసైనికులు కృషి చేయాలని జనసేన జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను అన్నారు. గురునానక్ కాలనీలోని జనసేన కార్యాలయంలో జనసేన జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను, ఉమ్మడి కృష్ణా జిల్లాల ఉపాధ్యక్షులు బోలియశెట్టి శ్రీకాంత్, మైలవరం పట్టణ అధ్యక్షుడు గజీరావు శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు శీలం బ్రహ్మయ్య ఆధ్వర్యంలో జనసేన నేతల సమావేశం మంగళవారం జరిగింది. ఉదయభాను మాట్లాడుతూ పార్టీ పదవుల్లో ఉన్న ప్రతి ఒక్కరూ గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను, సంక్షేమ పథకాలను వివరించాలని అన్నారు. గొల్లపూడి, చంద్రగూడెం గ్రామాల అధ్యక్షులు కటకం ధర్మారావు, శివరాం, నేతలు పాల్గొన్నారు.

పరామర్శ... విజయవాడ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గూడూరు ప్రాంతానికి చెందిన జనసేన కార్యకర్త సంతోష్‌ను జనసేన జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను మంగళవారం జనసేన నేతలతో కలిసి పరామర్శించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి పార్టీ తరుపున, ప్రభుత్వం తరుపున అండగా ఉంటా మని వారికి భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జనసేన సెంట్రల్ జోన్ ఆంధ్ర కన్వీనర్ బాడిత శంకర్, అధికార ప్రతినిధి రావి సౌజన్య, అమ్ములు పాల్గొన్నారు.


సత్యనారాయణ రాజుకు అభినందనలు తెలుపుతున్న జిల్లా అసోసియేషన్ సభ్యులు

సత్యనారాయణ రాజుకు అభినందనలు

లబ్బీపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఎన్నికల్లో పెనుమత్స సత్యనారాయణ రాజు రెండోసారి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. అసోసియేషన్ ఎన్నికలు గత ఆదివారం విశాఖపట్నంలో జరిగాయి. ఈ సందర్భంగా కృష్ణాజిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.వంశీకృష్ణా ప్రసాద్, ఇతర సభ్యులు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు సత్యనారాయణ రాజును కలిసి అభినందనలు తెలిపారు.

జీవశాస్త్రంలో విద్య, ఉద్యోగావకాశాలపై సదస్సు

భారతీనగర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రా లయోలా కళాశాలలో బయోటెక్నాలజీ, జువాలజీ, ఐక్యూఏసీ విభాగాల ఆధ్వర్యంలో కళాశాల సెమినార్ హాల్‌లో జీవశాస్త్రంలో విద్య, ఉద్యోగావకాశాలపై మంగళవారం సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో జర్మనీలోని గోయథే విశ్వవిద్యాలయానికి చెందిన పోస్ట్‌డాక్టోరల్ శాస్త్రవేత్త డాక్టర్ వుటుకూరి రాజ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నానోటెక్నాలజీ, బయోఇన్ఫర్మాటిక్, ఆస్ట్రోబయాలజీ, మెడికల్ బయాలజీ తదితర రంగాలు విద్యార్థుల విద్య, వృత్తి జీవితంలో విజయానికి కీలకమైన పాత్ర పోషిస్తాయన్నారు. ప్రిన్సిపాల్ ఫాదర్ జీఏపీ కిషోర్, ఐక్యూఏసీ డాక్టర్ పీవీఎస్ సాయిరాం, బయోటెక్నాలజీ విభాగాధిపతి శ్రీలక్ష్మీ సామంచి, జువాలజీ విభాగాధిపతి సాంధ్యశ్రీ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సహాయంపై ...

ఆంధ్రా లయోలా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఏపీ లీగల్ సర్వీస్ అథారిటీ డైరెక్టర్ ఫాదర్ బి. జోజి రెడ్డి సమక్షంలో కళాశాల సెమినార్ హాల్‌లో ఉచిత న్యాయ సహాయం అంశంపై సదస్సు జరిగింది. ఈ సదస్సులో జోజిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఉచిత న్యాయ సహాయాన్ని పొందడంలో వ్యక్తిగత భద్రత, చట్టపరమైన హక్కులను వివరించారు. ఉచిత న్యాయ సహాయం అంశంపై డిజిటల్ ఛాయిస్ బోర్డ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఓ.మహేష్, విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ స్మృతివనం తీర్చిదిద్దేందుకు కూటమి కృషి

- మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి


మ్యూజియంను పరిశీలిస్తున్న మంత్రి వీరాంజనేయ స్వామి, ఎమ్మెల్యే బొండా

గవర్నర్‌పేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనాన్ని అద్భుత రీతిలో తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయించిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి తెలిపారు. ఎంజీ రోడ్డులోని స్వరాజ్యమైదానంలో నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం ప్రాంతాన్ని మంగళవారం సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావుతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అంబేడ్కర్ స్మృతివనాన్ని అమరావతిలో ఏర్పాటు చేసి, అంబేడ్కర్ భారీ విగ్రహాన్ని అమరావతిలో ఏర్పాటు చేసేందుకు 2014లోనే నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిపాదన చేసి స్థలాన్ని కేటాయించారని గుర్తు చేశారు. 2024లో తిరిగి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు అమరావతిలో అద్భుత రీతిలో అంబేద్కర్ స్మృతివనం ఏర్పాటు చేయడంతో పాటు స్వరాజ్య మైదానంలో ఏర్పాటు చేసిన స్మృతివనంలో ఇంకా పెండింగ్‌లో ఉన్న పనులు త్వరగా పూర్తి చేసేందుకు అధికారులతో సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో 23వ డివిజన్ కార్పొరేటర్ నెల్లిబండ్ల బాలస్వామి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నవనీతం సాంబశివరావు, సంక్షేమశాఖ అధికారులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్లకు అదనంగా నగదు వసూలుచేస్తే చర్యలు

● జేసీ గీతాంజలిశర్మ

మచిలీపట్నం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): దీపం-2 పథకంలో భాగంగా గ్యాస్ సిలిండర్లను వినియోగదారులకిచ్చే సమయంలో బిల్లులో ముద్రించిన ధర కంటే అదనంగా నగదు వసూలు చేసే గ్యాస్‌డీలర్లు, డెలివరీ బాయ్‌లపై చర్యలు తీసుకుంటామని జేసీ గీతాంజలిశర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వసూళ్లపై ముఖ్యమంత్రి కార్యాలయానికి జిల్లా నుంచి ఫిర్యాదులు అందాయని తెలిపారు. గ్యాస్ సిలిండర్లను వినియోగదారులకు అందించే విషయంపై నిత్యం అధికారుల పర్యవేక్షణ ఉంటుందన్నారు. నగదు వసూలు చేసినట్టు రుజువైతే డీలర్ల లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ అంశంపై త్వరలో గ్యాస్‌డీలర్లతో సమావేశం నిర్వహించి నిబంధనలకు అనుగుణంగా నడచుకోవాలని చెబుతామని ఆమె తెలిపారు.

వయోజన విద్య డైరెక్టర్‌కు జేడీగా పదోన్నతి

జిల్లా వయోజన విద్య డైరెక్టర్ ఎస్‌కే షాకీరుల్లా బేగంకు జేడీగా పదోన్నతి ఇస్తూ స్కూల్ ఎడ్యుకేషన్ (ప్రోగ్రామ్-1) కార్యదర్శి కోన శశిధర్ మంగళవారం జీవోఆర్‌టీ నెంబరు 12ను జారీచేశారు.

సర్పంచ్ ఇందిరకు రిపబ్లిక్ డే ఆహ్వానం



కంకిపాడు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 26న ఢిల్లీలో జరుగుతున్న గణతంత్ర వేడుకల్లో అతిథిగా హాజరు కావాలంటూ ఈడుపుగల్లు సర్పంచ్ పందిపాటి ఇందిరకు ఆహ్వానం అందినట్టు గ్రామ పంచాయతీ ఈవో చింతా కిరణ్‌కుమార్ తెలిపారు. స్థానిక విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ డిల్లీలో ఈ నెల 26న గణతంత్ర వేడుకల్లో అతిథులుగా హాజరు కావాలంటూ జిల్లాకో సర్పంచ్‌ను పంచాయతీ రాజ్ కమిషనర్ నుంచి ఉత్తర్వులు అందాయన్నారు. రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము చేతుల మీదుగా సర్పంచులకు ఉత్తమ పురస్కారాలు అందించనున్నట్టు ఆయన తెలిపారు.



గల్లంతైన మత్స్యకారుడి కోసం గాలిస్తున్న మత్స్యకారుల బృందం

మత్స్యకారుడి ఆచూకీ కోసం గాలింపు

నాగాయలంక, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సముద్రంలో చేపల వేటకి వెళ్లి గల్లంతైన మత్స్యకారుడు కోలా నాంచారయ్య ఆచూకీ ఇంకా దొరకలేదు. మంగళవారం ఐదుగురు మత్స్యకారులు ప్రత్యేక పడవలో గుల్లలమోద - లంకేవానిదిబ్బ సముద్రతీర ప్రాంతాల్లో గాలిస్తున్నారని అధికారి సునీత తెలిపారు. మండలంలోని సంగమేశ్వరం శివారు పాత ఉపకాలి గ్రామానికి చెందిన కోలా నాంచారయ్య సోమవారం గుల్లలమోద - లంకేవానిదిబ్బ సముద్రతీర ప్రాంతంలో పడవలో చేపలు వేటాడుతూ మునిగిపోయిన విషయం విదితమే. దీనిపై మండల మత్స్య శాఖాధికారి సునీత మంగళవారం నాగాయలంక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. మండల అధికారులకు, ఇతర జిల్లాల మత్స్యశాఖ అధికారులకు సమాచారం ఇచ్చినట్టు తెలిపారు.

ప్రేయసి నిరాకరించిందని ఆత్మహత్య



జి.కొండూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఇద్దరికీ పెళ్లయింది. ఇద్దరికీ ఇద్దరు చొప్పున పిల్లలున్నారు. అయినా ప్రేమించుకుంటున్నారు. ఈక్రమంలో తనతో ఉండేందుకు ప్రేయసి నిరాకరించిందని ప్రియుడు చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన వైనమిది. పోలీసుల కథనం ప్రకారం చెర్వుమాధవరం గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ రమావత్ బాలాజీ (26) జి.కొండూరుకు చెందిన ఓ వివాహితతో ప్రేమాయణం నడుపుతున్నారు. ఈ క్రమంలో తన ఆటోలో ప్రేయసిని ఎక్కించుకొని చెవుటూరు శ్రీవాణి కళాశాల సమీపంలోని అటవీ ప్రాంతం వద్దకు వెళ్లారు. అక్కడ తనతో ఉండేందుకు ఇక కుదరదు అని ప్రేయసి చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెందిన బాలాజీ ఆటో స్టార్ట్ చేసే తాడుతో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య దుర్గా ఫిర్యాదు మేరకు మైలవరం సీఐ చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాజధానిలో పనుల పర్యవేక్షణకు పీఎంసీల నోటిఫికేషన్ల పరంపర

ఆంధ్రజ్యోతి, విజయవాడ: అమరావతి రాజధానిలో పీఎంసీల కోసం నోటిఫికేషన్ల పరంపర నడుస్తోంది. రాజధానిలో ఈ 3, ఈ 6, ఈ 8, ఈ 9, ఈ 14 రోడ్ల పరిధిలో చేపట్టే రోడ్లు, డ్రెయిన్లు, వాటర్ పైప్‌లైన్స్, సీవరేజి నెట్‌వర్క్, పెడస్ట్రియల్ ట్రాక్స్ అవెన్యూ ప్లాంటేషన్ పనుల పర్యవేక్షణకు సంబంధించి ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ కన్సల్‌టెంట్ (పీఎంసీ) కోసం టెండర్లు పిలిచింది. అలాగే ఎన్ 6, ఎన్ 9, ఎన్ 11, ఎన్ 12, ఎన్ 15, ఎన్ 18 రోడ్లకు సంబంధించి పైన చెప్పుకున్న పనుల పర్యవేక్షణకు పీఎంసీ కోసం టెండర్లు పిలిచింది. వీటితో పాటు కొండవీడు వాగు విస్తరణాభివృద్ధి, పాలవాగు, గ్రావిటీ కెనాల్ విస్తరణాభివృద్ధి, నీరుకొండ రిజర్వాయర్ పనుల పర్యవేక్షణకు పీఎంసీ కోసం సీఆర్‌డీఏ టెండర్లు పిలిచింది.

హద్దు మీరితే ఆట కట్టిస్తా..!

● ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య ఫైర్



నందిగామ టీడీపీ సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య

నందిగామ, జనవరి 21: హద్దు మీరితే ఆట కట్టిస్తా.. నియోజకవర్గానికి నేనే రాజు, నేనే మంత్రినంటూ పార్టీ నేతలకు, పెత్తనం చేస్తున్న ప్రజాప్రతినిధులకు ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య ఘాటైన హెచ్చరికలు చేశారు. నియోజకవర్గ సమన్వయ కమిటీకి సమావేశానికి హాజరైన నేతలకు గతంకంటే భిన్నమైన అనుభవం ఎదురైంది. ఎప్పుడూ సౌమ్యంగా ఉండే సౌమ్య ఆగ్రహం వెనుక 6 నెలల అవమానాలున్నట్టు పార్టీ నేతలు కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ పరిణామాలు ఎటు దారి తీస్తాయోనన్న ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అసలేం జరిగింది..?

మంగళవారం తన నివాసంలో ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. నందిగామ ఏఎంసీ చైర్మన్ పదవి కేటాయింపుపై నిర్ణయం తీసుకుంటారన్నా సమాచారంతో ఆశావహులు అక్కడకు వచ్చారు. ఈ పదవి బీసీలకు కేటాయించినట్టు వార్తలు వస్తున్న నేపథ్యంలో ఆ కేటగిరీ నేతలు సౌమ్య ఆశీస్సుల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఒక బీసీ నేత ఒకడుగు ముందుకు వేసి ఆ పదవి తనకే వచ్చినట్టు ప్రచారం చేస్తున్నాడు. పైగా సౌమ్య పేరు చెప్పకుండా ఒక ప్రముఖ ప్రజాప్రతినిధి పేరు చెబుతున్నాడు. గతంలోనూ మునిసిపల్ చైర్మన్ మార్పు అంశం ప్రస్తావనకు వచ్చినప్పుడు కూడా కొందరు సౌమ్యను వీడి తమ కుల నేతలు, ఎమ్మెల్యేలు ఇతర జిల్లాల మంత్రులను కలిసి మద్దతు కోరారు. దీనిపై ఇప్పటికే అభిమానులు ఆగ్రహంతో ఉన్నారు. రెండుసార్లు రికార్డు మెజారిటీతో సౌమ్యను గెలిపించుకుంటే ఆమెను కాదని ఇతర నేతల వద్దకు వెళ్లి పైరవీలు చేయడమేమిటని ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి వారి పట్ల కఠినంగా ఉండాలని సౌమ్యకు సూచిస్తూ వచ్చారు. ఎట్టకేలకు ఆ తరుణం వచ్చింది. అందుకే ఈ సమావేశంలో తాను కూడా సీనియర్ ఎమ్మెల్యేనని, తన హక్కులకు భంగం వాటిల్లితే తీవ్ర పరిణామాలుంటాన్న భావన కలిగేలా సౌమ్య మాట్లాడినట్టు తెలిసింది.

ఈ ఆవేదన, ఆగ్రహం నేటిది కాదు

ఎమ్మెల్యే సౌమ్యకు కట్టలు తెంచుకొనే ఆగ్రహం వెనుక పలు కారణాలు ఉండొచ్చని ని రాజకీయ ప్రముఖులు విశ్లేషిస్తున్నారు. సహజ వనరులకు నెలవైన నందిగామపై పలువురు పెద్ద నేతలు పెత్తనం చేస్తున్నట్టు టాక్. ఇసుక, మట్టి, రేషన్ బియ్యం తదితర వ్యాపారాలను అక్రమమార్గంలో నిర్వహిస్తున్నట్టు విమర్శలున్నాయి. నియోజకవర్గంలో జరిగే ప్రతి పనిపైన ఎమ్మెల్యేదే బాధ్యత. అక్రమ వ్యాపారాల షేడ్ కూడా ఆమెపై పడుతుంది. చేసేది ఒకరైతే నిందలు మరొకరు భరించాల్సి వస్తుందన్న ఆవేదన ఇక్కడి నేతల్లో ఉంది. ఈ పరిణామాలపై తీవ్ర ఆగ్రహంతో ఉన్న సౌమ్య తన ఆవేదనను ఈ రూపంలో చూపించినట్టు తెలుస్తోంది. పార్టీ అధిష్ఠానం స్పందించి గతానికి భిన్నంగా సాగుతున్న రాజకీయాలను గాడిలో పెట్టాలని సగటు పార్టీ అభిమానులు కోరుతున్నారు.



కోర్టుకు హాజరైన టీడీపీ నేతలు

టీడీపీ నేతలపై ధర్నా కేసులు కొట్టివేత

వన్‌టౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా టీడీపీ నేతలు నిర్వహించిన ధర్నాలపై నమోదైన 4 కేసులను మంగళవారం విజయవాడ చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు కొట్టివేసింది. క్రైం నెం.1344, 3251, 1626, 1489 నాలుగు ధర్నా కేసులను నమోదు చేసి కోర్టుకు చార్జిషీటు దాఖలు చేశారు. ఈ క్రమంలో వాయిదాలు జరగ్గా కోర్టు వాటిని కొట్టివేసింది. మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా, సాదరబోయిన ఏడుకొండలు, మాజీ కార్పొరేటర్లు బొబ్బూరి నారాయణస్వామి, పత్తి నాగేశ్వరరావు, యేదుపాటి రామయ్య, హబీబుల్లా, 40వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు చిన సుబ్బయ్య, సురభి బాలు, గణపా రాము, పేరాబత్తుల రమణ, ఈగల సాంబ, నారాయణ, మాల్యాద్రి, గంగవరపు సురేష్, శ్రీకాంత్, తదితరులపై కేసు నమోదు కాగా వారంతా మంగళవారం కోర్టుకు హాజరయ్యారు. చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కేసులను కొట్టివేశారు.



ప్రధాన ఆలయాన్ని పరిశీలిస్తున్న టీటీడీ ఇంజనీరింగ్ అధికారి, స్థపతి

దుర్గమ్మకు కనకశోభిత గోపురం

● అమ్మవారి ప్రధాన ఆలయ శిఖరానికి బంగారు తాపడం

● టీటీడీ అధికారుల పరిశీలన

వన్‌టౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ ప్రధాన ఆలయ గోపురం ఇక పూర్తిగా కనకశోభితం కానుంది. కొన్నేళ్ల క్రితం అర్ధభాగం వరకు బంగారు తాపడం చేశారు. మిగతా అర్ధభాగానికి స్వర్ణతాపడం చేయించేందుకు చాలాకాలం నుంచి ప్రయత్నాలు జరుగుతున్నాయి. గతంలోనూ టీటీడీ దేవస్థానం ఆధ్వర్యంలోనే గోపురానికి స్వర్ణతాపడం పనులు జరిగాయి. ఇప్పుడు కూడా వారే స్వర్ణతాపడం చేయించేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ పనులకు చాలా వరకు విరాళాలు కూడా సేకరించారు. మొత్తం గోపురానికి స్వర్ణతాపడం చేయించేందుకు చర్యలు చేపట్టాల్సిందిగా సుమారు 2 నెలల క్రితం అప్పటి దుర్గగుడి ఈవో కె.ఎస్. రామరావు టీటీడీకి లేఖ రాశారు. ఈ మేరకు మంగళవారం టీటీడీ ఇంజనీరింగ్ అధికారి, స్థపతి వచ్చి ఆలయ గోపురాన్ని పరిశీలించి కొలతలు తీసుకున్నారు. స్వర్ణతాపడానికి గోల్డ్ కోటింగ్ రేకులను తయారు చేయాల్సి ఉంది. గోపురంలోని అర్ధభాగం నుంచి దిగువ వరకు అంటే సుమారుగా ఆలయ కుడ్యం చుట్టూ ఉన్న అష్టలక్ష్మీ దేవతల విగ్రహాల వరకు స్వర్ణతాపడానికి సుమారు 80 కిలోల బంగారం అవసరమని అంచనా. ఆలయం వద్ద ఉన్న కొంత బంగారంతోపాటు సేకరించిన విరాళాలతో కొంత బంగారాన్ని కొనుగోలు చేసి తాపడం పనులకు వినియోగించనున్నట్టు సమాచారం. విజయవాడ దుర్గమ్మకు కనకదుర్గ అని పేరుంది. పురాణోక్తి ప్రకారం అప్పట్లో విజయవాడను పాలించిన మాధవ వర్మ సత్య నిరతికి మెచ్చి అమ్మవారు కనకవర్షం కురిపించిన కారణంగానే ఆమెను భక్తులు కనకదుర్గగా కొలుస్తున్నారు. అటువంటి అమ్మవారు కొలువైన ఆలయ గోపురం ఇక పూర్తిగా కనకశోభితం కానుంది.





వేగవంతంగా పనులు జరుగుతున్న లడ్డూ ప్రసాదం తయారీ, అన్నదాన భవనాల నిర్మాణాలు

దుర్గగుడి అభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టి

వన్‌టౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపైనున్న దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టగా పనులు వేగంగా సాగుతున్నాయి. మాస్టర్‌ప్లాన్ ప్రకారం నిర్మాణాలను చేపట్టారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో అభివృద్ధి పనులకు బ్రేక్ పడగా, ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు దేవస్థానం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారు. జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన తరచూ ఆరా తీస్తున్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక రెండుసార్లు దేవస్థానానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయా అభివృద్ధి పనుల వివరాలను దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డితో పాటు కమిషనర్, దుర్గగుడి ఈవో ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి పనులనూ ఆరా తీశారు. ముఖ్యంగా లడ్డూ ప్రసాదం తయారీ సముదాయం, అన్నప్రసాదం తయారీ భవనం, ఇంకా పలు అభివృద్ధి పనుల ప్రగతిపై అధికారులు ముఖ్యమంత్రికి నివేదిక సమర్పించారు.

దేవస్థానంలో వేగవంతంగా అభివృద్ధి పనులు

మహామండపం ఎదురుగా సుమారు రూ.16కోట్ల వ్యయంతో జీప్లస్-4 లడ్డూ ప్రసాదం పోటు, శివాలయం మెట్ల పక్కన సుమారు రూ.30కోట్ల వ్యయంతో జీప్లస్-1 అన్నదాన భవన సముదాయాన్ని నిర్మాణం చేపట్టినట్లు సీఎం చంద్రబాబుకు అధికారులు వివరించారు. పనులు త్వరగా పనులు చేపట్టి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. మాజీ ఈవో కె.ఎస్.రామారావు, ప్రస్తుత ఈవో కె.రామచంద్రమోహన్ పర్యవేక్షణలో ఈఈలు కోటేశ్వరరావు, వైకుంఠరావు భవనాల అభివృద్ధి పనులను వేగవంతం చేశారు. ఇంజనీరింగ్ అధికారులు ఎప్పటికప్పుడు పనుల వివరాలను అధికారులకు తెలియజేస్తూ సూచనలు తీసుకుంటున్నారు. లడ్డూ ప్రసాద తయారీ భవనం, అన్నదాన విభాగం భవనాల నిర్మాణ పనులు ఈ ఏడాది దసరాలోపు పూర్తిచేసి భక్తులకు అందుబాటులోకి తెచ్చేందుకు ఈవో కె.రామచంద్ర మోహన్, ఈఈలు గట్టి ప్రయత్నం చేస్తున్నారు.

వాయిద్య కళాకారుల పోస్టులను భర్తీ చేయాలి

ధర్నాచౌక్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా అన్ని దేవాలయాల్లో ఖాళీగా ఉన్న వాయిద్య కళాకారుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఆంధ్రప్రదేశ్ సంగీత వాయిద్య కళాకారుల సంఘం జాతీయ అధ్యక్షుడు ఎల్‌వీ చెన్నారావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సంఘం రాష్ట్ర నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణస్వీకారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగింది. అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎస్.మీరాబీ, వి.కృష్ణారావు, కార్యదర్శిగా కే శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ ఓ సునీత, కోశాధికారి ఎం.నారాయణతో ఆయన ప్రమాణస్వీకారం చేయించారు. టీడీపీ అధికార ప్రతినిధి నాగుల్‌మీరా మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. వాయిద్య సంగీత కళాకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సంఘం నూతన అధ్యక్షురాలు మీరాబీ మాట్లాడుతూ రాష్ట్రంలో సంఘం బలోపేతానికి కృషి చేస్తానన్నారు. వాయిద్య కళాకారులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలని, ప్రతి జిల్లాలో శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు.

కుంగ్‌ఫు సర్టిఫికెట్ కోర్సు ప్రారంభం

విజయవాడ కల్చరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులందరూ ఆత్మరక్షణకోసం మార్షల్ ఆర్ట్స్ కోర్సులు విధిగా నేర్చుకోవాలని గురుకుల కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వల్లూరు నీరజ కోరారు. కళాశాలలో 3 నెలల కుంగ్ ఫు సర్టిఫికెట్ కోర్సును మంగళవారం ప్రారంభించారు. కుంగ్ ఫు వంటి కళలను నిత్యం సాధన చేయడం వల్ల విద్యార్థులు శారీరకంగానూ, మానసికంగానూ, బౌద్ధికంగానూ ఆరోగ్యంగా ఉంటారన్నారు. తద్వారా చదువులో రాణించగలుగుతారన్నారు. కళాశాల మహిళా సాధికారత విభాగం ఇంక్లూజివ్ క్లబ్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ కోర్సును ఇప్పటి వరకు 2 బ్యాచ్ విద్యార్థులు విజయవంతంగా పూర్తిచేశారని కోర్సు సమన్వయకర్త ఆంగ్ల విభాగాధిపతి డాక్టర్ వై సుమిత్ర తెలియజేశారు. కుంగ్ ఫు శిక్షకుడు అబ్దుల్ బాసిత్ విద్యార్థులకు, అధ్యాపకులకు ఒత్తిడిని తగ్గించుకోడానికి సులువైన పద్ధతులను చేసి చూపించారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బాలకృష్ణ, ఐక్యూఏసీ సమన్వయకర్త అరుణ, డాక్టర్ సుధారాణి, సత్యవాణి, ప్రసాదరావు, లావణ్య, డాక్టర్ నాగలక్ష్మి, దివ్య తదితర అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

సాగర్ ఆయకట్టు.. అంతా కనికట్టు

● సిబ్బంది లేక ఇబ్బందులు ● పాలకవర్గాలకు కార్యాలయాల కొరత ● సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నరైతులు



రెగ్యులర్ డీవో లేక తరచూ మూసి ఉంచుతున్న డీఈ కార్యాలయం

నందిగామ, జనవరి 21: ఆధునీకీకరణకు నోచుకోని సాగర్ కాలువలు, విధ్వంసానికి గురైన ఎన్ఎస్‌పీ క్వార్టర్లు, నియామకాలు లేక కంటికి కనిపించని సి బ్బందితో సాగర్ ఆయకట్టు కునారిల్లుతోంది. సాగునీటి రంగానికి పెద్దపీట వేసే చంద్రబాబు పాలనలో పరిస్థితులు మారొచ్చని అన్నదాతలు కోటి ఆశలతో ఉన్నారు. మూడు దశాబ్దాల క్రితం లెఫ్ట్ కెనాల్ పరిధిలోని జిల్లాలోని పలు ప్రాంతాలకు సాగర్ నీరు పుష్కలంగా వచ్చేవి. గత టీడీపీ ప్రభుత్వాలతో పాటు కాంగ్రెస్ పాలకులు పెద్దయెత్తున ఎత్తిపోతల పథకాలను అందించారు. గత టీడీపీ పాలనలో కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి కాల్వల ఆధునికీకరణ పనులు చేపట్టింది. అనంతరం వైసీపీ ఐదేళ్ల పాలనలో కాలువలకు కనీస మరమ్మతులు కూడా చేపట్టకపోవడంతో ఎక్కడికక్కడ గండ్లు పడ్డాయి. వాటా ప్రకారం రావల్సిన సాగర్ నీటిని తీసుకురాలేకపోగా, ఎత్తిపోతల పథకాలను మూలన పడేశారు. దీంతో ఆయకట్టు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ దశలో టీడీపీ అధికారంలోకి రావడంతో మళ్లీ ఆశలు చిగురించాయి. నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించిన ప్రభుత్వం ఎన్ఎస్ఎల్‌బీసీ ఆయకట్టు స్థిరీకరణకు చర్యలు చేపట్టింది. పాలకవర్గం చిత్తశుద్ధితో పనిచేసి రైతుల ఆశలకు అనుగుణంగా చర్యలు చేపట్టాల్సి ఉంది.

సిబ్బంది కొరత

మూడు దశాబ్దాల క్రితం పూర్తిస్థాయి సిబ్బందితో ఎన్ఎస్‌పీ వ్యవస్థ పటిష్ఠంగా ఉండేది. ముఖ్యంగా లష్కర్లు కీలకపాత్ర పోషించేవారు. గొడ్డలి, కొడవళ్లు పట్టుకొని తిరుగుతూ అన్నదాతలకు ఆత్మబంధువులుగా ఉండేవారు. కాలువలపై గండ్లు పూడ్చడం, కంపచెట్లు కొట్టడం వంటి కీలక బాధ్యతలతో లష్కర్లు పని చేసేవారు. కానీ నేటితరం రైతులకు లష్కర్ అన్నపేరే తెలియనంతగా కనుమరుగయ్యారు. 190 మంది లష్కర్ల కు కేవలం 30మంది మాత్రమే ఉన్నారు. సగానికి స గం ఏఈ పోస్టులతో డీఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

కొలువు దొరికినా నెలవు కరువు

సాగునీటి సంఘాల ఎన్నికల్లో గెలిచిన పాలకవర్గాలకు కూర్చొనేందుకు కార్యాలయాలు కరువయ్యాయి. ఎన్టీఆర్, కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాలకు సంబంధించి ఈ ప్రాజెక్ట్ కమిటీకి విజయవాడలో ఒక కార్యాలయం ఏర్పాటు చేయాలి. నందిగామ, చందర్లపాడు డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు కార్యాలయాలు లేదు. నందిగామ ఎన్ఎస్‌పీ కాలనీలోని క్వార్టర్స్ పూర్తిగా ధ్వంసమవగా, ఉన్న రెండు భవనాల్లో ఏఈ, డీఈ కార్యాలయాలు ఉన్నాయి. రెగ్యులర్ డీఈ లేకపోవడంతో అప్పుడప్పుడు మాత్రమే తెరుస్తున్నారు. కాబట్టి డీఈకి కూడా ఏఈ కార్యాలయంలోనే ఒక గది కేటాయించి ఖాళీ అయిన డీఈ కార్యాలయాన్ని పాలకవర్గాలకు కేటాయించాలని కోరుతున్నారు. అక్కడే రైతులకు సమగ్ర నీటి యాజమాన్య పద్ధతులపై శిక్షణ ఇచ్చే అవకాశం ఉంటుంది.

ఆరుతడి పంటలకు సాగునీరందించాలి

● కేఆర్ఎంబీ చైర్మన్ అతుల్‌జైన్‌కు వినతి



అతుల్‌జైన్‌కు వినతి పత్రం ఇస్తున్న గోపాలకృష్ణ, శ్రీనివాసరావు, రాజేష్, తదితరులు

హనుమాన్‌జంక్షన్ రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ఎడమకాలువ పరిధిలోని ఉమ్మడి కృష్ణాజిల్లాలోని 3వ జోన్‌లో వివిధ నియోజకవర్గాల పరిధిలో లక్షలాది ఎకరాల్లో సాగవుతున్న ఆరుతడి పంటలకు వెంటనే సాగునీరందించాలని హైదరాబాద్‌లోని జలసౌధలోని కేఆర్ఎంబీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం కేఆర్ఎంబీ (కృష్ణా రివర్ మేనేజ్మెంట్ బోర్డు) చైర్మన్ అతుల్ జైన్‌కు కలిసి వినతిపత్రం అందజేసి సమస్యలను వివరించారు. రంగన్నగూడెంలో ఎన్ఎస్ఎల్‌పీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ మంగళవారం మాట్లాడుతూ నాగార్జునసాగర్ ఎడమకాలువ 3వ జోన్ పరిధిలోని గన్నవరం, నూజివీడు, మైలవరం, నందిగామ, దెందులూరు నియోజకవర్గాల పరిధిలో సుమారు 2.11 లక్షల ఎకరాల ఆయుకట్టు ఉందని, పొగాకు, పెసర, మిర్చి, మామిడి, మొక్కజొన్న లాంటి ఆరుతడి పంటలు సాగుచేస్తున్నారన్నారు. డిసెంబరు, జనవరి మాసాలకు 12 టీఎంసీల నీటిని విడుదల చేయాలని కేఆర్ఎంబీ ఉత్తర్వులున్నా తెలంగాణ రాష్ట్రం నేటి వరకూ 2.9 టీఎంసీల నీరు మాత్రమే విడుదల చేసిందన్నారు. ఈ నెలలోనే ఆంధ్రప్రదేశ్‌కు 1700 టీఎంసీల నీటిని విడుదల చేయించి ఆరుతడి పంటలను కాపాడాలని కేఆర్ఎంబీ చైర్మన్ అతుల్‌జైన్ దృష్టికి తీసుకువెళ్లి విజ్ఞప్తి చేసినట్టు ఎన్ఎస్ఎల్‌పీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ తెలిపారు. మంగళవారం జరిగే కేఆర్ఎంబీ సమావేశంలో ఈ సమస్యలను ప్రస్తావించేందుకు ముందుగానే కలిసి చైర్మన్‌కు వివరించామని ఆళ్ల తెలిపారు. కాకులపాడు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్, నున్న డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ పామర్తి శ్రీనివాసరావు, పాములపాడు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ యార్లగడ్డ రవిబాబు, మడిచర్ల డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ దేవినేని సత్యన్నారాయణ పాల్గొన్నారు.

దుర్గమ్మ ఆదాయం రూ.3.22 కోట్లు



దుర్గగుడి హుండీల్లో కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

వన్‌టౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపైనున్న దుర్గగుడి హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను మంగళవారం మహామండపం 6వ అంతస్తులో లెక్కించారు. ఈవో కె.రామచంద్ర మోహన్, డిప్యూటీ ఈవో ఎం.రత్నరాజు, దేవదాయ శాఖ అధికారులు, ఏఈవోలు, సిబ్బంది, ఎస్‌పీఎఫ్, వన్‌టౌన్ పోలీసు సిబ్బంది, అమ్మవారి సేవాదారులు కానుకల లెక్కింపులో పాల్గొన్నారు. పకడ్బందీ బందోబస్తు మధ్య కానుకల లెక్కింపులో నగదు రూపేణ రూ.3,22,45,920 లభించాయి. 618 గ్రాముల బంగారం, 6 కిలోల 28 గ్రాముల వెండి కానుకల రూపేణ లభించాయి. ఆన్‌లైన్ హుండీ ద్వారా 21 రోజులకు గాను రూ.1,13,085 లభించింది. పలు దేశాల కరెన్సీ కూడా లభించింది. 773 యూఎస్ఏ డాలర్లు, 125 ఆస్ట్రేలియా డాలర్లు, 30 సౌదీ రియాల్స్, 5 యూరప్ యూరోలు, 35 అరబ్ ఎమిరేట్స్ దీర్హమ్స్, 205 కెనడా డాలర్లు, 14 సింగపూర్ డాలర్లు, 93 మలేషియా రింగెట్లు, 120 థాయిల్యాండ్ బాట్‌లు, 15 ఇంగ్లండ్ ఫౌండ్‌లు, 10 స్కాట్‌ల్యాండ్ ఫౌండ్లు, 10 న్యూజిల్యాండ్ డాలర్లు, 10 హాంకాంగ్ డాలర్లు, 50 ఖతర్ రియాల్‌లు, 400లు ఒమన్ బైసాలు, 0.5 కువైట్ దీనార్‌లు లభించాయి.

దుర్గమ్మ సన్నిధిలో సీఎం కార్యదర్శి రాజమౌళి

కనకదుర్గమ్మను ముఖ్యమంత్రి కార్యదర్శి ఏవీ రాజమౌళి దంపతులు మంగళవారం దర్శించుకున్నారు. ఈవో రామచంద్రమోహన్ ఆయనకు ఆలయ మర్యాదలు అందజేసి అమ్మవారి దర్శనానంతరం ఆయనకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు. వేద పండితులు ఆశీర్వచనాలు అందజేశారు.

ఆంధ్రజ్యోతి
చిత్రజ్యోతి
SINCE 1965
విజయవాడ ● బుధవారం 22 జనవరి 2025



కొత్త ప్రయాణం మొదలైంది

బాలీవుడ్ నటి ప్రియాంకాచోప్రా మంగళవారం సాయంత్రం చిలుకూరు బాలాజీని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఆమెకు ప్రధానార్చకులు రంగరాజన్ స్వామి వారి దర్శనం కల్పించి ఆలయ విశిష్టతను వివరించారు. ఆలయ చరిత్రను తెలిపే వాక్ పుస్తకాన్ని అందించారు. బాలాజీ ఆశీస్సులతో తన కెరీర్‌లో కొత్త ప్రయాణం మొదలైందని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా రామ్‌చరణ్ సతీమణి ఉపాసనకు ప్రియాంక సోషల్ మీడియా వేదికగా దన్యవాదాలు తెలిపారు. మీ కొత్త సినిమా మంచి విజయం సాధించాలి, ఆ వేంకటేశ్వర స్వామి ఆశీస్సులు మీకు ఉంటాయి అని ఉపాసన బదులిచ్చారు. మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం షూటింగ్ కోసం ప్రియాంక చోప్రా హైదరాబాద్‌కు వచ్చినట్లు సమాచారం.

మొయినాబాద్ రూరల్ (ఆంధ్రజ్యోతి)

కాళేశ్వరాలయ గర్భగుడిలో
ప్రైవేటు ఆల్బమ్ చిత్రీకరణ

● గాయని మధుప్రియపై దేవాదాయ శాఖ ఆగ్రహం



దక్షిణ కాశీగా పేరుగాంచిన పుణ్యక్షేత్రం కాళేశ్వరం గర్భగుడిలో గాయని మధుప్రియ ప్రైవేటు ఆల్బమ్ చిత్రీకరించడం వివాదాస్పదమైంది. ఆలయంలో ఉన్న భక్తులను బయటకు పంపేసి, గర్భగుడి తలుపులు మూసి వీడియోను చిత్రీకరించారు. ఆదివారం జరిగిన ఈ షూటింగ్‌కు సంబంధించిన వీడియో సోమవారం బయటకు రావడంతో ఈ వ్యవహారం బహిర్గతమైంది. ఆలయ సంప్రదాయాలను తుంగలో తొక్కి గర్భగుడిలో శాస్త్ర విరుద్ధంగా షూటింగ్‌లు చేయడం ఏమిటనే ఆరోపణలు వెల్లువెత్తాయి. షూటింగ్ చేయడానికి ఆలయ అధికారులు ఎలా అనుమతించారని భక్తులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై ఆలయ ఈవో మారుతిని వివరణ కోరగా దర్శనానికి మాత్రమే వారికి అనుమతి ఇచ్చామని, షూటింగ్‌లకు అనుమతి ఇవ్వలేదని స్పష్టం చేశారు. గర్భ గుడిలో జరిగిన ఈ వ్యవహారాన్ని దేవాదాయ శాఖ సీరియస్‌గా తీసుకుంది. దీనిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆలయ ఈవోకు దేవాదాయశాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు.





జూనియర్ ఎన్టీఆర్‌తో సినిమా చేయాలనుంది

● హాలీవుడ్ దర్శకుడు జేమ్స్ గన్

జూనియర్ ఎన్టీఆర్‌తో సినిమా చేయాలనుంది అని తన మనసులో మాట చెప్పారు ప్రముఖ హాలీవుడ్ డైరెక్టర్ జేమ్స్ గన్. రాజమౌళి నిర్మించిన 'ఆర్ఆర్ఆర్' చిత్రాన్ని చూశానని, అందులో జూనియర్ ఎన్టీఆర్ నటనకు ముగ్ధుడనయ్యానని, అప్పుడే ఆయనతో ఓ సినిమా చేయాలనే ఆలోచనకు వచ్చినట్లు జేమ్స్ చెప్పారు. ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ 'ఆర్ఆర్ఆర్‌లో నటించిన ఆ కుర్రాడు ఎవరు? అనే అంశం ఏడాదిగా నా మదిని తొలిచేస్తోంది. అతను చాలా బాగున్నాడు. పులులతో వీరోచిత పోరాటం, ఆయన నటించిన ప్రతీ సన్నివేశం ఎంతో అద్భుతంగా ఉంది. ఆయనతో కలసి పనిచేయడానికి ఇష్టపడుతున్నాను' అని అన్నారు. జూనియర్ ఎన్టీఆర్ కోసం మీ వద్ద ప్రత్యేక పాత్ర ఏమైనా సిద్ధంగా ఉందా అన్న ప్రశ్నకు 'ప్రస్తుతానికైతే లేదు. అందుకు కొంత సమయం పడుతుంది' అని జేమ్స్ బదులిచ్చారు. కాగా, ఇదే ఇంటర్వ్యూలో పాల్గొన్న మరో ప్రముఖ హాలీవుడ్ దర్శకుడు ఆండ్రూ గార్‌ఫీల్డ్ కూడా ఆర్ఆర్ఆర్‌లో రామ్‌చరణ్, జూనియర్ ఎన్టీఆర్ నటనను ప్రశంసలతో ముంచెత్తారు.

ఈ ఏడాది నాకు చాలా ముఖ్యం



'ఈ ఏడాది నాకు చాలా ముఖ్యం. చాలా సినిమాలు వస్తున్నాయ్' అని హీరోయిన్ సంయుక్తా మీనన్ అన్నారు. తిరుమల శ్రీవారిని మంగళవారం దర్శించుకున్న ఆమె మీడియాతో మాట్లాడుతూ, 'శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకుంటే జీవితం చాలా సాఫీగా సాగుతుందని నా నమ్మకం' అన్నారు. ప్రస్తుతం నాలుగైదు సినిమాల్లో నటిస్తున్నానని తెలిపారు.

తిరుమల (ఆంధ్రజ్యోతి)

సైఫ్.. సేఫ్‌గా ఇంటికి!



బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్ ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. ఈనెల 16న ఓ దుండగుడు ముంబై లోని సైఫ్ ఇంట్లోకి చొరబడి ఆయనపై దాడి చేసిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి లీలావతి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన మంగళవారం సాయంత్రం డిశ్చార్జి అయ్యి సేఫ్‌గా ఇంటికి వెళ్లారు. కాగా, సైఫ్‌పై దాడి చేశాడన్న ఆరోపణలతో షరీఫుల్ ఇస్లామ్ షెహజాద్(30)అనే బంగ్లాదేశ్ పౌరుడిని పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ఇదిలా ఉంటే ఇటీవల జరిగిన పరిణామాల వల్ల కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని సైఫ్ కుటుంబ సభ్యులు నిర్ణయించుకున్నారు. సైఫ్ కుటుంబం రక్షణ బాధ్యతలు బాలీవుడ్ నటుడు రోనిత్ రాయ్ స్వీకరించారు. ముంబయిలో ఓ సెక్యూరిటీ ఏజెన్సీని ఆయన నిర్వహిస్తున్నారు. సైఫ్ కుటుంబంతో తాము ఉన్నట్లు ఓ ఇంటర్వ్యూలో రోనిత్ చెప్పారు.

నా కెరీర్‌కి ఊపిరి పోసే చిత్రం



సాయిరామ్ శంకర్ హీరోగా వినోద్ విజయన్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఒక పథకం ప్రకారం'. ఆషిమా నర్వాల్ హీరోయిన్. సముద్రఖని కీలక పాత్రలో నటించారు. వినోద్‌కుమార్ విజయన్, గార్లపాటి రమేశ్ నిర్మించారు. చిత్రం ఫిబ్రవరి 7న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హీరో సాయిరామ్ శంకర్ మాట్లాడుతూ 'ఇది నా కెరీర్‌కి ఊపిరి పోసే సినిమా. కచ్చితంగా నాకు కమ్‌బ్యాక్ ఫిల్మ్ అవుతుంది. ఇందులో సిద్ధార్థ నీలకంఠ అనే పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నటించాను. నటనలో చిన్నపాటి కృత్రిమత్వం కూడా ఉండకూడదని నెలరోజుల పాటు నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామాలో శిక్షణ తీసుకున్నా. ఈ చిత్రం ఎవరినీ నిరాశపర్చదు' అని అన్నారు.

కృష్ణభక్తుని ప్రేమగాథ



అక్షయ్, మమితా బైజు, ఐశ్వర్య హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'డియర్ కృష్ణ'. దినేశ్ బాబు దర్శకత్వంలో పీఎన్ బలరామ్ నిర్మించారు. విడుదలకు సిద్ధమైన సందర్భంగా బలరామ్ మాట్లాడుతూ 'యదార్థ సంఘటనల ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కింది. ఒక కృష్ణభక్తుని జీవితంలో జరిగిన అద్భుత సంఘటన ఆధారంగా రూపుదిద్దాం. ఈ నెల 24న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాం' అని చెప్పారు. 'డియర్ కృష్ణ' చిత్రాన్ని ప్రేమకథకు వినోదాన్ని జోడించి ఆసక్తికరంగా రూపొందించాం, అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది అని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: హరిప్రసాద్, ఎడిటర్: రాజీవ్ రామచంద్రన్.



రష్మిక రాచఠీవి!

విక్కీ కౌశల్, రష్మిక మందన్న జంటగా రూపొందుతున్న బాలీవుడ్ చిత్రం 'ఛావా'. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వంలో దినేశ్ విజన్ నిర్మిస్తున్నారు. ఛత్రపతి శివాజీ తనయుడు ఛత్రపతి శంభాజీ మహరాజ్ జీవిత గాథ ఆధారంగా తెరకెక్కుతోన్న చిత్రమిది. ఇందులో శంభాజీ భార్య మహారాణి యేసుబాయి భోంస్లే పాత్రలో రష్మిక కనిపించనున్నారు. ఫిబ్రవరి 14న విడుదలవుతోంది. మంగళవారం చిత్రబృందం స్పెషల్ టీజర్‌తో పాటు రష్మికమందన్న ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది. మహారాణి పాత్రలో రష్మిక ఆకట్టుకున్నారు. ఈ పోస్టర్‌ను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన రష్మిక 'ప్రతి గొప్ప పాలకుడి వెనుక యోధురాలైన భార్య ఉంటుంది' అనే వ్యాఖ్యను జోడించారు. మహారాణి దుస్తుల్లో రష్మిక రాచఠీవితో కనిపించారు. అక్షయ్ ఖన్నా, అశుతోష్ రాణా, దివ్య దత్తా కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఏ.ఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం ట్రైలర్‌ను నేడు విడుదల చేయనున్నారు.



నన్ను అడిగి తీసుకుంటే బావుంటుందండీ

'బయటకు వెళ్లినప్పుడు కొందరు అకస్మాత్తుగా వాళ్ల సెల్‌ఫోన్లలో నా ఫొటోలు తీస్తున్నారు. మిమ్మల్ని ఒక్క ఫొటో తీసుకోవచ్చా? అని అడిగితే ఎంత బావుంటుంది' అంటూ అభిమానులతో తనకు ఎదురవుతున్న అనుభవాన్ని పంచుకున్నారు నటి సాయి పల్లవి. 'ప్రతి మనిషికీ కొన్ని నచ్చని విషయాలు ఉండటం సహజం. కొన్ని భయాలు కూడా మనల్ని వెంటాడుతూ ఉంటాయి. నన్ను ఫొటోలు తీయడం అసలు నచ్చదు. నేను అందమైన చెట్టునో, ఇల్లునో కాదు కదా, జీవం ఉన్న మనిషిని నా అనుమతి లేకుండా వీరంతా ఎందుకు ఇలా చేస్తున్నారు' అనిపిస్తుంది అని ఆమె చెప్పారు. సాయి పల్లవి నటించిన చిత్రం 'అమరన్' ఇటీవలె విడుదలై ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ చిత్రంలో నటనకుగాను ఆమెకు సర్వత్రా ప్రశంసలు లభించాయి. ఆమె 'రామాయణం' చిత్రం ద్వారా బాలీవుడ్‌లోనూ ఎంట్రీ ఇస్తున్నారు. ఇక తెలుగులో ఆమె నాగచైతన్య సరసన 'తండేల్' చిత్రంలో నటిస్తున్నారు. ఈ చిత్రం ఫిబ్రవరి 7న విడుదల కానుంది.

సరికొత్త కథాంశంతో...



దర్శకుడు మారుతి సమర్పణలో రూపుదిద్దుకుంటున్న చిత్రం 'త్రిబాణధారి బార్బరిక్'. సత్యరాజ్, వశిష్ట, ఎన్.సింహా, సాంచి రాయ్, ఉదయభాను, సత్యం రాజేశ్, క్రాంతి కిరణ్ ముఖ్య పాత్రలు పోషించిన ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. సరికొత్త పాయింట్‌తో రూపుదిద్దుకుంటున్న చిత్రమిదని దర్శకుడు మోహన్ శ్రీవత్స చెప్పారు. చిత్రంలోని ప్రతి పాత్ర విభిన్నంగా ఉంటుందని, ముఖ్యంగా సత్యరాజ్ పాత్ర అందరినీ అలరిస్తుందని ఆయన చెప్పారు. త్వరలోనే సినిమాను విడుదల చేస్తామని నిర్మాత విజయ్‌పాల్ రెడ్డి అడిదెల చెప్పారు.

సినీరంగంపై ఐటీ దాడులు

● ఏకకాలంలో 55 చోట్ల సోదాలు
● కొత్త సినిమాల హై కలెక్షన్ల లెక్కలపై ఆరా
● దిల్‌రాజు సహా పలువురు నిర్మాతల ఇళ్లు, కార్యాలయాల్లో సోదాలు

సినీ రంగానికి చెందిన ప్రముఖులు టార్గెట్‌గా ఇన్‌కంటాక్స్ అధికారులు మంగళవారం వరుస సోదాలతో హడలెత్తించారు. ఒకటీ, రెండు కాదు ఏకంగా 55 ఐటీ బృందాలు హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాల్లో సోదాలు నిర్వహించాయి. సినీ రంగానికి చెందిన నిర్మాతలు, ఫిలిం ప్రొడక్షన్ సంస్థల కార్యాలయాల్లో సోదాలు జరిగాయి. ఇటీవల సంక్రాంతికి విడుదలైన గేమ్ ఛేంజర్, సంక్రాంతికి వస్తున్నాం సినిమాలకు సంబంధించి తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దిల్ రాజు ఇల్లు, కార్యాలయాల్లో, ఆయన కుమార్తె హన్సిత రెడ్డి, సోదరుడు శిరీష్ ఇళ్లల్లో ఐటీ అధికారులు సోదాలు నిర్వహించారు. అలాగే మైత్రి మూవీ మేకర్స్ సంస్థకు సంబంధించి మైత్రి నవీన్, సీఈఓ చెర్రీ ఇళ్లు, కార్యాలయాలు, వారి భాగస్వాముల ఇళ్లలోనూ ఐటీ అధికారులు సోదాలు నిర్వహించి పలు అవకతవకలను గుర్తించినట్లు తెలుస్తోంది. మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన 'పుష్ప 2' భారీ కలెక్షన్లు సాధించిన విషయాన్ని బహిరంగంగా లెక్కలతో సహా నిర్మాతలు చెప్పడంతో ఆ మొత్తానికి సంబంధించి అసలు వాస్తవాలు జీఎస్టీ లెక్కలు, ఆదాయంలో ఈ కలెక్షన్ చూపించారా? లేదా అనే విషయాలను ఐటీ అధికారులు పరిశీలించారని సమాచారం. సింగర్ సునీత భర్త రాముకు సంబంధించిన మ్యాంగో మీడియా సంస్థలోనూ ఐటీ అధికారులు సోదాలు నిర్వహించారు. దిల్ రాజు ఇంట్లో సోదాలు నిర్వహించిన ఐటీ అధికారులు ఒక బ్యాంకు లాకర్‌ను గుర్తించి ఆ లాకర్ దిల్‌రాజు భార్య తేజస్విని పేరిట ఉండటంతో ఆమెను బ్యాంకుకు తీసుకుని వెళ్లి లాకర్ తెరిపించారు. ఐటీ వాళ్లు లాకర్ తెరిచి చూపించాలని అడిగారు అలాగే చేశామని తేజస్విని మీడియాతో అన్నారు. 'పుష్ప2, గేమ్ ఛేంజర్, సంక్రాంతికి వస్తున్నాం' సినిమాలకు సంబంధించిన కలెక్షన్లు వందలకోట్ల రూపాయలుగా ప్రచారం జరిగిన నేపథ్యంలో ఐటీ విభాగం ఈ సోదాలను చేపట్టినట్లు సమాచారం.

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి)


క్రిమినల్ నేపథ్యం ఉన్నా భయపడను



తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి తనపై చేసిన వ్యాఖ్యలకు చాలా వేదనకు గురయ్యానని సినీ నటి మాధవీలత వాపోయారు. మంగళవారం గచ్చిబౌలిలోని సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో జేసీ ప్రభాకర్ రెడ్డిపై ఆమె ఫిర్యాదు చేశారు. వారి బెదరింపులతో తన కుటుంబ సభ్యులు భయాందోళనలకు గురవుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సినిమా హీరోయిన్లు, మహిళల గురించి అసభ్యకరంగా మాట్లాడి, ఆ తర్వాత క్షమాపణ చెబితే సరిపోతుందా? అని ఆమె ప్రశ్నించారు. ఇలాంటి వ్యక్తుల వల్ల ఆడపిల్లలు రాజకీయాల్లోకి రావడానికే వెనకడుగు వేస్తారు? నేను ఊరుకునే ప్రసక్తే లేదు. వారికి ఎంత పెద్ద క్రిమినల్ నేపథ్యం ఉన్నా, నేను భయపడను. అందుకే దీన్నొక సవాల్‌గా తీసుకొని కమిషనర్‌కు ఫిర్యాదు చేశానని తెలిపారు.

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి)

అంచనాలకు మించి అవతార్ 3



ఇంతవరకూ వచ్చిన మొదటి, రెండు భాగాలకంటే 'అవతార్ 3.. ఫైర్ అండ్ యాష్' చిత్రం ప్రేక్షకులకు సరికొత్త అనుభూతి కలిగిస్తుందని దర్శకుడు జేమ్స్ కామెరూన్ చెప్పారు. ఆ రెండు భాగాల కంటే 'అవతార్ 3' నిడివి కూడా ఎక్కువే అని ఆయన తెలిపారు. 2022లో వచ్చిన 'అవతార్ 2.. ద వే ఆఫ్ వాటర్' ఆశించిన స్థాయిలో లేకపోయినప్పటికీ భారీ అంచనాల వల్ల 2.3 బిలియన్ డాలర్లు వసూలు చేసింది. కానీ ఆ సినిమాలో కంటెంట్ విషయంలో చాలా మంది పెదవి విరిచారు. సినిమా గొప్పగా లేదనీ, చూసిన సన్నివేశాలే రిపీట్ అయ్యాయని విమర్శలు వినిపించాయి. అవి దృష్టిలో పెట్టుకుని కంటెంట్ మీద ఎక్కువ దృష్టి పెట్టారు కామెరూన్. ఇప్పటికే షూటింగ్ పార్ట్ పూర్తి చేసుకున్న 'అవతార్ 3' ఇప్పుడు పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. విజువల్ వండర్‌గా ఈ సినిమా ఉంటుందనీ, ఇంతకుముందు వచ్చిన రెండు భాగాల్లోని సన్నివేశాలు రిపీట్ కావని కామెరూన్ చెప్పారు. డిసెంబర్ 19న 'అవతార్ 3' విడుదలవుతుంది. ఆ తర్వాత 'అవతార్ 4' 2029 డిసెంబర్ 21న, అవతార్ 5 2031 డిసెంబర్ 19న విడుదలవుతాయి.

జూన్‌లో ఆరంభం



రూ. 3 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కి రూ. 136 కోట్లకు పైబడి వసూళ్లను సాధించిన మలయాళ ప్రేమకథా చిత్రం 'ప్రేమలు'. మలయాళ హీరో ఫహద్ ఫాజిల్ నిర్మించిన ఈ చిత్రం చిన్న సినిమాగా విడుదలై సంచలన విజయాన్ని అందుకొంది. ఈ సినిమాకు గతంలోనే సీక్వెల్ ప్రకటించారు. మంగళవారం చిత్రబృందం ఓ అప్‌డేట్‌ను పంచుకుంది. ఈ ఏడాది జూన్‌లో షూటింగ్ ప్రారంభించి, డిసెంబర్‌లో 'ప్రేమలు 2'ను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు తెలిపింది.

బిజినెస్

ఐపీఓల సొమ్ము దుర్వినియోగమవుతోంది..

- ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్లూ జర జాగ్రత్త
- లిస్టింగ్‌కు ముందే ఐపీఓ షేర్లలో ట్రేడింగ్
- సెబీ చీఫ్ మాధవి పురి బుచ్

ముంబై: పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) మార్కెట్‌పై క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్ మరోసారి ఆందోళన వ్యక్తం చేశారు. ఐపీఓల ద్వారా సేకరించిన నిధులను కొన్ని కంపెనీలు దుర్వినియోగం చేస్తున్నాయన్నారు. ఇలాంటి కంపెనీలు అసలు ఐపీఓ మార్కెట్‌కే రాకుండా ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్లు కట్టడి చేయాలని కోరారు. ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఐబీఏఐ) నిర్వహించిన ఒక సదస్సులో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. గత ఏడాది కాలంలో ఐపీఓలు జారీ చేసిన కొన్ని కంపెనీల షేర్లు వందల రెట్లు సబ్‌స్ర్కైబ్ కావడం, భారీ లాభాలతో లిస్టింగ్ కావడం, తర్వాత నీరుగారి పోవడం జరుగుతోంది. ఈ నేపథ్యంలో సెబీ చీఫ్ బుచ్ ఈ వ్యాఖ్యలు చేయడం విశేషం. ఇలాంటి కంపెనీలను ఆమె 'పంప్ అండ్ డంప్' కంపెనీలుగా వర్ణించారు. దీనికి చెక్ పెట్టేందుకు లిస్టింగ్‌కు ముందే ఐపీఓ షేర్లలో ట్రేడింగ్‌ను అనుమతించే విషయాన్ని పరిశీలిస్తున్నట్టు తెలిపారు.





ట్రంప్ టారిఫ్ షాక్

సెన్సెక్స్ 1,235 పాయింట్లు డౌన్

స్టాక్ మార్కెట్ భారీ పతనం

ఏడు నెలల కనిష్ఠానికి సూచీ .. 23,000 స్థాయికి జారిన నిఫ్టీ .. రూ.7.52 లక్షల కోట్లు ఆవిరి



ముంబై: భారత స్టాక్ మార్కెట్ మంగళవారం భారీగా నష్టపోయింది. సెన్సెక్స్ ఒక దశలో 1,431.57 పాయింట్లు క్షీణించి 75,641.87 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి సూచీ 1,235.08 పాయింట్ల (1.60 శాతం) నష్టంతో 75,838.36 వద్ద స్థిరపడింది. సూచీకిది ఏడు నెలలకు పైగా కనిష్ఠ ముగింపు స్థాయి. నిఫ్టీ 320.10 పాయింట్లు (1.37 శాతం) కోల్పోయి 23,024.65 వద్దకు జారుకుంది. 2024 జూన్ 6 తర్వాత సూచీకిదే కనిష్ఠ ముగింపు స్థాయి. అమెరికా కొత్త అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ సుంకాల వడ్డింపు హెచ్చరికలు అంతర్జాతీయంగా వాణిజ్య యుద్ధానికి దారితీయవచ్చన్న భయాలతో పాటు విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు తరలిపోతున్న నేపథ్యంలో ట్రేడర్లు అప్రమత్తమై పెద్దఎత్తున అమ్మకాలకు పాల్పడ్డారు. డిసెంబరు త్రైమాసికానికి చాలా కంపెనీల ఆదాయ వృద్ధి అంచనాలకు అనుగుణంగా పెరగకపోవడం, బలహీన రూపాయి ట్రేడింగ్ సెంటిమెంట్‌ను మరింత కుంగదీశాయని విశ్లేషకులు పేర్కొన్నారు. అమ్మకాల హోరులో మార్కెట్ వర్గాల సంపద (బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్) రూ.7.52 లక్షల కోట్లు గల్లంతైంది. దాంతో బీఎస్ఈ మార్కెట్ క్యాప్ రూ.424.07 లక్షల కోట్లకు (4.90 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది.

సెన్సెక్స్ 30లో 28 కంపెనీలకు నష్టాలే..

సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో అల్ట్రాటెక్ సిమెంట్, హెచ్‌సీఎల్ టెక్ మినహా అన్నీ నష్టపోయాయి. జొమాటో షేరు ఏకంగా 10.92 శాతం క్షీణించి సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. అదానీ పోర్ట్స్, ఎన్‌టీపీసీ 3 శాతానికి పైగా పతనమయ్యాయి. ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్‌బీఐ, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎం అండ్ ఎం, బజాజ్ ఫైనాన్స్, టెక్ మహీంద్రా షేర్లు 2 శాతానికి పైగా మార్కెట్ విలువను కోల్పోయాయి. కాగా, బీఎస్ఈలోని చిన్న, మధ్య స్థాయి కంపెనీల ప్రాతినిధ్య సూచీలైన మిడ్‌క్యాప్ 2 శాతం, స్మాల్‌క్యాప్ 1.94 శాతం తగ్గాయి. రంగాల వారీ సూచీల్లో రియల్టీ ఏకంగా 4.22 శాతం నష్టపోయింది. కన్స్యూమర్ డ్యూరబుల్స్ 3.99 శాతం క్షీణించగా.. కన్స్యూమర్ డిస్‌క్రెషనరీ, సర్వీసెస్, పవర్, టెలికాం, యుటిలిటీ ఇండెక్స్‌లు 2 శాతానికి పైగా నష్టపోయాయి. బీఎస్ఈలో మొత్తం 4,088 కంపెనీల షేర్లు ట్రేడవగా.. 2,881 నెగిటివ్‌గా ముగిశాయి. 1,106 కంపెనీల షేర్లు లాభపడగా.. 101 యథాతథంగా ముగిశాయి. 67 కంపెనీల షేర్లు ఏడాది కనిష్ఠానికి జారుకున్నాయి. కాగా, విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు సోమవారం మన మార్కెట్ నుంచి నికరంగా రూ.4,336.54 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు.

- ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 13 పైసలు క్షీణించి రూ.86.58 వద్ద ముగిసింది. డాలర్ ఇండెక్స్ బలపడటంతో పాటు ఈక్విటీ మార్కెట్లో భారీ నష్టాలు ఇందుకు కారణమయ్యాయి.
- అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ ముడి చమురు పీపా ధర ఒక దశలో 1.68 శాతం తగ్గి 78.80 డాలర్లకు పడిపోయింది. దేశీయంగా చమురు ఉత్పత్తిని పెంచుతామని ట్రంప్ ప్రకటించడం ఇందుకు ప్రధాన కారణమైంది.
- ఢిల్లీ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.100 పెరిగి రూ.82,100కు చేరుకోగా.. కిలో వెండి రేటు ఏ మార్పు లేకుండా రూ.93,000 పలికింది. ఇంటర్నేషనల్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ ఒకదశలో 2,730 డాలర్లు, సిల్వర్ 31.10 డాలర్ల స్థాయిలో ట్రేడయ్యాయి.

- ఎల్జీ ఎక్విప్‌మెంట్స్ లిమిటెడ్ అనుబంధ సంస్థ, గ్యారేజ్ ఎక్విప్‌మెంట్ తయారీదారు ఏటీఎస్ ఎల్జీ.. ఆటోమోటివ్ పరిశ్రమ కోసం సరికొత్త పరికరాలను తీసుకువచ్చింది. ఢిల్లీలో జరుగుతున్న భారత్ మొబిలిటీ ఎక్స్‌పోలో ఏటీఎస్ టచ్‌లెస్ వీల్ అలైనర్, హై-పెర్‌ఫార్మెన్స్ కొలిషన్ రిపేర్ సిస్టమ్, అడ్వాన్స్‌డ్ వెల్డింగ్ ఎక్విప్‌మెంట్‌ను ప్రదర్శించింది.
- ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్ యాక్ట్ ఫైబర్‌నెట్.. కృత్రిమ మేథ (ఏఐ) ఆధారిత యాక్ట్ స్మార్ట్‌వైఫై అందుబాటులోకి తెచ్చింది. ఇందుకోసం ఆప్రికామ్ డాట్ ఏఐతో జట్టు కట్టింది. ఇందులో భాగంగా ప్రస్తుతమున్న రౌటర్ ఓఎస్.. యాక్ట్ జీపీగా అప్‌గ్రేడ్ కానుంది. సాంప్రదాయ వైఫై కనెక్టివిటీ.. స్మార్ట్, ఇంటలిజెంట్ సర్వీస్‌గా మారనుంది. ఎంపిక చేసిన నగరాల్లో యాక్ట్ స్మార్ట్‌వైఫై అందుబాటులో ఉండనుంది.

యూకో బ్యాంక్ లాభం రూ.639 కోట్లు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని యూకో బ్యాంక్.. డిసెంబరు త్రైమాసికంలో రూ.7,406 కోట్ల ఆదాయంపై రూ.639 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.503 కోట్లతో పోల్చితే లాభం 27% పెరిగింది. వడ్డీ, వడ్డీయేతర ఆదాయాల్లో వృద్ధి ఇందుకు దోహదపడింది. ఇదే త్రైమాసికంలో నిర్వహణాపరమైన లాభం రూ.1,119 కోట్ల నుంచి రూ.1,586 కోట్లకు పెరిగింది. వడ్డీ ఆదాయం రూ.6,220 కోట్లు కాగా నికర వడ్డీ ఆదాయం 20% పెరిగి రూ.2,378 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) 3.17% ఉంది. ఆర్థిక సంవత్సరం మొత్తం మీద ఎన్ఐఎం 3-3.10% ఉండవచ్చని భావిస్తున్నట్టు బ్యాంక్ సీఈఓ, ఎండీ అశ్వనీ కుమార్ తెలిపారు.



ఫామ్‌గేట్ ధర	వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్		
హైదరాబాద్	127	విజయవాడ	141
వరంగల్	127	గుంటూరు	137
కరీంనగర్	127	ఒంగోలు	137
మహబూబ్‌నగర్	127	చిత్తూరు	109
కర్నూలు	127	నెల్లూరు	114
విశాఖపట్నం	132	అనంతపురం	114
గోదావరి	141		



ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

22వ తేదీ			
హైదరాబాద్	480	విజయవాడ	510
వరంగల్	482	గోదావరి	505
చిత్తూరు	503	విశాఖపట్నం	505
		దజను గుడ్లు రూ. 72	



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	81,250 ▲	74,520 ▲	1,04,000 ▲
విజయవాడ	82,000 ▲	77,500 ▲	93,000 ▼
విశాఖపట్నం	79,320 ▲	72,710 ▲	92,060 ▲
రాజమండ్రి	81,270 ▼	74,500 ▲	94,200 ▲
ప్రొద్దుటూరు	80,150 ▼	74,220 ▼	93,000 ▼
ముంబై	79,453 ▲	72,779 ▲	90,533 ▲

92% లోకలైజేషన్ సాధించాం

హ్యుండయ్



న్యూఢిల్లీ: కార్ల తయారీలో 92 శాతం లోకలైజేషన్ సాధించామని, 1,200 కీలక విడిభాగాలు దేశీయం గానే తయారుచేస్తున్నామని హ్యుండయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ (హెచ్ఎంఐఎల్) ప్రకటించింది. విద్యుత్ వాహనాల బ్యాటరీ ప్యాక్‌లను కూడా దేశంలోనే తయారుచేస్తున్నట్టు వెల్లడించింది. మొబిస్ ఇండియా భాగస్వామ్యంతో తాము చెన్నై ప్లాంట్‌లో బ్యాటరీ ప్యాక్‌ల స్థానిక అసెంబ్లింగ్ చేపట్టినట్టు తెలిపింది. ఈ ప్లాంట్‌లో తయారైన బ్యాటరీ ప్యాక్‌తో మార్కెట్లోకి తెచ్చిన తొలి ఈవీ క్రెటా ఎలక్ట్రిక్ అని పేర్కొంది. ఈ స్థానికీకరణ చర్యల వల్ల 2019 నుంచి 67.2 కోట్ల డాలర్ల (రూ.5,678 కోట్లు) విదేశీ మారక ద్రవ్యం ఆదా అయినట్టు కంపెనీ తెలిపింది.

క్రెటా ఈవీ ధర రూ.17.99 లక్షలు: హెచ్ఎంఐఎల్ క్రెటా ఎలక్ట్రిక్ కారును మార్కెట్లోకి తెచ్చింది. భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పోలో విడుదల చేసిన ఈ కారు ధర రూ.17.99 లక్షలు. రెండు బ్యాటరీ ఆప్షన్లలో ఇది అందుబాటులో ఉంటుంది. ఒకసారి చార్జింగ్‌తో 51.3 కిలోవాట్ల బ్యాటరీ ప్యాక్ కారు 473 కిలోమీటర్లు, 42 కిలోవాట్ల బ్యాటరీ ప్యాక్ కారు 390 కిలోమీటర్లు ప్రయాణిస్తాయి.

లైటింగ్ వ్యాపారంలో ఏటా 20% వృద్ధి

విప్రో కన్స్యూమర్‌కేర్ అండ్ లైటింగ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): విప్రో కన్స్యూమర్ కేర్ అండ్ లైటింగ్.. హైదరాబాద్‌లో మైవిప్రోవెర్స్ ఎక్స్‌క్లూజివ్ షోరూమ్‌ను ఏర్పాటు చేసింది. ఈ షోరూమ్‌ను కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అనుజ్ ధిర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్క్ ప్లేసెస్, ఇతర పారిశ్రామిక విభాగాలకు అవసరమైన సరికొత్త స్మార్ట్ లైటింగ్, సీటింగ్ ఉత్పత్తులను ఇక్కడ అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. దేశంలో ఈ తరహా షోరూమ్‌ను ఏర్పాటు చేయటం ఇదే తొలిసారన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో దేశంలో కొత్తగా 6-7 షోరూమ్స్‌ను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం కంపెనీ లైటింగ్ వ్యాపారం రూ.1,000 కోట్లుగా ఉందని, ఇది ఏటా 15-20 శాతం వృద్ధి చెందుతూ వస్తోందని అనుజ్ తెలిపారు. కాగా మొత్తం వ్యాపారంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల వాటా 15 శాతంగా ఉందన్నారు.

'బ్రాండ్ ఫైనాన్స్'లో భారత ఐటీ దిగ్గజాలు

ఎగుమతుల్లోనే కాదు.. బ్రాండ్ ఫైనాన్సింగ్‌లోనూ భారత ఐటీ కంపెనీలు దూసుకుపోతున్నాయి. బ్రాండ్ ఫైనాన్స్ రూపొందించిన అత్యంత విలువైన ఐటీ బ్రాండ్లలో ఆరు భారత ఐటీ కంపెనీలు టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టెక్ మహీంద్రా, హెక్సావేర్ టెక్నాలజీలకు చోటు దక్కింది. ఈ జాబితాలో 40% బ్రాండ్ వాల్యూతో అమెరికా ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉంది. భారత్ 36% బ్రాండ్ వాల్యూతో రెండో స్థానంలో నిలిచింది.

హైదరాబాద్‌లో హెచ్‌సీఎల్ టెక్ విస్తరణ

5,000 సీట్ల సామర్థ్యంతో కొత్త సెంటర్ ప్రారంభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దేశీయ ఐటీ సేవల కంపెనీ హెచ్‌సీఎల్ టెక్.. హైదరాబాద్‌లో తన కార్యకలాపాలను మరింత విస్తరించింది. నగరంలోని హైటెక్ సిటీలో 5,000 మంది పనిచేయగలిగే సామర్థ్యంతో, 3.20 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంతో కూడిన కొత్త సెంటర్‌ను ప్రారంభించింది. ఈ కార్యాలయం ద్వారా హైటెక్, లైఫ్ సైన్సెస్, ఆర్థిక సేవలు సహా పలు రంగాలకు చెందిన అంతర్జాతీయ క్లయింట్లకు కృత్రిమ మేధ (ఏఐ), క్లౌడ్, డిజిటల్ పరివర్తన పరిష్కారాలను అందించనున్నట్లు కంపెనీ వెల్లడించింది. హెచ్‌సీఎల్ టెక్ 2007 నుంచి హైదరాబాద్‌లో కార్యకలాపాలు సాగిస్తోంది. కొత్త సెంటర్‌తో కలిపి నగరంలోని కంపెనీ కార్యాలయాలు ఐదుకు చేరుకోగా.. సీటింగ్ సామర్థ్యం 8,500కు పెరిగింది.

భాగ్యనగరిలో మెల్ట్‌వాటర్ ఏఐ హబ్

అంతర్జాతీయ మీడియా, సోషల్ అండ్ కన్స్యూమర్ ఇంటెలిజెన్స్ సంస్థ మెల్ట్‌వాటర్.. హైటెక్ సిటీలో ఎమర్జింగ్ ఏఐ హబ్‌ను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. భారత్‌లో కంపెనీకిది నాలుగో కార్యాలయం కానుంది. ఏఐలో రెండు దశాబ్దాల అనుభవం కలిగిన ఈ కంపెనీ.. రోజుకు 150 కోట్ల డిజిటల్ కంటెంట్‌ను విశ్లేషించి, ప్రపంచవ్యాప్తంగా తనకున్న 27,000 మంది కస్టమర్ల వ్యాపార వృద్ధికి అవసరమైన సమాచారంగా మలుస్తుంది.

స్పోర్ట్స్

5 పరుగులకే 5 వికెట్లు



స్పిన్నర్ వైష్ణవి సూపర్ ఫీట్

అండర్-19 మహిళల టీ20 వరల్డ్‌కప్

- యువ భారత్‌కు రెండో విజయం
- 10 వికెట్లతో మలేసియా చిత్తు

కౌలాలంపూర్: అరంగేట్రం లెఫ్టామ్ స్పిన్నర్ వైష్ణవి శర్మ (5/5) హ్యాట్రిక్ సహా ఐదు వికెట్లతో విజృంభించడంతో.. అండర్-19 మహిళల టీ20 వరల్డ్‌కప్‌లో భారత్ వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. మంగళవారం ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో భారత్ 10 వికెట్లతో ఆతిథ్య మలేసియాను చిత్తు చేసింది. మొదట మలేసియా 14.3 ఓవర్లలో 31 పరుగులకే కుప్పకూలింది. వైష్ణవితోపాటు ఆయుషి శుక్లా (3/8) వికెట్ల వేటను కొనసాగించడంతో.. మలేసియా బ్యాటర్ ఒక్కరు కూడా రెండంకెల స్కోరును అందుకోలేక పోయారు. మన బౌలర్లు వేసిన 10 వైడ్‌లతో కలిపి ఎక్స్‌ట్రాలే టాప్ స్కోర్ అంటే ఆధిపత్యం ఏవిధంగా సాగిందో అర్థం చేసుకోవాలి. పిచ్ నుంచి లభిస్తున్న టర్న్, బౌన్స్‌ను సద్వినియోగం చేసుకొన్న శర్మ.. కేవలం 5 పరుగులే ఇచ్చి 5 వికెట్లతో మలేసియా బ్యాటింగ్ వెన్నువిరిచింది. 14వ ఓవర్‌లో నూర్ అయిన్ బింటీ రోస్లాన్ (3), నూర్ ఇస్మా డానియా (0), సీటి నజ్వా (0)ను వరుసగా అవుట్ చేసిన వైష్ణవి ఆడిన తొలి మ్యాచ్‌లోనే హ్యాట్రిక్ నమోదు చేసింది. ఛేదనలో భారత్ 2.5 ఓవర్లలో 32/0 స్కోరు చేసి గెలిచింది. ఓపెనర్లు గొంగడి త్రిష (12 బంతుల్లో 5 ఫోర్లతో 27 నాటౌట్), కమలిని (4 నాటౌట్) 103 బంతులు మిగిలుండగానే జట్టును గెలిపించారు. మొత్తంగా మ్యాచ్ కేవలం 18 ఓవర్ల లోపలే ముగియడం విశేషం.

విండీస్‌పై లంక గెలుపు

వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో శ్రీలంక 81 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత లంక నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 166 పరుగులు చేసింది. మాపేడి ననుఎక్కార (41), సంజన కవింది (39) రాణించారు. ఛేదనలో విండీస్ 19.4 ఓవర్లలో 85 పరుగులకే ఆలౌటైంది. కెప్టెన్ సమార రామ్‌నాథ్ (24) టాప్ స్కోరర్. ఆడిన రెండు మ్యాచ్‌లూ నెగ్గిన భారత్, లంక చెరో 4 పాయింట్లతో సమంగా నిలిచినా.. మెరుగైన రన్‌రేట్‌తో భారత్ టాప్‌లో ఉంది. గురువారం జరిగే లీగ్ ఆఖరి మ్యాచ్‌లో లంకతో భారత్ తలపడనుంది.

'చాంపియన్స్' ముందు ధనాధన్ విందు

జోష్‌లో టీమిండియా
ఇంగ్లండ్‌తో తొలి టీ20 నేడు

రాత్రి 7 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో..



ప్రాక్టీస్‌లో తిలక్, సూర్య, కోచ్ గంభీర్

కోల్‌కతా: ప్రతిష్ఠాత్మక చాంపియన్స్ ట్రోఫీ కోసం అందరూ ఎదురు చూస్తుండగా.. అంతకంటే ముందే భారత్-ఇంగ్లండ్ జట్లు ధనాధన్ పోరుతో అలరించేందుకు సిద్ధమవుతున్నాయి. ఇరు జట్లలోనూ హిట్టర్లకు కొదువ లేకపోవడంతో ఈ ఐదు టీ20ల సిరీస్ ఫ్యాన్స్‌ను మురిపించడం ఖాయమే. ఈడెన్ గార్డెన్స్‌లో బుధవారం తొలి మ్యాచ్ జరుగనుంది. కోహ్లీ, రోహిత్‌లేకున్నా సూర్యకుమార్ నేతృత్వంలోని యువ భారత్ టీ20ల్లో అదరగొడుతోంది. అటు పర్యాటక ఇంగ్లండ్ కూడా యువకులతో నిండి ఉంది. ప్రస్తుత జట్టులోని 8 మంది ఆటగాళ్లకు భారత్‌లో టీ20 మ్యాచ్ ఆడిన అనుభవం లేదు.

అంచనాలను అందుకునేందుకు..: అభిమానులతో పాటు టీమ్ మేనేజ్‌మెంట్ దృష్టంతా ఇప్పుడు పేసర్ మహ్మద్ షమిపైనే ఉంది. 2023 వన్డే వరల్డ్‌కప్‌లో విశేషంగా రాణించిన తను ఆ తర్వాత గాయంతో జట్టుకు దూరమయ్యాడు. సుదీర్ఘ విరామం తర్వాత కోలుకుని దేశవాళీల్లో మెరుగ్గా రాణించి సెలెక్టర్లను ఆకర్షించాడు. దీంతో ఇంగ్లండ్‌తో సిరీస్‌లతో పాటు చాంపియన్స్ ట్రోఫీకి కూడా ఎంపికయ్యాడు. ఈ నేపథ్యంలో తాజా సిరీస్ అతడికి అత్యంత కీలకం కానుంది. ఏడాది తర్వాత తొలి అంతర్జాతీయ మ్యాచ్ ఆడుతుండడంతో షమి మైదానంలో ఎలా రాణిస్తాడనేది తేలాల్సి ఉంది. బుమ్రా గాయంతో బాధపడుతున్న వేళ షమి అంచనాలకు తగ్గట్టు రాణించాల్సి ఉంది. అలాగే తను ఈ ఫార్మాట్‌లో 2022 టీ20 వరల్డ్‌కప్ సెమీస్‌లో చివరిసారి ఆడడం గమనార్హం. ఇక వైస్‌కెప్టెన్ హోదాలోనూ అక్షర్‌కిది తొలి మ్యాచ్ కానుంది. గతేడాది టీ20 మెగా టోర్నీలో తను ఆల్‌రౌండర్‌గా ఆకట్టుకున్నాడు. దక్షిణాఫ్రికాపై వరుసగా రెండు టీ20 సెంచరీలు బాదిన కీపర్ శాంసన్‌తో పాటు తిలక్ వర్మ కూడా భీకర ఫామ్‌లో ఉన్నాడు. ఆసీస్ గడ్డపై టెస్టు సెంచరీ బాదిన నితీశ్ కుమార్ తుది జట్టులో చోటు కోసం ఎదురుచూస్తున్నాడు. కెప్టెన్ సూర్య, రింకూ, హార్దిక్‌లతో కలిపి ఓవరాల్‌గా భారత బ్యాటింగ్ పటిష్ఠంగా కనిపిస్తోంది. అలాగే స్పిన్ త్రయం అక్షర్, వరుణ్, బిష్ణోయ్ ఇంగ్లండ్‌ను కట్టడి చేస్తే ఇక తిరుగే ఉండదు.

తొలిసారి మెకల్లమ్ శిక్షణలో..: పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లో కోచ్ బ్రెండన్ మెకల్లమ్ ఆధ్వర్యంలో మొదటిసారి ఇంగ్లండ్ బరిలోకి దిగబోతోంది. టెస్టుల్లోనే బజ్‌బాల్ గేమ్‌తో ఆట స్వరూపాన్ని మార్చిన మెకల్లమ్ భారత్‌తో పొట్టి పోరుకు ఎలాంటి వ్యూహాలు రచిస్తాడనేది ఆసక్తికరంగా మారింది. ఇంగ్లండ్ తుది జట్టును ప్రకటించడంతో బెన్ డకెట్, ఫిల్ సాల్ట్ ఓపెనర్లుగా రానున్నారు. కేకేఆర్ మాజీ ఆటగాడైన సాల్ట్‌కు ఈడెన్ గ్రౌండ్‌పై చక్కటి అవగాహన ఉంది. టోప్లే, కర్రాన్, విల్ జాక్స్ జట్టులో లేకపోయినా 21 ఏళ్ల జాకబ్ బేథెల్‌పై జట్టు నమ్మకం పెట్టుకుంది. తను ఆడిన ఏడు టీ20ల్లో 57.66 సగటుతో ఉన్నాడు. ఇక షమి మాదిరిగానే గాయం నుంచి కోలుకున్న పేసర్ జోఫ్రా ఆర్చర్ రాణింపుపై పర్యాటక జట్టు దృష్టి సారించింది. మిడిలార్డర్‌లో కెప్టెన్ బట్లర్, బ్రూక్, లివింగ్‌స్టోన్ కీలకం కానున్నారు.



బట్లర్



ఏడాది విరామం తర్వాత బరిలోకి షమి

తుది జట్లు (అంచనా)

భారత్: శాంసన్, అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, సూర్యకుమార్ (కెప్టెన్), హార్దిక్, రింకూ సింగ్, అక్షర్ పటేల్, అర్ష్‌దీప్ సింగ్, రవి బిష్ణోయ్, వరుణ్ చక్రవర్తి, మహ్మద్ షమి.

ఇంగ్లండ్: డకెట్, సాల్ట్, బట్లర్ (కెప్టెన్), బ్రూక్, లివింగ్‌స్టోన్, బేథెల్, ఒవర్టన్, అట్కిన్సన్, ఆర్చర్, ఆదిల్ రషీద్, మార్క్ ఉడ్.

పిచ్, వాతావరణం

గతేడాది ఈడెన్‌లో జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌ల సగటు స్కోరు 198. ఎనిమిది సార్లు ఇక్కడ 200+ స్కోర్లు నమోదు కావడం విశేషం. నేటి మ్యాచ్‌లోనూ పరుగుల వరద పారడం ఖాయమే. మంచు ప్రభావం అధికం కావడంతో టాస్ నెగ్గిన జట్టు బౌలింగ్ తీసుకునే చాన్సుంది.

కుటుంబ సభ్యులు ఉండాల్సిందే..

ఇంగ్లండ్ కెప్టెన్ బట్లర్

కోల్‌కతా: విదేశీ పర్యటనల్లో క్రికెటర్ల వెంట కుటుంబ సభ్యులు ప్రయాణిస్తే వచ్చే నష్టమేమీ ఉండదని ఇంగ్లండ్ కెప్టెన్ జోస్ బట్లర్ అభిప్రాయపడ్డాడు. ఇటీవల బీసీసీఐ తమ ఆటగాళ్ల వెంట కుటుంబాలను తీసుకెళ్లడంపై ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. తీరిక లేని షెడ్యూల్‌తో ఆటగాళ్లు తమ కుటుంబాలకు దూరంగా ఉండాల్సి వస్తోందని, ఈ నేపథ్యంలో వారి చెంత ఫ్యామిలీ ఉంటే మానసికంగా బలంగానూ ఉంటారని తెలిపాడు. కుటుంబ సభ్యులు ఆటపై ప్రభావం చూపుతారని తానైతే అనుకోవడం లేదని బట్లర్ స్పష్టం చేశాడు.

రెండో ర్యాంక్‌కు మంధాన

ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్

దుబాయ్: ఐసీసీ మహిళల వన్డే ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన ఒక స్థానం మెరుగుపర్చుకొని రెండో ర్యాంక్‌కు చేరుకుంది. మంగళవారం ఐసీసీ విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో భారత్ నుంచి టాప్-10లో మంధానకు మాత్రమే చోటు దక్కింది. వోల్వార్ట్ (దక్షిణాఫ్రికా) టాప్‌లో ఉండగా, చమరి ఆటపట్టు (శ్రీలంక) తృతీయ స్థానం దక్కించుకుంది. బౌలర్ల ర్యాంకింగ్స్‌లో దీప్తి శర్మ నాలుగో స్థానానికి చేరగా, 1, 2 స్థానాల్లో ఎకెల్‌స్టోన్ (ఇంగ్లండ్), గార్డ్‌నర్ (ఆస్ట్రేలియా) ఉన్నారు.

హరి గెలుపు.. అర్జున్ ఓటమి

వికాన్ జీ (నెదర్లాండ్స్): టాటా స్టీల్ చెస్ మాస్టర్స్ విభాగంలో తెలుగు గ్రాండ్ మాస్టర్లు అర్జున్ ఇరిగేసి, పెంటేల హరికృష్ణకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. అర్జున్ ఓడగా.. హరికృష్ణ రెండో విజయాన్ని నమోదు చేశాడు. మంగళవారం జరిగిన నాలుగో రౌండ్‌లో అర్జున్‌పై వ్లాదిమిర్ ఫెడోసీవ్ (స్లోవేనియా) గెలిచాడు. వార్‌మెర్డమ్ (నెదర్లాండ్స్)తో గేమ్‌లో తెల్ల పావులతో ఆడిన హరి.. 23 ఎత్తుల్లోనే ప్రత్యర్థి ఆటకట్టించాడు. సహచరుడు లియాన్ మెన్డోన్కాపై ప్రజ్ఞానంద గెలిచాడు. చాలెంజర్స్ విభాగంలో నోదిర్‌బెక్ యాకుబ్‌బొయేవ్ (ఉజ్బెకిస్థాన్)పై వైశాలి నెగ్గింది.

జొకో జోరు



జొకోవిచ్

అల్కారజ్

- అల్కారజ్‌పై గెలుపుతో సెమీస్‌కు
- జ్వెరెవ్, సబలెంక, బడోసా కూడా..
- ఆస్ట్రేలియన్ ఓపెన్ నుంచి గాఫ్ అవుట్

మెల్‌బోర్న్: కెరీర్‌లో 25వ గ్రాండ్‌స్లామ్ రికార్డు వేటలో ఉన్న సెర్బియా యోధుడు నొవాక్ జొకోవిచ్ ఆ దిశగా మరో అడుగేశాడు. కాలి నొప్పితో ఇబ్బంది పడుతున్నా, అద్భుతంగా పోరాడిన జొకో.. టైటిల్ ఫేవరెట్, మూడో సీడ్ కార్లోస్ అల్కారజ్‌ను ఓడించి ఆస్ట్రేలియన్ ఓపెన్ సెమీస్‌కు దూసుకెళ్లాడు. మెల్‌బోర్న్‌లో 11వ టైటిల్‌కు రెండడుగుల దూరంలో నిలిచాడు. మహిళల డిఫెండింగ్ చాంప్ అర్యానా సబలెంక, రెండో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ కూడా ఫైనల్-4లోకి అడుగుపెట్టారు. మంగళవారం మూడున్నర గంటలకుపైగా జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో ఏడో సీడ్ జొకో 4-6, 6-4, 6-3, 6-4తో అల్కారజ్‌పై గెలిచి, 12వ సారి ఈ టోర్నీ సెమీస్‌లోకి అడుగుపెట్టాడు. మరో క్వార్టర్స్‌లో జ్వెరెవ్ 7-6(1), 7-6(0), 2-6, 6-1తో 12వ సీడ్ టామీ పాల్‌పై చెమటోడ్చి నెగ్గాడు. శుక్రవారం జరిగే సెమీస్‌లో జొకోతో టామీ పాల్ అమీతుమీ తేల్చుకోనున్నాడు.

సబలెంక కష్టంగా..: మహిళల టాప్ సీడ్ సబలెంక 6-2, 2-6, 6-3తో అనస్టాసియా పవ్లుచెన్‌కొవా (రష్యా)పై పోరాడి గెలిచింది. మరో మ్యాచ్‌లో మూడో సీడ్ కొకొ గాఫ్ (అమెరికా) 5-7, 4-6తో పౌలా బడోసా (స్పెయిన్) చేతిలో ఓడింది. గురువారం జరిగే సెమీస్‌లో సబలెంకతో బడోసా తలపడనుంది. కాగా మిక్స్‌డ్ డబుల్స్‌లో రోహన్ బోపన్న జంట పోరాటం ముగిసింది. క్వార్టర్స్‌లో బోపన్న-జాంగ్ షుఐ (చైనా) జోడీ 6-2, 4-6, 9-11తో జాన్ పీర్స్-ఒలీవియా గడెకీ జంట చేతిలో పరాజయం పాలైంది.

సాత్విక్ జోడీ శుభారంభం

'ఇండోనేసియా మాస్టర్స్'లో శ్రీకాంత్‌కు నిరాశ

జకార్తా: సొంతగడ్డపై ఇండియా ఓపెన్‌లో నిరాశపరిచిన భారత స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ శెట్టి ఇండోనేసియా మాస్టర్స్‌లో శుభారంభం చేసింది. మంగళవారం జరిగిన డబుల్స్ మ్యాచ్‌లో సాత్విక్/చిరాగ్ జంట 21-16, 21-15తో చైనీస్ తైపీ జోడీ చెన్ జి/లిన్ యుపై గెలిచి రెండోరౌండ్ చేరింది. మహిళల డబుల్స్‌లో భారత ద్వయం అశ్వినీ పొన్నప్ప/తనీషా క్యాస్ట్రో 21-6, 21-14తో థాయ్‌లాండ్ జోడీ ఒర్నిచా/సుకితాపై నెగ్గి రెండో రౌండ్లో ప్రవేశించింది. పురుషుల సింగిల్స్‌లో మాజీ ప్రపంచ నెంబర్‌వన్ కిడాంబి శ్రీకాంత్ క్వాలిఫయింగ్ రౌండ్లోనే వెనుదిరిగాడు. భారత్‌కే చెందిన ఆయుష్ శెట్టి 21-7, 21-15తో శ్రీకాంత్‌ను చిత్తుచేసి మెయిన్ డ్రాకు చేరాడు. మహిళల సింగిల్స్‌లో తాన్యా హేమంత్ మెయిన్ డ్రాకు అర్హత సాధించింది.

మా జెర్సీలపై పాక్ పేరు వద్దు

బీసీసీఐ



న్యూఢిల్లీ: చాంపియన్స్ ట్రోఫీ లో మరో వివాదం చోటు చేసుకుంది. ఈ మెగా టోర్నీకి ఆతిథ్యమిస్తున్న పాకిస్థాన్ పేరును తమ జెర్సీలపై ముద్రించడంపై భారత క్రికెట్ బోర్డు (బీసీసీఐ) అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈమేరకు ఐసీసీకి విజ్ఞప్తి చేసినట్టు సమాచారం. సాధారణంగా ఐసీసీ టోర్నీలు జరిగే సమయంలో ఆ టోర్నీ పేరుతోపాటు, నిర్వహించే దేశం పేరు కూడా ఆయా జట్ల జెర్సీలపై ముద్రించడం పరిపాటి. అయితే క్రికెట్‌లో రాజకీయాల్ని చొప్పించేందుకు బీసీసీఐ ప్రయత్నిస్తోందని పాక్ క్రికెట్ బోర్డు ఆగ్రహం వ్యక్తం చేసింది.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
బుధవారం • 22 జనవరి 2025



అభిరుచి

సకుటుంబ సమేతంగా

ముగ్గురు పిల్లల ఆలనా పాలనా చూసుకొంటూ, గృహిణిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ... ఏ కార్పొరేట్ కొలువుకూ తీసిపోనంతగా సంపాదిస్తోంది కొమ్ముల సౌమ్యారెడ్డి ఉరఫ్ సౌమ్య. స్వతంత్రంగా ఎదగాలన్న పట్టుదల... తనకంటూ గుర్తింపు తెచ్చుకొని... గృహిణులకు స్ఫూర్తిమంత్రం కావాలన్న తపన... ఇవే ఆమెను ప్రత్యేకంగా నిలబెట్టాయి. 'వి5 ఫ్యామిలీ షో' యూట్యూబ్ చానల్ నెలకొల్పి... రెండేళ్లలో కోటిమంది సబ్‌స్క్రైబర్స్‌ను సంపాదించుకున్న సౌమ్య కథ ఇది.

"ఆర్గానిక్ కెమిస్ట్రీలో పీజీ చేశాను. ఇష్టపడి చదివి ఇంట్లో కూర్చోవడం... అదీ ఒక సాధారణ గృహిణిగా మిగిలిపోవడం... నాకు అస్సలు నచ్చలేదు. తలుచుకున్నప్పుడల్లా ఒకటే దిగులు. నాకంటూ ఒక గుర్తింపు లేదనే బాధ. ఏదో వెలితిగా ఉండేది. కుటుంబ బాధ్యతల నేపథ్యంలో బయటకు వెళ్లి ఉద్యోగం చేసే అవకాశం లేదు. మరి ఎలా? పిల్లల్ని చూసుకొంటూ, ఇంట్లో నుంచే ఏదైనా చెయ్యాలని అనుకున్నాను. అలా ఆలోచిస్తుంటే తట్టిందే యూట్యూబ్. అయితే చానల్ ఎలా ప్రారంభించాలనేది నాకు తెలియదు. ఇంటర్నెట్‌లో వెతికాను. చాలా విషయాలపై అవగాహన వచ్చింది. చివరకు 2018లో 'వి5 ఫ్యామిలీ షో- తెలుగు' పేరిట యూట్యూబ్ చానల్ ప్రారంభించాను. ఈ నేపథ్యంలో ఒక రోజు పేపర్‌లో వచ్చిన ఓ యూట్యూబర్ ఇంటర్వ్యూ నన్ను బాగా ఆకట్టుకుంది. ఒక తల్లి ఆడుకొంటున్న తన పిల్లల వీడియోలు సామాజిక మాధ్యమాల్లో పెట్టిందని, తరువాత అదే ఆమెకు ఆదాయ వనరుగా మారిందనేది దాని సారాంశం. ఆ స్ఫూర్తితో నా ముగ్గురు పిల్లల ఆటపాటలను కంటెంట్‌గా తీసుకుందామని అనుకున్నా. కానీ వాళ్ల వీడియోలు పెడతానంటే... 'ఇబ్బందులు ఏవైనా ఎదురవుతాయేమో' అని మావారు సందేహం వ్యక్తం చేశారు. దాంతో మళ్లీ ఆలోచనలో పడ్డాను. తరువాత రకరకాల రూబిక్ క్యూబ్స్‌ను ఎలా పరిష్కరించాలో చెబుతూ చిన్న చిన్న చిట్కాలతో వీడియో ఒకటి అప్‌లోడ్ చేశాను. అందరికంటే నేను బాగా వివరించి చెబుతున్నానని, నా వీడియోల కోసం పిల్లలు వేచి చూస్తున్నారని... ఇలా చాలామంది కామెంట్లలో రాశారు. అవి నాకు ఎంతో ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చాయి.

పిల్లల్ని చూసుకొంటూనే...

నా వీడియోలకు మంచి కామెంట్స్ అయితే వచ్చాయి కానీ అనుకున్నంత ఆదరణ లభించలేదు. ఒకరోజు యూట్యూబ్‌లో సాయి రమేష్ గారి ఇంటర్వ్యూ ఒకటి చూశాను. ఆయన్ను కలిశాక ఎలాంటి కంటెంట్ పెట్టాలనే దానిపై అవగాహన వచ్చింది. అప్పుడు మా పిల్లలు చాలా చిన్నవారు. వాళ్లు బడికి వెళ్లడం మొదలయ్యాక చానల్‌పై పూర్తి శ్రద్ధ పెడదామని అనుకున్నా. అదే సమయంలో కరోనా వచ్చింది. రెండేళ్ల విరామం తరువాత 2023 ఫిబ్రవరిలో కొత్త చానల్ ప్రారంభించాను. పాత చానల్ పేరులో 'తెలుగు' తీసేసి 'వి5 ఫ్యామిలీ షో' అని పెట్టుకున్నా.

ఇంట్లో జరిగే ఘటనలే...

నా కంటెంట్‌లో ఎక్కువగా ఇంట్లో అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ల మధ్య జరిగే చిన్న చిన్న గొడవలు, కుటుంబంలో కనిపించే భావోద్వేగాలు, నీతి కథలతో పాటు పిల్లలకు వండిపెట్టే వంటలకు సంబంధించిన అంశాలు ఉంటాయి. అంటే ఇంట్లో నిత్యం జరిగే ఘటనలనే ఒక చిన్న వీడియోలో సరదాగా చూపించే ప్రయత్నం. తద్వారా చిన్నారులకు ఈ సమాజం గురించి, మానవ సంబంధాలు, విలువల గురించి తెలియజెప్పడం నా ఉద్దేశం. నాకు ముగ్గురు పిల్లలు. పెద్దవాడి పేరు కృష్ణప్రీతమ్. ఎనిమిదవ తరగతి చదువుతున్నాడు. చిన్నోడు సౌర్యనందన్ ఐదు, పాప... దియా 2వ తరగతిలో ఉన్నారు. మావారు వెంకట్‌రెడ్డి ట్యాక్స్ కన్సల్టెంట్. సొంత వ్యాపారం నిర్వహిస్తున్నారు. మా కంటెంట్‌లో మా పిల్లలు, నేను, మావారితో పాటు మా అత్తమ్మ, అమ్మ కూడా కనిపిస్తుంటారు.

కోటి దాటింది...

యూట్యూబ్‌లో మా కంటెంట్ సూపర్ హిట్ అయింది. చానల్ ప్రారంభించి ఇంకా రెండేళ్లు పూర్తి కాలేదు. కానీ సబ్‌స్క్రైబర్స్ సంఖ్య కోటి దాటింది. ప్రస్తుతం మా చానల్‌కు 10.4 మిలియన్లమంది సబ్‌స్క్రైబ్ చేశారు. రోజుకు దాదాపు ముప్పై వేల మంది కొత్తవారు వస్తున్నారు. వరుసగా ఐదారు రోజులు మంచి వీడియోలు పడితే సబ్‌స్క్రైబర్స్ కూడా పెరుగుతారు. ఇప్పటివరకు 800కు పైగా వీడియోలు అప్‌లోడ్ చేశాను. నేను పెట్టిన 'ఈజీ గణేష్ డ్రాయింగ్' వీడియోను అత్యధికంగా నాలుగు కోట్లమందికి పైగా చూశారు. గణేష్ డ్రాయింగ్‌ను సులువుగా ఎలా వేయాలో అందులో చూపించాను. డ్రాయింగ్, డ్యాన్సింగ్, పేరెంటింగ్, పిల్లల హ్యాండ్ రైటింగ్... ఇలా ఎన్నో విషయాలు యూట్యూబ్‌లో చెబుతుంటాను. ఇంకో విశేషమేమంటే... మా చానల్‌ను రోజుకు దాదాపు మూడు కోట్ల మంది వీక్షిస్తారు. భారత్‌లోని టాప్600 యూట్యూబ్ చానల్స్‌లో మాది ఒకటి.

మా స్టార్ తనే...



మా చానల్ విజయవంతం కావడానికి ప్రధాన కారణం విభిన్నమైన కంటెంట్. అలాగే మా అమ్మాయి. తనకు అభిమానులు ఎక్కువ. మాలో స్టార్ తనే. ఇక మా షార్ట్ వీడియోల్లో మాటలు ఉండవు. నటనతోనే కథ చెబుతాను. అందుకే సబ్‌స్క్రైబర్స్‌లో తెలుగు వారే కాకుండా ఇతర దేశాలవారు కూడా ఉన్నారు. షూటింగ్, ఎడిటింగ్, టైటిలింగ్ తదితర పనులన్నీ నేనే చేసుకొంటాను. ఎక్కువ భాగం మొబైల్‌తోనే షూట్ చేస్తాం. ఇక్కడ మన ఆలోచనలు, సృజనాత్మకతే పెట్టుబడి. యూట్యూబ్ చానల్ పెట్టాలనుకున్న మహిళలకు నేను చెప్పేది ఏంటంటే... మన నైపుణ్యం ఏంటో మనం తెలుసుకోవాలి. దానికి పదును పెట్టి, విభిన్నంగా, వినూత్నంగా ఆలోచించాలి. అప్పుడే మంచి కంటెంట్ వస్తుంది.

అదే అతిపెద్ద సవాలు...

మా పిల్లలు చదువులోనూ, ఆటల్లోనూ ఫస్టే. వీడియోల్లో నటించినంతమాత్రాన వాళ్ల చదువు పాడైపోతుందని కొందరు అనుకొంటారు. అలాంటిదేమీ లేదు. రోజుకు ఒక గంట వారు దీనికి కేటాయిస్తారు. ఆటలు, చదువులో వాళ్లు సాధించిన మెడల్స్, సర్టిఫికెట్లు అన్నీ మా చానల్‌లో చూపిస్తుంటాను. అన్నం తిన్నా తినకపోయినా... నిద్రపోయినా పోకపోయినా రోజూ ఒక వీడియో పెట్టాల్సిందే. మా చానల్ ఇంత వేగంగా అభివృద్ధి సాధించడానికి కారణం అదే. కానీ ఇది అంత సులువు కాదు. ప్రతి రోజూ కంటెంట్ తేవడమే ఒక సవాలైతే... అందులో కొత్తదనం ఉండేలా చూసుకోవడం, అదీ ఆకట్టుకొనేలా రూపొందించడం అతి పెద్ద సవాలు. వీటన్నిటినీ అధిగమించాను కనుకనే ఇవాళ నా పేరు ఇంతమందికి పరిచయమయింది.

నా సంకల్పం నెరవేరింది...

మాది ఒక సాధారణ మధ్యతరగతి కుటుంబం. సిరిసిల్ల జిల్లా ముస్కానిపేట్ స్వస్థలం. మా అమ్మ లక్ష్మి, నాన్న నర్సింహారెడ్డి... వ్యవసాయం చేసేవారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూనే మా అన్నయ్యను ఎంబీబీఎస్ చదివించారు. అన్నయ్య కూడా అంతే కష్టపడి డాక్టర్ అయ్యాడు. ఇప్పుడు అపోలోలో ఒక టీమ్‌ను లీడ్ చేస్తాడు. తన గురించి ఎప్పుడూ గొప్పగా చెప్పుకొంటా. కానీ నేను ఏమీ సాధించలేదన్న వెలితి నాలో ఉండేది. పీజీ మొదటి సంవత్సరంలో ఉండగానే నాకు పెళ్లయింది. తరువాత చదువు కొనసాగించాను.2010లో పీజీ పూర్తయ్యాక హైదరాబాద్‌కు వచ్చేశాను. కానీ ఉద్యోగాలేవీ చేయలేదు. పదేళ్లు పిల్లలతోనే సరిపోయింది. వెనక్కి తిరిగి చూసుకొంటే నేనంటూ సాధించిందేమీ లేదు. 'గృహిణి అయినంతమాత్రాన ఏమీ చేయలేమా?' అనే ఆలోచన నాకు నిద్రపట్టనివ్వలేదు. అంకితభావంతో ప్రయత్నిస్తే అనుకున్నది సాధించవచ్చని చెప్పాలనుకున్నా. నాలాంటి గృహిణులు అందరికీ ఒక స్ఫూర్తిమంత్రం అవ్వాలని కోరుకున్నా. ఆ సంకల్పంతోనే నన్ను నేను నిరూపించుకున్నాను. ఇవాళ సొంత వ్యాపారం చేస్తున్న మావారితోనే కాదు... డాక్టర్ అయిన మా అన్నయ్యతో కూడా పోటీపడి సంపాదిస్తున్నా. మా పిల్లలకు నెల నెలా జీతం ఇస్తున్నా. ఇల్లు, భర్త, పిల్లలు... అన్నిటినీ చూసుకొంటూ నాకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్నా. ఇంతకు మించిన సంతృప్తి, సంతోషం ఇంకేముంటుంది!"

• హనుమా

చెవి రంధ్రాలు సాగితే...

ఫ్యాషన్‌లో భాగంగా మహిళలు రకరకాల చెవి పోగులు, జుంకాలు, హ్యాంగింగ్స్ పెట్టుకుంటూ ఉంటారు. వీటి బరువు వల్ల చెవి రంధ్రాలు క్రమంగా పెద్దవై సాగుతుంటాయి. అలాంటప్పుడు చెవులకు ఆభరణాలు వేలాడకుండా అందంగా అమరేలా కొన్ని చిట్కాలు పాటించవచ్చు.

- బరువైన జుంకాలు, లోహాలతో రూపొందించిన కమ్మలు పెట్టుకునేటపుడు సిలికాన్‌తో తయారు చేసిన ఇయర్ లోబ్ ప్యాడ్స్‌ను ఉపయోగించాలి. ఇవి ఆధారంగా నిలిచి ఆభరణం వేలాడకుండా చెవి తమ్మె మీద పూర్తిగా అమరేలా చేస్తాయి.
- కర్ణాభరణాలకు బ్యాక్ స్టాపర్ స్థానంలో డబుల్ స్టాపర్‌ను ఉపయోగిస్తే జారకుండా నిలబడతాయి.
- చెవి క్లిప్ ఉన్న జుంకాలు ఎంచుకోవడం మంచిది. ఇవి రంధ్రం మీద బరువు పడనీయకుండా చెవి మీద నిటారుగా నిలుస్తాయి.
- చూడడానికి భారీగా కనిపిస్తున్నప్పటికీ అంత బరువు లేని కర్ణాభరణాలు ప్రస్తుతం విరివిగా లభ్యమవుతున్నాయి. వీటిని ఎంపిక చేసుకుంటే చెవి రంధ్రాలు కనపించవు. అంతేకాదు రంధ్రాలు మరింత సాగకుండా ఉంటాయి.





- రాళ్లతో నిండిన బరువైన జుంకాలను ఎక్కువ సేపు ధరించవద్దు. నిద్రించేముందు, స్నానం చేసే ముందు చెవి ఆభరణాలను తీయాలి.
- చెవులకు కమ్మలు పెట్టుకునేముందు రంధ్రం మీద కొబ్బరి నూనె లేదంటే బాదం నూనె రాసి మెల్లగా మర్దన చేయాలి. దీనివల్ల కండరాలు బిగుతుగా మారి ఆభరణాలను జారనివ్వవు. ఇ-విటమిన్ నూనె రాసినా కూడా మంచి ఫలితం కనిపిస్తుంది.
- గుప్పెడు వేపాకులను తీసుకుని ముద్దగా నూరి దానిలో అరచెంచా పసుపు కలిపి ఈ మిశ్రమాన్ని చెవి రంధ్రం మీద రాయాలి. ఇలా తరచూ రాస్తే చర్మం పెరిగి రంధ్రం చిన్నగా మారుతుంది.
- చెవి రంధ్రం బాగా పెద్దదై సాగిపోతే వైద్యుని సలహా మేరకు కుట్లు వేయించుకోవాలి.

పిల్లలు బాగా చదవాలంటే..

పిల్లలు శ్రద్ధగా చదువుకుని ఉన్నతస్థానానికి ఎదగాలని తల్లిదండ్రులు కోరుకుంటారు. అందుకు పిల్లలను చదువులో ప్రోత్సహిస్తూ కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే సత్ఫలితాలు వస్తాయంటున్నారు నిపుణులు.

- పిల్లలు చదువుకునేటప్పుడు ఇంట్లో ప్రశాంతంగా, సౌకర్యవంతంగా ఉండేలా చూసుకోవాలి. చదువుపై నుంచి వారి దృష్టి మళ్లకుండా జాగ్రత్త వహించాలి.
- చదువుకునే సమయంలో టీవీ పెట్టకూడదు. ఫోన్ మోగినా వాళ్లకి వినిపించనంత దూరంలో ఉంచుకోవాలి. అప్పుడే ఏకాగ్రత పెరుగుతుంది.
- పిల్లలకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, పెన్స్, పెన్సిల్స్, రబ్బర్, షార్ప్‌నర్, నోట్‌బుక్స్, వైట్ పేపర్స్, డిజిటల్ టూల్స్ వంటివి అందుబాటులో ఉంచాలి.



- పిల్లలకు ఓ టైమ్‌టేబుల్ ఇవ్వాలి. పాఠశాలలో ఇచ్చే హోమ్‌వర్క్‌లు, ప్రాజెక్ట్ వర్క్‌లను పరిగణనలోకి తీసుకుంటూ ఏవి ముందు పూర్తిచేయాలో చెప్పాలి.
- పాఠాలను పాయింట్ల వారీగా చదువుకుంటూ సులువుగా గుర్తుంచుకునే విధానాన్ని నేర్పించాలి.
- అదేపనిగా చదవమని చెప్పకుండా మధ్యలో కొద్దిగా విరామం ఇవ్వాలి. దీనివల్ల వారి మెదడుపై ఒత్తిడి తగ్గుతుంది. జ్ఞాపకశక్తి పెరుగుతుంది.
- పరీక్షల్లో మార్కులు తక్కువగా వచ్చినా, ఉత్తీర్ణులు కాలేకపోయినా పిల్లలపై కోపం ప్రదర్శించకుండా మరోసారి ప్రయత్నించమని చెబుతూ ప్రోత్సహించాలి.
- మార్కులు ఎలా వచ్చినా వాటి గురించి కాకుండా పిల్లలు చేసిన కృషిని మెచ్చుకోవాలి.
- పిల్లలు క్రమశిక్షణతో చదివి మంచి మార్కులు తెచ్చుకున్నపుడు... వారిని మనస్ఫూర్తిగా ప్రశంసించాలి.

వారి వేదనకు ఉపశమనంగా..

అనస్థీషియాలజిస్టుగా క్యాన్సర్ రోగుల బాధ, వారి బంధువుల వేదన గమనించి తీవ్రంగా కదిలిపోయారు డాక్టర్ మామి పరిజా. వారికి ఉపశమనం కలిగించడానికి ఆమె చేపట్టిన ప్రయత్నం... 800కు పైగా కుటుంబాలకు అండగా నిలిచింది. ఒడిశాకు చెందిన మామి పరిజా సేవా ప్రయాణం గురించి ఆమె మాటల్లోనే...



"డాక్టర్! నా కణితిని తొలగిస్తే ప్రమాదం ఏదైనా ఉంటుందా? ఆపరేషన్ తరువాత అంతా బాగుంటుందా? ఇంకొన్నాళ్ళు బతుకుతానా? నా నొప్పి తగ్గిపోతుందా?... ఆపరేషన్ థియేటర్‌లో రోగులతో, వారి బంధువులతో జరిగే సంభాషణలో నాకు ఎదురయ్యే ప్రశ్నలివి. వాటికి నా దగ్గర సమాధానం ఉండేది కాదు. ఆ రోగుల పరిస్థితిని తలచుకొని నాకు రాత్రిళ్ళు నిద్రపట్టేది కాదు. వివిధ దశల్లో శస్త్రచికిత్సలు చేయించుకొనే ఆ రోగులు నా కళ్ళ ముందు కదులుతూ ఉండేవారు.

పదే పదే అదే ఆలోచన...

మాది ఒడిశాలోని భువనేశ్వర్. అక్కడే వివిధ ఆసుపత్రుల్లో అనస్థీషియాలజిస్ట్‌గా పని చేశాను. క్యాన్సర్ రోగులను చూస్తున్నప్పుడు 'వారి బాధను తగ్గించే మార్గం ఏదీ లేదా?' అనే ఆలోచన నా మనసులో పదే పదే తిరుగుతూ ఉండేది. ఆ దిశగా ఒక ఆచరణీయమైన మార్గం కోసం వెతుకుతున్న సమయంలో... నా బాల్య స్నేహితురాలు నమ్రత మా ఆసుపత్రికి వచ్చింది. రోగుల్ని చూసి ఆమె తీవ్రంగా చలించిపోయింది. అప్పుడే నా ఆలోచనలను ఆమెతో పంచుకున్నాను. "దీనికి పరిష్కారం ఏమిటి?" అని అడిగింది తను. "పేద, దిగువ మధ్య తరగతి కుటుంబాలకు చెందిన రోగులకు ఎక్కువకాలం ఆసుపత్రుల సంరక్షణలో ఉండే ఆర్థిక స్తోమత ఉండదు. వాళ్ళకు నిపుణుల పర్యవేక్షణలో పెయిన్ మేనేజిమెంట్, ఉపశమన సేవలు అవసరం. ఇళ్ళ దగ్గర అవి లభించడం కష్టం. ప్రత్యేకంగా ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేసి... ఈ సేవలు అందిస్తే వారికి ఊరటగా ఉంటుంది. కానీ దానికి ఖర్చవుతుంది. మానవ వనరులు కూడా అవసరం అవుతాయి" అని చెప్పాను. "ఈ ఊర్లో నాకు ఒక ఇల్లుంది. సిబ్బంది సంగతి నువ్వు చూసుకుంటానంటే... ఆ ఇంట్లో మనం ఒక కేంద్రాన్ని ప్రారంభించవచ్చు" అంది నమ్రత. అలా 2012లో... కొద్దిమంది రోగులతో మా చిన్న ప్రయత్నం ప్రారంభమయింది. ఈ సంగతి తెలిసి మరికొందరు మిత్రులు మాతో కలిశారు.

ఆ సంఘటనలు ఆవేదన కలిగించాయి...

మొదట్లో మా 'పాలియేటివ్ కేర్ సెంటర్'... అవుట్‌పేషెంట్ విభాగంగా పని చేసేది. వచ్చిన రోగులకు కౌన్సెలింగ్ చేసేవాళ్ళం. వ్యాధి నియంత్రణకోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారికీ, వారి కుటుంబ సభ్యులకు వివరించేవాళ్ళం. నొప్పి నివారణ మందులను పంపిణీ చేసేవాళ్ళం. క్యాన్సర్ తొలిదశలో ఉన్నవారిని నిపుణులు ఉన్న ఆసుపత్రులకు రిఫర్ చేసి, ఆయా యాజమాన్యాల సహకారంతో చికిత్సలకు సాయపడేవాళ్ళం. కానీ ఈ క్రమంలో మాకు కొన్ని చేదు అనుభవాలు ఎదురయ్యాయి. అవగాహన లోపం,



చికిత్సలు మధ్యలో మానెయ్యడం, శస్త్రచికిత్సల తరువాత తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల కొందరు రోగులు మరణించిన సంఘటనలు ఆవేదన కలిగించాయి. దీంతో క్యాన్సర్ బాగా ముదిరిన దశలో ఉన్నవారికి, శస్త్ర చికిత్సలు చేయించుకున్నవారికి పూర్తిస్థాయిలో ఉపశమన సేవలను అందించడం కోసం... 'అమృతధార ట్రస్ట్' పేరిట ఒక సంస్థను 2019లో ఏర్పాటు చేశాం.

ఉపశమనం, స్వస్థతే ధ్యేయం...

ప్రస్తుతం భువనేశ్వర్‌లో మాకు రెండు కేంద్రాలున్నాయి. రోగులు బస చేయడానికి వసతి ఉంది. డేకేర్ విభాగంలో తీవ్రమైన నొప్పులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, క్యాన్సర్ గాయాలకు డ్రెస్సింగ్, ఇతర ప్రక్రియలు నిర్వహిస్తున్నాం. మాకు ప్రత్యేకంగా ఒక ఫార్మసీ కూడా ఉంది. మా నర్సులు రోగులకు రోజూ కాల్ చేసి... వారి పరిస్థితి గురించి వివరాలు తెలుసుకుంటారు. వాటిని ఎప్పటికప్పుడు నమోదు చేస్తారు. రోగులు రాలేని పక్షంలో... మా సిబ్బంది వారి ఇళ్ళకు వెళ్తారు. డేకేర్, హోమ్ విజిట్స్ ద్వారా నొప్పి నిర్వహణ, మందులు వేసుకోవడంలో సహాయం, పరిశుభ్రతను పాటించేలా చేయడం, క్యాన్సర్ విషయంలో ఉన్న అపోహలను, భయాన్ని తొలగించడం, కౌన్సెలింగ్ సేవలను మేము అందిస్తున్నాం. ఇప్పటివరకూ 800కు పైగా కుటుంబాలు మా సాయాన్ని అందుకున్నాయి. మృతి చెందిన రోగుల కుటుంబాలకు కూడా వివిధ మార్గాల్లో సాయం అందేలా చూస్తున్నాం. ట్రస్ట్‌కు అయ్యే ఖర్చు మొత్తాన్ని మా సభ్యుల కుటుంబాలు, స్నేహితులు, శ్రేయోభిలాషుల ద్వారా సమకూర్చుకుంటున్నాం. కిందటి ఏడాది ... ఒడిశా మాజీ సీఎం నవీన్ పట్నాయక్ చేతుల మీదుగా 'దేవి' పురస్కారం అందుకున్నాను. పలు ఇతర సంస్థల నుంచి కూడా మా సంస్థకు గుర్తింపు లభించింది. రోగులకు ఉపశమనం, స్వస్థత కలిగించాలనే మా సంకల్పాన్ని ఇవన్నీ బలోపేతం చేస్తున్నాయి. ఒడిశా అంతటా, భవిష్యత్తులో ఇతర ప్రాంతాల్లో సమగ్రమైన ఉపశమన చికిత్సను అందించాలన్నది మా లక్ష్యం."

ఫ్యాషన్



శ్వేత సౌధంలో కాంచీపురం ధగధగలు

అమెరికా కొత్త అధ్యక్షుడు ట్రంప్ పదవీ ప్రమాణ స్వీకారానికి హాజరైన నీతా అంబానీ, ఎప్పటిలాగే భారతీయ సంప్రదాయం ఉట్టిపడే వస్త్రధారణలో మెరిసిపోయారు. ఈ వేడుక సందర్భంగా ఆమె ఎంచుకున్న కాంచీపురం పట్టుచీర, 18వ శతాబ్దం నాటి వారసత్వ ఆభరణాల సొగసుల విశేషాలు ఈ వారం ఫ్యాషన్ ప్రత్యేకం!

వారసత్వ సంపద ఉట్టిపడేలా...

కాంచీపురం ఆలయ వైభవాలకు అద్దం పట్టే, వందకు పైగా ప్రత్యేక మోటిఫ్స్‌తో రూపొందిన కాంచీపురం పట్టుచీర, 18వ శతాబ్దం నాటి వారసత్వ ఆభరణాలు ధరించి... భారతీయ సంప్రదాయ వైభవాన్ని అంతర్జాతీయ వేదికపై ఘనంగా ఆవిష్కరించారు రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీ సతీమణి నీతా అంబానీ. జాతీయ అవార్డు విజేత, చేనేత కళాకారుడు బి.కృష్ణమూర్తి రూపొందించిన ఈ చీరలో ఇరుతలైపాక్షి (విష్ణువును సూచించే రెండు తలల గద్ద), మయిల్ (అమరత్వం, దైవత్వానికి సూచన), భారతీయ జానపద కథల విశిష్టత) పౌరాణిక సౌర్గవాసల్ జంతు బాటలతో కూడిన సూక్ష్మమైన, క్లిష్టమైన మోటిఫ్స్ ఉన్నాయి. ఈ అద్భుతమైన చీరకు తనదైన శైలిలో రూపొందించిన వెల్వెట్ బ్లౌజ్‌తో ప్రముఖ డిజైనర్ సమకాలీన హంగును జోడించడం మరొక విశేషం.



విలువైన జాతి రాళ్లతో...

కాంచీపురం చీరలు విలాసవంతమైన, అత్యంత అద్భుతమైన కళాకృతులు. వీటికి సరిజోడుగా ఎంచుకునే ఆభరణాలు కూడా అంతే హుందాతనాన్ని ప్రతిబింబించేలా ఉండాలి. కాబట్టే 200 ఏళ్లనాటి అరుదైన భారతీయ శైలితో రూపొందిన ఆభరణాలను ఎంచుకున్నారు నీతా అంబానీ. పచ్చలు, గోమేధికాలు, వజ్రాలు, ముత్యాలు పొదిగిన చిలుక ఆకారంలో కుందన్ శైలిలో రూపొందిన పెండెంట్‌ను ఆమె ధరించారు. నలుపు రంగు కాంచీపురం చీర, పాతకాలపు నగలతో, నీతా అంబానీ వేడుకలో మెరిసిపోయారు. కాంచీపురం చీరలు ప్రత్యేకించి సంప్రదాయ వేడుకలకు ఎంతో బాగా నప్పుతాయి. ప్రస్తుతం మార్కెట్లో కాంచీపురం చీరలు వినూత్నమైన డిజైన్లలో రూపొందుతున్నాయి. కలకాలం వన్నె తరగని ఈ పట్టుచీరల మిలమిలల ముందు ఎంతటి ఆధునిక వస్త్రధారణ అయినా దిగదుడుపే!



హైవేలకు భూసేకరణ వేగవంతం చేయండి: సీఎస్

అమరావతి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వివిధ జాతీయ రహదారుల నిర్మాణం, విస్తరణ.. వాటిపై బైపాస్ రహదారుల నిర్మాణానికి సంబంధించి అవసరమైన భూసేకరణను త్వరితగతిన పూర్తి చేసి, సంబంధిత నిర్మాణ ఏజెన్సీలకు అప్పగించాలని జిల్లా కలెక్టర్లు, సంయుక్త కలెక్టర్లతో పాటు సంబంధిత శాఖల అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఆదేశించారు. మంగళవారం సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, జేసీలతో వీడియో సమావేశం నిర్వహించారు. నిబంధనల ప్రకారం.. రైతులకు నష్టపరిహారం అందించి సకాలంలో భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసి ఆయా నిర్మాణ సంస్థలకు అందించాలన్నారు.

మైనార్టీలకు స్వయం ఉపాధి రుణాలు

- రూ.326 కోట్లతో 49 వేల మందికి లబ్ధి.. ఉత్తర్వులు జారీ

అమరావతి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మైనార్టీలకు స్వయం ఉపాధి రుణాల మంజూరుకు ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళిక ప్రకటించింది. బడ్జెట్‌లో నిధులు కేటాయించిన మేరకు 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.326 కోట్లు ఖర్చు చేయనుంది. దీనివల్ల మొత్తం 49,218 మంది మైనార్టీలకు లబ్ధి చేకూరనుంది. మంగళవారం ఈ మేరకు మైనార్టీ సంక్షేమశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. మైనార్టీలకు సంబంధించిన వివిధ పథకాలకు రూ.152 కోట్లు రాయితీగా అందిస్తోంది. 19,790 మంది దీని ద్వారా లబ్ధి పొందనున్నారు.

2017 పీఆర్‌సీ బకాయిలను చెల్లించాలి: ఈయూ

విజయవాడ(బస్‌స్టేషన్), జనవరి 21(ఆంధ్రజ్యోతి): పీఆర్‌సీ- 2017 పెండింగ్ బకాయిలను ఏక మొత్తంలో చెల్లించాలని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వి.నరసయ్య ప్రభుత్వాన్ని కోరారు. ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం కాకముందు 2017 పీఆర్‌సీని టీడీపీ ప్రభుత్వ హయాంలోనే 2019 ఫిబ్రవరిలో 25 శాతం ఫిట్‌మెంట్‌తో ఇచ్చారని పేర్కొన్నారు. ఈ బకాయిలను 80 శాతం వరకు ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమల రావు చొరవతో చెల్లించారని తెలిపారు. పదవీ విరమణ చేయనున్న ఉద్యోగులకు ఈనెలాఖరులోగా చెల్లించాలని కోరుతూ ఆర్టీసీ ఎండీకి లేఖ ఇచ్చామన్నారు.

కాటమనేని భాస్కర్ సెలవు దరఖాస్తు వెనక్కి

- ఐటీ కార్యదర్శిగా కొనసాగేందుకు సుముఖత

అమరావతి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): అనారోగ్య కారణం చూపించి దీర్ఘకాలిక సెలవులోకి వెళ్లేందుకు సిద్ధమైన ఐఏఎస్ అధికారి కాటమనేని భాస్కర్ తన సెలవు దరఖాస్తును వెనక్కి తీసుకున్నారు. సీఆర్‌డీఏ కమిషనర్‌గా ఉన్న కాటమనేని భాస్కర్‌ను ప్రభుత్వం ఐటీ కార్యదర్శిగా సోమవారం బదిలీ చేసింది. దీంతో అలకబూనిన ఆయన మెడికల్ లీవ్‌లో వెళ్లేందుకు సీఎస్ విజయానంద్‌కు దరఖాస్తు చేశారు. అయితే, కొంతమంది సీనియర్ ఐఏఎస్‌లు భాస్కర్‌తో మాట్లాడారు. సెలవు రద్దు చేసుకోవాలని నచ్చజెప్పారు. దీంతో ఆయన మెత్తబడ్డారు.

ఆరోగ్యశ్రీ సీఈవోగా పట్టాన్‌శెట్టి రవిసుభాష్

- సీపీడీసీఎల్ సీఎండీగా భాస్కర్‌కు బాధ్యతలు

అమరావతి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఏపీ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్(ఏపీసీపీడీసీఎల్) సీఎండీ పట్టాన్‌శెట్టి రవి సుభాష్‌ను ఆరోగ్యశ్రీ సీఈవోగా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆయన మంగళవారమే సీఈవోగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన స్థానంలో ఏపీసీపీడీసీఎస్ సీఎండీగా.. ట్రాన్స్‌కో డైరెక్టర్(గ్రిడ్, ట్రాన్స్‌మిషన్ అండ్ మేనేజ్‌మెంట్) ఏకేవీ భాస్కర్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ మంగళవారం ఉత్తర్వు జారీ చేశారు.

ఈశాన్య రాష్ట్రాలు చాలా కీలకం: గవర్నర్ నజీర్

ఈశాన్య ప్రాంతం భారతదేశానికి చాలా కీలకమైన భాగమని ఏపీ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. రాజ్‌భవన్‌లో మంగళవారం.. 'ఏక్ భారత్.. శ్రేష్ఠ భారత్' కార్యక్రమంలో భాగంగా మణిపూర్, మేఘాలయ, త్రిపుర రాష్ట్రాల ఆవిర్భావదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. గవర్నర్ నజీర్ ప్రసంగించారు. ఆయా రాష్ట్రాల సంస్కృతీ సంప్రదాయాలను, విశిష్టతలను వివరించారు. తొలుత ఈ కార్యక్రమం త్రిపుర, మేఘాలయ గవర్నర్ల వీడియో సందేశాలతో ప్రారంభమైంది.

వెటర్నరీలో ఈ ఏడాది 26 మంది ఉద్యోగ విరమణ

అమరావతి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పశుసంవర్ధకశాఖలో ఈ ఏడాది 26 మంది గెజిటెడ్ అధికారులు ఉద్యోగ విరమణ చేయనున్నారు. ప్రస్తుత డైరెక్టర్ దామోదర్‌నాయుడు, అదనపు డైరెక్టర్ వెంకట్రావు జూలైలో ఉద్యోగ విరమణ చేయనున్నారు. వీరితో పాటు 10మంది జాయింట్ డైరెక్టర్లు, 14 మంది డిప్యూటీ డైరెక్టర్లు 62 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసుకుని, వివిధ నెలల్లో ఉద్యోగ విరమణ చేయనున్నారు. కాగా, తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయంలో కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీం కింద పదోన్నతుల కోసం ఎంపిక కమిటీ సభ్యుడిగా పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని ఫార్మకాలజీ రిటైర్డ్ ప్రొఫెసర్ కేవీఎస్ఆర్‌జీ ప్రసాద్‌ను గవర్నర్ నామినీగా ప్రభుత్వం నామినేట్ చేసింది.

మద్దతు ధరా దక్కట్లేదు.. అపరాల రైతుల ఆవేదన

పంట చేతికొచ్చిన సమయంలో ధరలు పడిపోవడం అపరాల రైతులను ఆవేదనకు గురిచేస్తోంది. 2024 ఖరీఫ్‌లో పండించిన కంది, మినుము, పెసర, వేరుశనగ పంటలకు ప్రస్తుతం కనీస మద్దతు ధర కూడా దక్కడం లేదు. క్వింటా పెసలకు రూ.8,682, కందులకు, రూ.7,550, మినుములకు రూ.7,400, వేరుశనగకు రూ.6,783 కనీస మద్దతు ధరగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. కానీ.. కంది, పెసర, మినుములు క్వింటా రూ.6 వేలకు కాస్త అటుఇటుగానే ప్రైవేటు వ్యాపారులు అడుగుతున్నారు. ఎక్కడా కనీస మద్దతు ధర కూడా ఇవ్వడం లేదు. పంట వేయకముందు మినుములు క్వింటా రూ.9-10వేల మధ్య ఉండగా.. ఇప్పుడు రూ.6-7వేల మధ్యే పలుకుతోంది. పెసలు మరింత దారుణంగా రూ.6 వేలే అంటున్నారు. నాణ్యమైన సరుకు అయితే రూ.200-300 అదనంగా ఇస్తున్నారు. కర్నూలు మార్కెట్‌లో మొన్నటి దాకా కందులు రూ.7,400 పలకగా, ప్రస్తుతం మరో రూ.200 తగ్గింది.

గీత కులాలకు 335 మద్యం షాపులు

- 7న లైసెన్సీల ఎంపికకు లాటరీ
- లైసెన్స్ ఫీజు 50 శాతం మాత్రమే.. ఉత్తర్వులు జారీ



అమరావతి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గీత కులాలవారికి 335 మద్యం షాపులను రిజర్వ్ చేస్తూ ప్రభుత్వం నూతన మద్యం పాలసీని విడుదల చేసింది. ఆ షాపుల కేటాయింపునకు సంబంధించిన మార్గదర్శకాలను పేర్కొంటూ ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.కె.మీనా మంగళవారం ఉత్తర్వులు విడుదల చేశారు. 2016లో నిర్వహించిన స్మార్ట్ పల్స్ సర్వే ప్రామాణికంగా గీత కులాల జనాభాను పరిగణనలోకి తీసుకుని.. ఆయా జిల్లాల్లో గీత ఉప కులాలవారికి వేర్వేరుగా మద్యం షాపులను కేటాయించారు. ఇందులో యాత, గౌడ, ఈడిగ, గామళ్ల, కలాలీ, గౌండ్ల, శ్రీశయన (సేగిడి), శెట్టిబలిజ కులాలకు వారి జనాభా నిష్పత్తి ప్రకారం ఈ షాపులు కేటాయించనున్నారు. ఉమ్మడి చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపురం, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లోని శెట్టి బలిజలు ఓసీల్లో ఉన్నందున.. ఆయా జిల్లాల్లో శెట్టిబలిజలకు ఈ పాలసీ వర్తించదు. షెడ్యూలు ప్రాంతాల్లో గీత కులాలకు షాపులు కేటాయించరు. ఎక్కడ షాపులు పెట్టాలనేది ఆయా జిల్లాల్లో ఎక్సైజ్ అధికారులు నిర్ణయిస్తారు. ప్రాంతాలను నిర్ణయించిన అనంతరం జిల్లాల్లోని ఎక్సైజ్ అధికారులు దరఖాస్తులను ఆహ్వానిస్తారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ లేదా హైబ్రిడ్ విధానంలో దరఖాస్తులను స్వీకరిస్తారు. కలెక్టర్ల సమక్షంలో లాటరీ ద్వారా లైసెన్సీలను ఎంపిక చేస్తారు. దరఖాస్తుదారులు తప్పనిసరిగా కులధ్రువీకరణ, స్వస్థల ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. ఒక్కో దరఖాస్తు రుసుము రూ.2 లక్షలుగా నిర్ణయించారు. ఒక వ్యక్తి ఒకటి కంటే ఎక్కువ షాపులకు దరఖాస్తులు చేసుకోవచ్చు. అయితే వారంతా గీత కులాలకు చెందినవారైనప్పటికీ ఆయా ఉప కులాలకు నోటిఫై చేసిన షాపులకు దరఖాస్తులు చేసుకోవడానికి వీల్లేదు. ఫిబ్రవరి 7న లాటరీ నిర్వహించి లైసెన్సీలను ఎంపిక చేస్తారు. ఒక వ్యక్తికి ఒక్క షాపు మాత్రమే కేటాయిస్తారు. ఒకవేళ ఒకే వ్యక్తికి రెండు షాపులు లాటరీలో వస్తే.. దరఖాస్తుదారుల అభీష్టం మేరకు వారు కోరుకున్న షాపును కేటాయించి, మిగిలిన షాపు లైసెన్స్‌ను రద్దు చేస్తారు. అక్టోబరు నుంచి అమలులోకి వచ్చిన సాధారణ మద్యం పాలసీ లైసెన్సుదారులు చెల్లించే మొత్తంలో 50 శాతం లైసెన్స్ ఫీజు మాత్రమే గీత కులాల లైసెన్సీలు చెల్లిస్తే సరిపోతుంది. 2026, సెప్టెంబరు వరకు ఈ లైసెన్సుల గడువు ఉంటుంది.

చారిత్రక నిర్ణయం: మంత్రి అనగాని

కల్లు గీత కార్మికులకు 10 శాతం మద్యం షాపులు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. కల్లుగీత కార్మికులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీని చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం నెరవేర్చిందని చెప్పారు. కుల వృత్తినే నమ్ముకుని, ఇబ్బందులు పడుతున్న గీత కార్మికులకు మద్యం దుకాణాలు కేటాయించడం చారిత్రక నిర్ణయమన్నారు.

కొత్త అధ్యక్షుడెవరు?

రాష్ట్ర బీజేపీ శ్రేణుల్లో చర్చ

- రేసులో సుజనా, పార్థ, విష్ణు తదితరులు



అమరావతి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎవరికి అవకాశం లభిస్తుందనే అంశంపై పార్టీ వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. ప్రస్తుతం పార్టీ అధ్యక్షురాలిగా ఉన్న పురందేశ్వరి 2023 జూలైలో ఈ బాధ్యతలు చేపట్టారు. ఈ నెలాఖరులోపు కొత్త జాతీయ అధ్యక్షుడిని ఎన్నుకోవలసి ఉంది. దానికి ముందే పలు రాష్ట్రాల అధ్యక్షుల ఎంపిక జరగాలి. ఈ క్రమంలో ఈ నెలాఖరులోగా కొత్త అధ్యక్షుడిని నియమించడం ఖాయమని తెలుస్తోంది. ఈ పదవి కోసం దాదాపు పది మంది పోటీ పడుతున్నారు. అందులో... విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనాచౌదరి, ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ఉత్తరాంధ్ర నుంచి పీవీఎన్ మాధవ్, కోస్తా నుంచి పాకా సత్యనారాయణ లాంటి వారిని పరిగణనలోకి తీసుకోవచ్చంటున్నారు. మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి, నెల్లూరు జిల్లాకు చెందిన సురేశ్‌రెడ్డి పేర్లు కూడా వినిపిస్తున్నాయి. విష్ణువర్ధన్ రెడ్డి పేరును పొరుగు రాష్ట్రానికి చెందిన ఒక కేంద్ర మంత్రి సిఫారసు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. తనకు పొత్తులో సీటు దక్కలేదని, రాష్ట్ర అధ్యక్ష పదవి అప్పగించాలని జాతీయ లేబర్ బోర్డు చైర్మన్ వల్లూరు జయప్రకాశ్ నారాయణ ఢిల్లీ పెద్దలకు విన్నవించినట్లు సమాచారం. ఇటీవల విశాఖలో కోర్ కమిటీ భేటీలో రాష్ట్ర పార్టీ సహ ఇన్‌చార్జి శివ ప్రకాశ్ పార్టీ ముఖ్యులతో చర్చించారు. ఢిల్లీ ఎన్నికల్లో నిమగ్నమైన అగ్రనేతలు 'కొత్త అధ్యక్షుడి నియామకంపై మీ అభిప్రాయాలు పంపండి' అని చెప్పినట్లు తెలుస్తోంది.

పంచాయతీరాజ్‌లో పదోన్నతులకు కసరత్తు

- ఉపముఖ్యమంత్రి పవన్ ఆదేశాల మేరకు చర్యలు
- నేడు ఉద్యోగ సంఘాలతో కమిషనర్ సమావేశం
- అన్ని కేడర్ల నుంచి సూచనలు, సలహాలు స్వీకారం

(అమరావతి, ఆంధ్రజ్యోతి)

పంచాయతీరాజ్ శాఖలో పదోన్నతుల ప్రక్రియ వేగవంతం కానుంది. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు కమిషనర్ కృష్ణతేజ చర్యలు ప్రారంభించారు. ఆ శాఖలో పదోన్నతుల ప్రక్రియపై చర్చించేందుకు ఉద్యోగ సంఘాలతో కమిషనర్ బుధవారం సమావేశం కానున్నారు. అన్ని కేడర్ల ఉద్యోగ సంఘాల నేతల సూచనలను, సలహాలను స్వీకరించనున్నారు. గతంలో పదోన్నతుల ప్రక్రియ ఒక ప్రహసనంలాగా ఉండేది. ఇప్పటి వరకు పదోన్నతుల కోసం వేసే డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ (డీపీసీ) వేశాక ఏర్పడ్డ ఖాళీలకు మళ్లీ డీపీసీ ఏర్పాటుచేసే దాకా మోక్షం కలిగేది కాదు. ఉదాహరణకు సెప్టెంబరు నెలలో డీపీసీ ఏర్పాటు చేసి పదోన్నతులు కల్పించాక ఆ తర్వాత నెలల్లో ఖాళీ అయ్యే పోస్టులను మళ్లీ రెండేళ్ల తర్వాత డీపీసీ ఏర్పాటు చేసే వరకు పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉండేది కాదు. కొందరు ఉద్యోగులు పదోన్నతులు లేకుండానే రిటైరవుతున్నారు. దీంతో ఈ ప్రక్రియలో సంస్కరణలు తీసుకురావాలని, ప్రతి ఏటా డీపీసీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. పంచాయతీరాజ్ శాఖలో ఖాళీగా ఉన్న సుమారు 200 ఎంపీడీఓ పోస్టులు భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోనున్నారు.

కమిషనరేట్‌లో సిబ్బంది కొరత లేకుండా..

రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీరాజ్ శాఖలో పదోన్నతులు, బదిలీల ప్రక్రియ వేగంగా కొనసాగించడానికి కమిషనరేట్‌లో సిబ్బంది కొరత లేకుండా చేయాలని కమిషనర్ నిర్ణయించారు. పీఆర్ ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగంలో ఇప్పటికే ఐదుగురు సిబ్బందిని డిప్యుటేషన్‌పై నియమించారు. మరో నలుగురిని త్వరలో తీసుకోనున్నట్లు సమాచారం.

అధికారుల సామర్థ్యం పెంచేందుకు.. ఆర్ట్ ఆఫ్ లివింగ్‌తో త్వరలో ఒప్పందం

అమరావతి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలోని వ్యక్తి వికాస్ కేంద్రం, పబ్లిక్ ఎడ్యుకేషన్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ప్రభుత్వ అధికారులకు నాయకత్వ లక్షణాలు, అభివృద్ధి, పరిపాలన సామర్థ్యం పెంచేందుకు ఆ సంస్థతో అవగాహనా ఒప్పందం (ఎంవోయూ) చేసుకోవాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనల మేరకు జీఏడీ పొలిటికల్ సెక్రటరీ సురేశ్‌కుమార్, వ్యక్తి వికాస్ కేంద్రం చైర్మన్ ప్రసన్న ప్రభు మంగళవారం సచివాలయంలో సమావేశమయ్యారు. పాలన, సేవాదృక్పథంలో పని చేసేందుకు కొత్త టెక్నాలజీ పరికరాలు, ఇతర మౌలిక సదుపాయాలతో అధికారులను సన్నద్ధం చేయడానికి ఏం చేయాలన్న దానిపై చర్చించారు. త్వరలోనే సీఎం సమక్షంలో ఎంవోయూ చేసుకోవాలని నిర్ణయించారు.

ఈసీఆర్ఎఫ్ డ్యామ్ డిజైన్లు సిద్ధం చేయండి

- 'ఆఫ్రీ'కి జల వనరుల శాఖ ఆదేశం

అమరావతి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రధాన డ్యామ్‌లో అత్యంత కీలకమైన డయాఫ్రమ్‌వాల్ నిర్మాణంలో ఉండగానే... ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్ నిర్మాణం పనులు చేపట్టేలా డిజైన్లను రూపొందించి, కేంద్ర జల సంఘం నుంచి ఆమోదం పొందాలని మేఘా ఇంజనీరింగ్ సంస్థ నియమించిన డిజైనింగ్ సంస్థ 'ఆఫ్రీ'ని జల వనరుల శాఖ ఆదేశించింది. ఈ డిజైన్లు రూపొందించి కేంద్ర జల సంఘం ఆమోదం పొందితే డయాఫ్రమ్ వాల్‌తో సమాంతరంగా ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్ పనులు పూర్తి చేయవచ్చన్న యోచనలో రాష్ట్ర జల వనరుల శాఖ ఉంది. కాగా, డయాఫ్రమ్ వాల్ నిర్మాణాన్ని ఈ ఏడాది డిసెంబరు నాటికి పూర్తి చేయాలని నిర్మాణ సంస్థ బావర్‌కు కేంద్ర జల సంఘం లక్ష్యాన్ని నిర్దేశించింది.

చెరి సగం కుదరదు!

(మొదటి పేజీ తరువాయి)

తర్వాత 811 టీఎంసీలను ప్రాజెక్టుల వారీగా కేటాయించారని జలవనరుల శాఖ అధికారులు గుర్తుచేశారు. కృష్ణా జలాల వివాదంపై సుప్రీంకోర్టులో విచారణ నడుస్తున్న తరుణంలో.. నీటి కేటాయింపులపై చర్చకు ఆస్కారమే లేదని తేల్చిచెప్పారు. ఈ సమయంలో కేటాయింపులపై బోర్డు ఎలాంటి నిర్ణయం తీసుకున్నా అది కోర్టు ధిక్కరణ కిందకే వస్తుందని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు తీర్పు వెలువడేంతవరకు ఇంతకుముందు అంగీకారం కుదిరినట్లుగా ఏపీ 512 టీఎంసీలు, తెలంగాణ 299 టీఎంసీలు వినియోగించుకోవలసిందేనని తెలిపారు. తెలంగాణ డిమాండ్ చేస్తున్నట్లుగా 50:50 వినియోగానికి అంగీకరించేది లేదన్నారు. అయితే.. తాము చెరిసగం వాటా కోసం పట్టుబడుతున్న విషయాన్ని మినిట్స్‌లో రాయాలని తెలంగాణ పట్టుబట్టగా.. తాము అంగీకరించడం లేదన్న విషయాన్ని కూడా అందులో పొందుపరచాలని ఏపీ కోరింది. తమ అభ్యంతరాన్ని నోట్ చేయకపోతే.. భవిష్యత్‌లో తాము న్యాయపరమైన చిక్కులు ఎదుర్కోవలసి వస్తుందని తెలిపింది. ఏపీలో కొత్తగా ప్రతిపాదనల్లో ఉన్న గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు సహా.. ఇతర ప్రధాన కాలువల ద్వారా వినియోగిస్తున్న జలాలపై తెలంగాణ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చింది. కృష్ణా జలాలను చెరిసగం వినియోగించుకునేలా ఆదేశాలివ్వాలని బోర్డుపై ఒత్తిడి పెంచేందుకు ప్రయత్నించింది. వాస్తవానికి తమకు 71 శాతం వాటా, ఏపీకి 29 శాతమే రావాలని.. కానీ తాము చెరో 50 శాతం తీసుకుందామంటున్నామని తెలిపింది. అయితే బచావత్ ట్రిబ్యునల్ అవార్డు మేరకే నీటిని వాడుకోవాలని.. ఆ కేటాయింపులకు విరుద్ధంగా దేనికీ అంగీకరించబోమని ఏపీ పునరుద్ఘాటించింది. ఆంధ్ర ఎంత నీటిని వాడుతోందో లెక్కించేందుకు టెలిమెట్రీలను ఏర్పాటు చేయాలన్న తెలంగాణ వాదనలను తిప్పికొట్టింది. తమకు కేటాయించిన 512 టీఎంసీలను మాత్రమే వాడుకుంటున్నామని పేర్కొంది.

బెజవాడ రావడానికి ఓకే..

కృష్ణా బోర్డు ప్రధాన కార్యాలయాన్ని విజయవాడకు తరలించేందుకు చైర్మన్ జైన్ సూత్రప్రాయంగా అంగీకరించారు. అద్దె భారం లేని 15,000 చదరపు అడుగుల భవనాన్ని ఉచితంగా అప్పగిస్తే.. వెంటనే షిఫ్ట్ చేస్తామని చెప్పారు. అయితే.. బోర్డుకు ఉచితంగా కార్యాలయ భవనాన్ని సమకూర్చడం కుదరదని ఏపీ స్పష్టం చేసింది. విజయవాడకు తరలించాలంటే రూ.కోటిన్నర వరకూ వ్యయమవుతుందని.. 2025-26 వార్షిక బడ్జెట్‌లో ఈ ఖర్చు చూపుతామని జైన్ అన్నారు.

ఇంకా.. అదే విధేయత!

(మొదటి పేజీ తరువాయి)

జిల్లా, మండల స్థాయి వ్యవసాయ అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

వైసీపీ హయాంలోనే గ్రూపుల ఎంపిక

జగన్ ప్రభుత్వం ఉన్నప్పుడే కిసాన్ డ్రోన్ల పంపిణీకి సంబంధించి మొత్తం జాబితాలను రూపొందించారు. మొత్తం 674 గ్రూపులను ఎంపిక చేశారు. ఐదుగురు రైతులను ఒక గ్రూపుగా ఏర్పాటు చేసి వారిలో ఒకరికి డ్రోన్ పైలెట్‌గా శిక్షణ కూడా ఇప్పించారు. ఆర్భాటంగా గ్రూపులను ఎంపిక చేశారు కానీ డ్రోన్ల కొనుగోలుకు నిధులు మాత్రం విడుదల చేయలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత వ్యవసాయ రంగంలో ఖర్చు తగ్గించేందుకు కిసాన్ డ్రోన్లు పంపిణీ చేయాలని నిర్ణయించింది. అందులో భాగంగా గతంలో ఎంపిక చేసిన 674తోపాటు మరో 201 కలిపి తొలి విడతలో మొత్తం 875 డ్రోన్లు అందించేందుకు సిద్ధమైంది. డ్రోన్ ఏ కంపెనీది కొనుగోలు చేయాలి అన్న విషయం తేల్చేందుకు ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ యూనివర్సిటీలో నెల రోజుల నుంచి పరిశీలనా కసరత్తు జరుగుతోంది. ఈ పరిశీలన అనంతరం ఒక కంపెనీని ఎంపిక చేసి రైతులకు డ్రోన్లు సరఫరా చేసేందుకు రూ.70 కోట్లు ముందుగానే మంజూరు చేసింది. సుమారు రూ.10 లక్షల విలువ చేసే డ్రోన్‌ను రైతులకు కేవలం రూ.2 లక్షలకే అందజేస్తారు. మిగిలిన రూ.8 లక్షలు ప్రభుత్వం సబ్సిడీగా భరిస్తుంది. ఈ నేపథ్యంలో అర్హులైన రైతులను ఎంపిక చేయాలని ఆదేశించింది.

పాత జాబితాలో వైసీపీ వారికే అందలం

తాజాగా అర్హులను ఎంపిక చేయాల్సిన వ్యవసాయ శాఖ.. జగన్ ప్రభుత్వంలో రూపొందించిన 674 గ్రూపుల జాబితా ఆధారంగా ముందుకెళ్లేందుకు సిద్ధపడింది. పాత జాబితాలో ఉన్న వ్యక్తికి డ్రోన్ నిర్వహణపై 12 రోజులు శిక్షణ ఇచ్చామని, కాబట్టి వారికే వాటిని అందిస్తే బాగుంటుందని వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు. అప్పట్లో వైసీపీకి అనుకూలంగా ఉన్న వారికే జాబితాలో ప్రాధాన్యత కల్పించారు. టీడీపీ, జనసేన, బీజేపీకి సానుభూతిపరులుగా ఉన్న రైతులను పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో పాత జాబితాతో ముందుకెళ్లాలన్న వ్యవసాయశాఖ ఆదేశాలపై ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఎమ్మెల్యేలు భగ్గుమంటున్నారు. డ్రోన్ నిర్వహణకు అవసరమైన శిక్షణ 12 రోజుల్లో ఇవ్వొచ్చు. కానీ.. శిక్షణ సాకుతో వైసీపీ వాళ్లకు లబ్ధి చేకూర్చాలని ఎందుకు చూస్తున్నారని వారు ప్రశ్నిస్తున్నారు. కొందరు ఎమ్మెల్యేలు ఈ విషయాన్ని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన అధికాకాలను హెచ్చరించారు. లబ్ధిదారుల ఎంపిక సక్రమంగా జరగాలని సూచించారు.

రఘురామపై దాడిలో తులసిబాబు పాత్రపై ఆధారాల్లేవ్!

- ముసుగులతో వచ్చిన నలుగురు కొట్టారనే సాక్షులు చెప్పారు
- ఒడ్డు, పొడుగు ఆధారంగానే ఆయనను నిందితుడిగా చేర్చారు
- హైకోర్టులో తులసిబాబు తరపు సీనియర్ న్యాయవాది వాదనలు



అమరావతి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ, శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజుపై వైసీపీ ప్రభుత్వ హయాంలో సీఐడీ కస్టడీలో జరిగిన దాడి వ్యవహారంలో కామేపల్లి తులసిబాబు పాత్రపై ఎలాంటి ఆధారాలూ లేవని ఆయన తరపు సీనియర్ న్యాయవాది కేఎస్ మూర్తి హైకోర్టుకు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన వాదనలు వినిపించారు. ముసుగు వేసుకొని వచ్చిన నలుగురు అధికారులు తనను కొట్టారని రఘురామ తన ఫిర్యాదులో పేర్కొన్నారని, సాక్షులు సైతం నలుగురు వ్యక్తులు ముసుగు వేసుకొని కార్యాలయంలోకి వచ్చారని వాంగ్మూలం ఇచ్చారని తెలిపారు. అయితే, ఒడ్డు, పొడుగు ఆధారంగా తులసిబాబును నిందితుడిగా చేర్చారన్నారు. ఆరోపణలకు నిర్దిష్ట ఆధారాలు లేనందున బెయిల్ మంజూరు చేయాలని కోరారు. ప్రాసిక్యూషన్ తరఫున సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపిస్తూ తులసిబాబు పోలీస్ కస్టడీ పిటిషన్‌పై వాదనలు కొనసాగుతున్నాయని, కస్టడీ పిటిషన్‌పై నిర్ణయం వెల్లడించే వరకు బెయిల్ పిటిషన్‌పై విచారణను వాయిదా వేయాలని కోరారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ విచారణను ఈ నెల 24వ తేదీకి వాయిదా వేశారు. ఈ కేసులో తులసిబాబును పోలీసులు అరెస్ట్ చేసి మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చగా 14రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. ఈ నేపథ్యంలో తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ తులసిబాబు అత్యవసరంగా శుక్రవారం హైకోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే.

కాంట్రాక్ట్ కంపెనీలతో సంజయ్ కుమ్మక్కు

- 1.75 కోట్ల నిధులు మళ్లించిన సీఐడీ మాజీ చీఫ్
- దీనిపై ప్రాథమిక ఆధారాలున్నాయి
- వాస్తవాల వెలికితీతకు కస్టోడియల్ విచారణ అవసరం
- ముందస్తు బెయిల్ ఇస్తే దర్యాప్తుపై ఆ ప్రభావం
- హైకోర్టుకు తెలిపిన ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్
- సంజయ్ ముందస్తు బెయిల్‌పై ముగిసిన వాదనలు.. తీర్పు రిజర్వ్

అమరావతి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): అగ్ని ఎన్‌వోసీ వెబ్‌సైట్, మొబైల్ యాప్ రూపకల్పన, నిర్వహణ, 150 ట్యాబ్‌ల సరఫరాతోపాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంపై దళితులు, గిరిజనులకు అవగాహన సదస్సుల ఏర్పాటు పేరుతో సీఐడీ మాజీ చీఫ్ ఎన్.సంజయ్ కాంట్రాక్టు కంపెనీలతో కుమ్మక్కై నిధులు మళ్లించేశారని అడ్వకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు మంగళవారం ఆయన వాదనలు వినిపించారు. రూ1.75 కోట్లు మేర నిధులను సంజయ్ దుర్వినియోగం చేసినట్లు ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని తెలిపారు. అగ్ని యాప్ రూపకల్పనకు ఒప్పందం జరిగిన వారం రోజుల్లోనే హడావుడిగా సౌత్రికా టెక్నాలజీస్ సంస్థకు రూ.80 లక్షలు చెల్లించారని, యాప్ రూపకల్పన పురోగతిని పరిశీలించకుండానే సొమ్ము చెల్లించేశారని వివరించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంపై గిరిజనులు, దళితులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు క్రిత్వ్యాప్ సంస్థతో 2024 జనవరి 30న ఒప్పందం చేసుకున్నారని, ఆ రోజే ఆ సంస్థకు సొమ్ము చెల్లించేశారని తెలిపారు. క్రిత్వ్యాప్ సంస్థతో ఒప్పందానికి ముందే సీఐడీ అధికారుల నేతృత్వంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారని, క్రిత్వ్యాప్ సంస్థ సదస్సులు నిర్వహించకుండానే బిల్లులు సమర్పించిందని పేర్కొన్నారు. ఈ రెండు సంస్థల నుంచి నిధులు సంజయ్‌కి చేరాయో?లేదో? దర్యాప్తులో తేలాల్సి ఉందని, సదస్సుల నిర్వహణ గురించి దిగువస్థాయి అధికారులను ప్రశ్నించాల్సి ఉందని తెలిపారు. వాస్తవాలు వెలికితీయాలంటే సంజయ్ కస్టోడియల్ విచారణ అవసరమన్నారు. సంజయ్‌కి ముందస్తు బెయిల్ మంజూరు చేస్తే దర్యాప్తు ప్రభావితం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ముందస్తుబెయిల్ పిటిషన్‌ను కొట్టివేయాలని కోరారు. అంతకుముందు సంజయ్ తరపున సీనియర్ న్యాయవాది ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ.. అధికారుల నేతృత్వంలోని కమిటీ యాప్ రూపకల్పనపై సంతృప్తి వ్యక్తం చేసిన తరువాతే శాఖాధిపతి హోదాలో పిటిషనర్ నిధులను విడుదల చేశారని చెప్పారు. విధానపరమైన నిర్ణయాలలో జరిగే తప్పులకు పిటిషనర్‌ను బాధ్యుడిని చేయడం సరికాదన్నారు. అప్పటి మార్కెట్ ధర కన్నా 5శాతం తక్కువకే ల్యాప్‌టాప్‌లు కొనుగోలు చేశారని తెలిపారు. దారి మళ్లిందని చెబుతున్న సొమ్ము పిటిషనర్‌కు చేరినట్లు ఆధారాలు లేవన్నారు. కోర్టు విధించిన షరతులకు కట్టుబడి ఉంటామని, ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని అభ్యర్థించారు. ఇరువైపుల వాదనలు ముగియడంతో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ప్రకటించారు. కాగా, వైసీపీ హయాంలో సీఐడీ చీఫ్‌గా, అగ్నిమాపకశాఖ డీజీగా వ్యవహరించిన సంజయ్ 150 ట్యాబ్‌ల సరఫరా, అగ్ని ఎన్‌వోసీ వెబ్‌సైట్, మొబైల్ యాప్ అభివృద్ధి ఒప్పందాన్ని సౌత్రికా టెక్నాలజీస్ అండ్ ఇన్‌ఫ్రా సంస్థకు, అలాగే ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టంపై గిరిజనులు, దళితులకు అవగాహన సదస్సుల నిర్వహణ ఒప్పందాన్ని క్రిత్వ్యాప్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు నిబంధనలకు విరుద్ధంగా అప్పగించడంతోపాటు మోసపూరితంగా బిల్లులు చెల్లించడం ద్వారా రూ1.75కోట్ల మేర నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారంటూ ఏసీబీ కేసు నమోదు చేసింది. దీంతో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ సంజయ్ హైకోర్టును ఆశ్రయించారు. ఇదే కేసులో నిందితులుగా ఉన్న క్రిత్వ్యాప్ టెక్నాలజీస్ సంస్థ డైరెక్టర్లు, సౌత్రికా టెక్నాలజీస్ అండ్ ఇన్‌ఫ్రా డైరెక్టర్లు వేర్వేరుగా దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్లపైనా వాదనలు ముగియడంతో తీర్పు రిజర్వ్ చేశారు.

నేరపూరిత చర్యలుగా పరిగణించడానికి వీల్లేదు

- విజయ్‌కుమార్‌రెడ్డి తరపు న్యాయవాది వాదనలు
- ఏసీబీ వాదనల కోసం విచారణ రేపటికి వాయిదా

అమరావతి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): సమాచార శాఖ కమిషనర్ హోదాలో తీసుకున్న నిర్ణయాలకు నేరపూర్వక దుష్ప్రవర్తనను ఆపాదించడానికి వీల్లేదని పిటిషనర్ తరపు న్యాయవాది మహేశ్వరరెడ్డి వాదనలు వినిపించారు. పిటిషనర్ అనుచిత లబ్ధి పొందినట్లు ఎలాంటి ఆధారాలు లేవని తెలిపారు. జగన్ మీడియాకు అనుచిత లబ్ధి చేకూర్చేలా నిర్ణయాలు తీసుకోవడమే కాకుండా, అక్కడ పనిచేస్తున్న పలువురు సిబ్బందిని ఐ అండ్ పీఆర్, ఏపీ డిజిటల్ కార్పొరేషన్‌లో ఉద్యోగులుగా చట్టవిరుద్ధ నియామకాలు జరిపారని అప్పటి సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ తుమ్మా విజయ్‌కుమార్‌రెడ్డిపై ఏపీ మీడియా ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్.ఢిల్లీ బాబురెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ విజయ్‌కుమార్ రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. మంగళవారం ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా న్యాయవాది మహేశ్వరరెడ్డి వాదనలు వినిపిస్తూ.. ప్రకటనల టారిఫ్ పెంపు కమిటీ నిర్ణయం మేరకు జరిగిందని, దీనికి రాష్ట్ర కేబినెట్, ఆర్థికశాఖ ఆమోదం ఉందని పేర్కొన్నారు. చట్ట నిబంధనలకు విరుద్ధంగా నిర్ణయాలు తీసుకొంటే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి తప్ప క్రిమినల్ చర్యలు ప్రారంభించడానికి వీల్లేదని నివేదించారు. విజిలెన్స్ విచారణకు పిటిషనర్ సహకరిస్తున్నారని కోర్టు దృష్టికి తెచ్చారు. ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరారు. పిటిషనర్ తరపు వాదనలు పూర్తవగానే కోర్టు సమయం ముగియడంతో ఏసీబీ తరఫున ఏజీ వాదనల కోసం విచారణను న్యాయస్థానం ఈ నెల 23కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ఉత్తర్వులు ఇచ్చారు.

మాజీమంత్రి మేరుగపై అత్యాచారం కేసు కొట్టివేత

వైసీపీ మాజీ మంత్రి మేరుగ నాగార్జునకు హైకోర్టులో ఊరట లభించింది. మహిళపై అత్యాచారానికి పాల్పడ్డారంటూ నాగార్జున, మరొకరిపై పోలీసులు నమోదు చేసిన కేసును న్యాయస్థానం కొట్టివేసింది. మంగళవారం వ్యాజ్యం విచారణకు రాగా పిటిషనర్ తరపు న్యాయవాది దుష్యంత్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ... తనపై ఎలాంటి అత్యాచారం జరగలేదని, బాధిత మహిళ ప్రమాణపత్రం దాఖలు చేశారన్నారు.

వర్ల రామయ్యపై అధిష్ఠానం అసంతృప్తి

» కొలికపూడి వ్యవహారంపై మీడియాతో మాట్లాడడం సరికాదన్న అధినాయకత్వం

అమరావతి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): పొలిట్‌బ్యూరో సభ్యుడు, సీనియర్ నేత వర్ల రామయ్యపై తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పార్టీ క్రమ శిక్షణ సంఘం ముందు హాజరైన సందర్భంలో ఈ సంఘం సభ్యునిగా ఉన్న వర్ల మీడియాతో మాట్లాడటంపై నాయకత్వం అసంతృప్తి వ్యక్తం చేసింది. క్రమ శిక్షణ సంఘం సభ్యులుగా ఉన్న ఐదుగురు నేతల్లో వర్ల రామయ్య ఒకరు. సంఘం సమావేశం ముగిసిన తర్వాత ఆయన పార్టీ కార్యాలయంలోనే మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. 'ఎమ్మెల్యే వ్యవహార శైలిపై సీఎం కూడా అసంతృప్తిగా ఉన్నారు. ఇప్పటికి రెండుసార్లు క్రమ శిక్షణ సంఘం ముందు హాజరైన కొలికపూడి ఇక ముందు జాగ్రత్తగా ఉండాలి. లేనిపక్షంలో నష్టపోతారు' అని ఆయన వ్యాఖ్యానించారు. రామయ్య వ్యాఖ్యలపై పార్టీ నాయకత్వం అసంతృప్తిని వ్యక్తం చేసింది. 'క్రమ శిక్షణ సంఘం సభ్యులుగా ఉన్న నేతలు సంయమనం పాటించాలి. విచారణాంశాలపై బయట మాట్లాడకూడదు. తాము ఏ అభిప్రాయానికి వచ్చారో దానిని పార్టీ నాయకత్వానికి నివేదించాలి. అంతేతప్ప మీడియా ముందు ఎలా మాట్లాడతారు? అందరూ మీడియా ముందు మాట్లాడితే ఇక పార్టీ క్రమ శిక్షణకు అర్థమేముంది?' అని నాయకత్వం అభిప్రాయపడినట్లు సమాచారం. నాయకత్వం అసంతృప్తిని రామయ్యకు తెలియచేశారు. ఇక ముందు ఇలా జరగకుండా చూసుకోవాలని ఆదేశించారు.

రాజ్యాంగం నమ్మకానికి సంబంధించింది

» కేంద్ర మంత్రి పెమ్మసాని

న్యూఢిల్లీ, జనవరి 21(ఆంధ్రజ్యోతి): 'ప్రభుత్వానికి, దేశ ప్రజలకు రాజ్యాంగం కేవలం రాజ్యాంగం మాత్రమే కాదు.. అదొక విశ్వాసం' అని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వ్యాఖ్యానించారు. మంగళవారం, రాజ్యాంగాన్ని ఆమోదించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా జాతీయ ఫిలాటెలిక్ మ్యూజియం నిర్వహిస్తోన్న పోస్టల్ ఎగ్జిబిషన్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులతో కేంద్ర మంత్రి మాట్లాడారు. అనంతరం ఆయన ఎక్స్‌లో స్పందించారు. 'దేశం గొప్పతనం, పోస్టల్ చరిత్ర, రాజ్యాంగం ప్రాముఖ్యత తెలుసుకోనే అవకాశం పోస్టల్ ఎగ్జిబిషన్ ద్వారా లభిస్తుంది. భారతదేశ వారసత్వం, అభివృద్ధి గురించి యువ తరానికి అవగాహన కల్పించడం, వారిని ప్రేరేపించడం ఎగ్జిబిషన్ లక్ష్యం' అని పేర్కొన్నారు.

గత ప్రభుత్వం రద్దు చేసిన పింఛన్లు, టిడ్కో ఇళ్లు పునరుద్ధరించాలి

» టీడీపీ గ్రీవెన్స్‌లో పేదల విజ్ఞాపన

అమరావతి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): 'గత ప్రభుత్వంలో రద్దు చేసిన టిడ్కో ఇళ్లు, పింఛన్లను పునరుద్ధరించాలి. వైసీపీ నేతల భూకబ్జాలపై విచారణ జరిపి, తమకు న్యాయం చేయాలి' అని పలువురు టీడీపీ గ్రీవెన్స్‌లో విజ్ఞప్తి చేశారు. మంగళవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంత్రి అచ్చెన్నాయుడు వినతులు స్వీకరించి, బాధితులకు న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. అర్హులకు పింఛన్ల పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు. కడప జిల్లా యర్రగుంట్లకు చెందిన మైలాపురం లక్ష్మీదేవి అర్జీ ఇస్తూ, 2018లో టీడీపీ ప్రభుత్వం తమకు మంజూరు చేసిన టిడ్కో గృహాన్ని వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందని వాపోయారు. 2019కి ముందు తనకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ వచ్చేదని, వైసీపీ ప్రభుత్వం కక్షపూరితంగా రద్దు చేసిందని, దానిని పునరుద్ధరించాలని అన్నమయ్య జిల్లా చిన్నతిప్పసముద్రం గ్రామానికి చెందిన బీ ఉత్తమరెడ్డి వేడుకున్నారు. చిత్తూరు జిల్లా కృష్ణాపురంలో తమ కుటుంబం సాగు చేసుకుంటున్న భూమిని వైసీపీ నాయకులు రౌడీయిజం చేస్తూ, కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని యశ్వంత్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. అనంతపురం జిల్లా జరుట్ల రామాపురంలో తన ఐదెకరాల పొలానికి రికార్డులు తారుమారు చేసి, వైసీపీకి చెందిన చందప్ప పట్టా పుట్టించుకున్నాడని షేక్సానుపల్లికి చెందిన వడ్డే ఎర్రిస్వామి వాపోయారు. తన భూమి తనకు దక్కేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

డిసెంబరు నాటికి కాఫర్ డ్యాం పూర్తి

» 5 వేల కోట్ల హడ్కో రుణంతో టిడ్కో ఇళ్లు పూర్తి: మంత్రి నిమ్మల

పాలకొల్లు అర్బన్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): 'తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 2014-19 మధ్య కాలంలో రూ.460 కోట్ల వ్యయంతో నిర్మించిన పోలవరం ప్రాజెక్టులో ముఖ్య భాగం కాఫర్ డ్యాం నిర్మాణ పనులు అయిదేళ్ల జగన్ పాలనలో నిర్లక్ష్యంతో నిర్వీర్యమైపోయాయి' అని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు మున్సిపల్ కౌన్సిల్ హాల్లో మంగళవారం మీడియాతో మంత్రి మాట్లాడారు. 'ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో మళ్లీ రూ.900 కోట్లతో కొత్త కాఫర్ డ్యాం నిర్మాణం అత్యాధునిక పరిజ్ఞానంతో చేపట్టాం. ఈ ఏడాది డిసెంబరు నాటికి పూర్తి చేస్తాం. పోలవరం మెయిన్ డ్యామ్ నిర్మాణ పనులు త్వరలోనే పునః ప్రారంభించి 2027 డిసెంబరు నాటికి పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు లక్ష్యంగా పెట్టుకున్నారు. గతంలో 72 శాతం పూర్తి చేసిన పోలవరం పనులను వైసీపీ పాలనలో అర్ధంతరంగా ఆపివేసింది. టిడ్కో గృహాలపై రాష్ట్ర వ్యాప్తంగా రూ.ఐదు వేల కోట్లు రుణం తీసుకువచ్చిన జగన్ ప్రభుత్వం ఆ నిధులను టిడ్కో అకౌంట్లలో జమ చేయకుండా దారి మళ్లించింది. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు నేడు హడ్కో నుంచి రూ.5 వేల కోట్లు రుణం తీసుకుని టిడ్కో గృహాల నిర్మాణాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తాం' అని మంత్రి నిమ్మల తెలిపారు. ఆర్డీవో దాసి రాజు, మున్సిపల్ కమిషనర్ బి.విజయ సారథి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించే దిశగా చర్యలు

» '20 సూత్రాల' కమిటీ చైర్మన్ లంకా దినకర్

అమరావతి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించే దిశగా చేపట్టాల్సిన చర్యలపై సీఎం చంద్రబాబుకు త్వరలో సమగ్ర నివేదికను అందజేయనున్నట్లు 20 సూత్రాల కార్యక్రమం అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ తెలిపారు. మంగళవారం అమరావతి సచివాలయంలోని తన చాంబర్‌లో.. ఆర్గానిక్ ఫార్మింగ్ సర్టిఫికేషన్ అథారిటీ చైర్మన్ శేవల దత్తుతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాల్సిన ప్రాధాన్యతను వివరించారు. ఇటీవలే అత్తలూరు ఆర్గానిక్ ఫార్మింగ్ ఎఫ్‌పీవోను సందర్శించామని, అక్కడ నిర్వహించే కార్యకలాపాలను ఆదర్శంగా తీసుకుని భవిష్యత్‌లో ప్రకృతి వ్యవసాయం చేసే రైతులను ప్రోత్సహించే విధంగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించనున్నట్లు ఆయన తెలిపారు. అమరావతి చుట్టూ 75 లక్షల మొక్కల పెంపకం కోసం రైతులను భాగస్వామ్యం చేసేందుకు కార్యాచరణ చేయనున్నామన్నారు. విజయనగరం జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా ప్రకృతి సాగు కార్యాచరణకు శ్రీకారం చుట్టనున్నామని తెలిపారు. ఆర్గానిక్ ఫార్మింగ్ సర్టిఫికేషన్ అథారిటీ చైర్మన్ శేవల దత్తు మాట్లాడుతూ ప్రతి పంటను ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించే విధంగా, 100 శాతం ఆర్గానిక్ ధ్రువీకరణ పంటల ఉత్పత్తి దిశగా సేంద్రియ ఉత్పత్తులపై త్వరలోనే సీఎంకు సమగ్ర నివేదిక అందజేయనున్నామని తెలిపారు.



దావోస్‌లో గ్రీన్ ఇండస్ట్రియలైజేషన్‌పై సీఐఐ నిర్వహించిన సమావేశంలో ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు



మిత్తల్ గ్రూప్ చైర్మన్ లక్ష్మీ మిత్తల్, సీఈవో ఆదిత్య మిత్తల్‌తో సీఎం చంద్రబాబు, మంత్రులు లోకేశ్, టీజీ భరత్



కాగ్నిజెంట్ సీఈవో ఎస్.రవికుమార్‌తో సమావేశమైన సీఎం

బ్రాండ్ ఏపీ @దావోస్

ప్రపంచానికి మనమే మోడల్!

గ్రీన్ ఎనర్జీ, హైడ్రోజన్ హబ్‌గా ఏపీ

ఈ రంగాల్లోకి లక్ష కోట్ల పెట్టుబడులు

దావోస్ సదస్సులో చంద్రబాబు

అమరావతి, విజయవాడ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా త్వరలోనే ఆంధ్రప్రదేశ్ మారనున్నదని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. సంప్రదాయేతర ఇంధన వనరులైన సౌర, పవన, గ్రీన్ హైడ్రోజన్ విద్యుదుత్పత్తిపై దృష్టి కేంద్రీకరించామని, ఈ రంగాల్లోకి 115 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.లక్ష కోట్లు) పెట్టుబడులు ఏపీకి వస్తున్నాయని తెలిపారు. ఏపీకి పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి కల్పనే లక్ష్యంగా అమరావతిలో భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) కేంద్రాన్ని టాటా సంస్థతో కలిసి ఏర్పాటుచేస్తామని చంద్రబాబు అన్నారు. దావోస్ సదస్సులో మంగళవారం సీఐఐ ఆధ్వర్యంలో జరిగిన "గ్రీన్ ఎనర్జీ-గ్రీన్ హైడ్రోజన్ ఇండస్ట్రియలైజేషన్" సెషన్‌లో చంద్రబాబు ఈ ప్రకటన చేశారు. సోమవారం రాత్రి జ్యూరిక్ నుంచి దావోస్‌కు చంద్రబాబు బృందం చేరుకుంది. మంగళవారం ఉదయం నుంచి వరుస సమావేశాలతో బిజీగా గడిపింది. అందులోభాగంగా సీఐఐ నిర్వహించిన సదస్సులో చంద్రబాబు మాట్లాడుతూ.. స్వర్ణాంధ్ర 2047, గ్రీన్ ఇండస్ట్రీలో దేశ భవిష్యత్తుకు సంబంధించిన విజన్‌ను ఆయన ఆవిష్కరించారు. భారతీయుల రక్తంలోనే వ్యాపార లక్షణాలు ఉన్నాయని, ప్రపంచ దేశాలకు భారతీయులు అత్యుత్తమ సేవలు అందిస్తున్నారని కొనియాడారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పారిశ్రామికవేత్తలు తమదైన శైలిని ప్రదర్శిస్తూ, రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు తెస్తున్నారన్నారు. ఇంకా ఆయన ఏమన్నారంటే..



సంపద సృష్టిలో ముందున్నాం..

"2047 నాటికి భారతదేశం ప్రపంచ వ్యాప్తంగా మొదటి, లేక రెండో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించడం ఖాయం. సంపదను సృష్టించటంలో, ప్రపంచ సమాజ సేవ చేయటంలో భారతీయులు ముందుంటారు. దావోస్ సదస్సుకు హాజరైన తెలుగువారందరినీ చూస్తుంటే భవిష్యత్తులో తన కలలు వాస్తవ రూపం దాల్చుతాయన్న ఆత్మవిశ్వాసం పెరిగింది. రెండున్నర దశాబ్దాల్లో హైదరాబాద్‌ను అభివృద్ధి చెందిన నగరంగా మార్చేందుకు కృషి చేశాను. 25ఏళ్ల కిందట బిల్‌గేట్స్ ఐటీ సేవలను తీసుకొచ్చారు. 1991లో భారత్‌లో తొలితరం ఆర్థిక సంస్కరణలు వచ్చాయి. ఇంటర్నెట్, ఆర్థిక సంస్కరణల ఆధారంగా, రెండో తరం ఆర్థిక సంస్కరణలను నేను ప్రవేశపెట్టాను. 1999లో తొలిసారిగా విద్యుత్తు సంస్కరణలు ప్రారంభమయ్యాయి. పాలనా వ్యవస్థలో ఉన్న వ్యక్తిగా ఈ సంస్కరణలు అమలుచేసినందుకుగాను అప్పటి ఎన్నికల్లో ఓడిపోయాను. ఇప్పుడు ఆ సంస్కరణలే ఏపీకి సానుకూల ఫలితాలను అందిస్తున్నాయి."

ఇంటింటా సౌర విద్యుత్తే లక్ష్యం

"ఏపీలో విద్యుత్తు ఉత్పాదనకు మంచి అవకాశాలున్నాయి. విద్యుత్ వాహనాలను ప్రోత్సహిస్తున్నాం. దానితోపాటు సౌర విద్యుత్తు వినియోగంపై దృష్టి సారించాం. ఇందులోభాగంగా 'పీఎం సూర్యఘర్' కింద ఇంటింటా సౌర ఉత్పత్తిని చేసే వినూత్న విధానం అమలు చేస్తున్నాం. ఈవీల కొనుగోలు, సౌర ఫలకాల ఏర్పాటుకు ముందుకొచ్చినవారికి రాయితీలు ఇస్తున్నాం. ఏపీలో ఐదు ఎంపీటీపీ గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేయబోతున్నాం. 21 బిలియన్ డాలర్ల పెట్టుబడితో ఎన్టీపీసీ- జెన్కో సంయుక్తంగా గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిచేయబోతున్నాయి. మా రాష్ట్రంలో విస్తారమైన తీరప్రాంతం, రవాణాకు అందుబాటులో పోర్టులు ఉన్నాయి. అత్యంత తక్కువ ఖర్చుతో విద్యుత్తును అందించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. అదే సమయంలో పర్యావరణాన్ని పరిరక్షించే చర్యలకు కూడా పెద్దపీట వేస్తున్నాం"

సిస్కోతో చర్చించా: సీఎం

రాష్ట్రాభివృద్ధిలో 'సిస్కో' భాగస్వామ్యంపై ఆ సంస్థ సీఈవో అండ్ చైర్మన్ చుక్‌రాబిన్స్‌తో చర్చించానని సీఎం చంద్రబాబు 'ఎక్స్'లో వెల్లడించారు. "దావోస్‌లో మంగళవారం 'గ్లోబల్ లీడర్స్ ఇన్ టెక్నాలజీ ఇన్నోవేషన్' సెషన్‌లో భాగంగా చుక్‌రాబిన్స్‌తో సమావేశమయ్యాను. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో సిస్కో భాగస్వామి కావడంపై ఇరువురం చర్చించాం" అని తెలిపారు.

బాబు విజన్‌లో ఉపాధికే పెద్దపీట : టాటా చంద్రశేఖరన్



చంద్రబాబు ప్రభుత్వం రూపొందించిన విజన్- 2047లో ఉద్యోగాల కల్పనకు పెద్దపీట వేశారని టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ అన్నారు. చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో భాగస్వామ్యం కావడం తమకెంతో గర్వకారణమని సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ పేర్కొన్నారు. అమరావతిలో గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్‌ను స్థాపించేందుకు ప్రభుత్వంతో కలిసి పనిచేయటం మరిచిపోలేని అనుభవం అన్నారు. కాగా, పోటీ తత్వం విషయంలో సీఐఐ ప్రకటించిన సెంటర్ ఫర్ గ్లోబల్ లీడర్ షిప్ బ్రోచర్‌ను చంద్రబాబు విడుదల చేశారు. అనంతరం సీఐఐ - ఐఎండీ స్విట్జర్లాండ్ బిజినెస్ స్కూల్ మధ్య లెటర్ ఆఫ్ ఇండెంట్ మార్పిడి జరిగింది. పాత్ వేటూ ఇండియాస్ గ్రీన్ ఇండస్ట్రియలైజేషన్ ఫ్రమ్ గ్రీన్ హైడ్రోజన్ టూ గ్రీన్ మ్యాన్యుఫాక్చరింగ్ పై విస్తృత చర్చలు జరిగాయి. ఈ కార్యక్రమంలో సీఐఐ ఉన్నతాధికారి రాజీవ్ మెమానీ, స్విట్జర్లాండ్ ఐఎండీ బిజినెస్ స్కూల్ ప్రెసిడెంట్ డేవిడ్ బాచ్, జీఎంఆర్ గ్రూప్ ఎయిర్ పోర్టు బిజినెస్ చైర్మన్ జీబీఎస్ రాజు, గ్రీన్ కో గ్రూప్ చీఫ్ ఎగ్జిక్యూటివ్, ఎండీ అనిల్ కుమార్ చలమలశెట్టి, జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ చైర్మన్ సజ్జన్ జిందాల్, యారా క్లీన్ అమ్మోనియా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ హన్స్ ఒలావ్ రేన్‌లు ప్రసంగించారు.

స్మోక్ ఫ్రీ సిగరెట్ తయారీ యూనిట్ పెట్టండి

ప్రపంచంలో అగ్రగామి టొబాకో ఉత్పత్తుల సంస్థ ఫిలిప్ మోరిస్ ఇంటర్నేషనల్ ఆగ్నేయాసియా వైస్ చైర్‌పర్సన్ ఆండ్రియా వికోవాతో లోకేశ్ భేటీ అయ్యారు. ఫిలిప్ మోరిస్ అనుబంధ సంస్థ గాడ్ ఫ్రే ఫిలిప్స్ ద్వారా ఏపీలో స్మోక్ ఫ్రీ సిగరెట్ యూనిట్ ఏర్పాటు చేయాలని కోరారు. గుంటూరు పరిసర ప్రాంతాలు అనువుగా ఉంటాయన్నారు. ఆండ్రియా మాట్లాడుతూ స్మోక్ ఫ్రీ సిగరెట్ల ఉత్పత్తులపై దృష్టి సారించామని, ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను తప్పక పరిశీలిస్తామన్నారు.

ఫిలిప్ మోరిస్ వైస్ ప్రెసిడెంట్ ఆండ్రియా గోంట్కో వికోవాతో మంత్రి లోకేశ్

పెట్టుబడులకు రాష్ట్రం సానుకూలం

భావనపాడును పెట్రోకెమికల్ హబ్‌గా మారుద్దాం

మిట్టల్ గ్రూప్ చైర్మన్ లక్ష్మీ మిట్టల్‌కు లోకేశ్ ప్రతిపాదన

అమరావతి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి పెట్టుబడులు రాబట్టే లక్ష్యంలో భాగంగా రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, మానవవనరుల శాఖ మంత్రి లోకేశ్ దావోస్‌లో మంగళవారం బిజీబిజీగా గడిపారు. ప్రముఖ సంస్థల సీఈవోలు, చైర్మన్లు, వైస్ ప్రెసిడెంట్లతో వరుసగా సమావేశమయ్యారు. ఏపీలో పెట్టుబడులకు అత్యంత అనుకూల వాతావరణం ఉందని, ముందుకు రావాలని ఆహ్వానించారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. వాహన రంగ దిగ్గజ సంస్థ జెడ్ఎఫ్ ఫాక్స్‌కాన్ సీఈవో ఐకీ డోర్ఫ్‌తో లోకేశ్ సమావేశమయ్యారు. ఏపీలో ఆటోమొబైల్ రంగం శరవేగంగా అభివృద్ధి చెందుతోందని మంత్రి పేర్కొన్నారు. కియా, ఇసుజీ వంటి ప్రముఖ సంస్థలు కార్ల తయారీ యూనిట్లను తమ రాష్ట్రంలో నెలకొల్పాయని, అశోక్ లేల్యాండ్, వీర అండ్ ఆజాద్ మొబిలిటీ వంటి బస్ తయారీ ఓఈఎంలు కూడా కార్యకలాపాలు విస్తరించాలని చూస్తున్నాయన్నారు. ఆటోమొబైల్ తయారీ రంగం, సరఫరా చైన్ ఏర్పాటుకు విశాఖపట్నం, విజయవాడ, అనంతపురం వ్యూహాత్మక ప్రాంతాలని తెలిపారు. జెడ్ఎఫ్ ఫాక్స్‌కాన్ ఛాసిస్ మాడ్యుల్స్ సంస్థ తయారీ యూనిట్‌ను ఏపీలో ఏర్పాటు చేయాలని ఆహ్వానించారు. ఐకీ డోర్ఫ్ స్పందిస్తూ ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలపై కంపెనీ బోర్డులో చర్చించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

సోలార్ సెల్ తయారీ ప్లాంటు ఏర్పాటుకు ఆహ్వానం

అన్ని అనుకూలతలు ఉన్న భావనపాడును పెట్రోకెమికల్ హబ్‌గా మార్చడానికి మిట్టల్ గ్రూప్ పెట్టుబడులు పెట్టాలని లోకేశ్ కోరారు. ఆ గ్రూపు చైర్మన్ లక్ష్మీ మిట్టల్‌తో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. లోకేశ్ మాట్లాడుతూ పెట్రోకెమికల్స్ అన్వేషణకు భావనపాడు వ్యూహాత్మక ప్రాంతమన్నారు. 83.3 ఎంటీపీఏ సామర్థ్యం గల పోర్టు, వైజాగ్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ, మౌలిక సదుపాయాలు పెట్టుబడులకు అనుకూలతలన్నారు. హెచ్‌పీసీఎల్-మిట్టల్ సంయుక్త భాగస్వామ్య సంస్థ హెచ్ఎంఈఎల్-హెచ్‌పీసీఎల్-మిట్టల్ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ ఆధ్వర్యంలో రూ.3500 కోట్లతో భారత్‌లో ఏర్పాటు చేయాలని భావిస్తున్న 2 గిగావాట్ సామర్థ్య సోలార్ సెల్ తయారీ ప్లాంట్‌ను ఏపీలో ఏర్పాటు చేయాలని కోరారు. లక్ష్మీ మిట్టల్ స్పందిస్తూ ఆర్సెలర్ మిట్టల్, జపాన్‌కు చెందిన నిప్పాన్ స్టీల్ సంయుక్తంగా 17.8 మిలియన్ టన్నుల సామర్థ్యంతో గ్రీన్ ఫీల్డ్ స్టీల్ ప్రాజెక్టును ఏపీలో ఏర్పాటు చేయడానికి ఏర్పాట్లు ప్రారంభించామన్నారు. ఏఎం, ఎన్ఎస్ ఇండియా పేరుతో అనకాపల్లి జిల్లా సమీపంలో రూ.1.4 లక్షల కోట్ల పెట్టుబడితో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేస్తున్నాం. ప్రభుత్వ ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలిస్తామన్నారు.



టాటా గ్రూప్ చైర్మన్ చంద్రశేఖరన్‌తో మంత్రులు లోకేశ్, టీజీ భరత్

డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయండి

మాస్టర్ కార్డ్ హెల్త్ కేర్ బిజినెస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, మార్కెటింగ్ చీఫ్ రాజమన్నార్‌తో లోకేశ్ భేటీ అయ్యారు. ఏపీలో డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. తమ రాష్ట్రంలో ఐటీ శ్రామిక శక్తిని తయారు చేయడానికి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలని కోరారు. రాజమన్నార్ మాట్లాడుతూ తమ బోర్డు సభ్యులతో చర్చించి, ఏపీలో కార్యకలాపాల విస్తరణపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.



గ్లోబల్ కెపాసిటీ సెంటర్ ఏర్పాటుపై....

విశాఖలో సిస్కో గ్లోబల్ కెపాసిటీ సెంటర్ (జీసీసీ) ఏర్పాటు చేయాలని మంత్రి లోకేశ్ విజ్ఞప్తి చేశారు. ప్రముఖ బహుళజాతి ఐటీ సంస్థ సిస్కో వైస్ ప్రెసిడెంట్ ఫ్రాన్సిస్ కట్సౌదాస్‌కు ఈ మేరకు సూచించారు.

ఫుడ్ ఇన్నోవేషన్ సెంటర్ పెట్టండి

ఆహార పదార్థాలు, వస్తువుల ట్రేడింగ్‌లో పేరున్న కార్గిల్ సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ డేవిడ్ వెబ్‌స్టర్‌తో లోకేశ్ సమావేశమయ్యారు. ఏపీలో ఫుడ్ ఇన్నోవేషన్ సెంటరు పెట్టాలని ఆయనను కోరారు.

లాజిస్టిక్ బిజినెస్ సెంటర్లు ఏర్పాటు చేయండి

అంతర్జాతీయ స్థాయి లాజిస్టిక్ సంస్థ డీహెచ్ఎల్ సీఈవో ప్లాబో సియానోతో జరిగిన భేటీలో.. ఏపీలో లాజిస్టిక్ బిజినెస్ సెంటర్ల ఏర్పాటును పరిశీలించాలని లోకేశ్ కోరారు. ఓడరేవులు, పరిశ్రమల హబ్‌లు, కోల్డ్ స్టోరేజీలు ఉన్న ఏపీలో కనెక్టింగ్ మెర్క్స్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

గ్లోబల్ డెలివరీ సెంటర్ ఏర్పాటుకు వినతి

విశాఖ, తిరుపతిలో ఎక్కడో ఒకచోట గ్లోబల్ డెలివరీ సెంటర్‌ను ఏర్పాటుచేయాలని ఎర్నెస్ట్ యంగ్(ఈవై) ఇండియా సీఈవో, సీఐఐ ప్రెసిడెంట్ రాజీవ్ మెమానిని లోకేశ్ కోరారు. రాజీవ్ స్పందిస్తూ.. తమ సంస్థ 1.5 బిలియన్ డాలర్లతో ఈవై ఏఐ ప్లాట్‌ఫారంను ప్రారంభించిందని, ఏపీలోనూ కార్యకలాపాలు ప్రారంభించే అవకాశాలను పరిశీలిస్తామన్నారు.

ఏఐ వినియోగంలో ఏపీ టాప్: లోకేశ్

ఏపీ ప్రభుత్వం ఏఐ, డీప్‌టెక్ వంటి అధునాతన సాంకేతికత వినియోగంలో ముందంజలో ఉందని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. కృత్రిమ మేధ అంశంపై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఏపీ పాలనా వ్యవస్థలో ఏఐ వినియోగానికి గూగుల్ వంటి దిగ్గజ సంస్థల సహకారాన్ని తీసుకుంటున్నామని చెప్పారు. ఏపీ రాజధాని అమరావతిలో ఏఐ సిటీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. హెల్త్‌కేర్, సుస్థిరత వంటి కీలక రంగాల్లో ఏఐ వినియోగాన్ని వేగవంతం చేసేందుకు గత ఏడాది డిసెంబరులో గూగుల్‌తో ఒప్పందం కుదుర్చుకున్నామని తెలిపారు. ఈ ఏడాది గ్లోబల్ ఏఐ మార్కెట్ 243 బిలియన్ డాలర్లకు చేరుకోనుందని లోకేశ్ తెలిపారు.

పునరుత్పాదక ఇంధన రంగంలో 10 లక్షల కోట్ల పెట్టుబడులు

'పర్యావరణ పరిరక్షణ-వాతావరణ ఉద్యమ భవిష్యత్తు' అంశంపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో లోకేశ్ మాట్లాడుతూ ఏపీలో 5,230 మెగావాట్ల సామర్థ్యంతో ప్రపంచంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ రెన్యువబుల్ ఎనర్జీ స్టోరేజ్ ప్రాజెక్టు ఏర్పాటవుతోందని, త్వరలో ఇది ప్రారంభానికి సిద్ధమవుతోందని తెలిపారు. శిలాజేతర ఇంధన వనరుల నుంచి 25 గిగావాట్ల స్థాపిత సామర్థ్యంతో పునరుత్పాదక ఇంధన రంగంలో ఏపీ గణనీయమైన ప్రగతిని సాధిస్తోందన్నారు. 160 గిగావాట్లకుపైగా పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని జోడించడం ఈ పాలసీ లక్ష్యమన్నారు. రెన్యువబుల్ ఎనర్జీ రంగంలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు, 7.5 లక్షల మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి లక్ష్యమన్నారు.

ఏపీకి రండి!

(మొదటి పేజీ తరువాయి)

భావిస్తున్నారు. మార్క్స్ సంస్థ సీఈవో విన్సెంట్ క్లర్క్‌తో సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. వెయ్యి కిలోమీటర్ల సముద్రతీర ప్రాంతం కలిగి ఉండి, విస్తారంగా పోర్టులు కలిగిన ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టాలని విన్సెంట్‌ను ఆహ్వానించారు. రాష్ట్రంలో మానవ వనరులకు లోటు లేదని చంద్రబాబు వెల్లడించారు. ముఖ్యమంత్రితో చర్చల సందర్భంగా పెట్టుబడులు పెట్టేందుకు విన్సెంట్ సానుకూలతను వ్యక్తంచేశారు. రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలను పరిశీలించాలని ఆయనను చంద్రబాబు ఆహ్వానించగా, విన్సెంట్ సానుకూలంగా స్పందించారు. త్వరలో రాష్ట్ర పర్యటనకు వస్తానని ఆయన హామీ ఇచ్చారు.

ఎల్జీ కెమ్ లిమిటెడ్ సీఈవోతో భేటీ

ఏపీలో పెట్టుబడులకు విస్తృతావకాశాలు ఉన్నాయని ఎల్జీకెమ్ లిమిటెడ్ సీఈవో షిన్‌హక్ చియోల్‌కు చంద్రబాబు తెలిపారు. దక్షిణ కొరియాలో అతిపెద్ద కెమికల్ కంపెనీ ఇది. 1.5 బిలియన్ లిథియం అయాన్ బ్యాటరీ ప్లాంట్ ఏర్పాటు యోచనలో ఆ సంస్థ ఉంది. ఆ ప్లాంట్‌ను ఏపీలో ఏర్పాటు చేయాలని చియోల్‌ను చంద్రబాబు కోరారు. మూలపేట, విశాఖపట్నంలో పెట్రోకెమికల్ యూనిట్‌ను, తిరుపతిలో సెమీకండక్టర్ల యూనిట్‌ను ఏర్పాటుచేసేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు. పెట్టుబడుల ఆకర్షణ కోసం ఆంధ్రప్రదేశ్-దక్షిణకొరియాల మధ్య రాయబారిగా ఉండాలని షిన్‌హక్ చియోల్‌ను చంద్రబాబు కోరారు.

కార్ల్స్‌బెర్గ్ గ్రూప్ సీఈవోతో చర్చలు

ఇంటిగ్రేటెడ్ బ్రూవరీ, బాట్లింగ్ యూనిట్‌ను రాష్ట్రంలో నెలకొల్పాలని కార్ల్స్‌బెర్గ్ సంస్థ సీఈవో జాకబ్ అరుప్ అండర్సన్‌ను సీఎం చంద్రబాబు కోరారు. విశాఖపట్నం, కృష్ణపట్నం, శ్రీసిటీలోని ఇండస్ట్రియల్ పార్కులను పరిశీలించాలని ఆహ్వానించారు. బార్లీ, మొక్కజొన్న, వరి వంటి ముడి సరుకు అత్యధికంగా ఏపీలో పండుతుందని తెలిపారు. ఇందుకోసం రైతులతో భాగస్వామిగా మారాలని కోరారు.

మిత్తల్ ప్రాజెక్టుపైనా సమాలోచనలు

అనకాపల్లిలో రూ.1.4 లక్షలకోట్ల పెట్టుబడితో 17.8 మిలియన్ టన్నుల సామర్థ్యంతో ఏర్పాటుచేస్తున్న ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్రాజెక్టుపై ఆర్సెలార్ మిత్తల్ /నిప్పన్ స్టీల్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ లక్ష్మీమిత్తల్‌తో సీఎం చంద్రబాబు సమాలోచనలు జరిపారు. ఇది ఇటీవల రాష్ట్రానికి వచ్చిన అతిపెద్ద ప్రాజెక్టుల్లో ఒకటి. వెల్స్‌వన్ చైర్మన్ బీకే గోయంకాతోనూ చంద్రబాబు సమావేశమయ్యారు.

కాగ్నిజెంట్ రవికుమార్‌తో సమావేశమయ్యా : చంద్రబాబు

రాష్ట్రంలో యువతకు ఐటీ రంగంలో ఉద్యోగావకాశాలు మరింతగా దక్కేందుకు మార్గం సుగమమైందని సీఎం చంద్రబాబు అన్నారు. కాగ్నిజెంట్ సీఈవో ఎస్.రవికుమార్‌తో మంగళవారం జరిగిన సమావేశం వివరాలను 'ఎక్స్'లో పంచుకున్నారు. "ఐటీ రంగంలో కాగ్నిజెంట్ సంస్థ గ్లోబల్ లీడర్. రాష్ట్రంలోని పలు పట్టణాల్లో నైపుణ్యాభివృద్ధి సెంటర్లను ఏర్పాటుచేసేందుకు ముందుకు రావాలని రవికుమార్‌ను కోరాను. ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్, రెన్యువబుల్ ఎనర్జీ వంటి రంగాల్లో నైపుణ్యం కలిగిన యువత ఏపీలో ఉన్నారని తెలిపాను. వారిప్పుడు ప్రపంచవ్యాప్తంగా రాణిస్తున్న విషయం ఆయన దృష్టికి తీసుకెళ్లాను" అని చంద్రబాబు తెలిపారు.

ఇన్‌ల్యాండ్ వాటర్ సేవలు పరిచయం చేయండి

ఏపీలో ముఖ్యమైన నదులు, కాల్వలు, సరస్సుల వెంబడి ఇన్‌ల్యాండ్ వాటర్ సర్వీసులను పరిచయం చేయాలని మంత్రి లోకేశ్ ఉబెర్ ఉపాధ్యక్షుడు మధుకానన్‌ను కోరారు. ఉబెర్ యాప్ ద్వారా శ్రీనగర్ దాల్ సరస్సులో షికారా రైడ్ తరహాలో స్పీడ్ బోట్ సర్వీసులను ఏపీలోనూ ప్రారంభించాలని కోరారు. విశాఖపట్నంలో రీజనల్ టెక్నాలజీ హబ్ ఏర్పాటు చేయాలన్నారు. ఏపీలో ఎలక్ట్రిక్ వాహన రంగం వేగం పుంజుకుంటున్న నేపథ్యంలో రాష్ట్రమంతటా చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని సూచించారు. పర్యాటక రంగానికి తమ ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని, క్యూరెటెడ్ మార్గాలు, హెరిటేజ్ సైట్‌లలో ఎలక్ట్రిక్ షటిల్ సేవలను ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. మధుకానన్ స్పందిస్తూ ఏపీ ప్రతిపాదనలను పరిశీలిస్తామన్నారు.

దసాల్ట్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ఫ్లోరెన్స్‌తో లోకేశ్ భేటీ

విశాఖపట్నం లేదా తిరుపతిలో గ్లోబల్ కెపబిలిటీ సెంటర్ (జీసీసీ)ను ఏర్పాటు చేయాలని దసాల్ట్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ఫ్లోరెన్స్ వర్జైలాన్‌ను లోకేశ్ కోరారు. చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఫ్లోరెన్స్ తెలిపారు. రక్షణ పరికరాల తయారీ ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలని భారత్ ఫోర్జ్ వైస్ చైర్మన్ కల్యాణిని లోకేశ్ కోరారు. రక్షణ రంగ పరికరాల తయారీ కోర్సులతో కొత్త ఐటీఐలను ఏర్పాటు చేయాలన్నారు. కల్యాణి స్పందిస్తూ.. మూర్దనహళ్లిలో వెయ్యి ఎకరాల్లో రూ.2400 కోట్లతో రక్షణ తయారీ పరికరాల యూనిట్‌ను వేగవంతం చేస్తామన్నారు.

పదవులపై మాట్లాడొద్దు!

- జనసేన నేతలకు అధిష్ఠానం ఆదేశం
- సీఎం, డిప్యూటీ సీఎం పదవుల వ్యాఖ్యలపై సీరియస్
- టీడీపీలోనూ చంద్రబాబు ఆదేశాలతో తగ్గిన నేతలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

సీఎం, డిప్యూటీ సీఎం పదవులపై రాష్ట్రంలో తీవ్ర చర్చ జరుగుతోంది. మంత్రి లోకేశ్‌కు డిప్యూటీ సీఎం పదవి ఇవ్వాలని టీడీపీకి చెందిన మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, పిఠాపురం నాయకుడు ఎస్వీఎస్ఎన్ వర్మ.. ఇలా ప్రతి ఒక్కరూ బహిరంగంగా డిమాండ్ చేస్తున్నారు. టీడీపీ సోషల్ మీడియా టీమ్ కూడా దీనిపై భారీగానే పోస్టులు పెట్టడం ప్రారంభించింది. మరోవైపు కూటమి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న జనసేన పార్టీ నాయకులు, ఆ పార్టీ సోషల్ మీడియా సిబ్బంది కూడా తమ అధినేత పవన్ కల్యాణ్‌ను సీఎం చేయాలని పోస్టులు చేయడం ప్రారంభించారు. జనసేన నేత కిరణ్ రాయల్ ఒకడుగు ముందుకేసి పవన్‌ను సీఎంగా చూడాలని తాము పదేళ్ల నుంచి కోరుకుంటున్నామన్నారు. లోకేశ్‌ను డిప్యూటీ సీఎంగా చూడాలని టీడీపీ నేతలు కోరుకోవడంలో తప్పులేదని, అలానే తాము కూడా పవన్‌ను సీఎంగా చూడాలని కోరుకుంటున్నామని వ్యాఖ్యానించారు. టీడీపీ నేతలకు, సోషల్ మీడియాకు బ్రేక్ వేసేందుకు స్వయంగా సీఎం చంద్రబాబు స్పందించి డిప్యూటీ సీఎం, సీఎం పదవులపై ఎవ్వరూ ఎలాంటి వ్యాఖ్యలూ చేయవద్దని సూచించారు. కూటమి ప్రభుత్వంలో అన్నీ సమష్టి నిర్ణయాలు ఉంటాయన్న విషయాన్ని గుర్తించాలని పేర్కొన్నారు. ఇదే సమయంలో జనసేన కేంద్ర కార్యాలయం కూడా ఈ అంశంపై స్పందించింది. డిప్యూటీ సీఎం అంశంపై ఎవ్వరూ మాట్లాడొద్దని, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టవద్దని, మీడియాతోనూ మాట్లాడవద్దని స్పష్టం చేసింది. పార్టీ లైన్‌కు విరుద్ధంగా ఎవ్వరూ ఎలాంటి వ్యాఖ్యలూ చేయవద్దని, తమ ఆదేశాలను పాటించాలని తేల్చిచెప్పింది. ఇప్పటికే మీడియా ముఖంగా డిప్యూటీ సీఎం, సీఎం పదవులపై మాట్లాడిన కొంత మంది నాయకులను పార్టీ కార్యాలయం గట్టిగానే మందలించింది.

వైసీపీ పెట్టిన చిచ్చే!

కూటమి పార్టీల మధ్య చిచ్చు పెట్టాలని వైసీపీ ఎప్పటి నుంచో ప్రయత్నాలు చేస్తోంది. ఆ ప్రయత్నాల్లో భాగంగానే సీఎం, డిప్యూటీ సీఎం పదవులపై అసత్య ప్రచారాన్ని తెరపైకి తెచ్చింది. దీంతో టీడీపీ, జనసేన నాయకులూ ఆ పదవులపై మీడియా ముందు హడావుడి చేశారు. టీడీపీ అధిష్ఠానం, జనసేన పార్టీ కేంద్రం కార్యాలయం ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుని ఇరు పార్టీల నేతలను మందలించడం ద్వారా ఇప్పటికి ఈ సమస్యను సద్దుమణిగేలా చేశాయి. అయితే, భవిష్యత్తులోనూ వైసీపీ ఇలాంటి అసత్య ప్రచారాలను మరిన్ని సృష్టించే అవకాశం లేకపోలేదు.

నాపై నమ్మకంతో కీలక బాధ్యతలిచ్చారు

- విద్యారంగంలో విప్లవాత్మక మార్పులను సీఎం కోరుకుంటున్నారు
- వేరే ఆలోచనలకు తావు లేదు
- 'డిప్యూటీ' ప్రచారంపై లోకేశ్ స్పష్టీకరణ

అమరావతి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): 'సీఎం చంద్రబాబు నాపై నమ్మకంతో చాలా కీలక బాధ్యతలు అప్పగించారు. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలని ఆయన ఆశిస్తున్నారు. ఆయన నమ్మకాన్ని, ఆశయాన్ని సాధించేందుకు క్షణం తీరిక లేకుండా శ్రమిస్తున్నా. ఇతర ఆలోచనలకు తావులేదు' అని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. లోకేశ్‌కు డిప్యూటీ సీఎం పదవి ఇవ్వాలని నేతల నుంచి వస్తున్న డిమాండ్ల గురించి మంగళవారం స్విట్జర్లాండ్‌లోని దావోస్ పట్టణంలో ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు లోకేశ్ పైవిధంగా స్పందించారు. గత ఎన్నికల్లో ప్రజలు తిరుగులేని విజయాన్ని అందించారని, రాజకీయంగా ఎలాంటి ఇబ్బందులూ లేకుండా కూటమి ప్రభుత్వం సాగిపోతోందని లోకేశ్ పేర్కొన్నారు.

కలెక్టర్‌కూ తప్పని 'సైబర్' షాక్!


కలెక్టర్ ప్రొఫైల్ ఫొటోతో శ్రీలంక నుంచి వచ్చిన సందేశాలు

బాపట్ల, జనవరి 21(ఆంధ్రజ్యోతి): సైబర్ మోసగాళ్లు ఏకంగా జిల్లా కలెక్టర్ ప్రొఫైల్ ఫొటోతో శ్రీలంక దేశానికి చెందిన కోడ్‌తో ఉన్న ఫోన్ నంబర్‌తో సిబ్బందికి మెసేజ్‌లు పంపించారు. దీంతో కలెక్టరేట్ సహా ప్రభుత్వ కార్యాలయాల సిబ్బంది ఉలిక్కిపడ్డారు. ఈ ఘటన మంగళవారం బాపట్ల జిల్లాలో వెలుగు చూసింది. కలెక్టరేట్‌లోని 'సీ' సెక్షన్ విభాగంలో ఓ ఉద్యోగికి కలెక్టర్ వెంకటమురళి ప్రొఫైల్ ఫొటోతో ఉన్న నంబరు నుంచి "హలో.. వాట్ ఆర్ యూ డూయింగ్" సహా మరో రెండు మెసేజ్‌లు వచ్చాయి. సదరు ఉద్యోగికి అనుమానం రావడంతో విషయాన్ని కలెక్టర్ సీసీ దృష్టికి తీసుకెళ్లారు. ఇదే సమయంలో మరో ముగ్గురికి కూడా ఇదే తరహా మెసేజ్‌లు అదే నంబరు నుంచి రావడంతో వెంటనే కలెక్టర్ పేషీ అప్రమత్తమైంది. వివిధ ఫోన్ నంబర్లతో జిల్లా కలెక్టర్ పేరిట మెసేజ్‌లు చేస్తూ సైబర్ దుండగులు ఫేక్ అకౌంట్ సృష్టించినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. జిల్లా అధికారులతో పాటు సిబ్బంది కూడా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వెంకటమురళి సూచించారు.

పేదల సాగులో ఉన్న దేవాలయ భూములకు శాశ్వత యాజమాన్య హక్కు పత్రాలు ఇవ్వాలి

- రెవెన్యూ మంత్రికి వినతిపత్రం అందజేసిన సీపీఐ రామకృష్ణ

అమరావతి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): అంతర్వేదిలో వివిధ దేవాలయాల భూములను తరతరాలుగా సాగు చేసుకుంటున్న పేదలకు శాశ్వత యాజమాన్య హక్కు పత్రాలు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం ఆయన రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. అంతర్వేది, కేసుదాసుపాలెం, గొంది, శృంగవరప్పాడు గ్రామాల్లో వందలాది మంది నిరుపేదలు తరతరాలుగా దేవాలయాల భూములను సాగు చేసుకుంటున్నారని, కొంతమంది ఇళ్లు కట్టుకుని నివసిస్తున్నారని తెలిపారు. కడప జిల్లాలో నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, ఇంటి పట్టాలు ఇవ్వాలని, శ్రీ సత్యసాయి జిల్లాలోని నిడమామిడి జంగం భూమిలో 22 గ్రామాలకు చెందిన సుమారు 1,000 మందికి పట్టాలు మంజూరు చేయాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించి పేదలకు న్యాయం చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు రామకృష్ణ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, ఏఐవైఎఫ్ కడప జిల్లా ప్రధాన కార్యదర్శి గంగా సురేశ్ తదితరులు మంత్రిని కలిశారు.

కొత్తగా మరో 63 అన్న క్యాంటీన్లు మంజూరు

అమరావతి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా మరో 62 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కొత్తగా 63 అన్న క్యాంటీన్లు మంజూరుచేస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది. పట్టణాభివృద్ధి అథారిటీ పరిధిలో నిర్వహించనున్న ఈ అన్న క్యాంటీన్లకు ఆయా పట్టణాభివృద్ధి అథారిటీలకు సంబంధించి అందుబాటులో ఉన్న నిధులతో చేపడతారు. ఒక్కో అన్న క్యాంటీన్‌కు రూ.61 లక్షల చొప్పున మొత్తం రూ.38.43 కోట్లను మంజూరుచేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.


ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టులు

దండకారణ్యంలో

కాల్పుల మోత

(మొదటి పేజీ తరువాయి)

ఎన్‌కౌంటర్‌లో 16 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఈ సంఖ్య అంతకంటే ఎక్కువే అని కూడా వార్తలు వస్తున్నాయి. మృతుల్లో మావోయిస్టు అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు రామచంద్రారెడ్డి గారి ప్రతాప్ రెడ్డి జయరాంరెడ్డి అలియాస్ చలపతి ఉన్నారు. మరో ముగ్గురు కేంద్ర కమిటీ సభ్యులు కూడా ఎన్‌కౌంటర్‌లో మరణించినట్లు పోలీసు వర్గాలు చెబుతున్నాయి. పోలీసుల కథనం ప్రకారం.. కుల్హారిఘాట్ రక్షిత అటవీ ప్రాంతంలో చలపతి, ఆయన దళ సభ్యులు.. మొత్తం 60 మంది మావోయిస్టులు తలదాచుకున్నట్లు నిఘావర్గాలు ఛత్తీస్‌గఢ్ పోలీసులకు సమాచారం అందించాయి. దీంతో.. ఈ నెల 19వ తేదీ గరియాబంద్ ఎస్పీ నిఖిల్ రఖేచా, నౌపాడ ఎస్పీ గుండాల రాఘవేంద్ర, ఒడిసా నక్సల్స్ ఆపరేషన్ డీఐజీ అఖిలేశ్వర్‌సింగ్, కోబ్రా కమాండెంట్ డీఎస్ కథాటే నేతృత్వంలో ఇరు రాష్ట్రాలకు చెందిన సుమారు వెయ్యి మంది జవాన్లు రంగంలోకి దిగారు. ఒడిసా యాంటీ-నక్సల్స్ విభాగం స్పెషల్ ఆపరేషన్ గ్రూప్(ఎస్‌వోజీ)కి చెందిన మూడు యూనిట్లు నాలుగు డ్రోన్ కెమెరాలతో అర్ధచంద్రాకారంలో ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టగా.. మిగతా భాగాన్ని ఛత్తీస్‌గఢ్ డీఆర్‌జీ, సీఆర్పీఎఫ్, కోబ్రా బలగాలు చక్రవ్యూహం మాదిరిగా దిగ్బంధనం చేశాయి. నక్సల్స్ ఉన్న ప్రాంతానికి ఓవైపు ఎత్తైన గుట్టలు ఉండగా.. బలగాలు వాటిపైనా మోహరించాయి. నక్సల్స్ ఎటూ తప్పించుకునే వీలులేకుండా ముందుకు సాగాయి. పారిపోతున్న మావోయిస్టులను గుర్తించేందుకు డ్రోన్ కెమెరాలను రంగంలోకి దింపాయి. ఆ అడవి నుంచి బయటకు వెళ్లే మార్గాల్లో ఐదు కిలోమీటర్ల దూరంలో డాగ్‌స్క్వాడ్స్‌ను మోహరించాయి.

40 గంటలు నిర్విరామంగా...

ఆదివారం అర్ధరాత్రి దాటాక.. నక్సల్స్ తారసపడడంతో కాల్పులు మొదలయ్యాయి. పచ్చటి అడవుల్లో నిర్విరామంగా కాల్పుల మోత మోగింది. మంగళవారం ఉదయం వరకు.. అంటే 40 గంటలపాటు సుదీర్ఘ ఎన్‌కౌంటర్ కొనసాగింది. మంగళవారం సాయంత్రం కడపటి వార్తలందేసరికి కాల్పులు కొనసాగుతూనే ఉన్నాయి. సోమవారం సాయంత్రం ఇద్దరి మృతదేహాలు... మంగళవారం రాత్రికి మరో 14 మంది మృతదేహాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. రాయ్‌పూర్ ఐజీ అమ్రేశ్ విశ్రా ఈ ఆపరేషన్‌ను పర్యవేక్షించారు.

మృతుల్లో ఎవరెవరు?

మృతుల్లో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు చలపతి(61) ఉన్నట్లు ఛత్తీస్‌గఢ్ పోలీసులు నిర్ధారించారు. ఆయన తలపై రూ.కోటి రివార్డు ఉంది. కేంద్ర కమిటీకి చెందిన సభ్యులు మనోజ్, గుడ్డు, బాలన్న, చలపతి భార్య కూడా మృతిచెందారనే వార్తలు వస్తున్నా.. ఇంకా గుర్తించాల్సి ఉందని పోలీసులు తెలిపారు. నల్లగొండ జిల్లా చండూరు మండలం పుల్లెంల గ్రామానికి చెందిన పాక హనుమంతు అలియాస్ గణేశ్ సైతం మృతిచెందినట్లు తెలుస్తోంది. ఘటనాస్థలి నుంచి పెద్దఎత్తున ఏకే-47, ఎస్ఎల్ఆర్ వంటి తుపాకులు, మందుగుండు సామగ్రి, ఐఈడీలను స్వాధీనం చేసుకున్నామని పోలీసులు పేర్కొన్నారు. మావోయిస్టులు జరిపిన కాల్పుల్లో ఒడిసా ఎస్‌వోజీ జవాను ద్రాము కాలికి, ఛత్తీస్‌గఢ్ జవాను ధర్మేంద్ర భోయ్ చేతికి తూటా గాయాలయ్యాయని, వారిని చికిత్స నిమిత్తం హెలికాప్టర్ ద్వారా రాయ్‌పూర్‌లోని నారాయణ ఆస్పత్రికి తరలించినట్లు వెల్లడించారు.

2025లో వరుస దెబ్బలు

గత ఏడాది నుంచే మావోయిస్టు పార్టీ వైపు నష్టం పెరిగింది. 265 మంది నక్సల్స్ హతమవ్వగా.. సుమారు 800 అరెస్టులు/లొంగుబాట్లు జరిగాయి. 2025 ఆరంభం నుంచే నక్సల్స్‌కు ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఈ నెల 5న బీజాపూర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు, 15న బీమారంపాడు అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 12 మంది, తాజాగా గరియాబంద్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 27 మంది మావోయిస్టులు మృతి చెందారు. కాగా.. తాజా ఎన్‌కౌంటర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయి స్పందించారు. నక్సలైట్లు ఆఖరి శ్వాస తీసుకుంటున్నారని, ఇది బలగాల గొప్ప విజయమని అమిత్‌షా పేర్కొనగా.. భారీ ఆపరేషన్‌లో విజయం సాధించిన బలగాలను విష్ణుదేవ్ అభినందించారు. 2026 మార్చికల్లా ఛత్తీస్‌గఢ్‌లో నక్సలిజం లేకుండా చేస్తామని ఇరువురూ పునరుద్ఘాటించారు.

ఇంగ్లిష్ నేర్పించే హనుమంతు!



ఈ ఎన్‌కౌంటర్‌లో మృతిచెందినట్లుగా భావిస్తున్న నల్లగొండ జిల్లాకు చెందిన పాక హనుమంతు 42 ఏళ్ల క్రితం నక్సల్స్ ఉద్యమంలో చేరారు. నల్లగొండలో డిగ్రీ చదివే సమయంలోనే ర్యాడికల్ విద్యార్థి సంఘం వైపు ఆకర్షితుడయ్యారు. ఏబీవీపీ-ర్యాడికల్ విద్యార్థుల మధ్య 1982లో జరిగిన ఘర్షణలో ఇతనే ప్రధాన నిందితుడు కావడంతో.. అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఆయన దళంలోనే ఛత్తీస్‌గఢ్‌కు చెందిన యువతిని వివాహం చేసుకున్నారు. మావోయిస్టులకు ఇంగ్లిష్, రాజనీతి శాస్త్రంలో పాఠాలు చెప్పేవాడని, పలు భాషలను అనువదించేవాడని సమాచారం. వాస్తవానికి ఐదేళ్ల క్రితమే హనుమంతు అనారోగ్యంతో మృతిచెందినట్లు వార్తలొచ్చాయి. అయితే.. నెలక్రితం తాను బతికే ఉన్నట్లు బంధుమిత్రులకు సమాచారం ఇచ్చారు. అంతలోనే ఎన్‌కౌంటర్‌లో మృతిచెందినట్లు మళ్లీ వార్తలు వస్తున్నాయి. రెండేళ్ల క్రితం తండ్రి, ఇటీవల తల్లి మృతిచెందారు. హనుమంతు నివసించిన గుడిసె ప్రస్తుతం శిథిలావస్థలో ఉంది. ఆయన ఇద్దరు సోదరులు నల్లగొండలో కూలీపనులు చేసుకుంటున్నారు.

కేంద్ర కమిటీలో.. మిగిలింది 14 మంది తెలుగువాళ్లే!

హైదరాబాద్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మావోయిస్టు కేంద్ర కమిటీ నాయకులను కాపాడుతూ వస్తున్న అబూజ్‌మడ్‌లో బలగాలు చొచ్చుకువెళ్తుండడంతో.. మావోయిస్టులు కొత్త షెల్టర్‌జోన్‌కు మారుతున్నారు. సింహభాగం కేంద్ర కమిటీ సభ్యులు వయసు పైబడడంతో వృద్ధాప్య సంబంధిత అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. మంగళవారం నాటి ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన చలపతి కూడా రెండు కర్రల సాయంతోనే నడిచేవారు. ప్రస్తుతం కేంద్ర కమిటీలో 14 మంది తెలుగు వారుండగా.. వీరిలో పది మందికి పైగా ఇలాంటి సమస్యలతో బాధపడుతున్నారు. వీరిలో.. మావోయిస్టు పార్టీ రథసారథి నంబాళ్ల కేశవరావు, మాజీ కార్యదర్శి ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి, మల్లోజుల వేణుగోపాల్ 70 ఏళ్లకు పైబడ్డ వారే.! వీరు జ్ఞాపకశక్తి సమస్యలను ఎదుర్కొంటూ.. మనుషులను గుర్తించలేకపోతున్నారని సమాచారం. మిగతా వారిలో కడారి సత్యనారాయణరెడ్డి, మోడెం బాలకృష్ణ, తెంటూ లక్ష్మీనర్సింహాచలం, పుల్లూరి ప్రసాదరావు కూడా అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారు.

రిక్రూట్‌మెంట్లు లేక.. అగ్రనాయకులు, క్యాడర్ వరుస ఎన్‌కౌంటర్లు, పెద్ద సంఖ్యలో లొంగుబాట్లతో మావోయిస్టు పార్టీ ఇబ్బందులను ఎదుర్కొంటోంది. ఈ పరిస్థితుల్లో ఓ వైపు కేంద్ర బలగాలను ఎదుర్కోవడం.. మరోవైపు అగ్రనేతలను కాపాడుకోవడం ఇప్పుడు మావోయిస్టు పార్టీకి సవాలుగా మారింది. మల్లోజుల కోటేశ్వరరావు భార్య పోతుల కల్పన కేంద్ర కమిటీ సభ్యుల్లో ఏకైక మహిళ కాగా.. ఆమె జనతన సర్కార్ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. అడపాదడపా పోలీసుల వ్యూహాలను తిప్పికొడుతున్న కేంద్ర కమిటీ సభ్యుల్లో తిప్పిరి తిరుపతి, గాజర్ల రవి, కట్టా రామచంద్రారెడ్డి, బడే దామోదర్ అలియాస్ చొక్కారావు, పసునూరి నరహరి ఉన్నారు. అయితే.. అరెస్టవుతున్న, లొంగిపోతున్న మావోయిస్టులతో ఇప్పుడు దళాలకు ముప్పు పొంచి ఉందని తెలుస్తోంది. కాంకేర్‌లో అరెస్టయిన ప్రభాకర్‌రావు ద్వారా.. మావోయిస్టు పార్టీ అగ్ర నాయకత్వానికి సంబంధించిన కీలక సమాచారం నిఘావర్గాలకు చేరినట్లు తెలుస్తోంది. కేంద్ర కమిటీ సభ్యులు ఎక్కడున్నారనే సమాచారాన్ని పక్కాగా తెలుసుకున్నాకే.. బలగాలు దాడులకు పాల్పడడం ఇందుకు నిదర్శనం. తన బెటాలియన్‌కు చెందిన 30 మంది వరకు మావోయిస్టులు లొంగిపోయాక.. హిడ్మా కూడా పెద్దగా దాడులు జరిపిన దాఖలాలు లేవు.

చలపతి.. మాస్టర్‌మైండ్!

అలిపిరిలో చంద్రబాబుపై దాడిలో కీలక భూమిక



చిత్తూరు అర్బన్/చింతూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్-ఒడిశా సరిహద్దుల్లో ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు చలపతి అలియాస్ అప్పారావు అలియాస్ జైరాం ఆంధ్రప్రదేశ్ వాసి. అసలు పేరు రామచంద్రారెడ్డి గారి ప్రతాప్‌రెడ్డి. వ్యూహాత్మక దాడుల రూపకల్పనలో దిట్టగా పోలీసులు సైతం చెబుతున్నారు. ఆయనది మాస్టర్ మైండ్‌గా అభివర్ణిస్తుంటారు. 2003లో అప్పటి సీఎం చంద్రబాబుపై అలిపిరి వద్ద నక్సల్స్ చేసిన దాడి కీలక సూత్రధారి చలపతే. 2010లో దేశవ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన బలిమెల జలాశయంలో గ్రేహౌండ్స్ బలగాలు ప్రయాణిస్తున్న లాంచీపై దాడి ఘటనలోనూ ముఖ్య పాత్ర పోషించారు. ఈ ఘటనలో 30 మందికిపైగా పోలీసులు మృతిచెందారు. 2011లో ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా కలెక్టర్ వినీల్ కృష్ణను కిడ్నాప్ చేసిన ఘటనలోనూ ప్రధాన సూత్రధారి. వీటితో పాటు 2018లో నాటి అరకు ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సివేరి సోమలను మావోయిస్టులు కాల్చి చంపిన ఘటనలోనూ ఆయన పాత్ర ఉన్నట్లు చెబుతారు. ఛత్తీస్‌గఢ్‌లోనూ పలు దాడుల్లో ఈయన పాత్ర కీలకం. ఈయన తలపై రూ.కోటి రివార్డు కూడా ఉంది. మావోయిస్టు పీఎల్‌జీఏ దళం ఒకటో బెటాలియన్ కమాండర్ మాడ్వి హిడ్మాకు ఈయనే గురువు. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడైన చలపతిని చంపినందుకు కేంద్ర బలగాలను అభినందిస్తూ ఏకంగా కేంద్ర హోం మంత్రి అమిత్‌షా 'ఎక్స్'లో పోస్టు పెట్టారంటేనే ఈయన ఎంత కీలకమైన మావోయిస్టు నాయకుడో అర్థం చేసుకోవచ్చు. చలపతి స్వస్థలం చిత్తూరు జిల్లా తవణంపల్లె మండలం మత్యం పైపల్లె ఆయన స్వస్థలం. కానీ ఊరితో ఆయనకు సంబంధమే లేదని.. ఈయన తాత, తండ్రులు ఇక్కడే పుట్టి పెరిగారని.. చలపతి పుట్టకముందే ఊళ్లో ఉన్న పూరి గుడిసెను, కొద్దిపాటి స్థలాన్ని అమ్ముకుని వెళ్లిపోయారని గ్రామస్థులు చెబుతున్నారు. ప్రస్తుతం ఈ ఊరిలో ఆయన సోదరుడి కుమారుడు మాత్రమే ఉన్నారు. మరో అన్న చంద్రశేఖర రెడ్డి మదనపల్లె పట్టుపరిశ్రమ శాఖలో పనిచేస్తున్నారు. పోలీసుల భయంతో చలపతి కుటుంబంతో తమ బంధుత్వం చెప్పడానికి గ్రామస్థులు జంకుతున్నారు.

పట్టు ఉద్యోగం వదిలి..

పదో తరగతి వరకు చదువుకున్న ప్రతాప్ రెడ్డి అలియాస్ చలపతి మదనపల్లెలో సెరికల్చర్ ఉద్యోగిగా పనిచేసేవారు. తొలుత చిత్తూరు జిల్లా అడవుల్లో ఉద్యమాన్ని విస్తరించారు. విశాఖపట్నం జిల్లాకు బదిలీ అయ్యాక అక్కడ నక్సల్స్(మావోయిస్టులు) నేతలతో పరిచయాలు ఏర్పడి.. తదనంతరం అజ్ఞాతంలోకి వెళ్లినట్లు తెలిసింది. తర్వాత మావోయిస్టు పార్టీలో అంచెలంచెలుగా ఎదిగారు. కేంద్ర కమిటీలోకి వెళ్లకముందు ఆంధ్ర-ఒడిశా సరిహద్దు (ఏవోబీ)లో ఎక్కువ కాలం పనిచేశారు. 2015లో ఒడిశా రామగూడ అటవీ ప్రాంతంలో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో 32 మంది మావోయిస్టులు చనిపోయాక ఏవోబీలోని మావోయిస్టు నేతల్లో ఎక్కువ మంది ఛత్తీస్‌గఢ్ చేరుకుని అక్కడి నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. చలపతి భార్య అరుణ ప్రస్తుతం ఏవోబీ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శిగా ఉన్నారు.

ఏకే-47 భద్రత!

నిజానికి చలపతికి నిరంతరం ఏకే-47 ఆయుధాలు ధరించిన 9 మంది మావోయిస్టులు భద్రత కల్పిస్తారు. వీరిలో ఐదుగురు మహిళా నక్సల్స్-- బస్తర్‌కు చెందిన అమల, చోటీ, నాని, దీప్న, రీనా ఉంటారు. మరో గార్డు సుఖ్‌రామ్ హ్యాండ్‌హెల్డ్ మెటల్ డిటెక్టర్‌తో.. చలపతిని కలిసేందుకు వచ్చే ఇతర మావోయిస్టులను క్షుణ్ణంగా తనిఖీ చేసేవారని తెలుస్తోంది. వయసు పైబడడంతో చలపతి రెండు కర్రల సాయంతో నడిచేవారని, ఎక్కువ దూరం నడవలేరని సమాచారం. మంగళవారం నాటి ఎన్‌కౌంటర్‌లో కూడా ఆయన మృతదేహం పక్కన రెండు కర్రలు ఉండడం గమనార్హం..! అబూజ్‌మడ్‌లోకి చొచ్చుకువస్తూ.. గరియాబంద్‌ను సురక్షిత స్థావరం(సేఫ్‌జోన్)గా మలచుకునే క్రమంలో పోలీసు బలగాలు చలపతి బృందాన్ని చుట్టుముట్టాయి.

దండకారణ్యంలో.. 'ఎర్ర'కోటలకు బీటలు..!

- 20 ఏళ్ల మావోయిస్టుల ఆధిపత్యానికి చెక్
- వరుస ఎన్‌కౌంటర్లతో దళాలు కకావికలం
- అప్పటి నక్సల్స్.. ఇప్పుడు డీఆర్‌జీ బలగాలు
- 650 క్యాంపులు.. నిరంతర నిఘా
- 'ఆపరేషన్ కగార్'తో బలగాల పైచేయి
- ఏడాదిలో 300 మంది నక్సల్స్ మృతి



చర్ల, జనవరి 21(ఆంధ్రజ్యోతి): దండకారణ్యంలో 'ఎర్ర'కోటలకు బీటలు పడ్డాయి..! 20 ఏళ్లుగా అబూజ్‌మడ్ కేంద్రంగా ఏకచత్రాధిపత్యంగా దండకారణ్యాన్ని కంచుకోటగా మలచుకున్న మావోయిస్టులు ఇప్పుడు గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. ముందెన్నడూ లేనివిధంగా కేంద్ర కమిటీ సభ్యులు సైతం ప్రత్యక్ష ఎన్‌కౌంటర్లలో చనిపోతున్నారు. దండకారణ్యం, డీవీసీఎం కమిటీ సభ్యులదీ అదే పరిస్థితి. ఎండాకాలం వస్తే.. ఆకురాలిపోయి, బలగాల డ్రోన్ కెమెరాలకు చిక్కే ప్రమాదం.. టన్నెల్స్‌లోనూ ఉండలేని పరిస్థితి.. ఈ నేపథ్యంలో ఎక్కడ తలదాచుకోవాలో తెలియని దుస్థితి.! గత ఏడాది కాలంగా జరుగుతున్న వరుస ఎన్‌కౌంటర్లతో చెట్టుకొకరు.. పుట్టకొకరు అన్నట్లుగా ఉద్యమాన్ని నడుపుతున్నారు. ఇక లొంగిపోయిన నక్సలైట్లను పోలీసులు డీఆర్‌జీ పేరుతో బలగాలుగా మారుస్తూ.. మావోయిస్టులపై ఆయుధాలుగా మలచుకుంటున్నారు. వారు ఇచ్చే సమాచారంతో.. అడవుల్లో వారినే ముందుకు నడుపుతూ నక్సల్స్‌పై 'ఆపరేషన్ కగార్' పేరుతో వేట సాగిస్తున్నారు. బస్తర్‌లోని 7 జిల్లాల్లో సుమారు 8 వేల మంది డీఆర్‌జీ బలగాలను నియమించారు. వీరితోపాటు.. సీఆర్పీఎఫ్, కోబ్రా బలగాలతో దండకారణ్యంలో 650కి పైగా బేస్ క్యాంపులను ఏర్పాటు చేశారు. మావోయిస్టుల కదలికలపై సమాచారం వచ్చిందే తడవుగా.. ఈ క్యాంపుల నుంచి బలగాలు కూంబింగ్‌కు వెళ్తుంటాయి. దీంతో ఇప్పుడు అబూజ్‌మడ్ లాంటి నక్సల్స్ కంచుకోటల్లో బలగాలు పాగా వేస్తున్నాయి. ఇలా గత ఏడాది ఆరంభం నుంచి 42 ఎన్‌కౌంటర్లు జరగ్గా.. 300 మందికి పైగా మావోయిస్టులు మృతిచెందారు. వీరిలో చలపతి, శంకర్రావు, సాగర్, నర్సింహారావు వంటి భారీ రివార్డులున్న నక్సలైట్లు కూడా ఉన్నారు.

భారీ రివార్డులున్న అగ్రనేతలు

మావోయిస్టు అగ్రనేత గణపతిపై రూ.2.52 కోట్ల రివార్డు ఉంది. మరో నేత కేశవరావు అలియాస్ బస్వరాజ్‌పై రూ.1.5 కోట్లు, గెరిల్లా యుద్ధ నిపుణుడు మాడ్వి హిడ్మాపై రూ. కోటి రివార్డు ఉన్నట్లు పోలీసు రికార్డులు చెబుతున్నాయి. కాగా.. భారీ రివార్డు లున్న అగ్రనేతల్లో పలువురు అనారోగ్యంతో మృతిచెందడం గమనార్హం..! ఈ కోవలో కిషాందా(రూ.1.47కోట్లు) 2021లో ఝార్ఖండ్‌లో అరెస్టవ్వగా.. అనారోగ్యంతో మృతిచెందారు. కటకం సుదేశన్(రూ.1.47కోట్లు) 2023 జూన్‌లో గుండెపోటుతో మరణించారు. దేవ్ కుమార్‌సింగ్ అలియాస్ అరవింద్‌జీ(రూ.1.32కోట్లు) కూడా గుండెపోటుతో కన్నుమూశారు.

ఎల్లుండి 'ఈశాన్యం' నిష్క్రమణ

విశాఖపట్నం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): దక్షిణాదిలోని ఐదు వాతావరణ సబ్‌డివిజన్లలో వర్షాలకు కారణమైన ఈశాన్య రుతుపవనాల నిష్క్రమణకు రంగం సిద్ధమైంది. ఈశాన్య గాలులు క్రమేపీ బలహీనపడటం, సముద్రం నుంచి తూర్పుగాలులు ఆగిపోవడంతో వర్షాలు తగ్గుముఖం పట్టాయి. ఈ నేపథ్యంలో తమిళనాడు/పుదుచ్చేరి, రాయలసీమ, దక్షిణ కోస్తా, కేరళ, దక్షిణ కర్ణాటక నుంచి 24న ఈశాన్య రుతుపవనాలు వైదొలుగుతాయని భారత వాతావరణ శాఖ తెలిపింది. దక్షిణాది రాష్ట్రాల్లోకి గతేడాది అక్టోబరు 21న రుతుపవనాలు ప్రవేశించాయి. ఈశాన్య రుతుపవనాల సీజన్‌లో రెండు తుఫాన్లు, నాలుగైదు అల్పపీడనాలు/ వాయుగుండాలు రావడంతో విస్తారంగా వర్షాలు కురిశాయి. కాగా, మధ్య భారతం నుంచి అతి శీతల గాలులు ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ వరకూ విస్తరించాయి. దీంతో ఉత్తరాంధ్ర గజగజలాడింది. బలమైన చలి గాలులు వీయడంతో ఈ సీజన్‌లో తొలిసారిగా కొన్ని ప్రాంతాల్లో చలి ప్రభావం తీవ్రంగా ఉంది. వీటి ప్రభావంతో ఒడిశాకు ఆనుకుని శివారు ప్రాంతాలు, మన్యం, తెలంగాణకు ఆనుకుని కోస్తాలో కొన్నిచోట్ల రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 5 డిగ్రీలు తక్కువగా నమోదయ్యాయి. చలిగాలుల తీవ్రతకు ప్రజలు వణికిపోయారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయలో 4.3 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. విశాఖ ఎయిర్‌పోర్టులో ఈ సీజన్‌లోనే అతి తక్కువగా 14.4 డిగ్రీలు నమోదైంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.